సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 340

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ X కివీస్

చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. ఇరు జట్లు గ్రూప్ 'ఎ' నుంచి రెండేసి విజయాలతో సెమీ ఫైనల్ చేరగా...నేటి ఫలితంతో సెమీస్ ప్రత్యర్థులెవరో తేలనుంది. 14 లో



అ'టెన్'షన్ ప్లీజ్

పదేళ్లకోమారు మహిళ తన ఆరోగ్యం కోసం ఆ దశాబ్దపు ప్రణాళిక ప్రకారం వెళ్లాలి. ఇలా చేసుకుంటూ పోవడం వల్ల సుదీర్ఘకాలం పాటు ఆమె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. మీరు ఏ పదుల పడిలో ఉన్నారో చూసుకోండి. ఆ ప్రకారం జాగ్రత్తలు తీసుకోండి. 13 లో

వీసా 'గోల్డెన్' చాన్సేనా..?



గత దశాబ్ద కాలంలో ఈబీ-5 వీసా తీసుకున్న భారతీయులు **3,800 మంది**

అమెరికా గోల్డ్ కార్డ్ అందుకునేందుకు మనవాళ్లు సిద్ధమేనా?

- రూ.43.7 కోట్లు చెల్లించే స్తోమత ఎందరికి ఉంటుందనే సందేహాలు
- పన్ను నిబంధనలపై అనిశ్చితితోనూ సమస్యలు
- గోల్డ్ కార్డ్‌పై ట్రంప్ అంచనాలు నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు
- గోల్డ్ కార్డ్ విధానం అమెరికా రుణాన్ని తగ్గిస్తుందని భావిస్తున్న ట్రంప్

2 లో

రూ. **43,70,00,000** కోట్లు
కోటి గోల్డ్ కార్డులు అమ్మితే అమెరికాకు వచ్చే ఆదాయం

100కు పైనే... గోల్డెన్ వీసాలు ఇస్తున్న దేశాలు



ప్రాణాలతో బెట్టింగ్

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ భూతానికి బతుకులు బలి

- మొదట్లో లాభం చూపి.. ఊబిలోకి లాగుతున్న జూదం
- ఈజీ మనీ ఆశతో చిక్కుకుపోతున్న యువత.. రిటైరైనవారు, పెద్దవారూ అదే బాటలో..
- నష్టం పూడ్చుకోవచ్చని, అప్పులు తీర్చవచ్చని భావిస్తూ మరింతగా కూరుకుపోతున్న తీరు



- ఆన్‌లైన్ లోన్ యాప్‌లతో సులభంగా రుణాలు రావడంతో పెరుగుతున్న సమస్య
- అప్పుల వాళ్లు, లోన్ యాప్ కంపెనీల వేధింపులతో తీవ్ర ఒత్తిడి
- చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి

'ఆన్‌లైన్ రమ్మీ' చంపే వరకు వదల్లేదు



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస శంకరయ్య, స్వరూప దంపతుల కుమారుడు కార్తీక్ ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడ్డాడు. సంపాదన అంతా పోగొట్టుకుని, అప్పుల పాలయ్యాడు. రైలుపట్టాలపై పడుకుని, ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తల్లిదండ్రులు అప్పుడు కార్తీక్‌ను కాపాడుకోగలిగారు. రెండెకరాల భూమి అమ్మి మరీ అప్పులు తీర్చారు. అయినా కార్తీక్‌ను ఆన్‌లైన్ రమ్మీ భూతం వదల్లేదు. కార్తీక్ మళ్లీ అప్పులు చేసి, ఆవేదనతో గత నెలలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

సాక్షి, హైదరాబాద్

అవసరాలు తీరాలంటే డబ్బు కావాలి. కానీ ఆ డబ్బు సంపాదించేందుకు ఎంచుకునే మార్గాలు చాలా ముఖ్యం. కష్టార్జితం కొంతే అయినా జీవితం సాఫీగానే సాగుతుంది. కానీ కూర్చున్నచోటే శ్రమ లేకుండానే భారీగా డబ్బుకావాలని వెంపర్లాడితే జీవితం గాడి తప్పుతుంది. ఇటీవల వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. సులభంగా డబ్బు వస్తుందని ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌లు, పేకాట, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు అలవాటు పడి.. సంపాదన అంతా పోయి, అప్పుల పాలవుతున్నవారు ఎందరో. తెలిసినవారి దగ్గరే కాకుండా.. క్రెడిట్ కార్డులు, లోన్ యాప్‌లలో మిగతా 3వ పేజీలో ▶

24 గంటల్లో బయటికి!

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగం శిథిలాల్లో కార్మికుల గుర్తింపు
- ఒకచోట నలుగురు, మరోచోట నలుగురు ఉన్నట్టు ఆనవాళ్లు
- ఆదివారం సాయంత్రానికి నలుగురిని వెలికితీసే అవకాశం
- మిగతా వారి కోసం మరో రెండు రోజులు పట్టవచ్చంటున్న నిపుణులు
- పరిస్థితిని సమీక్షించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి

5 లో


ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో సహాయక సిబ్బంది

ఈసారి మంటలే..



రాష్ట్రంలో సాధారణాన్ని మించిపోనున్న వేసవి ఉష్ణోగ్రతలు

వరుసగా ఎక్కువ రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే చాన్స్

- మార్చి నుంచే వడగాడ్పులు.. ఇవి కూడా ఎక్కువ రోజులు వీచే అవకాశం
- మార్చి నుంచి మే వరకు వేసవి సీజన్ అంచనాలను విడుదల చేసిన వాతావరణ శాఖ
- పసిఫిక్, హిందూ మహాసముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు, లానినా బలహీనపడటంతోనే ప్రభావం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి ఎండలు మండిపోనున్నాయి. వడగాడ్పులూ తీవ్రరూపం దాల్చనున్నాయి. ఈ వేసవి సీజన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు 2025 మార్చి నుంచి మే నెల వరకు వేసవి సీజన్‌కు సంబంధించిన అంచనాలను శనివారం హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసింది. ఈ ఎండాకాలంలో వరుసగా ఎక్కువ రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. సాధారణంగా వేసవిలో నాలుగైదు రోజుల పాటు సాధారణం కంటే అధికంగా మిగతా 2వ పేజీలో ▶

నేటి నుంచి రంజాన్ మాసం షురూ

- ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు పాటించాలి
- రుహియ్యతే హిలాల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సజ్జాద్ పాషా

16 లో



రాజ్యాంగ హక్కులపై దాడిని ఖండిద్దాం

- పాలకులు మతాన్ని ఆయుధంగా మార్చేశారు
- ప్రభుత్వాలను ప్రశ్నిస్తే జైళ్లలో వేస్తున్నారు
- భౌతికంగా కంటే సోషల్ మీడియా ద్వారానే అధిక హింస
- ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవద్దు
- ఎన్‌పీఎం రెండో ప్లీనరీలో వక్తలు

12 లో



రణరంగ రక్షణ కవచాలు

- విజ్ఞాన్ వైభవ్ ఎగ్జిబిషన్–2025లో యుద్ధ పరికరాల ప్రదర్శన
- ఆకట్టుకున్న ఆకాశ్, అండర్‌వాటర్ వెహికల్, యాంటీ –జీ సూట్
- ప్రముఖ సంస్థలతో పాటు విద్యార్థుల ఆవిష్కరణలూ ప్రదర్శన

16 లో



వీసా గోల్డెన్ చాన్సేనా?

గోల్డ్‌కార్డ్‌పై తలెత్తుతున్న ప్రశ్నలెన్నో..

గోల్డ్ కార్డ్ వీసా.. ప్రపంచవ్యాప్తంగా కొత్త చర్చకు దారితీసిన టాపిక్ ఇది. అత్యంత గౌరవంగా భావించే అమెరికా పౌరసత్వం కోసం ట్రంప్ సర్కార్ తెచ్చిన ఈ కొత్త విధానం ఎంత మందిని ఆకట్టుకుంటుంది? అమెరికన్ కంపెనీలు ఈ పథకాన్ని ఉపయోగించి భారతీయులు సహా విదేశీ విద్యార్థులను, ప్రతిభావంతులను నియమించుకోవచ్చని ట్రంప్ అన్నారు. ట్రంప్ కేవలం పౌరసత్వ కలను అమ్ముకోవడం ద్వారా లాభం పొందాలని కోరుకోవడం లేదు. అమెరికన్ కంపెనీలు మంచి నిపుణులను నియమించుకోవడానికి వీలవుతుందని అంటున్నారు. వ్యాపారం పరంగా ఈ ఆఫర్ అమెరికన్ కంపెనీలకు ఆకర్షణీయమేనా? భారతీయులకు ప్రయోజనం చేకూరుస్తుందా? ఒక కోటి గోల్డ్ కార్డులు అమ్మడం ద్వారా అమెరికా అప్పులు తొలగిపోతాయని ట్రంప్ పేర్కొంటున్నారు. కానీ రూ.43.7 కోట్ల విలువైన వీసాను కొనగలిగే అతి ధనవంతులు అమెరికా వెలుపల ఎంతమంది ఉన్నారనేదే ఇక్కడ ప్రశ్న. మరోవైపు పౌరసత్వం సరే.. పన్ను నిబంధనలపై అనిశ్చితి కారణంగా గోల్డ్‌కార్డును తీసుకునేవారు తక్కువగా ఉంటారని నిపుణులు అంటున్నారు.

- సాక్షి, బిజినెస్ బ్యూరో

అమెరికా గోల్డ్ కార్డ్ అందుకునేందుకు మనవాళ్లు సిద్ధమేనా?

రూ.43.7 కోట్లు చెల్లించే స్తోమత ఎందరికి ఉంటుందనే సందేహాలు

పన్ను నిబంధనలపై అనిశ్చితితోనూ సమస్యలు

గోల్డ్ కార్డ్‌పై ట్రంప్ అంచనాలు నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు

ప్రపంచవ్యాప్తంగా గోల్డెన్ వీసాలు ఇస్తున్న దేశాలు 100కుపైనే...

ట్రంప్ లక్ష్యం అంత సులభమేమీ కాదు..



ఒక కోటి గోల్డ్ కార్డుల అమ్మకాలు అమెరికా రుణభారాన్ని తుడిచిపెట్టగలవని ట్రంప్ అంటున్నారు. కానీ ఏకంగా రూ.43.7 కోట్లు వెచ్చించగల స్తోమత ఉన్న ధనవంతులు అమెరికా వెలుపల ఎంత మంది ఉన్నారు? క్రెడిట్ స్విస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ ప్రకారం 2022లో ప్రపంచ వ్యాప్తంగా 5–10 మిలియన్ డాలర్ల సంపద పరిధిలోని ధనికుల సంఖ్య 51 లక్షలు. ఇందులో 10 మిలియన్ డాలర్లకుపైగా ఉన్నవారు 28లక్షల మంది. ఇలాంటప్పుడు ఒక కోటి మంది గోల్డ్‌కార్డ్ కొనుగోలుదారులను పొందడం సాధ్యమయ్యేదేనా? అన్న సందేహాలు వస్తున్నాయి. రష్యా, చైనా, ఆగ్నేయాసియా నుంచి ధనవంతులు డబ్బు సంచులతో అమెరికాకు వస్తారని ట్రంప్ ఆశిస్తున్నారేమోగానీ.. విదేశీ బిలియనీర్లు గోల్డ్ కార్డ్‌ను తీసుకుంటారా? అని ఇమిగ్రేషన్ నిపుణులే పేర్కొంటున్నారు.

- ఈ కార్యక్రమం ద్వారా అమెరికన్ పౌరసత్వాన్ని అమ్మకానికి పెట్టడం, యోగ్యత కంటే డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వడం వంటివాటిని ప్రతిభావంతులైన నిపుణుల ఖర్చుతో ధనవంతుల అవసరాలను తీర్చడంగా చూడవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- గోల్డ్ కార్డుల వల్ల బలమైన నియంత్రణ, తనిఖీలు లేనప్పుడు పెట్టుబడి అంశంతో కూడిన ఇమిగ్రేషన్ కార్యక్రమాలు మనీలాండరింగ్‌కు, విదేశాల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇది రష్యన్ సామ్రాజ్యవాదులకు అమెరికా తలుపులు తెరుస్తుందా అని అడిగినప్పుడు ట్రంప్ ఉదాసీనంగా సమాధానమిచ్చారు. 'అవును. నాకు కొందరు రష్యన్ సామ్రాజ్యవాదులు తెలుసు. వారు చాలా మంచి వ్యక్తులు'అని పేర్కొన్నారు.
- ఉద్యోగాలను సృష్టించే సంస్థలలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా గోల్డ్ కార్డ్ వస్తే.. చాలా మంది ధనవంతులు యూఎస్ ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి తోడ్పాటు ఏమీ ఇవ్వకుండా నివాసం ఉండవచ్చనే ఆందోళనలు ఉన్నాయి.
- కెనడాలో ఇలాంటి కార్యక్రమాన్ని తక్కువ పెట్టుబడితోనే ప్రారంభించారు. కానీ అది విపరీతంగా దుర్వినియోగం కావడంతో రద్దు చేశారు.

ముందున్న సవాళ్లు రెండు..




ప్రతినిధుల సభ కాంగ్రెస్‌లో..

వలస విధానంలో ఏదైనా ముఖ్య మార్పును అమెరికా ప్రతినిధుల సభ కాంగ్రెస్ ఆమోదించాలి. ప్రస్తుతం రిపబ్లికన్ పార్టీకి ఉభయ సభలలో మెజారిటీ ఉంది. కానీ అమెరికన్ పౌరసత్వాన్ని అమ్ముకుంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అందరు రిపబ్లికన్లు సమర్థించక పోవచ్చు. డెమొక్రాట్లు ఈ ప్రతిపాదనను దాదాపుగా వ్యతిరేకిస్తారు.

కోర్టులలో..

అమెరికాలో చాలా చట్టపరమైన సవాళ్లు వీసా కార్యక్రమాల నిర్వహణ నుంచే ఉత్పన్నమవుతాయి. ట్రంప్ గోల్డ్ కార్డ్ ఎలాంటి చట్టపర సవాళ్లను ఎదుర్కొంటుందో ఊహించడం కష్టమేనని నిపుణులు అంటున్నారు.

భారతీయులు-గోల్డ్ కార్డ్..



కాన్సులర్ ప్రాసెసింగ్ ఉపయోగించి 2022–23లో ఈబీ–5 కార్యక్రమం ద్వారా 631 మంది భారతీయులు మాత్రమే యూఎస్ గ్రీన్‌కార్డులను పొందారు. ఈ పథకానికి రూ.9.17 కోట్లు పెట్టుబడి మాత్రమే అవసరం. అలాంటిది రూ.43.7 కోట్లపైన చెల్లించి గ్రీన్‌కార్డ్ కొనాలనే ఆలోచన చాలా మంది భారతీయులకు ఆకర్షణీయంగా కనిపించే అవకాశం లేదని యూఎస్ న్యాయవాది, అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ సభ్యురాలు రవనీత్ కౌర్ బ్రార్ అభిప్రాయపడ్డారు.

గోల్డ్ కార్డ్ వీసా అంటే?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'గోల్డ్ కార్డ్'ను ఈ వారమే ఆవిష్కరించారు. ఇది విదేశీ పెట్టుబడిదారులకు అమెరికా పౌరసత్వం పొందేందుకు రాచమార్గం. అమెరికా గ్రీన్‌కార్డ్‌కు ఖరీదైన ప్రత్యామ్నాయం కూడా. గోల్డ్ కార్డ్ కోరుకునేవారు యూఎస్ ప్రభుత్వానికి 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.43.7 కోట్లు) చెల్లించాలి. ఈ వీసా విధివిధానాలు రెండు వారాల్లో వెలువడనున్నాయి. గోల్డ్ కార్డ్ హోల్డర్లు అమెరికా వెలుపల సంపాదించిన ఆదాయంపై పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. దేశీయంగా (యూఎస్‌లో) ఆర్జించే ఆదాయాలపై పూర్తి పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. గోల్డ్‌కార్డుల విక్రయం ద్వారా పెద్ద పన్ను చెల్లింపుదారులు, ఉద్యోగ సృష్టికర్తలు అమెరికాకు సమకూరుతారని ట్రంప్ అన్నారు.

అప్పుల భారం తగ్గించుకునేందుకు..



గోల్డ్ కార్డ్ విధానం అమెరికా రుణాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ''మేం కోటి కార్డులు అమ్మితే 50 ట్రిలియన్ డాలర్లు (రూ.43,70,00,000 కోట్లు) సమకూరుతుంది. మాకు 35 ట్రిలియన్ డాలర్ల (రూ.30,59,00,000 కోట్లు) అప్పు ఉంది''అని ఆయన పేర్కొన్నారు. అసాధారణ ప్రతిభ ఉన్న దరఖాస్తుదారులను స్పాన్సర్ చేయడం కోసం కంపెనీలను అనుమతించే నిబంధనలను గోల్డ్ కార్డ్‌లో చేర్చవచ్చని ట్రంప్ చెప్పారు. యాపిల్ వంటి సంస్థలు తాము నియమించుకోవాలనుకునే అగ్రశ్రేణి ప్రతిభావంతులకు గోల్డ్ కార్డులను స్పాన్సర్ చేయవచ్చన్నారు.

ఆ రెండింటి మధ్య వ్యత్యాసం ఇదే..

ప్రస్తుత ఈబీ–5 వీసా స్థానంలో గోల్డ్ కార్డ్ రానుంది. యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ నిర్వహించే ఈబీ–5 ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్‌ను 1990లో అమెరికా ప్రజాప్రతినిధుల సభ అయిన కాంగ్రెస్ రూపొందించింది. విదేశీ పెట్టుబడిదారుల ద్వారా అమెరికాలో ఉద్యోగ సృష్టి, మూలధన పెట్టుబడి ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు దానిని అమలు చేస్తున్నారు. ఈబీ–5 వీసా కోసం 10,50,000 డాలర్ల (రూ.9.17 కోట్లు) పెట్టుబడి అవసరం. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో అయితే 8,00,000 డాలర్లు (రూ.6.99 కోట్లు) పెట్టుబడి పెట్టినా సరిపోతుంది. దీనికితోడు కనీసం 10 మంది అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించాలి. దీనిద్వారా సాధారణంగా 3–5 ఏళ్లలో గ్రీన్‌కార్డ్ అందుకోవచ్చు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న 2019లో ఈ పరిమితిని 9,00,000 డాలర్లకు (రూ.7.8 కోట్లకు) పెంచాలన్న ప్రయత్నం జరిగింది. కానీ ఫెడరల్ కోర్టు అడ్డుకుంది. అమెరికా ఏటా 10,000 ఈబీ–5 వీసాలను జారీ చేస్తోంది. ప్రతి దేశానికి గరిష్టంగా 7% వీసాలు ఇస్తారు. ఈబీ–5 వీసా కావాల్సినవారు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అదే కొత్త గోల్డ్ కార్డ్ అయితే ఒకసారి కొనుక్కుంటే చాలు. పెట్టుబడి, ఉద్యోగ కల్పన భారం ఉండదు.

దశాబ్దంలో 3,800 మంది..

హెచ్–1బీ, ఈబీ–2, లేదా ఈబీ–3 వీసాలపై యూఎస్‌లో ఉన్న భారతీయ వలసదారులు గోల్డ్ కార్డ్ వీసా కోసం దరఖాస్తు చేసుకుని అక్కడి పౌరసత్వాన్ని అందుకోవచ్చు. వర్క్ వీసాలు, ముఖ్యంగా హెచ్–1బీ వీసాల కోసం భారత్ నుంచి అత్యధిక డిమాండ్ ఉంది. గోల్డ్ కార్డ్ వీసా హోల్డర్ల రాక వల్ల.. ఇతర వీసా హోల్డర్లు గ్రీన్‌కార్డుల కోసం వేచిఉండాల్సి వస్తుందనే ఆందోళన ఉంది. అమెరికాలో గ్రీన్‌కార్డ్ (శాశ్వత చట్టపర నివాస అనుమతి) కోసం వేచి ఉండే సమయం భారతీయులకు చాలా ఎక్కువ. కొన్నిసార్లు దశాబ్దాల సమయం పడుతోంది. అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులకు ఓ–1 వీసా మెరుగైన ప్రత్యామ్నాయమని.. దానిద్వారా సులభంగా ఈబీ–1 గ్రీన్‌కార్డ్‌లోకి మారవచ్చని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. ఇది ఇతర ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డ్ విభాగాల్లా కాకుండా తక్కువ వెయిటింగ్ పీరియడ్ ఉంటుందని పేర్కొంటున్నారు. ఇక వ్యాపార సంస్థల యజమానులు, కీలక స్థానాల్లో ఉన్న ఉద్యోగులు ఎల్–1 వీసాను పరిగణించవచ్చు. ఈబీ–5 వీసా కోసం చూస్తున్నవారు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో.. దానిని రద్దు చేయడానికి ముందే త్వరపడాలనే ఆత్రుత కనిపిస్తోంది. అయితే ఈబీ–5 వీసా రద్దు చేయాలంటే అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం అవసరమని ఇమిగ్రేషన్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గత దశాబ్దంలో దాదాపు 3,800 మంది భారతీయులు ఈబీ–5 వీసాతో అమెరికా వెళ్లారని అంచనా.

100కుపైగా దేశాల్లో సంపన్నులకు గోల్డెన్ వీసాలు

ప్రపంచవ్యాప్తంగా 100కుపైగా దేశాలు సంపన్నులకు గోల్డెన్ వీసాలు ఇస్తున్నాయి. యూరప్, ఇతర ప్రాంతాల్లోని చాలా దేశాలు పెట్టుబడి కార్యక్రమాల ద్వారా పౌరసత్వాన్ని ఆఫర్ చేస్తున్నాయి. తమ దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడే వారికి మాల్టా పౌరసత్వాన్ని అందిస్తోంది. ఆ విధానం ఉత్తమమైనదని హ్యాన్లీ సిటిజన్‌షిప్ ప్రోగ్రామ్ ఇండెక్స్ పేర్కొనడం గమనార్హం. మాల్టా పౌరసత్వం పొందాలంటే కనీసం 6,00,000 యూరోల (రూ.5.45 కోట్లు) పెట్టుబడితోపాటు అక్కడ కనీసం 36 నెలల పాటు నివాసం ఉండాలి. లేదా 12 నెలలు అక్కడ నివసించిన తర్వాత 7,50,000 యూరోలు (రూ.6.82 కోట్లు) ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. హ్యాన్లీ ఇండెక్స్ టాప్–10 జాబితాలో ఆస్ట్రియా, గ్రెనాడా, యాంటీగ్వా అండ్ బాబూడా, నౌరూ, సెయింట్ కిట్స్ ఉన్నాయి. తమ లాభాలను పెంచుకోవాలని చూస్తున్న అంతర్జాతీయ వ్యాపారులకు ఇవి ఆకర్షణీయ పన్ను స్వర్గధామాలు (ట్యాక్స్ హెవెన్స్) కూడా. ఇక హ్యాన్లీ గ్లోబల్ రెసిడెన్స్ ప్రోగ్రామ్ ఇండెక్స్ జాబితాలో గ్రీస్ అగ్రస్థానంలో ఉంది. తరువాతి స్థానాన్ని స్విట్జర్లాండ్ కైవసం చేసుకుంది. సంపన్న భారతీయులకు ఇష్టమైన గమ్యస్థానంగా నిలిచిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కనీసం 5,45,000 డాలర్ల (రూ.4.76 కోట్లు) పెట్టుబడితో గోల్డెన్ వీసా రెసిడెన్స్ ప్రోగ్రామ్ ఆఫర్ చేస్తోంది.

గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

గల్ఫ్‌లో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్‌లో పలు కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 113 బాధిత కుటుంబాలకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించినట్టు తెలంగాణ ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమీక్ష సందర్భంగా అనిల్ గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం నిధుల విడుదలకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా సీఎంకు.. మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, మేడిపల్లి సత్యం, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి అధికారులపై ఏసీబీ కొరడా

సాక్షి, హైదరాబాద్: అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదు చేశారు. ఇందులో 15 ట్రాప్ కేసులు కాగా, రెండు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఉన్నాయి. ట్రాప్ కేసులకు సంబంధించి మొత్తం రూ.7.6 లక్షలు సీజ్ చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రూ.4.13 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. ఈ మేరకు ఫిబ్రవరిలో నమోదైన కేసుల వివరాలను శనివారం ఒక ప్రకటనలో ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ వెల్లడించారు. పోలీస్ శాఖతో పాటు, రెవెన్యూ, రవాణా, బీసీ, సాంఘిక సంక్షేమం, ఎనర్జీ, అటవీ, వ్యవసాయం, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాల శాఖలు, ఎంఏయూడీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏసీబీకి చిక్కిన వారిలో ఉన్నట్టు వివరించారు.



ఖనిజ అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

ప్రభుత్వ పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా

- మైనర్ మినరల్స్ బ్లాక్‌ల వేలానికి టెండర్లు పిలవాలి
- గనుల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- ప్రతి నియోజకవర్గానికో ఏటీసీ ఏర్పాటుచేస్తామని వెల్లడి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇసుకతో పాటు అక్రమంగా సాగే ఇతర ఖనిజాల తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమని అన్నారు. గనుల శాఖపై ఐసీసీసీలో సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిందని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌లలో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణ పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలని ఆదేశించారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే సంస్థలకు కూడా ఇసుకను టీజీ ఎండీసీ ద్వారానే సరఫరా చేయాలని సూచించారు.

హైదరాబాద్ చుట్టూ ఇసుక స్టాక్ పాయింట్లు

హైదరాబాద్‌తో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగమవుతోందని సీఎం తెలిపారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపై ఆరా తీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో ఏటీసీ

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కార్మిక, ఉపాధి శిక్షణ అధికారులతో సీఎం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)లను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఏటీసీలు లేని చోట కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను కూడా వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యాక్ట్ విషయంలో పూర్తిస్థాయి అధ్యయనం చేయాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో వరంగల్ విమానాశ్రయాన్ని నిర్మించాలని సీఎం ఆదేశించారు. శనివారం వరంగల్ విమానాశ్రయ పనులపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. విమానాశ్రయం వరంగల్ పట్టణానికి ఓ ఆస్తిగా మారాలని ఆకాంక్షించారు.

సైనిక్ స్కూల్ తరహాలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్



స్కూల్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో రెమా రాజేశ్వరి, స్టీఫెన్ రవీంద్ర, సీవీ ఆనంద్, రామకృష్ణారావు, శ్రీధర్, ఐజీ రమేశ్

దేశానికే రోల్ మోడల్‌గా నిలవాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష
- స్కూల్ బ్రోచర్, వెబ్‌సైట్ ఆవిష్కరణ
- 31న స్కూల్‌ను ప్రారంభించనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: సైనిక్ స్కూళ్ల తరహాలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను కూడా దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంబించాలని, క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో పోలీస్, యూనిఫామ్ సర్వీస్ ఉద్యోగుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నెలకొల్పాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ స్కూల్ బ్రోచర్, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. స్కూల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్టు ప్రకటించారు. స్కూల్ యూనిఫామ్ నమూనాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ అమరుల కుటుంబాల పిల్లలకు అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి శ్రీధర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ (ఆపరేషన్స్) స్టీఫెన్ రవీంద్ర, ఐజీ రమేశ్, ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

31న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభం

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 31న ప్రారంభించనున్నారు. ఈ స్కూల్‌లో 50 శాతం సీట్లు యూనిఫామ్ సర్వీస్ ఉద్యోగుల పిల్లలకు రిజర్వ్ చేశారు. మిగిలిన 50 శాతం సాధారణ పౌరుల పిల్లలకు ఇస్తారు. సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ నేతృత్వంలోని అధికారుల బృందం గత రెండు నెలలుగా ఈ పాఠశాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసింది. అవసరమైన అనుమతులు, సిబ్బంది నియామకం, ఇతర మౌలిక సదుపాయాలు పూర్తి చేశారు.

ఈసారి మంటలే..

▶ మొదటి పేజీ తరువాయి

ఉష్ణోగ్రతలు నమోదవడం, తర్వాత సాధారణ స్థాయికి తగ్గడం వంటివి జరుగుతాయి. కానీ ఈసారి వరుసగా ఎక్కువ రోజులు ఎండలు మండిపోతాయని, దానితో వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా వడగాడ్పులు ఏప్రిల్ నెలాఖరు నుంచి మే నెల మధ్య వరకు ఉంటాయని, కానీ ఈసారి మార్చి నెలలోనే ఈ పరిస్థితి కనిపించే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

విభిన్నంగా వాతావరణం..

వేసవి సీజన్‌లో ఉష్ణోగ్రతల తీరు ఎప్పుడు కూడా.. అంతకు ముందు వర్షాలు, శీతాకాల వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని బట్టి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గత వానాకాలంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినా.. కృష్ణా పరీవాహకంలో అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. రాష్ట్రంలో సగటు కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైనా.. చాలా ప్రాంతాల్లో లోటు ఉండటం గమనార్హం. ఇక చలికాలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తగ్గినా.. గరిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం ఎక్కువగా నమోదయ్యాయి. అంతేకాదు సగటున చూస్తే ఈసారి జనవరి, ఫిబ్రవరి నెలలు అత్యధిక వేడిమి నెలలుగా నిలుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

లానినా బలహీనపడటంతో..

పసిఫిక్ మహా సముద్ర ప్రాంతంలో ఏర్పడిన లానినా బలహీనంగా మారిందని నిపుణులు చెబుతున్నారు. దీనితో ముందస్తు వేసవిని ఆహ్వానించినట్టు అయిందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే జనవరి, ఫిబ్రవరి నెలల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదైనట్టు చెబుతున్నారు. మరోవైపు హిందూ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయని పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో లానినా పరిస్థితులు మరింత బలహీనపడతాయని, అధిక ఉష్ణోగ్రతలకు దారితీస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్చి నెలలో వర్షపాతం సాధారణ స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

125 ఏళ్ల రికార్డులు దాటేయొచ్చు!

రాష్ట్రంలో గతేడాది జగిత్యాల, నల్లగొండ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా 46.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈసారి అంతకంటే అధికంగా నమోదవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. 1901 నుంచి 2025 వరకు గత 125 సంవత్సరాల కాలంలో సగటు ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుంటే... 2025 వేసవిలో ఎక్కువ సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

రాష్ట్రంలోని మహిళలందరికీ కుట్టుమిషన్లు

బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ




కుట్టుమిషన్లను అందజేస్తున్న మంత్రి పొన్నం. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, చామల, సంపత్‌కుమార్, మల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలందరికీ కుట్టుమిషన్లు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని బీసీ సంక్షేమ, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రజా ప్రభుత్వం మహిళల ప్రాధాన్యానికి పెద్ద పీట వేస్తుందని, ఇప్పటివరకు తాము తీసుకున్న నిర్ణయాలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను అందజేసే కార్యక్రమం జరిగింది. సొసైటీ చైర్మన్ బొజ్జా సంధ్యారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పొన్నం మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తెలంగాణ మహిళా సాధికారత కోసం అలుపెరగని కృషి చేస్తున్నామని వివరించారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

- 8న పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- అదేరోజు అంగన్‌వాడీల్లోని 14 వేల కొలువుల భర్తీకి నోటిఫికేషన్లు: సీతక్క



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి అద్భుతమైన కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇదే అంశంతో ఈసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో లక్ష మంది మహిళలతో సభ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మహిళలకోసం నూతన కార్యక్రమాలను కూడా ప్రకటిస్తారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 14వేలకు పైగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ నియామకాల ప్రక్రియను కూడా సీఎం ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ , తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కాశీంనగర్ ఎత్తిపోతల పథకానికి సర్కారు ఆమోదం

నేడు సీఎం చేతులమీదుగా సర్వే పనులు ప్రారంభం: చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నో ఏళ్లుగా చివరి ఆయకట్టుకు సాగు నీరు రాక ఇబ్బందులు పడుతున్న వనపర్తి నియోజకవర్గంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు గ్రామాలు, 13 గిరిజన తండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఈ మేరకు శనివారం జీవో జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన సర్వే పనులను ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ పథకం వల్ల కాశీంనగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తాయిపల్లి, అంజనగిరి గ్రామాలతోపాటు మరో 13 గిరిజన తండాలకు మేలు జరుగుతుందన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల సీఎం కాశీంనగర్ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారని ఆయన తెలిపారు.

కొత్తగా వచ్చిన వారికి కొలువులా?

- రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలి: మల్‌రెడ్డి రంగారెడ్డి
- సామాజిక సమీకరణాలే అడ్డంకి అయితే రాజీనామా చేస్తా

సాక్షి, హైదరాబాద్: నిన్న మొన్న వచ్చిన వారికి మంత్రి పదవులిచ్చి.. పార్టీ కోసం కష్టపడుతున్న వారిని పక్కన పెట్టడం సరైంది కాదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యానించారు. మదర్ ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం గాంధీభవన్‌కు వచ్చిన మల్‌రెడ్డి రంగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలోకి కొత్తగా ఎవరు వచ్చినా వారికి గౌరవం ఇవ్వాలి తప్ప పదవులు కాదని స్పష్టం చేశారు. అలా చేయడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరించారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం మంది ఉండే రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని కోరారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కనీసం ఆరుగురు మంత్రులు ఉండేవారని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ తనకు మంత్రి పదవి ఇచ్చేందుకు సామాజిక సమీకరణలు అడ్డువస్తే రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. అధిష్టానం సూచించిన వారిని నిలబెట్టి గెలిపిస్తానని, వారికైనా మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తనలాంటి వారికి ఎంత ఆవేదన ఉన్నా.. పార్టీ లైన్ దాటి మాట్లాడకూడదు కాబట్టి.. ఏమీ మాట్లాడలేకపోతున్నానని మల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

సింగరేణి సీఎండీకి జనక్ ప్రసాద్ వినతి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, తొలగించిన ఉద్యోగులకు సంస్థ అవసరాల దృష్ట్యా మరో అవకాశం కల్పించాలని, కార్పొరేట్ మెడికల్ బోర్డు వద్ద మెడికల్ అన్‌ఫిట్ కాని ఉద్యోగులు.. మరోసారి మెడికల్ బోర్డుకు హాజరయ్యే అవకాశం కల్పించాలని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సింగరేణి పెండింగ్ సమస్యలపై శనివారం సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు.. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి జనక్ ప్రసాద్ వినతి పత్రం సమర్పించారు. సింగరేణి కార్మికులకు 250 గజాల భూమి కేటాయింపు, రూ.30 లక్షల వడ్డీ లేని హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్ (హెచ్‌బీఏ) ప్రయోజనం కల్పించాలన్నారు. మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు చేయాలని, అన్ని ప్రాంతాల్లో శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని గనుల్లో విశ్రాంతి షెల్టర్లు ఏర్పాటు చేసి, కార్మికుల సామాన్లను భద్రంగా ఉంచుకునేందుకు లాకర్లు కలిగిన అల్మారీలను అందజేయాలని కోరారు.

రెడ్డి కాంగ్రెస్ నుంచి మల్లన్న సస్పెన్షన్ దుర్మార్గం

బీసీ జేఏసీ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం దుర్మార్గమని బీసీ జేఏసీ ధ్వజమెత్తింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేసినందుకే సస్పెండ్ చేశారా? అని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కో–ఆర్డినేటర్ డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్, బీసీ పొలిటికల్ జేఏసీ కో–కన్వీనర్ మాలి కరుణాకర్, ఏబీజేఎస్ న్యాయవేదిక అధ్యక్షుడు కెడల ప్రసాద్, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ తదితరులు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బీసీలు ఎదుర్కొంటున్న అన్యాయానికి వ్యతిరేకంగా, బీసీ సాధికారత కోసం మల్లన్న దృఢంగా నిలబడినందుకు పార్టీ నుంచి తొలగించారా? అన్నది చెప్పాలని కోరారు. కుల గణనలో బీసీ జనాభా, ఇతర ఎస్సీ, ఎస్టీ మైనార్టీల జనాభా ఎందుకు తగ్గిందని ప్రశ్నించడమే నేరమా? అని నిలదీశారు. సామాజిక న్యాయం కోసం చేసే పోరాటాల్లో మల్లన్నకు బీసీ జేఏసీ మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ప్రాణాలతో బెట్టింగ్

▶ మొదటి పేజీ తరువాయి

డబ్బు తీసుకుంటున్నారు. చివరికి అది యమపాశమై ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోంది. కుటుంబాలను కన్నీటి సంద్రంలో ముంచేస్తోంది. జీవితాలను తలకిందులు చేస్తోంది. రోజురోజుకు జడలు విప్పి కరాళ నృత్యం చేస్తున్న ఈ జాడ్యంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు.. మానలేని వ్యసనం..

ఒకసారి కొంత మొత్తంలో డబ్బులు రాగానే ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ వంటి ఆటలు మంచి ఆదాయ మార్గమని యువత భావిస్తున్నారు. కూర్చున్న చోటే రోజూ వేలకువేలు సంపాదించవచ్చనుకుంటూ ఉచ్చులో పడుతున్నారు. కొద్దిపాటి లాభాలు చూసిన తర్వాత అసలు 'ఆట' మొదలవుతుంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్ కొద్దిపాటి లాభాలు ఇస్తూ.. వీలైనంత దోచుకునేలా ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయి. దీనిపై అవగాహన లేక బానిస అవుతారు. డబ్బులు పోగొట్టుకుంటారు. ఆ డబ్బులు వచ్చే వరకు మళ్లీ బెట్టింగ్‌లు చేద్దాం, తర్వాత మానేద్దాం అనుకుంటూ... పూర్తిగా ఈ ఊబిలో కూరుకుపోతారు. యువత మాత్రమేకాదు.. రిటైరైన ఉద్యోగులు, పెద్దవాళ్లు కూడా ఆన్‌లైన్ జూదం, గేమ్స్ బారినపడుతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయామని గుర్తించే సరికే.. అప్పులు ఇచ్చిన వాళ్ల నుంచి, కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరిగి, తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.



ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్ నంబర్ల లిస్ట్ తీసుకోకూడదు. కేవలం రుణమిచ్చే సమయంలో కేవైసీ కోసం ఒక్కసారి మాత్రమే కెమెరా, మైక్రోఫోన్, లొకేషన్ యాక్సెస్ చేయాలి. కానీ ఆన్‌లైన్ లోన్‌యాప్ కంపెనీలు అప్పులు తీసుకున్నవారి వ్యక్తిగత వివరాలన్నీ సేకరించి, వారి వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయి. ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి.

ఆన్‌లైన్ బెట్టింగ్ వెనుక భయపెట్టే నిజాలు..

- మన దేశంలో అక్రమ బెట్టింగ్ మార్కెట్ విలువ రూ.8.7 లక్షల కోట్లు అని అంచనా. ఇది ఏటా 30 శాతం పెరుగుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.
- విదేశాల్లో, ప్రధానంగా చైనా కేంద్రంగా ఉండే ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ కంపెనీలు.. ఇక్కడి మనవారి కష్టార్జితాన్ని దోచుకుని దేశ వ్యతిరేక కార్యకలాపాలకు ఫండింగ్ చేస్తున్నాయి.
- గేమింగ్, బెట్టింగ్.. యాప్ ఏదైనా సరే. వాటి వెనుక సూత్రధారులు మాత్రం చైనీయులే ఉంటున్నారు.
- మనీలాండరింగ్, ఉగ్రమూకలకు నిధులు కూడా ఈ బెట్టింగ్ యాప్‌లు సమకూర్చుతున్నట్టు దర్యాప్తు సంస్థలు వెల్లడిస్తున్నాయి.
- 'ఫైవిన్' అనే బెట్టింగ్ యాప్ మన దేశంలో రూ.400 కోట్ల మేర దోపిడీకి పాల్పడింది. ఆ సొమ్మంతా చైనా కంపెనీలకు చేరవేసిన కేసులో నలుగురు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇటీవలే అరెస్టు చేసింది.

మన దగ్గర నిషేధం ఉన్నా..

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ సాధారణంగా రెండు రకాలు. మన దేశంలో ఆపరేట్ అయ్యేవి. చైనా కంపెనీలకు చెందినవి. అయితే ఈ ఆన్‌లైన్ బెట్టింగ్, డబ్బులు పెట్టి ఆడే గేమింగ్‌లపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో నిషేధం ఉంది. అందువల్ల మన దేశానికి చెందిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ఈ రాష్ట్రాల్లో పనిచేయవు. ఫోన్లు ఈ రాష్ట్రాల్లోని లొకేషన్‌లో ఉంటే.. ఇక్కడ అందుబాటులో ఉండవని మెసేజీ చూపిస్తాయి. అందుకే ఆన్‌లైన్ బెట్టింగ్ చేయడం కోసం నకిలీ జీపీఎస్ యాప్‌లతో తప్పుడు లొకేషన్స్ చూపేలా చేస్తుంటారు. అదే చైనా యాప్స్ ఏ నిబంధనలు పాటించవు కాబట్టి యథేచ్ఛగా వాటిలో ఆడుతున్నారు.

మీ వాళ్లను ఇలా గమనించండి..

ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు, రమ్మీ వంటి జూదానికి అలవాటుపడే వారిని జాగ్రత్తగా గమనించడం ద్వారా గుర్తించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వారి సూచనల మేరకు.. ఎవరైనా స్థాయికి మించి అప్పులు చేస్తున్నా, తరచూ ఏదో కారణాలతో డబ్బులు అడుగుతున్నా ఓ కన్నేసి ఉంచాలి. ఆ డబ్బు ఎలా ఖర్చు చేస్తున్నారో గమనిస్తూ ఉండాలి. కుటుంబ సభ్యులను, స్నేహితులను పక్కనపెట్టి అదేపనిగా మొబైల్ ఫోన్‌లో గడుపుతున్నా.. ఫోన్‌లో ఏం చేస్తున్నారన్నది ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నా అనుమానించాలి. నష్టపోయినప్పుడు చిరాకు, ఆగ్రహం, ఆందోళన వంటివాటికి లోనవుతుంటారు. ఒంటరిగా గడుపుతుంటారు. ఇలాంటి లక్షణాలను గమనించాలి.

ఆత్మహత్యలు వద్దు.. మీ బాధ పంచుకోండి..

- మీ సమస్య ఏదైనా, ఎలాంటిదైనా.. ప్రతిదానికీ పరిష్కారం ఉంటుందన్నది మర్చిపోవద్దు. ఆత్మహత్యలకు పాల్పడకుండా మీ బాధలను ఈ హెల్ప్‌లైన్ సెంటర్లతో పంచుకోవాలని, మీకు సమాధానం దొరకవచ్చని నిపుణులు చెబుతున్నారు.
- రోష్నీ సూసైడ్ ప్రివెన్షన్ హెల్ప్‌లైన్: 040–66202000
- హైదరాబాద్‌కు చెందిన వన్‌లైఫ్ ఎన్జీఓ: 7893078930
- ఎయిమ్స్ (బీబీనగర్): 9493238208
- నేరుగా పోలీస్ సహాయం కోసం..: డయల్ 100

ఆ యాడ్స్‌ను పూర్తిగా నిషేధించాలి



- సులభంగా డబ్బు సంపాదన, అదీ పెద్ద మొత్తంలో ఆర్జించాలనే కోరిక కొందరిని ఆవహిస్తుంది. దీనిని 'ఇన్‌పల్స్ కంట్రోల్ డిజార్డర్'అంటారు. క్రెడిట్ కార్డులు, లోన్‌యాప్‌ల ద్వారా సులభంగా డబ్బు సమకూరుతోంది. బెట్టింగ్, గేమింగ్‌లో కొంత కోల్పోయినా... మరోసారి ప్రయత్నిస్తే డబ్బు రావొచ్చన్న ఆశ వారిని నిలవనీయదు. లక్షల్లో అప్పుల్లో పడిపోతే దానిని తీర్చేయాలని మళ్లీ అప్పులు చేసి బెట్టింగ్ చేస్తున్నారు. ఈ విష వలయం నుంచి బయటికి రాలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. స్మోకింగ్‌కు సంబంధించిన ప్రకటనలను ఎలా నిషేధించారో అలా అన్ని ప్రచార, ప్రసార సాధనాల్లో బెట్టింగ్ కంపెనీల యాడ్లు, యాప్‌ల ప్రచారాన్ని నిషేధించాలి. వెచ్చించే వ్యయంపై పరిమితి పెట్టడం, ఆధార్–పాన్ కార్డులతో అనుసంధానం చేయడం వంటివాటితో డబ్బు అతి వినియోగాన్ని నియంత్రించవచ్చు. ఎక్కువ మొత్తంలో అప్పులు చేయడం, రాత్రంతా ఫోన్‌లో గడుపుతూ ఆందోళనతో కనిపించడం వంటి వాటిని కుటుంబ సభ్యులు గుర్తించి వారిని నియంత్రించాలి.

– డాక్టర్ నిషాంత్ వేమన, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, కేర్, చేతన హాస్పిటల్స్

వేలం వెర్రిగా లోన్ యాప్‌లు..

మనకు అవసరమున్నా, లేకున్నా నిమిషాల్లోనే అప్పులు ఇస్తామంటూ వస్తున్న ఆన్‌లైన్ లోన్‌యాప్‌లతో సమస్య మరింత పెరుగుతోంది. అందులో లోన్ పేరిట మోసగించేవి కొన్నయితే.. నిజంగానే లోన్ ఇచ్చి అడ్డగోలు వడ్డీలు, జరిమానాలతో, బలవంతపు వసూళ్ల ప్రయత్నాలతో వేధించేవి మరికొన్ని. సులువుగా సొమ్ము చేతికి వస్తుండటంతో.. ఇలాంటి యాప్‌ల నుంచి అప్పులు చేసి ఆన్‌లైన్ జూదంలో పోగొట్టుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. నిజానికి రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం లోన్ యాప్‌లు వినియోగదారుడి ఫొటోలు, వీడియోలు...

బెట్టింగ్‌తో అప్పుల పాలై..

- ఖమ్మంకు చెందిన అజీజుద్దీన్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అందుకోసం అందిన కాడికి అప్పులు చేశాడు. అజీజుద్దీన్ అప్పులు తీర్చేందుకు ఆయన తండ్రి ఇంటిని సైతం అమ్మేశాడు. కానీ అజీజుద్దీన్ చేసిన అప్పులకు అంతులేక.. చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు.



కుటుంబాన్నే మింగేసింది..

- సంగారెడ్డి జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల రాములు–లక్ష్మి దంపతుల పెద్ద కొడుకు నరేశ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఇంటికి అండగా మారిన కొడుకు చూసి తల్లిదండ్రులు ఎంతో సంబురపడ్డారు. కానీ నరేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. చివరికి భార్య, ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనితో అతడి తల్లిదండ్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.



గేమింగ్‌కు బానిసై.. తండ్రి చేతిలో హతమై..

- కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్ కుమారుడు శివసాయి (21) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై భారీగా డబ్బు పోగొట్టుకున్నాడు. తండ్రి వారించినా వినకపోవడమేగాక.. డబ్బు కోసం ఉన్న భూమిని అమ్మాలని పట్టుబట్టాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన శ్రీనివాస్.. కుమారుడిని రోకలి బండతో మోది హత్య చేశాడు.

నష్టపోయి.. మోసాలు, చోరీలకు తెగించి..

- పంచాయతీరాజ్ శాఖలో మిషన్ భగీరథ ప్రాజెక్టు కీసర విభాగంలో ఏఈగా పనిచేస్తున్న గడ్డం రాహుల్ బాబు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసయ్యాడు. తీవ్రంగా నష్టపోయి.. దాన్ని పూడ్చుకోవడానికి మోసగాడిగా మారాడు. గత ఏడాది మార్చిలో జైలుకెళ్లాడు. సిద్దిపేట జిల్లా చేర్యాల వీఆర్ ఏ నిరుడి జ్ఞానేశ్వర్ కూడా ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై.. డబ్బు కోసం దొంగగా మారి కటకటాల వెనక్కి వెళ్లాడు.

కుటుంబాన్ని కబళించింది..

నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగవేణి సురేశ్, హేమలత కుమారుడు హరీశ్ (22) కిరాణా దుకాణం నిర్వహించేవాడు. సురేశ్ ఇల్లు కట్టుకునేందుకు కూడబెట్టిన రూ.8 లక్షలను కుమారుడు హరీశ్ బ్యాంకు ఖాతాలో వేశారు. ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన హరీశ్.. ఆ రూ.8 లక్షలతోపాటు మరో రూ.10 లక్షలు అప్పు చేసి పొగొట్టుకున్నాడు. సురేశ్ ఆ అప్పులు తీర్చడానికి తన అర ఎకరం భూమి అమ్మేశాడు. అయినా తీరుమార్చుకోని హరీశ్.. మరో రూ.20 లక్షలు అప్పు చేసి ఆన్‌లైన్ గేమింగ్‌లో నష్టపోయాడు. ఆ అప్పుల బాధ భరించలేక సురేశ్, హేమలత, హరీశ్ గత ఏడాది అక్టోబర్ 5న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఊబిలో చిక్కుకోవద్దు..



సులభంగా డబ్బు సంపాదించాలనే సంస్కృతి పెరగడంతో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, బెట్టింగ్, గేమింగ్ వంటి వాటికి అలవాటు పడుతున్నారు. గత 15, 20 ఏళ్లలో రియల్ ఎస్టేట్‌లో భారీగా డబ్బు సంపాదించిన వారు.. డాబుగా ఖర్చుచేయడం, విలాసవంతమైన కార్లు, భవనాలు కొనడంతో సంపాదన ప్రదర్శన జరుగుతోంది. మిగతావారు సైతం దీనిని ఓ మోడల్‌గా అనుకరించడం మొదలుపెట్టారు. కష్టపడి పనిచేయాలనే తత్వం మరుగున పడి, ఏదో ఒక విధంగా లక్షలు, కోట్లు సంపాదించాలనే ఆశలు పెరిగిపోతున్నాయి. సులభంగా డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రయత్నాలు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కరోనా అనంతర పరిస్థితుల్లో మధ్య తరగతి ప్రజల ఆదాయం తగ్గి అప్పులు పెరిగాయి. పర్సనల్ లోన్ యాప్స్ అధిక వడ్డీలతో సగటు జీవిని చిదిమేస్తున్నాయి. పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేస్తూ ఊబిలో కూరుకుపోతున్నారు.

– డి.పాపారావు, ఆర్థిక రంగ విశ్లేషకుడు

బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లలో లాభాలు భ్రమే..



- ఆన్‌లైన్ బెట్టింగ్ మన రాష్ట్రంలో నిషిద్ధం. అలాంటి ఆన్‌లైన్ యాప్‌లు వాడితే చట్టప్రకారం శిక్ష తప్పదు. బాధితులపైనా కేసులు తప్పవన్నది గుర్తుంచుకోవాలి. బెట్టింగ్ యాప్‌లలో లాభాలు వస్తాయన్నది భ్రమ అని గుర్తించాలి. మొదట కొద్దిపాటి లాభాలు చూపి.. తర్వాత కచ్చితంగా మోసం చేస్తారు. దీనితో అప్పుల ఊబిలో కూరుకుపోవడంతోపాటు కుటుంబాలు చిక్కుల్లో పడతాయి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి ఆటలకు దూరంగా ఉండడం మంచిది.

– కవిత, డీసీపీ, సైబర్‌క్రైమ్స్, హైదరాబాద్

రేవంత్‌వి తప్పుడు ఆరోపణలు..

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు
- హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నాపై విమర్శలు
- కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు.. అందుకే సీఎంలో అసహనం
- రాష్ట్ర అభివృద్ధిని మేము అడ్డుకోము



సాక్షి, హైదరాబాద్: తనపై, అలాగే బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రాజెక్టుల మంజూరు, నిధుల కేటాయింపులపై సీఎం తనపై చేసిన దివాళాకోరు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. రేవంత్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిది అనుభవ రాహిత్యమని, ఆయన అసహనంతో మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రానికి ప్రాజెక్టులు రాకుండా అడ్డుకుంటున్నానని, కేంద్ర మంత్రులను తాను బెదిరిస్తున్నానంటూ రేవంత్ దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాగా, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్ ఆమోదం అవసరం లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రజలు డిమాండ్ చేస్తుండటంతో వారి దృష్టిని మళ్లించేందుకే సీఎం తనపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. 'ప్రస్తుతం కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు మొదలయ్యాయి. రేవంత్‌రెడ్డి మాటలు చూస్తుంటే అదే స్పష్టమవుతోంది. బీజేపీని బ్లాక్ మెయిల్ చేసినంత మాత్రాన ఆయనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత పోదని ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. పెద్ద గొంతేసుకుని మాట్లాడినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావు'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ రేవంత్ సొంత జాగీరా?

'అసలు అభివృద్ధిని అడ్డుకోవడానికి తెలంగాణ రాష్ట్రం రేవంత్‌రెడ్డి సొంత జాగీరా? ఆయన ఇవ్వాళ ఉంటారు. రేపు అధికారం నుంచి దిగిపోతారు. రేవంత్‌పై కోపంతో తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే అజ్ఞానులం కాము. రేవంత్ మాత్రమే కాదు.. ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఎవరున్నా మేము వారిని వ్యతిరేకించం. అభివృద్ధికే పాటుపడతాం' అని కిషన్‌రెడ్డి అన్నారు. 'నాకు రాసిన ఉత్తరంలో ఆయా ప్రాజెక్టులకు రూ.1,66,569 కోట్లు మంజూరు చేయాలని రేవంత్ డిమాండ్ చేశారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేంద్రం వద్ద రెడీగా ఉండవు. సీఎం నాకు లెటర్ రాసి రెండు నెలలైంది. ఆ లెటర్‌తో సంబంధిత శాఖల కేంద్ర మంత్రులకు నా లెటర్‌ను జత చేసి పంపించాను. ఇంతలోనే ప్రాజెక్టులన్నీ మంజూరవుతాయా?'అని ప్రశ్నించారు. 'రేవంత్.. నీ అసహనం, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నాపై విమర్శలు చేయొద్దు. గాలి మాటలు కాకుండా, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై మాట్లాడితే బాగుండేది. నేను విలువలకు కట్టుబడి పని చేస్తా. నీ తాటాకు చప్పుళ్లకు భయపడను'అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

మెట్రో రెండోదశను ఆలస్యం చేయం..

హైదరాబాద్‌లో మెట్రో రెండోదశను కేంద్రం ఆలస్యం చేయబోదని కిషన్‌రెడ్డి తెలిపారు. 'రీజినల్ రింగ్‌రోడ్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేవలం వంద కోట్ల రివాల్వింగ్ ఫండ్ పెట్టింది. దాని దక్షిణ భాగం తామే నిర్మిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. కన్సల్టెన్సీని పెట్టుకున్నారు. ఇప్పుడు మాపై ఆరోపణలు చేస్తున్నారు'అని మండిపడ్డారు. కాగా, కేసీఆర్ హయాంలోనే మెట్రో రెండో దశకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారని చెప్పారు. 'రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టును ఆపాలని గతేడాది ఫిబ్రవరిలో కేంద్రానికి లేఖ రాశారు. మార్పులు చేసి పంపిస్తామని చెప్పాక, మొన్న అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మీ సొంత ప్రాజెక్టుకు 10 నెలలు పడుతుంది. కేంద్రం మాత్రం 3నెలల్లో చేయాలా.. అదీ కేంద్ర కేబినెట్‌లో పెట్టాలి అంటే ప్రాసెస్ ఉంటుంది'అని పేర్కొన్నారు.

దేశ గతిని నిర్దేశించిన అంబేడ్కర్

జస్టిస్ కొండా మాధవరెడ్డి స్మారక ఉపన్యాసంలో ఆర్థికవేత్త డాక్టర్ నరేంద్ర జాదవ్



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి. చిత్రంలో నరేంద్రజాదవ్, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం మూడునాలుగేళ్ల కృషి కాదని, 55 ఏళ్లపాటు శ్రమించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన లిఖిత పూర్వక మహాగ్రంథమని ఆర్థికవేత్త, రచయిత డాక్టర్ నరేంద్ర దామోదర్ జాదవ్ పేర్కొన్నారు. మన దేశంలో రాజ్యాంగం ప్రవేశపెట్టాలన్న యోచనకు 1895 లోనే బీజం పడిందన్నారు. అప్పటి నుంచి పన్నెండుసార్లు వివిధ సందర్భాల్లో, వివిధ రూపాల్లో రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. అన్నిసార్లు అంబేడ్కర్ కీలకపాత్ర పోషించారని వెల్లడించారు. హైదరాబాద్ ఏవీ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన జస్టిస్ కొండా మాధవరెడ్డి (జేకేఎంఆర్) స్మారక ఉపన్యాసంలో ఆయన పాల్గొన్నారు. తొలుత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌తో కలసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జాదవ్ మాట్లాడుతూ.. 'జేకేఎంఆర్ విద్యకు ప్రోత్సాహం ఇచ్చి.. గ్రామీణ, పేద విద్యార్థుల కోసం విద్యాలయాలు స్థాపించారు. సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలను ప్రోత్సహించారు. అదే వారసత్వ సంప్రదాయాన్ని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కొనసాగించడం అభినందనీయం. జేకేఎంఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి విద్య, వైద్య సేవలు అందించడమే కాకుండా, విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారని గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రశంసించారు. స్మారక ఉపన్యాసం నిర్వహణతో నాటి వారి కృషి ఈ తరానికి తెలుస్తుందని కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. జేకేఎంఆర్ తనకు మార్గదర్శి, గురువు లాంటి వారని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వివేక్, ఎమ్మెల్సీ కోదండరాం, పలువురు న్యాయ మూర్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెన్షన్

- టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ ఉత్తర్వులు
- పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదు: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 'టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మీకు గతనెల ఐదో తేదీన షోకాజ్ నోటీసులిచ్చింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న అంశంపై అదే నెల 12లోపు వివరణ ఇవ్వా లని కోరింది. ఆ నోటీసులకు ఇప్పటివరకు వివరణ ఇవ్వకపోగా, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని మిమ్మల్ని సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది'అని ఎమ్మెల్సీ మల్లన్నకు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కులగణననే కారణమా?: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణనపై వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. బీసీల సభలకు వెళ్లినప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ నేతలనుద్దేశించి పరుష వ్యాఖ్యలు చేయడం, ఓ కులాన్ని ఉద్దేశించి మాట్లాడటం, ప్రభుత్వం విడుదల చేసిన కులగణన ప్రతులను చించివేయడం లాంటి ఘటనలను ఏఐసీసీ సీరియస్‌గా తీసుకుందని ఆ వర్గాలు అంటున్నాయి. అయితే, మల్లన్నను గత నెల రెండో వారంలోనే సస్పెండ్ చేయాల్సి ఉన్నా.. అప్పటి పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అడ్డుకున్నారని చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం మున్షీని మార్చి ఆమె స్థానంలో మీనాక్షి నటరాజన్‌ను పంపడం, మీనాక్షి దృష్టికి ఎమ్మెల్సీ మల్లన్న వ్యవహారాన్ని తీసుకెళ్లడం, ఆమె అధిష్టానంతో మాట్లాడి సస్పెన్షన్‌కు ఒప్పించడం చకచకా జరిగిపోయాయని తెలుస్తోంది. మీనాక్షి అనుమతితోనే ఎమ్మెల్సీ హోదాలో ఉన్న మల్లన్న సస్పెన్షన్ సాధ్యమవుతుందని గాంధీభవన్ వర్గాలు చెపుతుండటం గమనార్హం. అయితే, తన సస్పెన్షన్‌పై ఎమ్మెల్సీ మల్లన్న ఎక్కడా అధికారికంగా స్పందించలేదు.

చాలా సార్లు హెచ్చరించాం: పీసీసీ చీఫ్

మల్లన్న సస్పెన్షన్ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా వెళ్లవద్దని ఆయనను చాలా సార్లు హెచ్చరించామని, ముఖ్యంగా కులగణన ప్రతులను చించివేయడంపై ఏఐసీసీ సీరియస్ అయిందని మహేశ్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ లైన్ దాటితే ఎవరినీ వదిలిపెట్టేది లేదని శనివారం ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

రేవంత్ చరిత్రంతా బ్యాగులు మోయడమే కదా!

- బ్యాగులు మోయవద్దని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అనడం పెద్ద జోక్
- కేసీఆర్ అప్పు చేసి, సంపద సృష్టించి ప్రజలకు పంచారు
- రేవంత్ ఏడాదిలోనే రూ.1.50 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఏం చేసిండు?
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రశ్న
- బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు



మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్. చిత్రంలో మహమూద్ అలీ, సబిత, మధుసూదనాచారి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కన పెట్టుకొని బ్యాగులు మోయవద్దని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల కొత్త ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడడం పెద్ద జోక్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అప్పట్లో చంద్రబాబుకు బ్యాగులు మోసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి బ్యాగులు మోస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డితోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి మైక్‌లో చెప్పాలి, చెడు చెవిలో చెప్పాలంటున్న రేవంత్.. ఒక్క మంచి పని కూడా చేయకపోవటం వల్లనే ఎవరూ మైక్‌లో చెప్పడం లేదని అన్నారు. 'హైడ్రా విధ్వంసం, ఆర్‌ఆర్ ట్యాక్స్, భూకబ్జాలు, అంతులేని అవినీతితో కుప్పకూలిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, మొన్ననే కొట్టుకుపోయిన పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌస్ మొదలైన చెడులన్నీ చెపితే రేవంత్ చెవుల నుంచి రక్తం కారుతుంది. జనవరి 26న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల డబ్బులు పడతాయని హామీ ఇచ్చి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు'అని విమర్శించారు.

కేసీఆర్ హయాంలో ప్రశాంతం... నేడు విధ్వంసం

హైడ్రా, మూసీ కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారని కేటీఆర్ విమర్శించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు కేసీఆర్ హయాంలో 90% పూర్తయ్యాయని, కేవలం 10% పనులు చేస్తే చేవెళ్లకు నీళ్లు వస్తాయి కానీ కేసీఆర్‌కు పేరొస్తుందన్న అసూయతో రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని పక్కన పెట్టారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ కోసం రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేసి కమీషన్లు దండుకొని, కాంగ్రెస్ అధిష్టానానికి పంపి తన పదవి కాపాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలో తెలంగాణను తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని చెప్పారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 24 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు సృష్టించినట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి ఏడాదిలోనే రూ.1.5 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఏం చేశారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి హయాంలో నీళ్లు పాతాళంలోకి, నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు.



“ బలాత్కారము చేయువాని చూచి మత్సరపడకుము.
వాడు చేయు క్రియలను ఏమాత్రమును చేయగోరవద్దు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.తదియ 12.54 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ప.12.21 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.11.32 నుండి 1.01 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.27 నుండి 5.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.55 నుండి 8.11 వరకు.

సూర్యోదయం : 6.23
సూర్యాస్తమయం : 6.02
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

శశి థరూర్ (లోక్‌సభ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

పుస్తకాలు చదివితే జ్ఞానం లభిస్తుందా? ఆ జ్ఞానం... ఎవరినైనా, ఏ విధంగానైనా అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుందా? లేదంటే, అర్థం చేసుకోవటాన్ని ఆ జ్ఞానం మరింతగా సంక్లిష్ట పరుస్తుందా?

ఢిల్లీ నుండి రాహుల్ ఫోన్! “మనం ఒకర్నొకరం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది థరూర్‌జీ...” అంటారాయన! అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని గుర్తించటానికి ఏదైనా పుస్తకం చదవటం వల్ల సంప్రాప్తించిన జ్ఞానం ఆయనకు దోహదపడి ఉంటుందా?

“కొత్తగా ఏం చదువుతున్నారు రాహుల్‌జీ...” అని అడిగాను.

“కొత్తగా ఏమీ చదవటం లేదు థరూర్‌జీ. కొత్తగా మీ ట్విట్టర్ అకౌంట్ మాత్రం చూస్తున్నాను. ఎవరిదో కోట్ పెట్టినట్లున్నారు... ‘అజ్ఞానం ఆనందదాయకం అయిన చోట, జ్ఞానవంతులుగా ఉండటం మూర్ఖత్వమని’! ఆ కోట్ చూశాకే మీకు ఫోన్ చేశాను... మనం ఒకర్నొకరం అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని...” అన్నారు రాహుల్!

“రాహుల్‌జీ! మీరు గానీ ఆ కోట్‌లో... అర్థాలనేమైనా వెతుకుతున్నారా?” అన్నాను.

“అర్థాలను కాదు థరూర్‌జీ. మిమ్మల్ని వెతుకుతున్నాను. మీ ట్వీట్ చదివాక, మీ



పాడ్‌కాస్ట్ విన్నాక, పీయూష్ గోయల్‌తో మీ సెల్ఫీ చూశాక నాకనిపిస్తోంది. కాంగ్రెస్‌లో ఉన్న కారణంగా మీరు మీ జ్ఞానాన్ని చాలా మిస్ అవుతున్నారని...” అన్నారు రాహుల్!

రాహుల్ ఇంత జ్ఞానగర్భితంగా మాట్లాడటం మునుపెన్నడూ నేను వినలేదు.

“కాంగ్రెస్ పార్టీ మిమ్మల్ని వద్దనుకుంటే మీరేం చేస్తారు?” అని పాడ్‌కాస్టర్ నన్ను అడిగినప్పుడు – “నాకు వేరే ఆప్షన్స్ ఉన్నాయి” అని నేను చెప్పాను. వేరే ఆప్షన్స్ అంటే నా ఉద్దేశం పుస్తకాలు, ప్రసంగాలు.

ఇక పీయూష్ గోయెల్‌తో నేను సెల్ఫీ దిగటమైతే ఎవరి దృష్టిలోనో పడటానికి చేసింది కాదు. గోయెల్ కామర్స్ మినిస్టర్. బ్రిటన్ కామర్స్ మినిస్టర్ ఆయన పక్కన ఉన్నారు. నాకూ కామర్స్‌లో ఇంట్రెస్ట్ ఉంది కాబట్టి ముగ్గురం కలిసి సెల్ఫీ తీసుకున్నాం.

“నా ట్వీట్‌లో, పాడ్‌కాస్ట్‌లో, సెల్ఫీలో మీరు నన్ను వెతుకుతున్నట్లే, ‘కాంగ్రెస్ పార్టీలో నేనెక్కడ?!’ అని నేనూ నన్ను వెతుక్కుంటున్నాను రాహుల్‌జీ...” అన్నాను.

“థరూర్‌జీ! దేశానికెంతో చేస్తున్నారని మీరు మోదీజీని కీర్తిస్తున్నారు. కేరళకెంతో చేస్తున్నారని కమ్యూనిస్టులను ఆకాశానికెత్తేస్తున్నారు. అలాంటప్పుడు మేము మిమ్మల్నిగానీ, మిమ్మల్ని మీరు గానీ కాంగ్రెస్‌లో ఎంత వెతికితే మాత్రం ఎలా మీరు కనిపిస్తారు?! ...

...అంతేకాదు థరూర్‌జీ! మీరు స్టెప్ బై స్టెప్ కింది నుంచి పైకి రాలేదు. ఒకేసారి పైనుండి ప్యారాచూట్‌లో కాంగ్రెస్‌లోకి వచ్చి పడ్డారు. ప్యారాచూట్ కిందికి దిగటానికే కానీ, పైకి ఎగరటానికి కాదు...” అన్నారు రాహుల్!!

‘ఒక జ్ఞానవంతుడి ఆత్మకథ’ అనే పుస్తకమేదో చదువుతున్నట్లుగా ఉంది నాకు, రాహుల్ అలా మాట్లాడుతుంటే వినటం!

“‘పార్టీలో నేనేమిటి?’ అని లోక్‌సభలో మీరు నాకు ఎదురుపడి అడిగినప్పుడే మీ మనసులో ఉన్నదేమిటో నాకు అర్థమైంది థరూర్‌జీ. కేరళకు సీఎం అయితేనే మీరేదైనా అయినట్లు కాదు. జ్ఞానం అన్నది ట్వీట్‌లకు, పాడ్‌కాస్ట్‌లకు, సెల్ఫీలకు మాత్రమే పనికొచ్చే ఒక మిత్. ఇదుగోండి, ఖర్గేజీ మీతో మాట్లాడతారట...” అని, ఆగారు రాహుల్!

“హ్యాపీ బర్త్‌డే థరూర్‌జీ...” అన్నారు ఖర్గేజీ లైన్లోకి రావటంతోనే!

“ఈ ఆదివారం కాదు ఖర్గేజీ... నా బర్త్‌డే. వచ్చే ఆదివారం...” అన్నాను నవ్వుతూ.

“మీరు పార్టీలో ఉన్నప్పుడే బర్త్‌డే విషెస్ చెబితే మీకు సౌకర్యంగా ఉంటుంది కదా అని ముందే చెప్పేస్తున్నా థరూర్‌జీ...” అన్నారు ఖర్గే!!

నేను మళ్లీ మళ్లీ చదువుతుండే మహాభారతాన్ని మళ్లొకసారి బయటికి తీశాను. భారతం జ్ఞానాన్ని ఇవ్వదు! జ్ఞానాన్ని అర్థం చేసుకునే జ్ఞానం ఇస్తుంది!

మాయలేళ్లూ... మరీచికలు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

‘చెప్పేదొకటి, చేసేదొకటి’ స్వభావం గలవాళ్లను మోసగాళ్లనే అంటాము. ప్రజా జీవితంలో ఉంటూ మచ్చుకైనా పారదర్శకత లేని ఇటువంటి బ్యాచ్ కూడా మోసగాళ్లే! మాయ లేడి వేషం వేసుకొని మోసగించిన మారీచునికి వీళ్లు వారసులనుకోవాలి. ఇటువంటి మూడు మాయలేళ్లు కలిసి కూటమి కట్టి ఏర్పాటు చేసిన ప్రభుత్వం నుంచి హామీల అమలు గురించి ఆశించడమంటే మరీచికల వెంట పరుగులు తీయడమే! ఈ కూటమి ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్‌లో కూడా ఎన్నికల వాగ్దానాలకు నామం పెట్టారని ప్రతిపక్షం విమర్శిస్తున్నది. ప్రతిపక్షంగా అది వాళ్ల డ్యూటీ కావచ్చు.

కూటమి మాత్రం ఆ విమర్శలను పట్టించుకోదు. మేనిఫెస్టో హామీలను అమలుచేయలేమనీ, చేయబోమనీ వారికి ముందే తెలుసు. రాష్ట్ర శ్రేయస్సు, ప్రజా సంక్షేమం వగైరాల కంటే పరమ పవిత్రమైన ఆశయాలు, ప్రయోజనాలు వారికి విడివిడిగా వేరే ఉన్నాయి. ఆ ప్రయోజనాలు నెరవేరాలంటే అధికారం కావాలి. విడివిడిగా ఉంటే అది కుదిరే పని కాదు. అందుకని ఒక్కటయ్యారు. అయినా నమ్మకం లేక ‘కొండమీది కోతిని నేలకు దించుతాం, బొందితో కైలాసం తీసుకుపోతాం, కళ్ల ముందటే వైకుంఠాన్ని నిలబెడతాం’ తదితరాల స్థాయికి తగ్గని హామీలను మేనిఫెస్టోలో చేర్చుకున్నారు. వాటిని నెరవేర్చి తీరుతామని కూటమి నేతలు వివిధ సభల్లో చేసిన మంగమ్మ శపథాలు, భీష్మ ప్రతిజ్ఞలు ఇప్పటికీ జనం చెవుల్లో గింగిరుమంటూనే ఉన్నాయి.

పిట్టల దొర వాగ్దానాలకు తోడు ఢిల్లీ సర్కార్ సౌజన్యంతో ఎన్నికల సంఘం కూడా ఓ చేయి వేయడంతో కూటమి అధికారంలోకి వచ్చింది. వచ్చిన అధికారాన్ని ఏ రకంగా ఉపయోగించుకోవాలి అనే విషయంపై ఎవరి ప్రాధాన్యాలు వారికున్నాయి. జాతీయ స్థాయిలో కూటమికి పెద్దన్నగా బీజేపీ ఉంటున్నా ఏపీలో మాత్రం తెలుగుదేశం పార్టీదే పెద్దన్న పాత్ర. ఆ పార్టీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోకి మారిన తర్వాత ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వ్యతిరేకించే వైఖరి తీసుకుంటున్నది. విద్య, వైద్యం వంటి ప్రాథమిక విషయాలు కూడా ప్రభుత్వ బాధ్యత కాదనీ, ఆ రంగాల్లో ప్రైవేట్ సేవలు అవసరమనీ చెప్పిన చరిత్ర బాబుది.

ప్రభుత్వం నుంచి పొందే సేవలకు కూడా ప్రజలు యూజర్ ఛార్జీలు చెల్లించవలసిందేనని ఆయన గతంలోనే ఘంటాపథంగా ప్రకటించారు. అదేరకంగా పాలించారు. మొన్నటి ఎన్నికల సందర్భంగా ఆయన ప్రకటించిన సూపర్ సిక్స్ వాగ్దానాలకు ఆయన సిద్ధాంతపరంగానే వ్యతిరేకి! అయినప్పటికీ అటువంటి మేనిఫెస్టోకు రూపకల్పన చేయడమంటే అధికారం పొందడం కోసం ఉద్దేశపూర్వకంగా మోసానికి తెగబడ్డారంటే తప్పవుతుందా? ఈ మోసాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆయన ఈ మధ్యనే ‘పీ4’ అనే ఓ వంటింటి చిట్కాను ప్రకటించారు.

ఈ ఉగాది నుంచి అమలుచేయ సంకల్పించిన ఈ ‘పీ4’ చిట్కాతో రాష్ట్రంలోని పేదరికం మటుమాయమైపోతుందట! పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ భాగస్వామ్యమని దాని పూర్తి పేరు. సమాజంలోని పది శాతం మంది అత్యంత సంపన్నులు అట్టడుగున ఉన్న 20 శాతం మంది కడుపేదలను దత్తత తీసుకోవాలట! ఈ పేదవారి అవసరాలను ఆ సంపన్నులు గుర్తించి తృణమో పణమో సాయం చేసి పేదరికం నుంచి బయట పడేయాలట! ఈ ‘సామాజిక బాధ్యత’ నెరవేర్చినందుకు ఆ సంపన్నులకు ఏ సహజ వనరుల్ని కట్టబెడతారన్నది ఇక్కడ రహస్యం.

కుల మత ప్రాంతీయ లింగ భేదాల్లేకుండా ఈ దేశంలో పుట్టిన ప్రతి మనిషికీ భారత రాజ్యాంగం సమాన హక్కులను కల్పించింది. చారిత్రకంగా వివిధ సమూహాల మధ్య అభివృద్ధి క్రమంలో ఏర్పడిన అంతరాలను పూడ్చడానికి ప్రభుత్వాలు పూనుకోవాలని ఆదేశించింది. సహజ వనరుల్లో అందరికీ సమాన భాగస్వామ్యం ఉండాలి. అందరూ సమానస్థాయిలో పోటీ పడగలిగే అవకాశాలు (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) ఏర్పడాలని రాజ్యాంగం చెబుతున్నది. అటువంటి పరిస్థితులను ప్రభుత్వాలు ఏర్పాటు చేసినట్లయితే పేదరికాన్ని పేదలే జయిస్తారు. ఈ దేశాన్ని కూడా సంపన్న దేశంగా నిర్మిస్తారు. రాజ్యాంగం ఆశయం కూడా అదే! ఎవరి ఎంగిలి మెతుకుల తోనో పండుగ చేసుకొమ్మని చెప్పలేదు.



> భారతీయ జనతా పార్టీది జాతీయ స్థాయి లక్ష్యం. వరసగా మూడుసార్లు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి బీజేపీ, సంఘ్ పరివార్‌లు మంచి ఊపుమీదున్నాయి. ఇక ఆరెస్సెస్ స్థాపిత లక్ష్యమైన హిందూ రాష్ట్ర ఎజెండాను బయటకు తీసే ముహూర్తం ఇప్పుడు కాక ఇంకెప్పుడని అవి భావిస్తున్నాయి. మొన్నటి ‘మహా కుంభమేళా’ సందడిలోనే అందుకు అంకురార్పణ కూడా జరిగిపోయిందట! ‘అమర్ ఉజాలా’ అనే ఉత్తరాది హిందీ పత్రిక కోసం అలోక్ కుమార్ త్రిపాఠీ రాసిన వార్తా కథనాన్ని ఉటంకిస్తూ ‘ది వైర్ తెలుగు డాట్ ఇన్’ ఈ విషయాన్ని వెల్లడించింది. ఇంకో పాతికేళ్లలో దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించే అవకాశం ఉన్నదట! అందుకు అవసరమైన అడుగులన్నీ ఇక వరసగా వేసుకుంటూ వెళతారు. ‘రుషి సంవిధాన్’ అనే పేరుతో ప్రత్యామ్నాయ రాజ్యాంగం కూడా సిద్ధమైందట! దీన్నే ‘సనాతన రాజ్యాంగ’మని పరివార్ ముఖ్యులు పిలుచుకుంటున్నారు. రాజ్యాంగాన్ని మార్చబోమంటూ బీజేపీ నేతలు పదేపదే ఇస్తున్న హామీలన్నీ బూటకమేనని ఇప్పుడు సిద్ధంగా ఉన్న ‘రుషి సంవిధాన్’ లేదా సనాతన రాజ్యాంగం రుజువు చేస్తున్నది.

ఈ ‘పీ4’ కార్యక్రమాన్ని గురించి రానున్న రోజుల్లో యెల్లో మీడియా ఏ రకమైన ప్రచారాన్ని చేపట్టబోతున్నదోనని ఊహించుకుంటేనే గగుర్పాటు కలుగుతున్నది. ఇంతటి మహత్తరమైన ఆలోచన గతంలో కార్ల్ మార్క్స్‌కు గానీ, అంబేడ్కర్‌కు గానీ, మరెవ్వరికీ గానీ రాలేదని వీరతాడు వేయవచ్చు. ఇకముందు రాబోదని కూడా ఛాలెంజ్ చేయవచ్చు. ఈ చిట్కా వైద్యంతో చిటికెలోనే పేదరికం పరారైందని కూడా ప్రకటించవచ్చు.

‘పీ4’ సంక్షేమ ప్రచారం హోరులో తెలుగుదేశం పార్టీ అధినేతలకు మిగిలిన పవిత్ర కార్యక్రమం ఏమున్నది? ఒక్క అమరావతి తప్ప! దానికి అభివృద్ధి అనే ముసుగు వేయడం తప్ప! మిగిలిన ఈ మూడేళ్లూ (ఒక సంవత్సరం జమిలి ఎన్నికల కోత ఉండవచ్చు) అమరావతి సేవలోనే ప్రభుత్వం తరించే అవకాశం ఉన్నది. అమరావతి నిర్మాణానికి రూపాయి కూడా ప్రభుత్వం ఖర్చు చేయవలసిన అవసరం లేదని, దాని ల్యాండ్ బ్యాంక్ ద్వారా సంపాదించిన సొమ్ముతోనే నిర్మాణం జరిగిపోతుందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు పలుమార్లు చెప్పిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. అందుకు భిన్నంగా ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, జర్మనీ, ‘హడ్కో’ల ద్వారా 30 వేల కోట్లకు పైగా అప్పులు చేశారు. ఇంకో ఇరవై వేల కోట్ల రూపాయలను సీఆర్‌డీఏ ద్వారా సమీకరించేందుకు ఆదేశిస్తూ జీవో కూడా ఇచ్చారు.

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను గనక ఉపయోగంలోకి తెచ్చుకుంటే వైజాగ్ తక్షణమే అందుబాటులోకి వచ్చేది. ఆ సంగతి పక్కనబెట్టి, వైజాగ్‌ను విస్మరించి, ఇన్ని వ్యయప్రయాసలకోర్చడం వెనుక అసలు కథ ఇప్పటికే చాలామందికి అర్థమై ఉంటుంది. రాష్ట్ర రాజధాని పేరుతో అతి పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారని, దాని ద్వారా ఆ పార్టీ ముఖ్యనేతలు, వారి అనుయాయులు వేల కోట్ల రూపాయలు దండుకోవడానికి ప్రణాళికలు రచించారనే విమర్శలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ విమర్శలను పూర్వపక్షం చేసే సంతృప్తికరమైన సమాధానాన్ని తెలుగుదేశం నాయకత్వం ఇప్పటికీ ఇవ్వలేకపోతున్నది. ప్రతిపక్షం వారు రుజువులు చూపిస్తూ చేస్తున్న ఆరోపణలను సహేతుకంగా ఖండించనూ లేకపోతున్నది. దీన్నిబట్టి ఈ మూడేళ్లలో జరగబోయేది – పేదలకు ‘పీ4’ గంజినీళ్లు! పాలక పెద్దలకు కనక వర్షం!!

ఇక భారతీయ జనతా పార్టీది జాతీయ స్థాయి లక్ష్యం. వరసగా మూడుసార్లు కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి బీజేపీ, సంఘ్ పరివార్‌లు మంచి ఊపుమీదున్నాయి. ఇక ఆరెస్సెస్ స్థాపిత లక్ష్యమైన హిందూ రాష్ట్ర ఎజెండాను బయటకు తీసే ముహూర్తం ఇప్పుడు కాక ఇంకెప్పుడని అవి భావిస్తున్నాయి. మొన్నటి ‘మహా కుంభమేళా’ సందడిలోనే అందుకు అంకురార్పణ కూడా జరిగిపోయిందట! ‘అమర్ ఉజాలా’ అనే ఉత్తరాది హిందీ పత్రిక కోసం అలోక్ కుమార్ త్రిపాఠీ రాసిన వార్తా కథనాన్ని ఉటంకిస్తూ ‘ది వైర్ తెలుగు డాట్ ఇన్’ ఈ విషయాన్ని వెల్లడించింది. ఇంకో పాతికేళ్లలో దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించే అవకాశం ఉన్నదట! అందుకు అవసరమైన అడుగులన్నీ ఇక వరసగా వేసుకుంటూ వెళతారు. ‘రుషి సంవిధాన్’ అనే పేరుతో ప్రత్యామ్నాయ రాజ్యాంగం కూడా సిద్ధమైందట! దీన్నే ‘సనాతన రాజ్యాంగ’మని పరివార్ ముఖ్యులు పిలుచుకుంటున్నారు. రాజ్యాంగాన్ని మార్చబోమంటూ బీజేపీ నేతలు పదేపదే ఇస్తున్న హామీలన్నీ బూటకమేనని ఇప్పుడు సిద్ధంగా ఉన్న ‘రుషి సంవిధాన్’ లేదా సనాతన రాజ్యాంగం రుజువు చేస్తున్నది.

సంఘ్ పరివార్ తన అంతిమ గమ్యాన్ని చేరుకోవడానికి కీలకమైన తొలి అడుగు జమిలి ఎన్నికలు లేదా ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్ (ఒక జాతి... ఒకే ఎన్నిక). ఆ తర్వాత ‘ఒక జాతి... ఒకే భాష’, ‘ఒక జాతి... ఒకే మతం’ వంటి నినాదాలు మొదలు కావచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లో జమిలి ఎన్నికల కార్యక్రమాన్ని ఈ దఫా వాయిదా వేసే అవకాశం లేదు. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలకు సరిపోయే సంఖ్యాబలం ఎన్డీఏకు ఉన్నదా లేదా అనే శంకలు అనవసరం. సమకూర్చుకోగలమనే నమ్మకం ఎన్డీఏకు ఉన్నది. బీజేపీ శిబిరానికి దూరంగా ఉండే తటస్థ పార్టీలకు కూడా వాటి అవసరాలు వేరువేరుగా ఉండవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన రాజకీయ కక్షను, స్టేట్ టెర్రర్‌ను ఎదుర్కొంటున్న వైసీపీ వాళ్లు ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఈ దమనకాండను వదిలించుకుందామనే దిశలో ఆలోచించవచ్చు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కూడా ఏడాది ముందుగానే అధికారంలోకి వచ్చే అవకాశాన్ని వదులుకోకపోవచ్చు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత స్పష్టంగానే కనిపిస్తున్నది.

ఇల్లలకంగానే పండగ కాదు. జమిలి ఎన్నికలు జరిగినంత మాత్రాన హిందూ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైనట్టు కాదు. ఇంకా చాలా దూరం ఉన్నది. జమిలి ఎన్నికలకు సహకరించిన పార్టీలన్నీ ‘రుషి సంవిధాన్’కు సహకరించకపోవచ్చు. జమిలి ఎన్నికల్లో ఏమైనా జరగవచ్చు. కాకపోతే చాప కింద నీరులా బీజేపీ చేస్తున్న సన్నాహాలకూ, ఆ పార్టీ నేతలు పైకి చెబుతున్న మాటలకూ ఏమాత్రం పొంతన లేదనే విషయాన్ని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

ఇక మాటలకూ, చేతలకూ పొంతన ఉండనివాళ్లు తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ‘జనసేనాని’ని నియమించుకోవచ్చు. ఈ పదేళ్లలో ఆయన తన ఐడియాలజీని తలకిందులుగా వేలాడదీశారు. ఆయన ఆరాధన చేగువెరా నుంచి సావర్కర్‌కు బదిలీ అయింది. తన మాటలకు విరుద్ధంగా తానే మాట్లాడిన ఉదంతాలు కోకొల్లలు. సనాతన రాజ్యాంగం గురించిన మాటలు సంఘ్ పరివారంలో వినపడగానే సనాతన ధర్మ పోరాట యోధుడి అవతారమెత్తడం గమనార్హం. ఏ రాజకీయ ప్రవంతిలో కలిసిపోతే తన ప్రయాణం సుఖంగా సాగుతుందని భావిస్తారో అందులో దూకెయ్యడం ఆయనకు రివాజుగా మారింది. ఇలా మాట నిలకడ లేని, పారదర్శకత అసలే లేని ముగ్గురు కలిసి ఏర్పాటు చేసుకున్న కూటమి నుంచి హామీల అమలు గురించి ఆశించడం నీటి కోసం ఎండమావుల వెంట పరుగులు తీయడమే అవుతుంది. కాకపోతే ఈ రాజకీయ వంచనా శిల్పాన్ని ఎండగట్టడం, ప్రజలను జాగృతం చేయడం ప్రజాస్వామ్య ప్రియుల తక్షణ కర్తవ్యం.

> ఈ ఉగాది నుంచి ఏపీలో అమలుచేయ సంకల్పించిన ఈ ‘పీ4’ చిట్కాతో రాష్ట్రంలోని పేదరికం మటుమాయమైపోతుందట! పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ భాగస్వామ్యమని దాని పూర్తి పేరు. సమాజంలోని పది శాతం మంది అత్యంత సంపన్నులు అట్టడుగున ఉన్న 20 శాతం మంది కడు పేదలను దత్తత తీసుకోవాలట! ఈ పేదవారి అవసరా లను ఆ సంపన్నులు గుర్తించి తృణమో పణమో సాయం చేసి పేదరికం నుంచి బయట పడేయాలట! ఈ ‘సామా జిక బాధ్యత’ నెరవేర్చినందుకు ఆ సంపన్నులకు ఏ సహజ వనరుల్ని కట్టబెడతారన్నది ఇక్కడ రహస్యం.
> ...ఈ ‘పీ4’ కార్యక్రమాన్ని గురించి రానున్న రోజుల్లో యెల్లో మీడియా ఏరకమైన ప్రచారాన్ని చేపట్టబోతున్నదోనని ఊహించుకుంటేనే గగుర్పాటు కలుగుతున్నది. ఇంతటి మహత్తరమైన ఆలోచన గతంలో కార్ల్‌మార్క్స్‌కు గానీ, అంబేడ్కర్‌కు గానీ, మరెవ్వరికీ గానీ రాలేదని వీరతాడు వేయవచ్చు. ఇకముందు రాబోదని కూడా ఛాలెంజ్ చేయవచ్చు. ఈ చిట్కా వైద్యంతో చిటికెలోనే పేదరికం పరారైందని కూడా ప్రకటించవచ్చు.

vardhelli1959@gmail.com

ఆ కాలపు అరుదైన నటీమణి



వి.ఏ.కె. రంగారావు


నాకప్పుడు ఎనిమిదేళ్ళు. వేసవికని బెంగుళూరులో ఉన్నాము. అక్కడి ‘మినర్వా’ సినిమా హాలులో హీరోయిన్ కృష్ణవేణి నటించిన ‘గొల్లభామ’ (1947) సినిమా చూశాను. ఒకటికి రెండు మార్లు!

నాకు చిన్నతనం నుంచి గ్రామఫోన్ రికార్డులు వినడం అలవాటు. సినిమా చూడటానికి ముందే ఆ సినిమా రికార్డులు యింట్లో ఉన్నాయి. అందులో పాటలే కాక -- కె. రఘురామయ్యతో యుగళగీతం ‘చందమామ...’, కృష్ణవేణి సోలో ‘ఉన్నావా? లేవా...’-- ఒక పద్యం, సినిమాలోని పతాక సన్నివేశం లోనిది ‘భూపతి జంపితిన్’ ఉంది.

అంతవరకు సినిమా పాటలే నా బుర్రకెక్కాయి. ఇదే మొదటి పద్యం. ఆ రాగ మాధుర్యం, నేపథ్య సంగీతం ఒరవడి అర్థమై కాదు... ఆ సులభమైన మాటలు, ఆ సన్నివేశానికి తగినట్లుగా బోధపడటం వలన!

1947 మద్రాసులో మేము కొన్న యిల్లు ఉండేది పైక్రాఫ్ట్స్ గార్డెన్స్‌లో! ఆ వీధి చివరి యిల్లే కృష్ణవేణిది. ఆమె అమెరికా నుంచి దిగుమతి అయిన ఖరీదైన రెండు రంగుల ఇంపోర్టెడ్ కాడిలాక్ కారులో తిరిగేది. ఆమె భర్త మీర్జాపురం రాజా వారు చిన్న మోరీస్ మైనర్ కారులో వచ్చేవారు. అప్పట్లో సినీ రంగంలో సొంత లగ్జరీ లిమొజీన్ కారున్న తొలి వ్యక్తి కూడా కృష్ణవేణే!

సంస్మరణ



సి. కృష్ణవేణి (1924-2025)

ఆమె కూతురు -- అప్పటి పేరు మేకా రాజ్యలక్ష్మి అనూరాధ. ‘ఎమ్.ఆర్.ఎ.’ ప్రొడక్షన్స్ అన్న కృష్ణవేణి సినిమా నిర్మాణసంస్థ యీమె పేరు తాలూకు పొడి అక్షరాలే! సాయంత్రం పూట తోపుడు బండిలో షికారు వస్తే మా అమ్మ ఆమెను ముద్దు చేసేది.

నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేత్రిగా కృష్ణవేణిది బహుముఖమైన ప్రస్థానం. కొన్ని సంగతులు ప్రత్యేకించి చెప్పుకోవాలి. చిన్న వయసులో ఆమె నటించిన ‘కచ దేవయాని’ (1938) దశాబ్దాల తరువాత పూనాలోని నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్‌లో చూశాను. అందులో ‘‘కచా! కచా!!’ అంటూ ఆమె నాయకుడి వెంట బడటం గుర్తున్నది నాకు! అలాగే, కథానాయికగా విజయాలు సాధించిన తర్వాత ఆమె కెరీర్‌లో ఒకే ఒక సందర్భంలో... ‘తిరుగుబాటు’ (1950) చిత్రంలో... వ్యాంప్ పాత్ర ధరించడం మరో విశేషం. అయితే, అంతటి వ్యాంప్ పాత్రలోనూ ఆమె బాడీ ఎక్స్‌పోజర్ చేయకుండా నటించడం గమనార్హం. ఆ పాత్ర కోసం ఆమె ఫుల్ స్లీవ్ బ్లౌజులు స్వయంగా డిజైన్ చేసుకొని, ధరించడం మరో చిత్రం.

కృష్ణవేణి తాను నటించిన సినిమాలన్నిటిలో తన పాటలు తానే పాడుకున్న అరుదైన గాయని. అయితే, ‘దాంపత్యం’ (1957) చిత్రంలో మాత్రం తెరపై కృష్ణవేణి నటనకు రావు బాలసరస్వతి నేపథ్యగానం చేయడం అరుదైన సందర్భం. ఇక, తమ సంస్థ సొంత చిత్రం ‘కీలుగుర్రం’(1949)లో నటి అంజలీదేవికి కృష్ణవేణి ప్లేబ్యాక్ పాడడం మరో గమ్మత్తు. ఆమె పాడిన పాటల్లో దాదాపు 20 దాకా పాటలు 78 ఆర్‌పీఎం గ్రామఫోన్ రికార్డుల్లో ఉన్నాయి.

ఎన్.టి. రామారావుని ‘మన దేశం’ (1949) పోలీసు యిన్‌స్పెక్టర్‌గా, అదే చిత్రంతో ఘంటసాలను సంగీత దర్శకునిగా పరిచయం చేసింది ఆమె. రమేశ్ నాయుడికి స్వతంత్ర సంగీత దర్శకుడిగా మొదటి అవకాశమూ ఆమె నిర్మించిన ‘దాంపత్యం’ ద్వారానే! ఆ ‘దాంపత్యం’ చిత్రం ద్వారానే విజయ్‌కుమార్‌ను హీరోగానూ పరిచయం చేశారు. ఆ విజయ్‌కుమార్ తల్లి... అంతకు చాలాకాలం ముందే వచ్చిన తొలి తెలుగు సాంఘిక చిత్రం ‘ప్రేమ విజయం’ (1936)లో నటించారు. మద్రాసులో శోభనాచలా స్టూడియో నిర్వహణతో పాటు, నిర్మాతగా కృష్ణవేణి కన్నడంలో రాజ్‌కుమార్‌తో హిట్ చిత్రాలు నిర్మించడమూ మర్చిపోలేము. చివరి రోజుల్లో ఆమె తన జీవితచరిత్రను సీనియర్ జర్నలిస్ట్ ఎస్వీ రామారావు సహకారంతో రాయగా, ‘కృష్ణవేణీ తరంగాలు’ పేరిట కుమార్తె అనూరాధ ప్రచురించారు.


నూటొక్క సంవత్సరాలు నిండిన చిత్తజల్లు కృష్ణవేణి గంధర్వ లోక గతురాలైందన్న విషయం తెలిసి యివన్నీ గుర్తుకు వచ్చాయి.

అవన్నీ మరపురాని గుర్తులు... ఆమె పాడినవి మధుర గీతాలు!!

వ్యాసకర్త ప్రముఖ సినీ – సంగీత – నాట్య విమర్శకులు

అంతర్ దృష్టి

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన మనస్సు గ్రహించిన విషయాలు మనస్సులోనే లీనమవుతాయి. కొంచెం ఆలోచించండి... నీవు మైసూరు నుండి ముంబాయికి వాహనంలో వెళుతున్నప్పుడు వాస్తవంగా నీ శరీరమే కదలి వెళుతుందా? కాదు కదా! వాహనం కదా కదిలేది. నీ శరీరం కదిలే వాహనంలో ఉంటుంది. ప్రయాణ సాధనాల చలనాన్ని అందులో ఉన్న శరీరానికి ఆపాదించినట్లుగా, ఆలోచనలు, దృష్టి, కలలను కూడా ఆత్మపై ఆపాదించుకొంటున్నాం. ఆత్మ ఎల్లప్పటికీ నిశ్చలంగా ఉంటుంది. ఇది బాహ్య ప్రపంచానికి లోను కాదు. నీ దృష్టి ఎంతకాలం బాహ్య కదలికలపై, మార్పులపై ఉంటుందో... అంతవరకూ నీ ఆత్మజ్యోతి మరుగునపడి ఉంటుంది. అందువల్ల నీ దృష్టిని అంతరంగంలోకి మరల్చి, బాహ్య ప్రపంచంలో కనిపించే ఆకర్షణీయ దృశ్యాలన్నీ పైపై మెరుగులనే వాస్తవాన్ని తెలుసుకోవాలి.

సామాన్య ప్రజలు తమ శరీరాన్ని తాము గుర్తించుకుంటారు. అందువలన వారు ఆత్మజ్ఞానులు కాలేరు. ఈ శరీరం నిత్యమైనది కాదు. విశ్రాంతిగా ఉన్నప్పుడు, లేక తిరుగుచున్నప్పుడు శరీరం ఉన్నా, రాలిపోయినా సిద్ధునికి దీనిపై ధ్యాస (అభిమానం) ఉండదు. అతనే నడిచే దైవం!

బహుజనులకు సాహితీ బాసట

సాహితీవేత్తగా, సామాజిక కార్యకర్తగా ప్రసిద్ధి చెందిన బీఎస్ రాములు (బేతి శ్రీరాములు) తన జీవితాన్నే ఒక ఉద్యమంగా మల్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించారు. 1949 ఆగస్టు 23న జగిత్యాలలో చేనేత కుటుంబంలో ఆయన జన్మించారు. ఆకలి బాధను మర్చిపోవడానికి, సమాజాన్ని ఆకళింపు చేసుకోవడానికి తల్లి చెప్పిన కథలే ఆయన కథలు రాయడానికి తొలి ప్రేరణ. విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. 1982లో బీడీ కార్మికుల గురించి రాసిన ‘బతుకుపోరు’ నవల ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆకలి కడుపులను, అడవి బిడ్డల వెతలను, బహుజన బతుకులను ఆయన సాహిత్యీకరించారు. మార్క్సిజంలోని లోపాలను... అంబేడ్కరిజం, బుద్ధిజంతో పూరించి ప్రజా స్వామిక స్వభావాన్ని సంతరింపజేశారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని ఎత్తి పట్టారు. సమాజంలో మార్పు తీసుకొచ్చిన వీరి గ్రంథాల్లో ‘గతితర్క తత్వదర్శన భూమిక’ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన ‘కథల బడి’ పుస్తకం కొత్త రచయితలకు దారిచూపింది.



బీఎస్ రాములు

తన చుట్టూ ఉన్న సమాజాన్ని సజీవంగా చిత్రించడంతో పాటు ఒక నిర్మాణాత్మక సందేశాన్ని అందించిందాయన సాహిత్యం. ‘జీవన యానం’, ‘చూపు’ నవలలు ఇందుకు మచ్చుతునకలు. తాను అందించిన సాహితీ సేవకు ‘దాశరథి పురస్కారం’, ‘కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం’, ‘కొడవటిగంటి కుటుంబరావు పురస్కారం’ వంటివి ఎన్నో అందుకున్నారు. ఇప్పటి వరకు బీఎస్ మొత్తం 120 పుస్తకాలు రాశారు. సాహిత్యంతో పాటు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, తాత్విక రంగాలకు చెందిన పుస్తకాలు ఇందులో ఉన్నాయి. ‘విశాల సాహిత్య అకాడమీ’ స్థాపించి వందలాది రచయితలకు పురస్కారాలు అందజేశారు. ఎంతోమంది రచయితల పుస్తకాలు ప్రచురించారు.

మలి తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుండి చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి 17 పేద కులాలను బీసీల్లో చేర్చారు. ఇటువంటి బీఎస్‌కు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జన్మదినోత్సవం సందర్భంగా ఆయన తనయుడు, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ‘యుగకర్త’ బిరుదును, జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయడం ఆనందదాయకం.

– కరీం, సీనియర్ జర్నలిస్ట్ (నేడు దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో బి.ఎస్. రాములుకు జీవన సాఫల్య పురస్కార ప్రదానం)

ఆకేరు వెలవెల



చిన్నగూడూరు: మండు వేసవిలోనూ మత్తడి దూకుతూ జలకళను సంతరించుకునే ఆకేరు వాగు ప్రస్తుతం వేసవికి ముందే ఎడారిని తలపిస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో గత వర్షాకాలం కురిసిన భారీ వానలకు చిన్నగూడూరు ఆకేరువాగు చెక్‌డ్యాం కుడి ఆనకట్ట తెగిపోయి నీరంతా వృథాగా పోయింది. దీంతో వాగు ఇసుక దిబ్బెలు, రాళ్లకుప్పలతో దర్శనమిస్తోంది. యాసంగి పంటలు వేసి సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతన్నల ఆశలు ఆవిరయ్యే పరిస్థితి నెలకొంది.

గోదావరికి జలకళ

బాసర: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు. ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పడిపోతుండటంతో ఎగువన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు ఎత్తారు. 0.6 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నీటిని విడుదల చేసినట్లు ఈఈ చక్రపాణి తెలిపారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, నాందేడ్ డీఈ ప్రశాంత్, బాబ్లీ ప్రాజెక్టు అసిస్టెంట్ ఇంజనీర్లు వినయ్, రికీ, సుశాంత్, ఎస్సారెస్పీ ఏఈ రవి కలిసి బాబ్లీ గేట్లు ఎత్తారు. దిగువ గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. 0.6 టీఎంసీల నీటి విడుదల పూర్తికాగానే గేట్లు మూసి వేయనున్నట్లు తెలిపారు.



24 గంటల్లో బయటికి!

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం శిథిలాల్లో కార్మికుల గుర్తింపు

- ఒకచోట నలుగురు, మరోచోట నలుగురు ఉన్నట్టు ఆనవాళ్లు
- ఆదివారం సాయంత్రానికి నలుగురిని వెలికితీసే అవకాశం
- మిగతా వారి కోసం మరో రెండు రోజులు పట్టవచ్చంటున్న నిపుణులు
- సుమారు 18 అడుగుల మేర ఉన్న మట్టి, శిథిలాల తొలగించేందుకే ఆలస్యం
- మట్టి, బురదను తొలగించిన కొద్దీ ఉబికివస్తున్న ఊట నీరు
- సహాయక చర్యల్లో వేగం పెంచిన రెస్క్యూ బృందాలు
- పరిస్థితిని సమీక్షించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి



సొరంగంలో పరిస్థితులపై సమీక్షిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల్లో నలుగురిని ఆదివారం బయటకు తీసే అవకాశం కనిపిస్తోంది. ప్రమాద స్థలంలో ఒకచోట నలుగురు, మరోచోట నలుగురు కార్మికుల ఆనవాళ్లను గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) గుర్తించింది. సొరంగం పైకప్పు కూలిపడిన సుమారు 150 మీటర్ల స్థలంలో ముందు భాగంలో నలుగురు, చివరి భాగం (ఎండ్ పాయింట్)లో నలుగురు ఉన్నట్టుగా 'నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ)' నిపుణులు అంచనా వేశారు. ముందు భాగంలో ఉన్న నలుగురిని బయటికి తీసేందుకు సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలతో మ్యాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టారు. కొన్ని గంటల్లోనే వీరిని వెలికితీసే అవకాశం ఉందని తెలిసింది. ఇక చివరి భాగంలో ఉన్న నలుగురు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) హెడ్‌కు సుమారు 15 మీటర్ల వెనకాల చిక్కుకొని ఉన్నట్టుగా భావిస్తున్నారు. అక్కడ సుమారు 18 అడుగుల ఎత్తున మట్టి, శిథిలాలు పేరుకుని ఉండటంతో.. అక్కడున్న నలుగురిని బయటికి తీసేందుకు ఒకటి, రెండు రోజులు పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

బురద, ఊట నీటితో ఆటంకం..

సొరంగం పైకప్పు కూలిన ప్రాంతంలో సుమారు 18 అడుగుల ఎత్తులో, 200 మీటర్ల వరకు మట్టి, బురద, శిథిలాలు పేరుకుని ఉన్నాయి. అందులో కాంక్రీట్ సెగ్మెంట్లు, టీబీఎం భాగాలు, రాళ్లు, మట్టి కాకుండా అసాధారణ అవశేషాలు ఉన్న స్పాట్లను జీపీఆర్ గుర్తించింది. ఆయా చోట్ల మ్యాన్యువల్‌గా తవ్వకాలు చేపట్టగా.. తవ్విన కొద్దీ ఏర్పడుతున్న బురద, ఊట నీటితో ఇబ్బంది ఎదురవుతోంది. సొరంగంలో నిమిషానికి సుమారు 5 వేల లీటర్ల సీపేజీ వస్తుండటంతో పది పంపులతో డీవాటరింగ్ పనులు చేపడుతున్నారు. హైడ్రాకు చెందిన మినీ డోజర్‌తో బురదను తొలగిస్తున్నారు.

కన్వేయర్ బెల్టు మరమ్మతుకు మరో 2 రోజులు: సొరంగంలో 13 కిలోమీటర్ల వరకే లోకో ట్రైన్ వెళ్లగలుగుతోంది. అక్కడి నుంచి మినీ డోజర్ ద్వారా బురద, మట్టి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ప్రమాద స్థలానికి ముందు 200 మీటర్ల వరకు చేరుకునేందుకు రెస్క్యూ సిబ్బంది సిద్ధం చేసిన ఫ్లోటింగ్ బెల్టు మీదుగా నడిచి వెళుతున్నారు. ఈ శిథిలాలు, మట్టి తొలగించేందుకు కన్వేయర్ బెల్టు అందుబాటులోకి రాక ఆలస్యం అవుతోంది. కన్వేయర్ బెల్టు ఎండ్ పార్ట్ వద్ద మెషీన్ పూర్తిగా ధ్వంసం కావడం, బెల్టును తిరిగి వినియోగంలోకి తేవాలంటే కొత్త ఫౌండేషన్ వేయాల్సి ఉండటంతో.. ఇందుకోసం మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ..

సహాయక చర్యల్లో ఆధునిక సాంకేతికతను, పరికరాలను వినియోగిస్తున్నారు. శిథిలాల్లో అవశేషాలను గుర్తించేందుకు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్), మానవ రక్తం ఆనవాళ్లను గుర్తించే ఆక్వా-ఐ, ప్రోబోస్కోప్, టీబీఎం విడిభాగాలు, శిథిలాలను కట్ చేసేందుకు అల్ట్రా థర్మికల్ కటింగ్ మెషీన్, ప్లాస్మా కట్టర్స్, సొరంగంలోని బురద, మట్టిని తొలగించేందుకు ఆర్మీకి చెందిన రెండు మినీ బాబ్ క్యాట్ మెషీన్లు, ఎస్కవేటర్‌ను వినియోగిస్తున్నారు. టన్నెల్ లోపల సహాయక చర్యలను ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్‌ఎఫ్ ఐజీ మోహ్సెన్ షహది పర్యవేక్షిస్తున్నారు. శనివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. అనంతరం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, ఆర్మీ, ఎన్‌జీఆర్‌ఐ నిపుణులతో సమీక్షించారు.

డాక్టర్‌గా చెబుతున్నా.. వాళ్లు బతికుండే అవకాశం లేదు: ఎమ్మెల్యే వంశీకృష్ణ

సొరంగంలో కార్మికులు మట్టి, బురద, శిథిలాల కింద కూరుకుపోయారని.. ఒక డాక్టర్‌గా చెబుతున్నానని, వాళ్లు బతికి ఉండేందుకు అవకాశం లేదని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. కార్మికులను బయటికి తీసేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని.. ఒకట్రెండు రోజుల్లో బయటికి తీసే అవకాశం ఉందని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

సర్వే కోసం నేడు ఎన్‌ఆర్‌ఎస్‌సీ బృందం..

సొరంగంలో కుప్పకూలిన ప్రాంతానికిపైన భూఉపరితలం వద్ద 'నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్జీఆర్‌ఐ)' అధికారులు సర్వే చేపట్టారు. ఈ ప్రాంతానికి సమీపంలో మల్లెల తీర్థం జలపాతం ఉండటం, దానికి నల్లవాగు (ఏనిగే)కు మధ్యలో సుమారు 400 మీటర్ల లోతున టన్నెల్‌లో ప్రమాదం జరగడంతో... టన్నెల్‌లో భారీగా నీటి ఊటకు కారణాలపై పరిశీలన చేపట్టారు. అయితే ఎన్జీఆర్‌ఐ పరికరాల ద్వారా 150 మీటర్లలోతు వరకు మాత్రమే మట్టి పొరలు, రాళ్ల ఆకృతుల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. సొరంగం 400 మీటర్ల లోతులో ఉన్న నేపథ్యంలో... పరిశోధించేందుకు 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)' చెందిన నిపుణులు ఆదివారం రంగంలోకి దిగనున్నారు.

వెళ్లి చూస్తే పరిస్థితి ఎంత క్లిష్టమో తెలుస్తుంది: మంత్రి జూపల్లి కృష్ణారావు

సొరంగంలో చిక్కుకున్న 8 మందిని బయటికి తీసే చర్యల్లో పురోగతి కనిపించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శనివారం దోమలపెంట సొరంగం వద్ద మంత్రి ఉత్తమ్‌తో కలసి అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లోపల చిక్కుకున్న కార్మికులు బతికి ఉండే అవకాశం 99శాతం లేదన్నారు. రెస్క్యూ బృందాలు ప్రమాదంలో పడొద్దన్న ఉద్దేశంతో జాగ్రత్తగా పనులు చేపడుతున్నామని, అందుకే ఆలస్యం అవుతోందని జూపల్లి తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యమంటూ విమర్శలు చేస్తున్నవారు ఒకసారి టన్నెల్‌లో ప్రమాదస్థలానికి వెళ్లి చూస్తే.. పరిస్థితి ఎంత కష్టంగా ఉందో తెలుస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

- బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- ఎస్‌ఎల్‌బీసీ సొరంగ స్థలాన్ని సందర్శించిన బీజేపీ ఎమ్మెల్యేల బృందం



ప్రమాద స్థలం వద్దకు వెళుతున్న మహేశ్వర్ రెడ్డి, సూర్య నారాయణగుప్తా తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్/మన్ననూరు: ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, ఘటనకు బాధ్యత ప్రభుత్వానిదేనని బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణగుప్తా, పాల్వాయి హరీశ్‌తో కలసి ఎస్‌ఎల్‌బీసీ సంఘటన స్థలాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రమాద విషయం తెలిసిన నిమిషాల్లోనే ప్రధాని మోదీ స్పందించి కేంద్ర బలగాలను అప్రమత్తం చేశారని చెప్పారు. సహాయక చర్యలకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులు ప్రారంభించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ఆర్థిక స్థితిగతులు బాగాలేవని, ప్రభుత్వ ఒత్తిడితో హడావుడిగా, అజాగ్రత్తగా పనులు చేపట్టారని ఏలేటి తెలిపారు. సొరంగంలో 8 మంది నిండు ప్రాణాలు కొట్టుమిట్టాడుతుంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిక్నిక్‌కు వచ్చినట్టుగా హెలికాప్టర్‌లో వచ్చి వెళ్తున్నారని మండిపడ్డారు. ప్రమాదస్థలానికి సీఎం రేవంత్ ఎందుకు రాలేదని, మంత్రి ఉత్తమ్‌కు ఆయనకు మధ్య కొట్లాట ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు.

సారీ అమ్మా.. సారీ డాడీ

- నేను చనిపోతున్నా.. నా చావుకు కారణం అభి
- సెల్ఫీ వీడియో తీసి ప్రేమికుడి ఇంట్లో యువతి బలవన్మరణం



శ్రీకల్యాణి

ఖమ్మం రూరల్: ఐదేళ్లుగా ప్రేమిస్తున్న యువకుడు మాట్లాడుకుందామని వారి ఇంటికి పిలిపించగా.. అక్కడ జరిగిన పరిణామాలతో యువతి ఆయన ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ సందర్భంగా ప్రేమించిన యువకుడే తన చావుకు కారణమంటూ సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఖమ్మం బ్యాంకు కాలనీకి చెందిన మంగళగిరి శ్రీకల్యాణి అలియాస్ కావ్య (32) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేయగా, ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌కు చెందిన అభిలాష్ హైదరాబాద్‌లో డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ ఐదేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఈ విషయాన్ని కావ్య రెండేళ్ల క్రితం ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పగా, కులాంతర వివాహానికి వారు నిరాకరించారు. అయినప్పటికీ వారిద్దరూ తమ బంధం కొనసాగిస్తున్నారు. ఈక్రమంలోనే కొద్దిరోజుల క్రితం కావ్యను పొన్నెకల్‌లోని తన ఇంటికి అభిలాష్ తీసుకురాగా అక్కడే ఉంటోంది. మళ్లీ ఆమె తమ ఇంటికి వెళ్లిపోవడంతో శనివారం ఉదయం మాట్లాడుకుందామని అభిలాష్ ఫోన్ చేయగా తిరిగి వచ్చింది. అభిలాష్ ఇంట్లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగ్గా.. మరో గదిలోకి వెళ్లి ఆమె తలుపులు వేసుకుంది. దీంతో అభిలాష్, ఆయన కుటుంబీకులు తలుపులు తీసేందుకు ప్రయత్నిస్తుండగానే కావ్య సెల్ఫీ వీడియో తీసి తన ఫోన్‌లో స్టేటస్‌గా పెట్టి ఉరి వేసుకుంది. అభిలాష్ కుటుంబీకులు తలుపులు పగలగొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే కావ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముష్కరాజు తెలిపారు.

వీడియోలో ఏముందంటే...

ఆత్మహత్యకు ముందు కావ్య తన ఫోన్‌లో సెల్ఫీ వీడియో రికార్డు చేసి స్టేటస్‌గా పెట్టింది. అభిలాష్ ఇంటికి వెళ్లిన సమయంలో ఆమెను కాకుండా మరో యువతిని పెళ్లి చేసుకుంటానని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. కాగా, సెల్ఫీ వీడియోలో 'నా పేరు కావ్య.. నేను చనిపోతున్నాను.. నా చావుకు కారణం అభి.. ఐదు సంవత్సరాల నుంచి నన్ను ప్రేమిస్తున్నానని చెప్పి, వాళ్లింట్లో పెట్టుకుని, ఇప్పుడు నన్ను వదిలేసి ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని చెబుతున్నాడు.. నన్ను ఇంట్లో నుంచి వెళ్లిపోమని అంటున్నాడు.. సో, ఇప్పుడు నేను ఉరి వేసుకోబోతున్నాను (ముడి పెట్టి ఉన్న చీరను చూపిస్తూ).. నా చావుకు కారణం అభి.. సారీ అమ్మా, సారీ డాడీ'అని ఉంది. ఈ మేరకు వీడియో ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నడి రోడ్డుపై భార్యను చంపి..

- అదే కత్తితో పొడుచుకుని భర్త ఆత్మహత్యాయత్నం
- కామారెడ్డిలో కలకలం రేపిన ఘటన

కామారెడ్డి క్రైం: కుటుంబ కలహాల కారణంగా ఓ భర్త పట్టపగలే నడిరోడ్డుపై తన భార్య గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన మోసారపు నర్సింలు నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తుండగా, అతని భార్య మహేశ్వరి (45) స్థానికంగా ఓ హోటల్‌లో వర్కర్‌గా పనిచేస్తోంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. సులభ్ కాంప్లెక్స్ వద్ద శనివారం మధ్యాహ్నం వారి మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహంతో నర్సింలు తన వద్దనున్న పదునైన కత్తితో మహేశ్వరిపై దాడి చేశాడు. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే గొంతు కోసి కడుపులో పొడిచాడు. ఆపై అదే కత్తితో తన కడుపులో పొడుచుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నర్సింలును ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మహేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అత్యంత రద్దీగా ఉండే చౌరస్తాలో హత్య జరగడం కలకలం రేపింది.

క్లుప్తంగా...

టన్ను పామాయిల్ గెలల ధర రూ. 20,871

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



సాక్షి, హైదరాబాద్: గత ఏడాది ఫిబ్రవరిలో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ. 13,135 ఉండగా, ఈ నెల వాటి ధర రూ. 20,871కు చేరిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 1992–93 నుంచి ఇప్పటి వరకు 2.39 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగులోకి తీసుకొచ్చినట్టు వెల్లడించారు. వచ్చే ఏడాది మరో లక్ష ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు ఎకరాకు రూ.50,918 రాయితీని నాలుగేళ్ల పాటు ఇస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

యూసీసీతో దేశం బలహీనం

- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) దేశాన్ని బలహీనపరుస్తుందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. దారుస్సలాంలో శనివారం పార్టీ 67వ వ్యవస్థాపక దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. యూసీసీ అమలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉర్దూ ముస్లిం మతానికి మాత్రమే ప్రత్యేకం కాదని, భారతదేశ సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగమని స్పష్టం చేశారు. భారత స్వాతంత్య్ర పోరాటంలో ఉర్దూ ఒక భాగమని.. రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్ వంటి స్వాతంత్య్ర సమరయోధులు రాసిన కొన్ని ద్విపదలను ఆయన ఉటంకించారు. సభలో పార్టీ శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- చదువుతున్న కాలేజీ ఇష్టం లేక బలవన్మరణం



వైష్ణవి

నర్సాపూర్: తాను చదువుతున్న కాలేజీ ఇష్టం లేక ఇంటర్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన కృష్ణకిశోర్ ఆరేళ్లుగా నర్సాపూర్‌లోని ప్రభుత్వ గిరిజన గురుకుల విద్యా సంస్థలో జూనియర్ వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన కూతురు వైష్ణవి (16) హైదరాబాద్‌లోని నాగోల్‌లో గల ఓ ప్రైవేటు కాలేజీలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. తాను చేరిన కాలేజీలో చదవడానికి ఇష్టం లేదని చెప్పడంతో తండ్రి నెలరోజుల కిందట ఇంటికి తీసుకొచ్చారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలు అయిపోయాక మరో కాలేజీలో చేర్పిస్తానని చెప్పగా ఇంటి వద్దే పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆమెను కాలేజీకి పంపేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తుండగా శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై బీఆర్‌ఎస్‌ది మొసలి కన్నీరు

- ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై బీఆర్‌ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పినా బీఆర్‌ఎస్ నేతల వైఖరిలో మార్పు రాలేదని, ఇంకా శవ రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొండగట్టులో బస్సు ప్రమాదం జరిగినప్పుడు అప్పటి సీఎం కనీసం స్పందించలేదని, అక్కడికి వెళ్లడం అటుంచితే కనీసం ఒక్కమాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వంలో సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి మాత్రం ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం జరిగిన కొన్ని నిమిషాల్లోనే స్పందించారని, ఎక్కువ నష్టం జరగకుండా అధికారులు, మంత్రులకు ఆదేశాలిచ్చారని చెప్పారు.

కొత్త టెక్నాలజీలతో సమర్థంగా పౌర సేవలు

- సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో దేశంకంటే మన వృద్ధిరేటే అధికం
- గ్రోత్ ఎక్స్ సమ్మిట్ 2025లో మంత్రి శ్రీధర్‌బాబు



హెచ్‌ఐసీసీలో నిర్వహించిన గ్రోత్ ఎక్స్ సమ్మిట్ 2025లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్ తదితరులు

మాదాపూర్: తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీల ద్వారా పౌర సేవలను మరింత సమర్థంగా అందించేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ కామర్స్ అండ్ ఇండస్ట్రీ'ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మిట్ ఆన్ ఫ్యూచర్ రెడీ ఇండస్ట్రీ ట్రాన్స్‌ఫార్మేషన్, ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోత్, ఎఫిషియెన్సీ అండ్ సెక్యూరిటీ (గ్రోత్ ఎక్స్ –2025)'ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధిరేటు 17.98 శాతం ఉంటే, దేశ స్థాయిలో 8 శాతమే ఉందని తెలిపారు. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతుండటంతో అన్ని రంగాల్లోనూ మార్పులు వస్తున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచనా తీరు కూడా మారాలని అన్నారు. పరిశ్రమలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకువచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సదస్సులో ఎఫ్‌టీసీసీఐ, టీ–హబ్, టీ- వర్క్స్, టాస్క్, వీహబ్, గూగుల్, మైక్రోసాఫ్ట్ తదితర కంపెనీలు భాగస్వామ్యమయ్యాయి.

ఏఐ ఇంకా మెరుగుపడాలి..

సదస్సులో భాగంగా పంకజ్ ద్వివేది నేతృత్వంలో నిర్వహించిన చర్చాగోష్టిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ కృత్రిమ మేధ పూర్తిస్థాయిలో కచ్చితత్వ సమాచారం లేదా సమాధానం ఇవ్వడం లేదని, తప్పులు దొర్లుతున్నాయని అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏఐని వినియోగించుకొని వ్యాపారాన్ని పెంపొందించుకోవాలని, కానీ అవి ఏఐ వినియోగానికి ఇంకా సంకోచిస్తున్నాయన్నారు.

బీసీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర

- అఖిల భారత బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య
- పీజీ అడ్మిషన్లలో జీవో 550 అమలుచేయాలి: జాజుల



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో జాజుల శ్రీనివాస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): పాలకులు బీసీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తున్నారని అఖిల భారత బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వంగాల ఈశ్వరయ్య అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ విజయ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్లుగా పీజీ వైద్య విద్య అడ్మిషన్లలో బీసీ విద్యార్థులకు జీవో నంబర్ 550ని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈమేరకు సుప్రీంకోర్టులో అఖిల భారత బీసీ ఫెడరేషన్ ద్వారా కేసు వేశామన్నారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దేలా హైకోర్టు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలిచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జీవో 550ని అమలు చేయకపోవడంతో ఏటా బీసీ విద్యార్థులు 300 పీజీ మెడికల్ సీట్లు కోల్పోతున్నారని జస్టిస్ ఈశ్వరయ్య వెల్లడించారు. పీజీ అడ్మిషన్లలో జీవో 550 అమలయ్యేలా 48 గంటల్లోగా చర్యలు తీసుకోవాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఎస్ గౌడ్, డాక్టర్ బండి సాయన్న, డాక్టర్ సురేశ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, జూకంటి రవీందర్, విఠోభా, రాచమల్ల అనిల్, ప్రవీణ్ కుమార్, ఈడియా శ్రీనివాస్, శ్రీకాంత్ ఏత, భిక్షమయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు బాధ్యత సంజయ్, ఈటల తీసుకోవాలి: చనగాని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఆమోదించనున్న బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందే బాధ్యతను కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ఈ చారిత్రక అడుగులో అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ తీర్మానాన్ని కేంద్రం కూడా పరిగణనలోకి తీసుకునేలా అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ నేతలు బాధ్యత తీసుకోవాలని, ఈ క్రమంలో బీఆర్‌ఎస్, లెఫ్ట్, ఇతర పార్టీలు కూడా మద్దతివ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం కృషి చేస్తోందని, వెనుకబడిన వర్గాలకు ఈ ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరుగుతుందని దయాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రక్షణ హామీలు కావాల్సిందే

- అప్పటిదాకా రష్యాతో చర్చల్లేవ్ • కుండబద్దలు కొట్టిన జెలెన్‌స్కీ
- ఖనిజాల ఒప్పందానికి సిద్ధమే • థాంక్యూ అమెరికా, థాంక్యూ ట్రంప్
- 'ఓవల్' రగడ తర్వాత ఎక్స్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుని పోస్టులు

న్యూయార్క్/వాషింగ్టన్: అమెరికాతో బలమైన బంధాన్ని ఆకాంక్షిస్తున్నామని ఉక్రెయిన్ అధినేత వొలొదిమిర్ జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. రష్యాతో మూడేళ్లుగా సాగుతున్న యుద్ధంలో తమకు దన్నుగా నిలుస్తున్నందుకు అమెరికాకు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని, కాల్పుల విరమణకు ఒప్పుకోకుండా లక్షలాది మంది ఉక్రేనియన్ల ప్రాణాలను పణంగా పెడుతున్నారని శుక్రవారం చర్చల్లో ట్రంప్ తీవ్రంగా ఆక్షేపించడం తెలిసిందే. దాంతో వారి భేటీ అర్ధంతరంగా ముగియడమే గాక అమర్యాదకర పరిస్థితుల్లో జెలెన్‌స్కీ వైట్‌హౌస్‌ను వీడారు. తర్వాత శనివారం ఆయన ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. ''అమెరికా ప్రజలకు, ముఖ్యంగా ట్రంప్‌కు, కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు. ఉక్రెయిన్‌కు శాశ్వత శాంతి కావాలి. ఆ దిశగానే కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ట్రంప్ మద్దతు మాకు చాలా కీలకం. యుద్ధానికి తెర దించాలని ఆయన కాంక్షిస్తున్నారు. కానీ మాకంటే శాంతికాముకులు ఇప్పుడు ఇంకెవరూ ఉండబోరు. ఇది మా స్వేచ్ఛ కోసం, ఇంకా చెప్పాలంటే ఉనికి కోసం జరుగుతున్న పోరు. అమెరికాతో ఖనిజాల ఒప్పందానికి సిద్ధంగా ఉన్నాం. ఇరు దేశాల ఆర్థిక, రక్షణపరమైన బంధాలను ఇది బలోపేతం చేయగలదు. కానీ మాకు కేవలం ఈ ఒప్పందాలు మాత్రమే చాలవు. ఉక్రెయిన్ రక్షణకు సరైన హామీలు లేకుండా కాల్పుల విరమణకు ఒప్పుకోవడం మా దేశాన్ని ముప్పులో పడేస్తుంది. రష్యా మరోసారి మాపై దురాక్రమణకు దిగకుండా కచ్చితమైన హామీలు కావాల్సిందే. అప్పటిదాకా రష్యాతో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదు. అమెరికా పూర్తిగా మావైపే ఉందని ఉక్రేనియన్లందరికీ విశ్వాసం కలిగించడం ఇప్పుడు చాలా ముఖ్యం'' అని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ట్రంప్‌తో వాగ్యుద్ధం ఇరు పక్షాలకూ మంచి చేయలేదని అభిప్రాయపడ్డారు.

అతనికి శాంతి అక్కర్లేదు

- జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్వజం
- రష్యా–ఉక్రెయిన్ కాల్పుల విరమణ తక్షణం జరగాల్సిందేనని వ్యాఖ్య

వాషింగ్టన్: అమెరికా భాగస్వామిగా ఉండే శాంతి చర్చలకు ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ సిద్ధంగా లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఇరువురి నడుమ తీవ్ర వాగ్యుద్ధం అనంతరం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ''జెలెన్‌స్కీతో చాలా అర్థవంతమైన సమావేశం జరిగింది. అది చాలా ఉద్రిక్తత, ఒత్తిడి నడుమ సాగింది. ఇతరత్రా నేర్చుకోలేని విషయాలెన్నింటినో నేర్చుకోగలిగాం. భావోద్వేగాలకు లోనైనప్పుడు మనసు లోతుల్లో దాగుండే విషయాలన్నీ ఎంతలా బయటకు తన్నుకొస్తాయో చూసి నిజంగా ఆశ్చర్యమేసింది. శాంతి చర్చల్లో మేం కలగజేసుకుంటే తనకు చాలా లాభమని జెలెన్‌స్కీ భావిస్తున్నారు. కానీ ఆయనకు లాభం చేకూర్చేందుకు మేం సిద్ధంగా లేం. మేం కోరేది శాంతి మాత్రమే. మాకందరికీ అత్యంత ప్రియమైన ఓవల్ ఆఫీసులోనే అమెరికాను ఆయన అగౌరవపరిచారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణం కాల్పుల విరమణ ఒప్పందం జరగాల్సిందే. కానీ అందుకు జెలెన్‌స్కీ అస్సలు సుముఖంగా లేనట్టు కన్పిస్తోంది. ఆయన నిజంగా శాంతికి సిద్ధంగా ఉన్నప్పుడే మాతో చర్చలకు రావాలి. లేదంటే అమెరికా మద్దతును శాశ్వతంగా కోల్పోతారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శాంతి ఒప్పందానికి సిద్ధంగా ఉన్నారని నేనిప్పటికీ నమ్ముతున్నా'' అని తన ట్రూత్ సోషల్ మీడియా సైట్‌లో పేర్కొన్నారు.

రచ్చకెక్కిన చర్చ
శుక్రవారం వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీల మధ్య జరిగిన వాగ్వాదం పూర్తిపాఠం...
సాక్షి ప్లస్ ఈ పేపర్ జాతీయం పేజీలో



డ్రెస్సు చూడు శుక్రవారం వైట్‌హౌస్ ప్రాంగణంలో జెలెన్‌స్కీకి స్వాగతం పలికిన సందర్భంగా ఆయన ధరించిన టీ షర్టును అమెరికా మీడియాకు వేలెత్తి చూపుతున్న ట్రంప్



మేమే దిక్కు వాగ్వాదం సందర్భంగా ఏదో అనబోతున్న జెలెన్‌స్కీని మధ్యలోనే వారిస్తూ, ఉక్రెయిన్‌కు ఎప్పటికైనా అమెరికాయే దిక్కని ఆయన భుజంపై చేత్తో తట్టి మరీ చెబుతున్న ట్రంప్



ఇక చాలు భేటీ రసాభాసగా ముగిసి ట్రంప్‌తో సంయుక్త మీడియా భేటీ రద్దయ్యాక ప్రొటోకాల్ వీడ్కోలు లేకుండా ఒంటరిగానే వైట్‌హౌస్ నుంచి బయటికొచ్చి కారెక్కబోతున్న జెలెన్‌స్కీ

జెలెన్‌స్కీకి యూరప్ బాసట

ఎక్స్‌లో దేశాధినేతల పోస్టులు
- తగిన శాస్తి జరిగిందన్న రష్యా
- జెలెన్‌స్కీని అవమానించారన్న కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి
- ఆయనతో గొంతు కలిపిన సెనేటర్ రీడ్

న్యూయార్క్: అధ్యక్షుల రగడలో యూరప్‌తో సహా పలు ప్రపంచ దేశాలు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి బాసటగా నిలిచాయి. దేశాధినేతలంతా శనివారం ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. వారందరికీ జెలెన్‌స్కీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు అమెరికా, యూరప్ దేశాల మధ్య పెరుగుతున్న అంతరానికి కూడా ఈ ఉదంతం అద్దం పట్టింది. రష్యా మాత్రం జెలెన్‌స్కీకి తగిన శాస్తే జరిగిందంటూ ఎద్దేవా చేసింది. ''అంతటి వాగ్యుద్ధంలోనూ ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్ చూపిన సంయమనం అభినందనీయం. జెలెన్‌స్కీని వాళ్లు కొట్టకపోవడం నిజంగా అద్భుతమే'' అని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జకరోవా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రంప్, వాన్స్ వైఖరిని అమెరికా మంత్రులు పూర్తిగా సమర్థించుకున్నారు. ఈ మేరకు వారంతా పోటాపోటీగా ప్రకటనలు విడుదల చేశారు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, సెనేటర్ జాక్ రీడ్ తదితరులు మాత్రం ట్రంప్, వాన్స్ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. జెలెన్‌స్కీని కించపరిచేలా వారు వ్యవహరించిన తీరు అమెరికాకే అవమానకరమని కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఎంతగా రష్యా వైపు, పుతిన్ వైపు మొగ్గినా అమెరికా ప్రజలు మాత్రం ఎప్పటికీ ఉక్రెయిన్‌కే దన్నుగా నిలుస్తారన్నారు. జెలెన్‌స్కీతో ట్రంప్, వాన్స్ వ్యవహరించిన తీరు నిజంగా సిగ్గుచేటని రీడ్ మండిపడ్డారు. తమ ప్రవర్తనతో అంతర్జాతీయంగా అమెరికా విశ్వసనీయతనే దెబ్బతీశారని ఆవేదన వెలిబుచ్చారు. దీన్ని ప్రపంచమంతా గమనిస్తోందన్నారు.

ఆత్మగౌరవం ప్రదర్శించారు: ఉర్సులా

ఉక్రెయిన్ ప్రజల ధైర్యాన్ని నిలబెట్టేలా జెలెన్‌స్కీ ఆత్మగౌరవం ప్రదర్శించారంటూ యూరోపియన్ యూనియన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండర్ లియన్ కొనియాడారు. ''నిర్భయంగా, ధైర్యంగా, బలంగా ఉండండి. మీరు ఒంటరి కారు. శాశ్వత శాంతి కోసం మేమంతా మీతో కలిసి పని చేస్తాం'' అని పేర్కొన్నారు. ''రష్యా ఒక దురాక్రమణదారు. ఉక్రెయిన్ బాధితురాలు. మేం ఆ దేశానికి సాయం చేయడం, రష్యాపై ఆంక్షలు విధించడం అస్సలు తప్పు కాదు. అమెరికా, యూరప్ దేశాలు, కెనడా, జపాన్ తదితరాలన్నీ ఇకముందూ ఇదే వైఖరి కొనసాగిస్తాయి'' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించే దౌత్య యత్నాలను తిరిగి పట్టాలెక్కించేందుకు తక్షణం ఈయూ–అమెరికా శిఖరాగ్ర భేటీ జరగాలని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌కు, జెలెన్‌స్కీకి మీకు తామంతా అన్నివేళలా వెన్నుదన్నుగా నిలుస్తామని జర్మనీ కాబోయే చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై రష్యా అక్రమంగా దండెత్తిందన్నది కాదనలేని వాస్తవమని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అన్నారు. లాతి్వయా, ఎస్తోనియా, ఫిన్లండ్, లగ్జెంబర్గ్, పోలండ్, హాలండ్ తదితర దేశాధినేతలు కూడా జెలెన్‌స్కీకి మద్దతుగా పోస్టులు చేశారు.

మూడో ప్రపంచయుద్ధానికి బాటలు...

''అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజాల ఒప్పందం ముందుకు సాగలేదు. అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నిరంతరం అమెరికా ప్రజల ప్రయోజనాల పరిరక్షణకే పాటుపడతారు. ప్రపంచంలో అమెరికా స్థానాన్ని గౌరవించని వాళ్లు మానుంచి అనుచిత లబ్ధి పొందేందుకు వారెన్నటికీ అనుమతించబోరు. జెలెన్‌స్కీతో భేటీలో ట్రంప్ మాటతీరే ఇందుకు తాజా నిదర్శనం. యుద్ధానికి తక్షణం ముగింపు పలకాలని ఉక్రేనియన్లలో ఏకంగా 52 శాతం మంది కోరుతున్నట్టు గత నవంబర్లో జరిగిన సర్వే తేలి్చంది. రష్యాకు భూభాగాన్ని కోల్పోవడానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉండాలి. లేదంటే ట్రంప్ హెచ్చరించినట్టు మూడో ప్రపంచ యుద్ధం తప్పదు. అది ఉక్రెయిన్లో మొదలవుతుంది. ఇజ్రాయెల్ మీదుగా ఆసియా దాకా పాకుతుంది. తర్వాత అంతటా విస్తరిస్తుంది''
– వైట్‌హౌస్ ప్రకటన


సూటు వేయలేదేం?

- జెలెన్‌స్కీకి మీడియా ప్రశ్నలు
- యుద్ధం ముగిశాకే: అధ్యక్షుడు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వాగ్యుద్ధానికి ముందు శుక్రవారం ఆ దేశ మీడియా నుంచి జెలెన్‌స్కీకి ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. వైట్‌హౌస్‌లో అధ్యక్షునితో భేటీకి సంప్రదాయం ప్రకారం సూటులో ఎందుకు రాలేదని ఒక విలేకరి ప్రశ్నించారు. యుద్ధం ముగిశాకే సూటు వేసుకుంటానంటూ ఆయన బదులిచ్చారు. ''మీరిప్పుడు వేసుకున్నటువంటిదో, బహుశా అంతకంటే మెరుగైన సూటో ధరిస్తా. లేదంటే కాస్త చౌకైనది కూడా కావచ్చు. అయితే అదెప్పుడు జరుగుతుందో ఇప్పటికైతే స్పష్టత లేదు. ఏం జరుగుతుందో చూద్దాం'' అని చెప్పారు. అంతకుముందు వైట్‌హౌస్ ప్రాంగణంలో జెలెన్‌స్కీకి స్వాగతం పలికిన సందర్భంగా ట్రంప్ కూడా ఈ విషయాన్ని ఎత్తిచూపారు. సూటులో కాకుండా ఇలా టీ షర్టులోనా వచ్చేదంటూ వేలితో చూపుతూ మరీ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సైనిక అమరులకు నివాళిగా రష్యాతో యుద్ధం ముగిసేదాకా నిరంతరం ఆలివ్ గ్రీన్ టీ షర్టే ధరిస్తానని మూడేళ్ల క్రితమే జెలెన్‌స్కీ ప్రతిజ్ఞ చేశారు.

అలా వెనుదిరిగారు

ఓవల్ ఆఫీసు వాగ్యుద్ధం తర్వాత ట్రంప్, జెలెన్‌స్కీ చెరో గదిలోకి వెళ్లిపోయినట్టు సీఎన్ఎన్ పేర్కొంది. ''చర్చలు కొనసాగాలని ఉక్రెయిన్ ఆకాంక్షించింది. కానీ అమెరికా ససేమిరా అంది. జెలెన్‌స్కీతో సహా ఉక్రెయిన్‌కు చెందిన వారందరినీ వైట్‌హౌస్ నుంచి పంపేయాల్సిందిగా ట్రంప్ ఆదేశించారు'' అని వైట్‌హౌస్ వర్గాలను ఉటంకిస్తూ చెప్పుకొచ్చింది. కాసేపటికి జెలెన్‌స్కీ ఒంటరిగానే తన గదిలోంచి బయటికి వచ్చి కారెక్కి వెళ్లిపోయారు. కేవలం వైట్‌హౌస్ అధికారి మాత్రమే వెంట ఉండి ఆయనను సాగనంపారు.



స్టార్మర్‌తో జెలెన్‌స్కీ

స్టార్మర్‌తో జెలెన్‌స్కీ చర్చలు

లండన్: అమెరికా పర్యటనను అర్ధంతరంగా ముగించుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగా శనివారమే బ్రిటన్ చేరుకున్నారు. ప్రధాని కియర్ స్టార్మర్ తన అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ వద్ద ఆయనకు స్వాగతం పలికారు. నేతలిద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ఉక్రెయిన్‌కు బ్రిటన్ ఇకముందు కూడా అన్నివిధాలా అండగా నిలుస్తుందని స్టార్మర్ పునరుద్ఘాటించారు. మూడేళ్లుగా తమకు బ్రిటన్ అందిస్తూ వస్తున్న మద్దతుకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నేతలిద్దరూ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా వైఖరిలో వచ్చిన పెను మార్పు, అధ్యక్షుడు ట్రంప్ వ్యవహార శైలి తదితరాలు ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఆదివారం లండన్‌లో యూరప్ నేతల భేటీ జరగనుంది. అందులో జెలెన్‌స్కీ పాల్గొనే అవకాశముంది. ఉక్రెయిన్ యుద్ధం, యూరప్ భద్రతే ప్రధాన అజెండాగా భేటీ జరగనుంది. నిజానికి మార్చి 6న పారిస్‌లో యూరప్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. అంతకు కేవలం రెండు రోజుల ముందు స్టార్మర్ ఆహ్వానంపై యూరప్ దేశాధినేతలంతా లండన్‌లో భేటీ కానుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

ప్రపంచ శక్తిగా భారత్

ప్రపంచానికి న్యూ ఫ్యాక్టరీగా ఎదుగుతున్న ఇండియా
- అపరిమిత నూతన ఆవిష్కరణల వేదికగా మారుతోంది
- 'వోకల్ ఫర్ లోకల్' పిలుపుతో సత్ఫలితాలు
- అంతర్జాతీయ స్థాయికి చేరుతున్న భారత ఉత్పత్తులు
- ఎన్ఎక్స్‌టీ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- 'న్యూస్ఎక్స్ వరల్డ్' వార్తాచానల్ ప్రారంభం



న్యూఢిల్లీ: తాను ఇచ్చిన 'వోకల్ ఫర్ లోకల్' పిలుపుతో సత్ఫలితాలు లభిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. భారతీయ ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి వెళ్తున్నాయని, ప్రపంచమంతటా అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. మన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ పెరుగుతోందని అన్నారు. భారతదేశం అత్యున్నత తయారీ కేంద్రంగా, ప్రపంచ కర్మాగారంగా ఎదుగుతోందని స్పష్టంచేశారు. శనివారం ఢిల్లీలో ఎన్ఎక్స్‌టీ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. 'న్యూస్ఎక్స్ వరల్డ్' వార్తాచానల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇండియా ఎన్నో రికార్డులు సృష్టిస్తోందని, ప్రపంచ శక్తిగా మారుతోందని ఉద్ఘాటించారు. అపరిమిత నూతన ఆవిష్కరణలకు భారత్ అడ్డా అని తేల్చిచెప్పారు. ఎన్నో క్లిష్టమైన సమస్యలకు చౌకగా పరిష్కార మార్గాలు కనుగొంటూ ప్రపంచ దేశాలకు సైతం అందిస్తోందని వివరించారు. 21వ శతాబ్దంలో భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచమంతా నిశితంగా గమనిస్తోందని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటించాలని, దేశాన్ని అర్థం చేసుకోవాలని ప్రపంచ దేశాల ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారని తెలిపారు. సదస్సులో ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

ఇండియా ప్రగతికి ప్రపంచమే సాక్షి

''ప్రపంచ దేశాలు కొన్ని దశాబ్దాలపాటు ఇండియాను తమ బ్యాక్ ఆఫీసుగానే పరిగణించాయి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రపంచానికి న్యూ ఫ్యాక్టరీగా ఇండియా ఎదుగుతోంది. మనం శ్రమశక్తి కాదు.. ముమ్మాటికీ ప్రపంచ శక్తి. రక్షణ ఉత్పత్తుల్లో మనది అగ్రస్థానం. మన ఇంజనీరింగ్, టెక్నాలజీ సామర్థ్యం ఎలాంటిదో ప్రపంచానికి తెలుస్తోంది. ఎల్రక్టానిక్స్ నుంచి ఆటోమొబైల్ దాకా కీలక రంగాల్లో ఇండియా ప్రగతికి ప్రపంచమే సాక్షి. విదేశాలకు ఎన్నో ఉత్పత్తులు అందజేస్తున్నాం. గ్లోబల్ సప్లై చైన్‌లో విశ్వసనీయ భాగస్వామిగా ఇండియాకు గుర్తింపు దక్కుతోంది. వేర్వేరు రంగాల్లో దేశం నేడు నాయకత్వ స్థాయికి ఎదిగిందంటే ఎన్నో ఏళ్ల నిర్విరామ శ్రమ, క్రమానుగత విధానపరమైన నిర్ణయాలు''.

ఇండియా అంటే ఇండోవేటింగ్

''వోకల్ ఫర్ లోకల్, లోకల్ ఫర్ గ్లోబల్ అనే దార్శనికతను కొన్నేళ్ల క్రితం నేను స్వయంగా ఆవిష్కరించా. అది ఇప్పుడు వాస్తవ రూపం దాల్చింది. ఆశయం ఆచరణగా మారింది. ఫలితాలను స్వయంగా చూస్తున్నాం. సెమీకండక్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ల తయారీలో ముందుకు దూసుకెళ్తున్నాం. మన సూపర్‌ఫుడ్స్ మఖానా, చిరుధాన్యాలకు ప్రపంచమంతటా ఆదరణ దక్కుతోంది. మన ఆయుష్ ఉత్పత్తులు, యోగా గురించి అన్ని దేశాల్లోనూ చర్చించుకుంటున్నారు. మనల్ని మనం ఉన్నది ఉన్నట్లుగా ప్రపంచం ఎదుట వ్యక్తీకరించుకోవాలి. మేకప్ అవసరం లేదు. సంకోచం వద్దు. మన అసలైన విజయగాథలు ఉన్నది ఉన్నట్లుగానే ప్రపంచానికి చేరాలి. 'సున్నా'ను ప్రపంచానికి పరిచయం చేసిన దేశం ఇండియా. ఇప్పుడు అపరిమిత ఆవిష్కరణల వేదికగా ఎదుగుతోంది. ఇండియా అంటే కేవలం ఇన్నోవేషన్ కాదు.. అది ఇండోవేటింగ్. అంటే ఇన్నోవేటింగ్ ద ఇండియన్ వే. ప్రపంచానికి అవసరమైన ఎన్నో పరిష్కార మార్గాలను చౌకగా, సులభంగా, వేగంగా మనం అందిస్తున్నాం. అద్భుతమైన యూపీఐ వ్యవస్థను అభివృద్ధి చేశాం. ఫ్రాన్స్, యూఏఈ, సింగపూర్ తదితర దేశాలు ఇలాంటి వ్యవస్థను ఉపయోగించుకుంటున్నాయి. కోవిడ్–19 నియంత్రణ కోసం వ్యాక్సిన్లు తయారీ చేసి ఇతర దేశాలకు సరఫరా చేశాం. మనం తీసుకొచ్చిన ఆరోగ్య సేతు యాప్ ఎన్నో దేశాలకు మార్గదర్శిగా మారింది'' అని మోదీ అన్నారు.



మణిపూర్ పరిస్థితిపై శనివారం న్యూఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష జరుపుతున్న కేంద్రమంత్రి అమిత్ షా

శాశ్వత శాంతిని పునరుద్ధరించండి

- మణిపూర్‌లో 8 కల్లా ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలి
- అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠినచర్యలే
- అంతర్జాతీయ సరిహద్దు వెంబడి వీలైనంత త్వరగా కంచె నిర్మాణం పూర్తి చేయాలి
- మణిపూర్ భద్రతా పరిస్థితిపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్‌లో శాశ్వత శాంతిని పునరుద్ధరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులను ఆదేశించారు. మార్చి 8 నుంచి మణిపూర్‌లోని అన్ని రహదారులపై ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. శాంతిని పునరుద్ధరించే విషయంలో అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అమిత్ షా దిశానిర్దేశం చేశారు. మణిపూర్ భద్రతా పరిస్థితిపై శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలు కీలక ఆదేశాలు చేశారు. ఈ సమావేశంలో మణిపూర్ గవర్నర్, అజయ్‌కుమార్ భల్లా, కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఆర్మీ డిప్యూటీ చీఫ్, తూర్పు కమాండ్ ఆర్మీ కమాండర్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్స్, మణిపూర్ భద్రతా సలహాదారు సహా పలువురు ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మణిపూర్‌లో శాశ్వత శాంతిని పునరుద్ధరించడానికి అవసరమైన పూర్తి సహాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అమిత్ షా పేర్కొన్నారు. అంతేగాక దోపిడీకి సంబంధించిన అన్ని కేసులలో కఠినమైన చర్యలు తీసుకోవడం కొనసాగించాలని... మణిపూర్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఏర్పాటు చేసిన ఎంట్రీ పాయింట్లకు ఇరువైపులా కంచె వేయడం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర హోంమంత్రి సూచించారు. మణిపూర్‌ను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు, మాదకద్రవ్య వ్యాపారంలో పాల్గొన్న మొత్తం నెట్‌వర్క్‌ను నిర్మూలించాలని ఆదేశించారు.

కాలం చెల్లిన వాహనాలకు ఇంధనం బంద్

ఢిల్లీలో కొత్త నిబంధన.. ఏప్రిల్ 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని కట్టడి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. కాలం చెల్లిన వాహనాలకు ఇంధనం విక్రయించకుండా నిబంధన విధించింది. ఇది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. పెట్రోల్ వాహనాలు 15 ఏళ్లు, డీజిల్ వాహనాలు పదేళ్లు దాటితే ఇంధనం విక్రయించే ప్రసక్తే లేదని శనివారం తేల్చిచెప్పింది. వాహనాల గడువు తీరిపోయిందో లేదో తెలుసుకొనేందుకు పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని పెట్రోల్, డీజిల్ పంపుల యజమాన్యాలకు సూచించింది. కాలుష్య నియంత్రణపై శనివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కాలం చెల్లిన వాహనాలకు ఇంధనం విక్రయించకూడదని నిర్ణయించినట్లు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా వెల్లడించారు. ఈ విషయాన్ని త్వరలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖకు తెలియజేస్తామని పేర్కొన్నారు. గడువు తీరిపోయిన వాహనాలు రోడ్లపైకి రాకుండా నిరోధించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టంచేశారు. ఢిల్లీలో 425కుపైగా ఇంధన బంకులు ఉన్నాయి. నగరంలో కాలం చెల్లిన వాహనాలు 55 లక్షలు ఉన్నట్లు అంచనా. ఇందులో 66 శాతం ద్విచక్ర వాహనాలు, 54 శాతం నాలుగు చక్రాల వాహనాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఏడాది డిసెంబర్ నాటికి మొత్తం ప్రజారవాణా బస్సుల్లో 90 శాతం సీఎన్‌జీ బస్సులనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి అటవీప్రాంతంలో శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం అందడంతో డీఆర్జీ, కోబ్రా బలగాలు శుక్రవారం నుంచి గాలిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం కిష్టారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు – భద్రతా బలగాల మధ్య పలుమార్లు ఎదురుకాల్పులు జరిగాయని సుకుమా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మావోయిస్టులు కాల్పులు జరుపుతూ అటవీ ప్రాంతంలోకి పారిపోగా ఆ తర్వాత ఘటనా స్థలంలో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను భద్రత బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఇజ్రాయెల్‌కు రూ. 26.24 వేల కోట్ల
ఆయుధాల విక్రయం

ఆమోద ముద్ర వేసిన ట్రంప్ ప్రభుత్వం

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌కు అమెరికా 3 బిలియన్ డాలర్ల (రూ.26.24 వేల కోట్లు) విలువైన ఆయుధాలు విక్రయించనుంది. ఈ అంశంపై ట్రంప్ ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు కాంగ్రెస్‌కు సమాచారం చేరవేసింది. ఇజ్రాయెల్‌కు ఆయుధాల విక్రయానికి ఒప్పందం కుదిరినట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. 35,500 ఎంకే84 బాంబులు, బీఎల్‌యూ–117 బాంబులు, 4,000 ప్రిడేటర్ వార్‌హెడ్లను ఇజ్రాయెల్‌కు అందజేయబోతున్నట్లు పేర్కొంది. ఈ విక్రయ ఒప్పందానికి కాంగ్రెస్ ఆమోదం అవసరంలేదని స్పష్టం చేసింది.

బీసీఐ చైర్మన్‌గా మళ్లీ మనన్‌కుమార్

న్యూఢిల్లీ: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) చైర్మన్‌గా సీనియర్ అడ్వొకేట్, రాజ్యసభ సభ్యుడు మనన్‌కుమార్ మిశ్రా మరోసారి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి ఎన్నిక కావడం వరుసగా ఏడోసారి కావడం గమనార్హం. బీసీఐలో 27 లక్షల మంది సభ్యులున్నారు. వారంతా ఆయన పట్ల సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేసినట్లు బీసీఐ ప్రధాన కార్యదర్శి శ్రీమంతో సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆ నలుగురి జాడెక్కడ?

- మంచుచరియల కింద నుంచి 50 మందిని రక్షించిన సహాయక బృందాలు
- వారిలో నలుగురి దుర్మరణం
- ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని ఛమోలా జిల్లా మనా గ్రామంలో హిమపాతం కారణంగా మంచు చరియల్లో కూరుకుపోయిన వారిలో మొత్తంగా ఇప్పటిదాకా 50 మంది కార్మికులను బయటకు తీసుకురాగలిగారు. అయితే వీరిలో నలుగురి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేసినా ఫలితంలేకుండా పోయింది. ఆ నలుగురు శనివారం చనిపోయారని జిల్లా విపత్తు నిర్వహణాధికారి ఎన్‌కే జోషి చెప్పారు. మంచుచరియల్లో కూరుకుపోయిన మిగతా నలుగురి కోసం అన్వేషణ తీవ్రతరం చేశారు. తొలుత ఐదుగురు చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. ఐదుగురిలో సునీల్ అనే కార్మికుడు ప్రాణాలతో బయటపడి సొంతూరుకు వెళ్లినట్లు తాజాగా తేలింది. దీంతో నలుగురి కోసం అన్వేషణ కొనసాగుతోంది. బద్రీనాథ్ ఆలయానికి వెళ్లే రహదారిలో మంచుచరియలు పడటంతో సరిహద్దు రోడ్డు సంస్థ(బీఆర్ఓ) కార్మికులు ఆ మంచును తొలగిస్తుండగా శుక్రవారం ఉదయం ఇతర 55 మంది సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్న కంటైనర్లు, షెడ్‌పై మంచుచరియలు పడటంతో దుర్ఘటన జరిగిన విషయం తెల్సిందే. వీరిలో 33 మందిని శుక్రవారం రాత్రి, 17 మందిని శనివారం మంచు నుంచి బయటకు లాగారు. మంచులో 57 మంది కూరుకుపోయారని శుక్రవారం వార్త లొచ్చాయి. శనివారం మాత్రం 55 మంది మాత్రమే చిక్కుకున్నారని అధికారులు చెప్పారు.


6 హెలికాప్టర్ల వినియోగం


శుక్రవారం రాత్రంతా భారీగా మంచు కురియడంతో అన్వేషణకు విరామమిచ్చి శనివారం ఉదయాన్నే ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్, బీఆర్ఓ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, వాయుసేన ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను మొదలెట్టాయి. వీరికి జిల్లా యంత్రాంగం, వైద్య విభాగం తగు సాయం అందిస్తున్నాయి. ''భారతీయ సైన్యానికి చెందిన మూడు, వాయు సేనకు చెందిన రెండు, మరో పౌర హెలికాప్టర్‌ను మొత్తంగా ఆరు హెలికాప్టర్లను గాలింపు కోసం వినియోగిస్తున్నాం. బయటకులాగిన వారిలో 24 మందికి గాయాలయ్యాయి. వారిని ఆర్మీ ఆస్పత్రికి తరలించాం'' అని ఆర్మీ అధికారి చెప్పారు.

బ్యాలెట్ పేపర్లు.. మీ పరిధి కాదు

జేపీసీకి తెలియజేసిన కేంద్ర న్యాయశాఖ

న్యూఢిల్లీ: ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టాలన్న అంశం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిధిలోకి రాదని కేంద్ర న్యాయ శాఖ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికల బిల్లుపై ఏర్పాటైన జేపీసీకి ఈ మేరకు రాతపూర్వకంగా తన అభిప్రాయాన్ని తెలియజేసింది. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించే విధానాన్ని మళ్లీ తీసుకురావాలని కమిటీలోని కొందరు సభ్యులు సూచించగా, కేంద్ర న్యాయశాఖ దీనిపై స్పందించింది. ఈ అంశం జేపీసీ పరిధిలోకి రాదని పేర్కొంది. ఎన్నికలను ఈవీఎంలతో నిర్వహించాలా? లేక బ్యాలెట్ పేపర్లతో నిర్వహించాలా? అనేది పరిశీలించే అధికారం జేపీసీకి లేదని పరోక్షంగా తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం కాదని స్పష్టంచేసింది. ఈ ఎన్నికల వల్ల దేశ సమాఖ్య నిర్మాణానికి ఎలాంటి విఘాతం కలగదని పేర్కొంది. బ్యాలెట్ పేపర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. పలు సందర్భాల్లో తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు వెల్లడించింది. సుప్రీంకోర్టు సైతం ఈవీఎంలవైపే మొగ్గు చూపుతోంది. పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ తీసుకురావాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది.





శనివారం సాయంత్రం మక్కా మసీదు సమీపంలో ఆకాశంలో కనిపించిన నెలవంక



మక్కా మసీదులో శనివారం సాయంత్రం ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నెలవంక.. అరుదెంచెను ఇలవంక

రంజాన్ ఉపవాస దీక్షలు షురూ

- భాగ్య నగరానికి ఆధ్యాత్మిక శోభ

నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ నెల ప్రారంభమైనట్లు సైరన్లు మోగించి మత గురువులు ప్రకటించారు. నేటి (ఆదివారం) తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. రంజాన్ మాసమంతా నగరంలోని ముస్లిం బస్తీలు, వీధులు శోభాయమానంగా కనిపిస్తాయి. మసీదుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంటుంది. తెల్లవారు జామున సహర్, సాయంత్రం వేళ ఇఫ్తార్ కోలాహలం కనిపిస్తుంది. మసీదులతో పాటు వ్యాపార సంస్థలకు రంగు రంగుల విద్యుద్దీపాలను అలంకరిస్తారు. – సాక్షి, సిటీబ్యూరో

టిప్పర్.. హిట్ అండ్ రన్

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



మృతుడు జ్ఞానేశ్వర్ రావు (ఫైల్)

గచ్చిబౌలి: టిప్పర్‌ను మితి మీరిన వేగంతో నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టినాగులపల్లి ఔటర్ సర్వీస్ రోడ్డులో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామానికి చెందిన పిల్లి జ్ఞానేశ్వర్ రావు (37) మణికొండలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. పటాన్‌చెరులో పని చేసేందుకు మరో మేస్త్రీ టేకుమూడి మార్కండేశ్వరరావుతో కలిసి శనివారం ఉదయం స్కూటీపై వెళ్తుండగా.. వట్టినాగులపల్లి ఔటర్ సర్వీస్ రోడ్డులో డంపింగ్ యార్డ్ సమీపంలో గుర్తు తెయని టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. జ్ఞానేశ్వర్ రావు అక్కడికక్కడే మృతి చెందాడు. మార్కండేడేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమై టిప్పర్ డ్రైవర్ ఆగకుండా వాహనంతో పారిపోయాడు. టిప్పర్ వివరాల కోసం పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త రూట్‌లలో ఏసీ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా రెండు రూట్లలో గ్రీన్ మెట్రో లగ్జరీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ఈ నెల 3వ తేదీ నుంచి నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లింగంపల్లి నుంచి మెహిదీపట్నం (216 డబ్ల్యూ) రూట్‌లో ప్రతిరోజూ 4 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. లింగంపల్లి నుంచి మొదటి బస్సు ఉదయం 6.50 గంటలకు బయలుదేరుతుంది. చివరి బస్సు రాత్రి 10.10 గంటలకు బయలుదేరుతుంది. అలాగే.. మెహిదీపట్నం నుంచి మొదటి బస్సు ఉదయం 8 గంటలకు, చివరి బస్సు రాత్రి 11 గంటలకు మెహిదీపట్నం నుంచి లింగంపల్లికి బయలుదేరనుంది. ఈ రూట్‌లో నల్లగండ్ల, గోపన్‌పల్లి, విప్రో, ఖాజాగూడ, నానల్‌నగర్ మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. అలాగే లింగంపల్లి- లక్ష్మీనగర్ జీఏఆర్ (216జీ) రూట్‌లో రెండు ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. లింగంపల్లిలో మొదటి బస్సు ఉదయం 6.15 గంటలకు చివరి బస్సు రాత్రి 9.05 గంటలకు బయలుదేరుతాయి. లక్ష్మీనగర్ జీఏఆర్ నుంచి మొదటి బస్సు ఉదయం 7.05 గంటలకు చివరి బస్సు రాత్రి 9.55 గంటలకు బయలుదేరుతాయి.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్



సాక్షి, సిటీబ్యూరో: రాంగ్ సైడ్ డ్రైవింగ్, అస్పష్ట నంబరు ప్లేట్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై సిటీ పోలీసులు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ఒకరు మృతి చెందారు. 21 మంది గాయాల పాలయ్యారు. గత ఏడాది ఏకంగా ముగ్గురు మరణించగా.. 206 మంది క్షతగాత్రులయ్యారు. అస్పష్ట నంబరు ప్లేట్ వాహనదారులకు రూ.200 జరిమానాతో పాటు చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్ల పేరుతో బురిడీ



నాగోలు: క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్ల గడువు ముగిసిందని, వెంటనే వాటిని క్యాష్ బ్యాక్, షాపింగ్ పాయింట్లుగా మార్చుకోవచ్చని సైబర్ మోసగాడు బురిడీ కొట్టించాడు. ఓ ప్రైవేట్ ఉద్యోగిని క్రెడిట్ కార్డు, ఓటీపీ వివరాలు తీసుకుని రూ.99 వేలు కొట్టేశాడు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌కు చెందిన అష్మిక నగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిని. గత నెల 28వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ ఆమెకు చేశాడు. తాను ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్నాడు. ఉద్యోగిని క్రెడిట్ కార్డులో ఉన్న 24,837 రివార్డు పాయింట్ల గడువు ముగిసిందని తెలియజేశాడు. ఈ పాయింట్లను క్యాష్‌బ్యాక్, షాపింగ్ పాయింట్లుగా మార్చవచ్చని చెప్పి అష్మిక క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలను తెలుసుకున్నాడు. దీంతో ఆమె క్రెడిట్ కార్డు నుంచి మొత్తం రూ.99 వేల నగదును కాజేశాడు. మరో రూ.50 వేల లావాదేవీల కోసం ఓటీపీ షేర్ చేయాలని అతడు చెప్పడంతో తాను మోసానికి గురైనట్లు బాధితురాలు గ్రహించింది. శనివారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్ సిగ్నల్



'ట్రాఫిక్' సమస్యల పరిష్కారమే బల్దియా ధ్యేయం

- పని చేయని సిగ్నళ్లకు మరమ్మతులు
- కొత్తవాటి ఏర్పాటు దిశగా జీహెచ్‌ఎంసీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో అసలే ట్రాఫిక్ సమస్యలెక్కువ. దానికి తోడు పలు జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు లేవు. ఉన్న సిగ్నళ్లలోనూ పని చేయనివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పని చేయని ట్రాఫిక్ సిగ్నళ్లకు అవసరమైన మరమ్మతులు చేసేందుకు, లేని ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు, నిర్వహణ మెరుగ్గా ఉండేందుకు తగిన చర్యలు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఇందు కోసం కొత్తగా ఏర్పాటు చేసేవాటి కోసం సిగ్నళ్ల డిజైన్, సప్లయ్, ఇన్‌స్టలేషన్, పాత సిగ్నళ్లకు మరమ్మతులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం తక్కువ ధరకు ఆయా పరికరాలు, ఉపకరణాలు సప్లయ్ చేసే ఏజెన్సీల నుంచి కొటేషన్లను ఆహ్వానించింది.

జీహెచ్‌ఎంసీ లెక్కల ప్రకారం 404 జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నళ్లున్నాయి. దశాబ్దం క్రితం ఏర్పాటు చేసిన జంక్షన్లలో సరిగా పని చేయనివెన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అవసరమైన జంక్షన్లను అప్‌గ్రేడ్ చేయాలని, సిగ్నలింగ్ విధానాన్ని ఆధునికీకరించాలని అధికారులు భావిస్తున్నారు. నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) మొత్తం సమగ్రంగా కొత్తగా కాంట్రాక్టుకు ఇవ్వాలని.. తద్వారా వాహనాల ప్రయాణం మెరుగవడం, వేగం పెరగడం, పాదచారులకు భద్రత కల్పించడంతో పాటు ఎమర్జెన్సీ వాహనాలకు ప్రాధాన్యమివ్వాలనుకుంటున్నారు. మూడేళ్ల వరకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌తో పాటు టైమర్స్ తదితర అంశాల వారీగా అవసరమైన సామగ్రికి కొటేషన్లు ఆహ్వానించారు. వాటిని పరిశీలించాక, పరికరాల సరఫరా, నిర్వహణల కోసం టెండర్లు జారీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతమున్న ట్రాఫిక్ సిగ్నల్ జంక్షన్లు.. పని చేస్తున్న సిస్టమ్స్ పోలీస్ కమిషనరేట్ల వారీగా..

సిస్టమ్	హైదరాబాద్	సైబరాబాద్	రాచకొండ
హెచ్-ట్రిమ్స్	133	60	20
ఏటీఎస్‌సీ	62	38	13
పీఎస్ఎస్	31	44	3
మొత్తం	226	142	36

హెచ్-ట్రిమ్స్ : హైదరాబాద్ ట్రాఫిక్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్

ఏటీఎస్‌సీ: అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్ కంట్రోల్ సిస్టమ్

పీఎస్ఎస్: పెలికాన్ సిగ్నల్ సిస్టమ్

టార్గెట్.. ట్యాక్స్

ఆస్తిపన్ను వసూలుకు సిబ్బంది పని చేయాల్సిందే

- ఆదివారాలు సెలవులు తీసుకోవద్దు
- పౌరసేవ కేంద్రాలనూ తెరిచి ఉంచాల్సిందే



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను. ఈ ఆర్థిక సంవత్సరం వసూళ్ల లక్ష్యం రూ.2,000 కోట్లు. ఇప్పటి వరకు వసూలైంది దాదాపు రూ.1550 కోట్లు. మిగతా లక్ష్యాన్ని సాధించేందుకు మిగిలి ఉంది నాలుగు వారాల సమయమే. అందులోనూ ఈ నెలలో 5 ఆదివారాలున్నాయి. మరో రెండు పండగలున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్ చేరుకునేందుకు ఇప్పటికే భారీ బకాయిలున్న ఆస్తులను జప్తు చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు మరిన్ని చర్యలకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ట్యాక్స్ సెక్షన్ సిబ్బంది పండగలు మాత్రం మినహాయించి అన్ని ఆదివారాలూ పని చేయాలని ఆదేశించారు. ప్రజలు ఆస్తిపన్ను చెల్లించేందుకు వీలుగా సిటిజెన్ సర్వీస్ సెంటర్లు (పౌరసేవాకేంద్రాలు) ఆదివారాలు కూడా తెరిచి ఉంచాలని ఆదేశించారు. అంతర్గతంగా ఆయా అధికారులకు లక్ష్యాలు నిర్దేశించి వసూళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇలా ముందుకెళ్లాలి..

- డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని అడిషనల్ మున్సిపల్ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు వసూళ్ల టార్గెట్ విధించడంతో పాటు దాన్ని చేరుకునేందుకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలి. సక్రమంగా పని చేయని వారిపై నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన ఆస్తి పన్నునూ రాబట్టాలి. అందుకుగాను డిప్యూటీ కమిషనర్లు సంబంధిత కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులను వ్యక్తిగతంగా సంప్రదించి ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా కోరాలి.
- ఆస్తి పన్ను కోసం ఇచ్చిన చెక్కులు బౌన్సయితే వెంటనే నోటీసులు జారీ చేయాలి.
- ఐలాల నుంచి జీహెచ్‌ఎంసీకి రావాల్సిన ఆస్తిపన్ను వాటాను వసూలు చేయాలి. మీ సేవ దరఖాస్తుల్ని సత్వరం పరిష్కరించాలి.
- ఈ మేరకు అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ) సర్క్యులర్ జారీ చేశారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదో తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు నగరంలో 358 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, వీటి పరిధిలో 77,701 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక చొప్పున సిట్టింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ ఈ.వెంకటాచారి, డీఈఓ ఆర్ రోహిణి, డీఎంహెచ్ఓ వెంకటి, అదనపు డీసీపీ రవీందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏడీఈ ప్రార్థన, డిప్యూటీ ఆర్ఎం భీంరెడ్డి, పర్యవేక్షకులు జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: అమీన్‌పూర్ పెద్ద చెరువులో ఎఫ్‌టీఎల్ సరిహద్దుల నిర్ధారణ పేరిట జరుగుతున్న దందాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ పేరుతో పలువురు దందాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. జేఏసీ తరఫున కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు రసీదులు, వాట్సాప్ సందేశాలతో శనివారం రంగనాథ్‌ను కలిసి విన్నవించారు. చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై హైడ్రా చేస్తున్న కసరత్తును ఆసరాగా తీసుకుని ఎవరైనా దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దందాలకు పాల్పడిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలని బాధితులకు సూచించారు. హైడ్రా నుంచి కూడా కేసులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 95 ఎకరాలుండే చెరువు 450 ఎకరాలకు ఎలా విస్తరించిందనే విషయమై హైడ్రా లోతైన విశ్లేషణ చేస్తోందని, ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో కూడా ఉందన్నారు. గ్రామ రికార్డులు, సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఇమేజీలతో సరిపోల్చడమే కాకుండా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తి చేస్తామని కమిషనర్ చెప్పారు. జేఎన్‌టీయూ, ఐఐటీ కళాశాలల వారి భాగస్వామ్యంతో కమిటీ వేసి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తామన్నారు. రెండు, మూడు నెలల్లోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. నీట మునిగిన లే ఔట్ల ప్లాట్లను కాపాడేందుకు ఖర్చు అవుతుందని దందాలు చేస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

9999 @ రూ.9.37 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నెంబర్‌లపై వాహనదారులు మరోసారి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. శనివారం మణికొండలోని రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 'టీజీ 07 పి 9999' నెంబర్‌ను ఓ వాహనదారు రూ.9.37 లక్షలు చెల్లించి సొంతం చేసుకున్నారు. అలాగే 'టీజీ 07 పి 0009' నెంబర్ కోసం మరో వాహనదారు రూ.7.50 లక్షలు చెల్లించారు. 'టీజీ 07పి 999' నెంబర్ కోసం మరొకరు రూ.3 లక్షలు చెల్లించినట్లు జేటీసీ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.

ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పంజగుట్ట: ఉద్యోగం రావడంలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూలు జిల్లా శ్రీశైలం ప్రాంతానికి చెందిన నూకరాజు (29) బీటెక్ పూర్తి చేశాడు. నగరంలోని అమీర్‌పేటలో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇటీవల ఓ సంస్థలో ఇంటర్వ్యూకు వెళ్లొచ్చిన నూకరాజు.. తనకు తప్పకుండా ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో రూమ్‌మేట్‌కు పార్టీ కూడా ఇచ్చాడు. కానీ.. ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు రూమ్‌మేట్ మణికంఠ ఆఫీస్‌కు వెళ్లాడు. గదిలో నూకరాజు ఒక్కడే ఉన్నాడు. ఇదేరోజు రాత్రి 7.30 గంటలకు మణికంఠ వచ్చి చూడగా గది లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా.. మణికంఠ ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో వెంటనే హాస్టల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాడు. వారు వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు నూకరాజు ఉరి వేసుకుని ఉన్నాడు. పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

శానిటరీ జవాన్లకు స్థాన చలనం

బల్దియాలో 139 మంది బదిలీ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ఐదేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న 139 మంది శానిటరీ జవాన్లను ఇతర సర్కిళ్లకు బదిలీ చేశారు. పలువురు శానిటరీ జవాన్ల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు అని బదిలీ ఉత్తర్వులో పేర్కొన్నప్పటికీ, ఒకేచోట సుదీర్ఘ కాలంగా పాతుకుపోయినవారు చేయాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణ కంటే పైఆదాయానికే ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు ఎంతో కాలంగా ఉన్నాయి. ఇంటింటి నుంచి చెత్త తరలించాల్సిన స్వచ్ఛ ఆటో కార్మికుల్లో చాలామంది ఇళ్లకంటే హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే అధిక ఆదాయం కోసం వాటి కోసమే పని చేస్తున్నారు. ఈ తతంగంలో పారిశుద్ధ్య కార్మికులపై అజమాయిషీ చెలాయించే ఔట్‌సోర్సింగ్‌పై పని చేస్తున్న ఎస్ఎఫ్ఏ (శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్)లు, రెగ్యులర్ సిబ్బంది అయిన శానిటరీ జవాన్లు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని భావించి ఉన్నతాధికారులు ఇందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీలో మొత్తం 269 శానిటరీ జవాన్లు ఉండగా, వారిలో ఐదేళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్న 139 మందిని ఇతర సర్కిళ్లకు బదిలీ చేశారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఉత్తర్వు జారీ చేశారు. ఉండాల్సిన శానిటరీ జవాన్ల కంటే కొన్ని సర్కిళ్లలో ఎక్కువగా ఉండగా, కొన్ని సర్కిళ్లలో తక్కువగా ఉండటాన్ని కూడా అధికారులు గుర్తించారు. బదిలీలతో దీన్ని సరిచేశారు. కాగా.. వారి విజ్ఞప్తుల మేరకు నివసిస్తున్న ప్రాంతాలకు ఎక్కువ దూరం కాకుండా వీలైనంత తక్కువ దూరంలోనే పోస్టింగ్స్ ఇవ్వాల్సిందిగా సంబంధిత జోనల్, డిప్యూటీ కమిషనర్లకు సూచించారు. అదే తరుణంలో నివసిస్తున్న ప్రాంతంలోనే నియమించరాదని కూడా ఆదేశించారు. ఈ నేపథ్యంలో శానిటరీ జవాన్లు ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిళ్లకు ఇరుగుపొరుగు సర్కిళ్లకు బదిలీ చేశారు. జోనల్ కమిషనర్ల సహకారంతో డిప్యూటీ కమిషనర్లు పారిశుద్ధ్య జవాన్లను ఆయా వార్డుల్లో నియమించనున్నారు. రెండు పనిదినాల్లో ఈ ప్రక్రియ పూర్తికావాలని కమిషనర్ ఆదేశించారు.

ఎయిర్‌పోర్టు ఫిర్యాదులన్నీ ఇక ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టులోనే..

బాధితులు శంషాబాద్‌కు రానవసరం లేదు

- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టు ప్రారంభోత్సవంలో సీపీ అవినాష్ మహంతి, సీఐ బాలరాజు తదితరులు

శంషాబాద్: 'శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరిగాయి. అభివృద్ధి జరిగిన చోట కొన్ని రకాల సమస్యలు కూడా పెరుగుతుంటాయి. వాటి పరిష్కారానికి అనుగుణంగా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆర్‌జీఐఏలో పోలీస్‌స్టేషన్ ఔట్‌పోస్టును ప్రారంభించాం' అని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. ఇకపై ఎయిర్‌పోర్టుకు సంబంధించిన ఫిర్యాదులన్నీ ఔట్‌పోస్టు పరిధిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బాధితులు ఫిర్యాదులు ఇచ్చేందుకు శంషాబాద్ పట్టణానికి రానవసరం లేదని సూచించారు. ఎయిర్‌పోర్టులో గతంలో కేవలం ఆరుగురు పోలీసు సిబ్బంది మాత్రమే ఉండేవారని, ప్రస్తుతం ఓ సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటు ఇరవైమంది సిబ్బందితో ఔట్‌పోస్టు కొనసాగనుందన్నారు. ఇమిగ్రేషన్, సీఐఎస్ఎఫ్ తదితర ఏజెన్సీలతో సమన్వయంగా కలిసి పని చేసి శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు పోలీసులు పని చేస్తారన్నారు.

వేర్వేరుగా మారొచ్చు..

శంషాబాద్ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలతోపాటు శంషాబాద్ పట్టణ పరిధి కూడా పెరిగిన కారణంగా వికేంద్రీకరణ చేసినట్లు సీపీ తెలిపారు. భవిష్యత్‌లో ప్రస్తుత ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టు పూర్తి ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌గా పట్టణంలో ఉన్న ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ శంషాబాద్ టౌన్ పీఎస్‌గా మారేందుకు అవకాశాలున్నాయని చెప్పారు.

ఔట్‌పోస్టు సీఐగా బాలరాజు

కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పోస్టు సీఐగా జె.బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన సీపీ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్, శంషాబాద్ డీసీపీ రాజేష్, ఏసీపీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యకు కారకుడైన పీఈటీ టీచర్ అరెస్టు

ఉప్పల్: నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన..ఉప్పల్ సాగర్ గ్రామర్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి ముంగా సంగారెడ్డి ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడైన పీఈటీ టీచర్ ఎడమ ఆంజనేయులను శనివారం ఉప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో ఇంకా సాగర్ గ్రామర్ స్కూల్ యాజమాని ధన్‌సాగర్, క్లాస్ టీచర్‌ను పోలీసులు అరెస్టు చేయాల్సి ఉంది.

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి

బాలానగర్: భవన నిర్మాణం పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం ..రంగారెడ్డినగర్‌లో నివాసం ఉండే యమల బాబురావు(52) గురుమూర్తి నగర్‌లో ఒక ఇంటి నిర్మాణంలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం 12:30 సమయంలో రెండవ అంతస్తు పైనుంచి ఇనుప సామాగ్రిని తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలింది. దాంతో విద్యుత్ షాక్‌కు గురై రెండవ అంతస్తు నుంచి కింద పడిపోయాడు. తోటి కార్మికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

ఆనందంగా అమెరికాకు బయలుదేరి...

- మార్గమధ్యలో గుండెపోటుతో కుప్పకూలిన వృద్ధురాలు
- నగరానికి రేపు మృతదేహం..


శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి బయల్దేరుతూ..(ఫైల్)

లంగర్‌హౌస్: 'అందరూ సంతోషంగా ఉండండి...జూలైలో తిరిగివస్తా..అందరికీ బాయ్' అని చెప్పి కుమారుడితో కలిసి సంతోషంగా బయలుదేరిన ఓ వృద్ధురాలు.. అమెరికా ప్రయాణంలో మార్గమధ్యలోనే గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే...లంగర్ హౌస్ బాపునగర్‌లో నివాసముండే కాయిశెట్టి లక్ష్మీబాయి(70)కి నలుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. మూడవ కుమారుడు శ్రీధర్ అమెరికాలోని చార్లెటీలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల కుంభమేళాలో పాల్గొనేందుకు ఇండియాకు వచ్చిన ఆయన తిరిగి అమెరికా వెళ్లేందుకు తల్లితో కలిసి ఈ నెల 24న బయలుదేరాడు. శంషాబాద్ నుంచి విమానాలు మారుతూ చార్లెటీకి వెళ్తున్న క్రమంలో మియామీ ఎయిర్‌పోర్టులో ఈ నెల 25న లక్ష్మీబాయికి తీవ్రమైన గుండెపోటు వచ్చి కుప్పకూలింది. వెంటనే అక్కడి ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ వార్త విని నగరంలోని ఆమె సోదరి ముత్యాల ప్రమీల, కుమారుడు శ్రీనివాస్, ఇతర కుటుంబీకులు శోకసముద్రంలో మునిగారు. మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు. అమెరికాలోని తానా నిర్వాహకులు వీరికి సహకరించి మృతదేహాన్ని మన దేశానికి పంపించే ప్రయత్నాలు పూర్తి చేశారు. సోమవారం రాత్రి లంగర్‌హౌస్‌కు మృతదేహం చేరనుండగా సంగం శ్మశానవాటికలో మంగళవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

మెడికల్ సీటు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన సంస్థపై కేసు

బంజారాహిల్స్: ప్రఖ్యాత వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని నమ్మించి మోసగించిన సంస్థ యజమానితో పాటు ఇద్దరు ఉద్యోగులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్ నగరానికి చెందిన సురేంద్రకుమార్ చంద్రాకర్ తన కుమారుడు ఆకర్ష్ చంద్రాకర్‌కు ఎంబీబీఎస్ సీటు కోసం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని సైబర్ హైట్స్‌లో ఉన్న శ్రీబాలాజీ కెరీర్ గైడెన్స్‌ను సంప్రదించాడు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగి రాకేష్ శైనీ మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ సురేంద్రకుమార్‌ను నమ్మించి గత ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన ఒప్పందం కుదుర్చుకున్నాడు. శ్రీబాలాజీ కెరీర్ గైడెన్స్ అధినేత రాఘవేంద్రశర్మతో ఈ మేరకు అగ్రిమెంట్ కూడా కుదుర్చుకున్నారు. చత్తీస్‌ఘడ్ బిలాయ్‌లో ఉన్న శంకరాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని ఈ సంస్థ అధినేత రాఘవేంద్ర శర్మ, ఉద్యోగులు రాకేష్ శైనీ, గిరీష్ రూపానీలు నమ్మబలికి రూ.10,74,167 డీడీ కూడా తీసుకున్నారు. బిలాయ్‌లోని శంకరాచార్య మెడికల్ కాలేజీలో సీటు వచ్చినట్లుగా కూడా వెల్లడించారు. అయితే సురేంద్రకుమార్ కుమారుడు ఆకర్ష్‌కు నీట్ పరీక్షలో భాగంగా విశాఖపట్టణంలో మెడికల్ సీటు వచ్చింది. దీంతో తాను ఇచ్చిన రూ.10.74 లక్షల డీడీని తిరిగి ఇవ్వాలని సురేంద్రకుమార్ కోరారు. దీంతో ఈ సంస్థ అధినేతతో పాటు మిగతా ఉద్యోగులు స్పందించలేదు. తాను ఇచ్చిన డీడీని టోలిచౌకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి డ్రా చేసుకున్నారని బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. శంకరాచార్య మెడికల్ కాలేజీ పేరుతో డూప్లికేట్ అకౌంట్ తెరిచి తాను ఇచ్చిన డీడీని ఈ సంస్థ తన ఖాతాలో వేసుకుందని ఆరోపించారు. ఇదిలా ఉండగా శ్రీబాలాజీ కెరీర్ గైడెన్స్ సంస్థ కార్యాలయం గత ఏడాది అక్టోబర్ 29 నుంచి మూతపడి ఉండగా, దీని అధినేత రాఘవేంద్రశర్మ పరారీలో ఉన్నాడు. ఈ విషయంలో బాధితుడు చత్తీస్‌ఘడ్‌లో కూడా వీరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్‌తో పాటు శ్రీబాలాజీ కెరీర్ గైడెన్స్ సంస్థ, దీని అధినేత రాఘవేంద్రశర్మ, ఉద్యోగులు రాకేష్‌శైనీ, గిరీష్ రూపానీలపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలమండలిలో హాజరు ఇక పక్కా!

- ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ప్రారంభం
- త్వరలో ఫీల్డు హాజరు కోసం ప్రత్యేక యాప్



సాక్షి,సిటీబ్యూరో: ఇక జలమండలి ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది సమయ పాలన పాటించాల్సిందే. శనివారం నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం) పద్ధతి హాజరు అమలు ప్రారంభమైంది. సరిగ్గా ఐదేళ్ల క్రితం కరోనా నేపథ్యంలో బయోమెట్రిక్ హాజరు నిలిచిపోగా ..ఇప్పుడు ఆధునిక సాంకేతిక ముఖగుర్తింపు హాజరు అమలులోకి వచ్చింది. దశల వారీగా క్షేత్ర స్థాయి వరకు ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుకు కసరత్తు ప్రారంభమైంది. ఫీల్డ్ సిబ్బందికి సైతం ప్రత్యేక యాప్ ద్వారా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాగం సిద్ధమవుతోంది.

ఉదయం 11 గంటల తర్వాతే..

గత ఐదేళ్లుగా మాన్యువల్ హాజరు అమలవుతుండటంతో ఉద్యోగులు ఎవరు ఎప్పుడు వస్తున్నారో.. వెళ్తున్నారో సమయ పాలన లేకుండా పోయింది. సాక్షాత్తు జలమండలి ప్రధాన కార్యాలయంలో కొందరైతే ఉదయం 11 గంటలు దాటిన తర్వాత రావడం ఆనవాయితీగా మారింది. ప్రధాన కార్యాలయంలో సుమారు 500 మంది, డివిజన్, సెక్షన్ ఆఫీసుల్లో మూడు వేల మంది వరకు సిబ్బంది సేవలందిస్తున్నారు. బయో మెట్రిక్ హాజరు లేకపోవడం వల్ల చాలామంది ఆలస్యంగా విధులకు హాజరవుతున్నట్లు ఇటీవల ఉన్నతాధికారుల పరిశీలనలోనే బహిర్గతమైంది. ప్రధాన కార్యాలయంలో పరిశీలించగా..60 శాతం మంది ఉదయం 11.30 గంటల తర్వాత విధులకు వస్తున్నట్లు తేలింది. డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సిబ్బంది, ఉద్యోగుల గైర్హాజరుతో ఆ ప్రభావం సేవలపై పడుతోంది. కొందరైతే అసలు విధుల్లోకే రాకుండా..వస్తున్నట్లు మేనేజ్ చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. మరికొందరు ఆలస్యంగా వచ్చి మధ్యాహ్నం తర్వాత వెళ్లిపోయి..సొంత పనులు చూసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విధుల అలసత్వానికి చెక్‌పెట్టేందుకు ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుకు జలమండలి సిద్ధమైంది.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలి

సాక్షి, సిటీబ్యూరో: ఉపాధ్యాయులు విద్యార్థుల పఠన, గ్రహణశక్తిపై దృష్టి సారించాలని, వారి సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, ఎఫ్‌ఆర్‌ఎన్, ఎస్‌ఎస్‌సి ఫలితాలు, యూడీఐఎస్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను యుద్ధ ప్రాతిపదికన 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఐఓఎస్‌లు తమ పరిధిలోని పాఠశాలల్లో 100 శాతం ఎఫ్ఎల్ఎన్ సందర్శన చేయాలని, విద్యార్థుల పఠన, గ్రహణ శక్తిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో 50 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ఎంఎన్‌ఓలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, రెగ్యులర్ సందర్శనలో భాగంగా పఠన గ్రహణానికి సంబంధించిన వీడియోలను పోస్ట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ ఆర్. రోహిణి, డిప్యూటీ ఈవోలు, హెడ్మాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ మహిళలతో వ్యభిచారం

అంబర్‌పేట: విదేశీ యువతులతో ఓ విదేశీ వ్యక్తి నిర్వహిస్తున్న వ్యభిచార ముఠా గుట్టురట్టు అయింది. ఈ సంఘటన శనివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం సైబీరియాకు చెందిన టిమోతీ కాపా (30) చదువుల కోసం నగరానికి వచ్చి గోల్నాక జిందా తిలిస్మాత్ ప్రాంతంలో ఉంటున్నాడు. డబ్బు సంపాదన కోసం విదేశీ మహిళలతో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆ గృహంపై పోలీసులు దాడి చేసి ఉగాండాకు చెందిన ముగ్గురు, కెన్యాకు చెందిన ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. వీరిని ప్రభుత్వ వసతి గృహానికి పంపించారు. ఈ సంఘటనలో విటుడు బాలాజీరెడ్డి, నిర్వాహకుడు టిమోతీ కాపాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

షోరూమ్‌ల హ్యాండ్లింగ్ దోపిడీపై ఆర్టీఏ కొరడా

సాక్షి, సిటీబ్యూరో: కొత్త వాహనాల అమ్మకాలపై రకరకాల చార్జీలు, ఫీజుల రూపంలో వాహనదారులను నిలువునా దోచుకొనే వాహన షోరూమ్‌లపైన చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు రవాణాశాఖ సన్నద్ధమైంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, తదితర వాహనాల అమ్మకాలపైన హ్యాండ్లింగ్ చార్జీలు, ఆర్టీఏ చార్జీల పేరిట రూ.5000 నుంచి రూ.10,000 వరకు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. గోడౌన్‌లలో ఉన్న వాహనాలను షోరూమ్ వరకు తరలించి వినియోగదారుడికి విక్రయించేందుకు హ్యాండ్లింగ్ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాగే వాహనాల రిజిస్ట్రేషన్లపైన సుమారు రూ.2000 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వాహన వినియోగదారులపైన నిలువు దోపిడీకి పాల్పడే ఆటోమొబైల్ డీలర్లపైన కఠిన చర్యలను తీసుకోనున్నట్లు రవాణాశాఖ విజిలెన్స్ జాయింట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ హెచ్చరించారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్ అథరైజేషన్‌ను సస్పెండ్ చేయనున్నట్లు ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు. ఈ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జీవిత కాలపు పన్ను చెల్లింపుల్లో, వాహనదారుడు రెండవ వాహనం కొనుగోలు చేసే సమయంలో విధించాల్సిన అదనపు జీవిత కాలపు పన్నుపైన కచ్చితమైన నిబంధనలు పాటించవలసిందేనన్నారు. పన్ను చెల్లింపుల్లో కొందరు డీలర్లు నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వాహనదారులు తాము బండి కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి అదనపు చార్జీల వసూళ్లకు పాల్పడినా రవాణాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. షోరూమ్‌లలో హ్యాండ్లింగ్ చార్జీల కోసం డిమాండ్ చేస్తే నేరుగా రవాణా కమిషనర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అలాంటి డీలర్లను, షోరూమ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, సమగ్రమైన విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చంద్రశేఖర్‌గౌడ్ స్పష్టం చేశారు.

జాతరకొచ్చి..నీట మునిగి ఇద్దరు యువకులు మృతి

- మంజీరాలో ఈతకెళ్లిన నగర విద్యార్థులు
- ఒకరిని కాపాడబోయి మరొకరు మునక


శ్యామ్(ఫైల్)


కృష్ణ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల వనదుర్గాదేవి జాతరకొచ్చిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. హైదరాబాద్ నగరంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నిన్నేకర్ కృష్ణ (18) బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆసిఫ్ నగర్‌కు చెందిన మిల్కీకర్ శ్యామ్(21) ఇటీవలే డిగ్రీ పూర్తి చేశాడు. ఇరు కుటుంబాలు కలిసి గురువారం ఏడుపాయల వనదుర్గాదేవి జాతరకు వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని మూడు రోజులపాటు ఉత్సాహంగా గడిపారు. ఇందులో ఇద్దరు యువకులు శనివారం ఈత కోసం ఏడుపాయల నుంచి వచ్చి పోతంశెట్టిపల్లి రెండవ బ్రిడ్జి వద్ద మంజీరా నదిలోకి దిగారు. ఇద్దరూ ఈత కొడుతున్న క్రమంలో ఆయాసం వచ్చి కృష్ణ నీట మునిగాడు. ఇది గమనించిన శ్యామ్ కృష్ణను కాపాడే ప్రయత్నంలో అతనూ నీట మునిగిపోయాడు. బ్రిడ్జి పై నుంచి ఇది గమనించిన కృష్ణ సోదరుడు అంబదాస్ ఇద్దరినీ కాపాడేందుకు నదికిలోకి దిగాడు. అప్పటికే వారు కనిపించకుండా పోయారు. వెంటనే గజఈతగాళ్ల సాయంతో వెతికించగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. అప్పటిదాకా సంతోషంగా గడిపిన ఇరు కుటుంబాల్లో తీరని శోకం నిండింది. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మూతపడిన ట్రాన్స్‘మిత్ర’ క్లినిక్

సాక్షి, సిటీబ్యూరో: ట్రాన్స్‌జెండర్‌లకు ఉచిత వైద్యసేవలను అందజేసిన మిత్ర క్లినిక్ మూతపడింది. అమెరికా నుంచి వచ్చే ఆర్థిక సహాయం నిలిచిపోవడంతో నగరంలోని నారాయణగూడలో ఏర్పాటు చేసిన ఈ క్లినిక్‌లో అన్ని రకాల వైద్యసేవలను నిలిపివేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని సుమారు 2000 మందికి పైగా ట్రాన్స్‌జెండర్‌లకు అవసరమైన వైద్యపరీక్షలు, చికిత్సలను అందజేసేందుకు యూఎస్ ఎయిడ్‌తో 2021లో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఆసుపత్రి నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం సుమారు రూ.24 లక్షల ఆర్థిక సహాయం లభించేది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గత జనవరిలో బాధ్యతలు చేపట్టిన వెంటనే యూఎస్ ఎయిడ్‌ను నిలిపివేస్తూ ‘యాంటీ ట్రాన్స్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్’పైన సంతకం చేయడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మిత్ర క్లినిక్‌లను ఆర్థిక సాయం నిలిచిపోయిందని ట్రాన్స్ ఆరోగ్య నిపుణులు రచన ముద్రబోయిన తెలిపారు. ‘ఒక్క కలం పోటుతో మాకు లభించే ఆర్థిక సాయాన్ని నిలిపివేశారు. తీవ్ర షాక్‌కు గురయ్యాం. నాలుగేళ్ల వార్షిక వేడుకలు ముగిసిన కొద్ది రోజులకే మిత్ర మూతపడింది.’ అని రచన విచారం వ్యక్తం చేశారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య


సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీసీపీలు శ్రీనివాస్, సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను త్వరగా పరిష్కరించాలని, దోషులకు శిక్షపడేలా చేసి, బాధితులకు న్యాయం దక్కేలా చూడాలని కోరారు. అణగారిన వర్గాలపై ఇప్పటికీ వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దన్నారు. అధికారులు ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను విధిగా తనిఖీ చేయాలని, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భూ సమస్యలపై ఆర్డీఓలతో విచారణ జరిపించి వారికి సత్వర న్యాయం దక్కేలా చూస్తామని చెప్పారు. ఈనెల 31లోగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై.. శ్రీనివాసుడు



క్షీరసాగరంలో ఉద్భవించిన కల్పవృక్షంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఆలయ వీధుల్లో ఊరేగుతుండగా.. యువతులు, మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పెద్దఎత్తున విచ్చేసిన భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతుండగా శనివారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై.. సాయంత్రం సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్షం నీడన ఉన్న వారికి ఆకలి దప్పులు ఉండవని, పూర్వ జన్మ సుకృతం కలుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

– బంజారాహిల్స్



సర్కార్ బడుల్లో సదుపాయాలపై.. సర్వే పూర్తి

వివరాలు నమోదు చేసిన ఉపాధ్యాయులు

- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధుల కోసం వివరాలు నిక్షిప్తం
- సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్న అధికారులు



ఎస్‌బీటీనగర్ హైస్కూల్‌లో విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా బోధన

బంజారాహిల్స్: సర్కార్ బడుల్లో సమగ్ర సమాచార సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. 2024–25 విద్యా సంవత్సరానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ(యూడైస్ ప్లస్) సర్వేను గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే షేక్‌పేట మండల పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లలో 26 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉండగా ఖైరతాబాద్-1 మండల పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, శ్రీనగర్‌కాలనీ, కమలాపురికాలనీ, పంజగుట్ట ప్రాంతాల్లో ఉన్న 17 ప్రాథమిక, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలల్లో, ఖైరతాబాద్-2 మండల పరిధి కిందికి వచ్చే ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ ప్రాంతాల్లో ఉన్న 17 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సర్వే జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు మౌలిక వసతుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు, విద్యాభివృద్ధికి నిధులు కేటాయించనున్నాయి. క్షేత్రస్థాయిలో గత ఏడాది సెప్టెంబర్‌లో సేకరించిన సమాచారానికి సంబంధించి తప్పులు ఏవైనా ఉన్నాయో పరిశీలించిన అనంతరం సవరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

ఐదు రోజుల పాటు పరిశీలన..

పాఠశాల స్థాయిలో ప్రత్యేక యాప్‌లో స్కూల్ హెడ్‌మాస్టర్ నమోదు చేసిన వివరాలపై ఇటీవల ఐదు రోజుల పాటు పునః పరిశీలించారు. ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటుచేసి ఆపరేటర్లు ఒక్కో అంశాన్ని నిశితంగా పరిశీలించారు. మండల కార్యాలయాల్లో ఉన్న రిసోర్స్ పర్సన్లు, అధికారులు ప్రతి అంశాన్ని పరిశీలించి సవరణలు ఉంటే సరిదిద్దారు. పేర్లు, ఇతర వివరాలు నమోదు కాకుంటే ఆయా పాఠశాలల నుంచి తెప్పించుకుని పోర్టల్‌లో పొందుపరిచారు. షేక్‌పేట, ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2 మండలాల పరిధిలో 1–10వ తరగతి వరకు 28,656 మంది విద్యార్థులు ఉన్నట్లు తేలింది. పాఠశాల స్థాయిలో అత్యంత కీలక సమాచారం కావడంతో ఆన్‌లైన్‌లో విద్యాశాఖ అధికారులకు నివేదించేందుకు సిద్ధమయ్యారు.

మౌలిక వసతుల కల్పనకు యూ డైస్..

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యకు సరిపడా మౌలిక వసతులు కల్పించడానికి యూ డైస్ ప్లస్ సర్వే కీలకంగా మారింది. అందుబాటులో ఉన్న తరగతి గదులు, క్రీడా మైదానాలు, తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, కుర్చీలు, మధ్యాహ్న భోజన కిచెన్ ఇతర మౌలిక వసతుల వివరాలను నమోదు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమగ్ర వివరాలు, హాజరు, మధ్యాహ్న భోజనం అమలుతీరు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు ఇందులో పొందుపర్చారు. ఆన్‌లైన్ వివరాల ప్రకారం కల్పించాల్సిన వసతులు, అవసరమైన ఉపాధ్యాయుల సంఖ్య కూడా యూడైస్‌లో తేలనుంది. ఖైరతాబాద్ జోన్ పరిధిలో యూడైస్ ప్లస్ సర్వేపై ప్రధానోపాధ్యాయులతో ఉన్నతాధికారులు పలుమార్లు సమీక్షించారు. పాఠశాల స్థాయిలో సేకరించిన వివరాలపై ఐదు రోజుల నిశితంగా పరిశీలించాచు. తప్పులు లేకుండా జాబితాను సిద్ధం చేశారు. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఎంతమంది టీచర్లు పనిచేస్తున్నారో ఆ వివరాలు అందజేశారు. విద్యార్థుల ఆధార్ కార్డు లేకపోయినా సరే ఆన్‌లైన్‌లోనూ, రికార్డులోనూ వివరాలు నమోదు చేయడం జరిగింది. విద్యార్థుల హాజరు ప్రకారం రికార్డులు నిర్వహిస్తున్నారో లేదో ఖచ్చితంగా పరిశీలించారు.

టీచర్లు తక్కువే..

యూడైస్ ప్లస్ సర్వే ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 1–10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడాన్ని ఈ సర్వేలో గుర్తించారు. కొన్ని పాఠశాలల్లో సరిపడినంతమంది ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో టీచర్ల సంఖ్య తక్కువగా ఉంది.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఎగ్జిబిషన్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పటేల్‌నగర్, అజంతా గేట్, ఎగ్జిబిషన్ ఏరియా, ఏపీహెచ్‌బీ కాలనీ, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎగ్జిబిషన్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో గోవర్ధన్ చాంబర్స్ ఏరియా, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎంసీహెచ్ కార్యాలయం, ఏసీటీ టెక్నాలజీ కార్యాలయం, బీజేపీ కార్యాలయం ఏరియా, జగదీష్ మార్కెట్, బాషా మంజిల్ ఏరియా, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఫోన్ హ్యాక్ అయ్యిందంటూ మోసం

వెంగళరావునగర్: ఫోన్ హ్యాక్ అయ్యిందంటూ ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఏలూరుకు చెందిన బి.వంశీ స్థానిక యాదగిరినగర్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 23న అతడికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. బ్యాంక్ ఖాతా హ్యాక్ అయ్యిందని, అర్జెంటుగా రూ.70 వేలు పంపాలని ఫోన్ వచ్చింది. ఆ నంబర్‌కు నగదు ట్రాన్స్‌ఫర్ చేసి ఫోన్ చేస్తే స్పందన లేకపోవడంతో సైబర్ పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షాన్‌బాగ్ హోటల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

పంజగుట్ట: పంజగుట్టలోని షాన్‌బాగ్ హోటల్‌లో శనివారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వంటగదిలో ఉన్న చిమ్నీ నుంచి స్వల్పంగా మంటలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది భవనంపైకి వెళ్లి చిమ్నీలోకి పైప్‌తో నీళ్లు చల్లారు. తందూరీ రోటీ తయారు చేసే సమయంలో చిమ్నీలోని వ్యర్థాలకు నిప్పు అంటుకొని స్వల్పంగా మంటలు వచ్చి ఉంటాయని పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికే మంటలు పూర్తిగా ఆర్పివేశారు. హోటల్ చిమ్నీలో నుంచి పొగ వ్యాపించినప్పటికీ హోటల్ సిబ్బంది కస్టమర్లకు సర్వ్ చేస్తూనే ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి చిన్నపిల్లలు కూడా హోటల్ లోపల భోజనం చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగినా కూడా కస్టమర్లకు సమాచారం ఇవ్వకుండా హోటల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

రహమత్‌నగర్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన సాయికుమార్(28) గతనెల 27న ఎర్రగడ్డలోని సల్మాన్ లాడ్జీలో దిగాడు. లాడ్జీ సిబ్బంది శనివారం గది తలుపులు తెరిచి చూడగా ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలాలో వ్యర్థాల తొలగింపు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బసవతారకనగర్–ఎంజీనగర్ బస్తీలకు ఆనుకుని ఉన్న నాలా కొంతకాలంగా మురుగు, వ్యర్థాలతో నిండిపోయి మురుగంతా రోడ్లపై పారుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి జీహెచ్ఎంసీ, జలమండలి ఇంజినీర్లను అప్రమత్తం చేసి నాలా పూడికతీత చేపట్టాలని ఆదేశించారు. శనివారం వ్యర్థాల తొలగింపు పనులను సిబ్బంది జేసీబీలతో ప్రారంభించారు.

నమూనా.. ఆలోచింపజేసేలా..



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని విశ్వభారతి మోడల్ స్కూల్ విద్యార్థులు శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలు ఆలోచింపజేశాయి. 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు వివిధ విభాగాల్లో 155 నమూనాలు ఏర్పాటు చేసినట్లు కరస్పాండెంట్ సి.శ్రీనివాసులు తెలిపారు. హెచ్ఎం నర్సింహులు, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో..



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–10లోని గాయత్రీహిల్స్ లిటిల్ స్టార్ హైస్కూల్‌లో సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా బహుమతులు ప్రదానం చేశారు. సైన్స్ టీచర్లను సత్కరించారు.

ఆర్టిజన్ కన్వర్షన్ కోసం వినతి



ప్రజాభవన్ వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ప్రతినిధులు

బంజారాహిల్స్: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ కే.ఈశ్వర్‌రావు కన్వీనర్ ఎంఏ వజీర్‌తో కలిసి ప్రజాభవన్‌లో ప్రజావాణి సీఈఓ దివ్యకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రం మొత్తం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సుమారు 23 వేల మంది ఆర్టిజన్ల కన్వర్షన్ కోసం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఆర్టిజన్ కన్వర్షన్ కోసం ఉద్యమాలు కూడా చేశామని, ఉన్నతాధికారులకు వినతి పత్రాలు కూడా సమర్పించామని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ కూడా ఇచ్చారని గుర్తుచేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బసవతారకం నగర్ బస్తీకి చెందిన ఓర్సు లక్ష్మమ్మ ఆరోగ్య సమస్యలతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమె ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆమె వైద్య చికిత్స నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యుడు అయోధ్యకు శనివారం ఆయన నివాసం వద్ద అందజేశారు. నేతలు మామిడి నర్సింగ్‌రావు, నాగేష్ సాగర్, అబ్దుల్ గని తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

పీజేఆర్ గ్రౌండ్స్‌లో గంజాయి తాగుతూ..

ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బంజారాహిల్స్: నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌లోని పీజేఆర్ గ్రౌండ్స్‌లో ముగ్గురు యువకులు గంజాయి తాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడ దాడులు నిర్వహించారు. ఎల్ఎన్‌నగర్‌కు చెందిన ఏకే పాయింట్ జనరల్ స్టోర్స్ వ్యాపారి మహ్మద్ అక్రం అహ్మద్, కార్మికనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ రహీమ్ అలియాస్ డ్యామ్‌బాబా, ఎల్ఎన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మజర్ అలియాస్ మజ్జూను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురూ గంజాయికి బానిసయ్యారని, నానక్‌రాంగూడ నుంచి కొనుగోలు చేసి నిర్మానుష్య ప్రాంతాల్లో తాగుతుంటారని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం



రహమత్‌నగర్: అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో సాల్మాన్ హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కంటి, పంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డా.స్నేహ, సతీష్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ సుధాకర్, హెచ్ఎం ప్రీతి బస్తీవాసులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు



వెంగళరావునగర్: నీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో ఉన్న కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం ఆమె జవహర్‌నగర్ నివాసితులతో సమావేశం నిర్వహించారు. జవహర్ నగర్ గాయత్రీ స్కూల్ పరిసర ప్రాంతాల్లో నీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ నేతలు విజయ్‌కుమార్, పవన్ ముదిరాజ్, కిట్టు, జవహర్‌నగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.

తుమ్మలకుంట నాలాలో పాక్షికంగా నిర్మాణాల కూల్చివేత

ఫిలింనగర్: టోలిచౌకి సమీపంలోని హకీంపేట కుంట వెనుక తమ్మల కుంట నాలాను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది శనివారం పాక్షికంగా కూల్చారు. హకీంపేట కుంట వెనుక ఉన్న పార్కుతో పాటు దేవాలయ స్థలం కబ్జాకు గురైందని, అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలంలో నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొత్తగా మూడు షట్టర్లు నిర్మించారని, మరికొన్ని చోట్ల పిల్లర్ల నిర్మాణం చేపట్టారని, స్లాబ్ కూడా వేశారని ఆమె తెలిపారు. ఆలయ భూమితో పాటు పార్కు స్థలాన్ని కాపాడాలని స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ కూల్చివేతలు చేపట్టారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ దాదాపు 20, 30 మందితో వచ్చి నిర్మాణాలు కూల్చివేస్తున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే అడ్డుకోవడంతో రెవెన్యూ సిబ్బంది నిర్మాణాలను పాక్షికంగా కూల్చి వెనుదిరిగారు. అక్బర్ అనే వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు నిర్ధారించారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కమాండ్ కంట్రోల్ వెనుక చెలరేగిన మంటలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్10లోని తెలంగాణ భవన్, కమాండ్ కంట్రోల్ వెనుక ఇటీవల కొత్తగా వేసిన రోడ్డును ఆనుకుని శనివారం మధ్యాహ్నం ఖాళీ ప్రదేశంలో భారీ మంటలతో చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ రోడ్డు పక్కన ప్రతిరోజూ గుట్టలకొద్దీ వ్యర్థాలను డంప్ చేస్తుండటంతో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పారేయడంతో ఈ మంటలు చెలరేగినట్లుగా గుర్తించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని ఇక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఒకవైపు ఇక్కడ మంటలు చెలరేగుతున్న సమయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ ఘటనతో అధికారులంతా మంటలు చెలరేగుతున్న ప్రాంతానికి చేరుకుని సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేశారు.

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం

పంజగుట్ట: రైస్ పుల్లింగ్ యంత్రం పెట్టుకుంటే వ్యాపారంలో అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఓ వ్యాపారవేత్త నుంచి రూ.24 లక్షలు కాజేసిన నిందితుడిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివాసం ఉండే వెంకటరమణకు అమీర్‌పేటలో రియల్ ఎస్టేట్ కార్యాలయం ఉంది. కార్యాలయానికి గతేడాది నవంబర్‌లో పబ్బతి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వచ్చి వెంకటరమణను పరిచయం చేసుకున్నాడు. తనవద్ద రైస్‌ను ఆకర్షించే యంత్రం ఉందని, అది ఆఫీస్‌లో పెట్టుకుంటే అధిక లాభం వస్తుందని నమ్మబలికాడు. దీంతో జనవరి 30వ తేదీన వెంకటేశ్వర్లుకు రూ.24 లక్షలు ఆన్‌లైన్‌లో పంపిస్తూ, ఒకవేళ ఇది పనిచేయక పోతే తిరిగి తన డబ్బు తనకు ఇచ్చేలా చెక్కులు ఇవ్వాలని వెంటరమణ కోరాడు. దీంతో వెంకటేశ్వర్లు చెక్కులు కూడా ఇచ్చాడు. యంత్రం పని చేయకపోవడంతో వెంకటరమణ ఇటీవల చెక్కులను బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. పంజగుట్ట పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకొని వెంకటేశ్వర్లు కోసం గాలిస్తున్నారు.

వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి



సదస్సులో ప్రసంగిస్తున్న ఆచార్య బాలకిష్టారెడ్డి

చార్మినార్: ప్రజాక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన చారిత్రక వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని, వారిని సదా స్మరించడం అందరి బాధ్యత అని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి అన్నారు. చరిత్ర విస్మరించిన యోధురాలు, లోకమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకల సందర్భంగా శనివారం సిటీ కాలేజీలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు.అనేక రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నా, అవసరమైన నైపుణ్యాలు లేకపోవటం వల్లే ఇన్నాళ్లు యువత నిరాశలో ఉందని పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం 2020, విద్యారంగంలోని డిజిటల్ విప్లవం, నైపుణ్య భారత్‌లో యువత తన సామర్థ్యాన్ని నిరూపించుకోనున్నదని, వచ్చే 15 ఏళ్లల్లో ప్రపంచం ముంగిట కొత్త సవాళ్లు ఉంచబోతున్నదని అన్నారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి గుంతా లక్ష్మణ్ జీ మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన అహల్యాబాయి మూడు శతాబ్దాల పూర్వం పురుషులకు మాత్రమే పరిమితమైన రాజ్యాధికారాన్ని పొంది అనేక సంస్కరణలు చేశారని, మాల్వా ప్రాంతంలో రైతుల కోసం సాగునీటి సౌకర్యాలు కల్పించారని అన్నారు. స్త్రీ విద్య, స్త్రీ సాధికారత కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్, ఆచార్య ఏలూరి యాదయ్య, వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, డా.కె.భాస్కర్, డా.పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నాటికి 'లీ' నివేదిక

- గ్రేటర్‌లో ప్రజారవాణాపై సమగ్ర అధ్యయనం
- కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్‌పై ఉన్నతాధికారుల సమీక్ష
- లీ అసోసియేషన్ సర్వే పూర్తి.. త్వరలో డాటా విశ్లేషణ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఇక ప్రజారవాణాను మెరుగు పర్చే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ నాటికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక రూపొందించనున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో ప్రజారవాణా వ్యవస్థల విస్తరణ, అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన లీ అసోసియేషన్ నిపుణులతో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హుమ్టా డైరెక్టర్ జీవన్‌బాబు, లీ అసోసియేషన్ ప్రతినిధులు ఫణిరాజ్, శెట్టి పాల్గొన్నారు. ఇప్పటి వరకు లీ ఆధ్వర్యంలో జరిగిన సర్వేపై అధికారులు సమీక్ష జరిపారు. ఈ సర్వే నివేదిక ఆధారంగా డాటా విశ్లేషించనున్నట్లు లీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఏప్రిల్ నాటికి ఈ విశ్లేషణను పూర్తి చేసి సమగ్రమైన నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రజారవాణా సదుపాయాలు, హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా చేపట్టవలసిన చర్యలపై గతేడాది లీ అసోసియేషన్‌ను హెచ్ఎండీఏ నియమించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనుంది. ఇందులో భాగంగా లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) పై అధ్యయనం చేపట్టారు. ప్రతి ఇంటి రవాణా అవసరాలను, ప్రస్తుతం వారు వినియోగిస్తున్న వాహనాల వివరాలను సేకరించడంతోపాటు ఏయే ప్రాంతాల్లో ఏ విధమైన ట్రాఫిక్ రద్దీ ఉత్పన్నమవుతుందనే అంశాలపై కూడా ఈ సంస్థ దృష్టి సారించింది. మెట్రో రెండోదశ విస్తరణలో భాగంగా 2051 వరకు ప్రయాణికుల రద్దీ ఎలా పెరగనుందనే అంశంపైన కూడా సమగ్ర మొబిలిటీ ప్రణాళికలను రూపొందించనున్నారు. ఈ అంశంపై ఇప్పటికే అందజేసిన ప్రాథమిక నివేదిక ఆధారంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ వివిధ మార్గాల్లో మెట్రో విస్తరణపై డీపీఆర్‌లను సిద్ధం చేసింది. ఈ డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేశారు.

ఏ రకమైన ప్రజా రవాణా అవసరం

లీ అసోసియేషన్ ప్రాథమిక అంచనాల మేరకు కొన్నిచోట్ల వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండగా, మరికొన్ని చోట్ల సెవెన్ సీటర్ ఆటోలు, బస్సుల వినియోగం ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఎంఎంటీఎస్, మెట్రోరైళ్ల వినియోగం కూడా ఏ ప్రాంతంలో ఎలా ఉందనే అంశంపై కూడా దృష్టి సారించారు. ఏ ప్రాంతంలో ఎలాంటి ప్రజారవాణా సదుపాయాలను చేపట్టవలసిన అవసరముందనే ప్రధానమైన అంశాన్ని ఆధారంగా చేసుకొని తుది నివేదికను అందజేయనుంది. ప్రస్తుతం గ్రేటర్ జనాభా సుమారు రెండు కోట్లకు చేరువైంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి స్థిరపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాలు, నిర్మాణ రంగంలో కార్యకలాపాలు కూడా పెద్ద ఎత్తున కొనసాగుతున్న దృష్ట్యా ఇతర రాష్ట్రాల నుంచి భారీగా ప్రజలు నగరానికి వలస వస్తున్నారు. దీంతో అన్ని వైపులా కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. కానీ, ఈ నగర విస్తరణకు అనుగుణంగా ప్రజా రవాణా సదుపాయాలు పెరగడం లేదు.

2,550 బస్సులు మాత్రమే...

బెంగళూరు వంటి నగరాల్లో సుమారు ఆరు వేల బస్సులు అందుబాటులో ఉండగా, గ్రేటర్‌లో 2,550 బస్సులు మాత్రమే ఉన్నాయి. ఎంఎంటీఎస్ రెండో దశలో ఆరు కొత్తలైన్‌లను ఏర్పాటు చేసినప్పటికీ రైళ్లు పూర్తిస్థాయిలో లేవు. ప్రస్తుతం 70 ఎంఎంటీఎస్ సర్వీసులు మాత్రమే తిరుగుతున్నాయి. మరో వంద ఎంఎంటీఎస్ రైళ్లను నడవలసి ఉంది. మెట్రో రైళ్లు కూడా మూడు కోచ్‌లతోనే నడుస్తున్నాయి. రోజుకు 5 లక్షల మందికిపైగా మెట్రో సేవలను వినియోగించుకుంటున్నా కోచ్‌ల సంఖ్య పెరగడం లేదు. రోజుకు వెయ్యి ట్రిప్పులు నడుపుతున్నట్లు అధికారులు చెబుతున్నా అన్ని సర్వీసులు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో భవిష్యత్ అవసరాలు, రవాణా ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఈ అధ్యయనం సమగ్రమైన ప్రజా రవాణా ప్రణాళికలను ప్రభుత్వం ముందు ఉంచనుంది.

నగరంలో నేడు

- తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ శాస్త్రి ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు శ్రీ భక్తరామదాసు జయంతి ఉత్సవాలు జరుగుతాయి.
- సామాజిక సంభాషణ కేంద్రం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు సిరికి స్వామినాయుడు శతర ఆదివాసీ కవిత్వ సంకలనం ఆవిష్కరణ, ప్రత్యామ్నాయ సృజనకారుల కలయిక, సాహిత్య సదస్సు జరుగుతాయి.
- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షరయాన్, సీతాస్, అభిజ్ఞ, భారత్ సంస్థల సంయుక్త నిర్వహణలో జరుగుతున్న జాతీయ సదస్సులో భాగంగా రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు సాహిత్య పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్మారావునగర్‌లోని స్వరాజ్య ప్రెస్ కాంపౌండ్‌లో సాయంత్రం 6 గంటలకు ఋషిపీఠం పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది.
- ఎండోమెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వద్ద ఉదయం 6 గంటలకు ఎల్లో రిబ్బన్ రన్ 2025 కార్యక్రమం జరుగుతుంది.
- హిమాలయ వెల్‌నెస్ ఆధ్వర్యంలో హైటెక్ సిటీలోని ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఉన్న ఐటీసీ కోహినూర్‌లో ఉదయం 10 గంటలకు ఏక్ నయీ ముస్కాన్ కార్యక్రమం జరుగుతుంది.
- భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ 175 సంవత్సరాలను పురస్కరించుకుని నెక్లెస్ రోడ్‌లోని సంజీవయ్య చిల్డ్రన్ పార్క్ వద్ద ఉదయం 8 గంటలకు వాకథాన్ కార్యక్రమం జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాలులో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటలకు హ్యాండ్ టు హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

400 మందికి భోజనం.. 1,200 మందికి వడ్డన

- అంకుషాపూర్‌లోని ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల వద్ద ఆందోళన
- సరైన శిక్షకులు, అధ్యాపకులు లేరని విద్యార్థినులు, తల్లిదండ్రుల ఆవేదన



ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఘట్‌కేసర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మీ డిగ్రీ కళాశాలలో నాలుగు మంది కోసం తయారు చేసిన భోజనాన్ని 1,200 మందికి వడ్డిస్తున్నారని విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. నీటిసౌకర్యం లేదని, స్నానాల గదులు సరిపడా లేవని, మూడు నెలలుగా ఆర్మీ శిక్షణ ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీనగర్ మండలం అన్నంపట్లలో ఉన్న తమ కళాశాలను మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుషాపూర్ ప్రిన్స్‌టన్ కళాశాలలోకి తరలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు విద్యార్థినులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆ కళాశాల గేటు ముందు శనివారం ఆందోళన చేపట్టారు. శారీరక శిక్షణ ఇచ్చే శిక్షకులు, నైపుణ్యం గల అధ్యాపకులు, ఆర్మీ డైరెక్టర్, మేజర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఆర్మీ శిక్షణకు కావలసిన వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి చదువులు వదిలిపెట్టి పిల్లలను ఆర్మీ కళాశాలలో చేర్పిస్తే ఇబ్బందులకు గుర్తి చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసనకు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి నిరసనకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, కోశాధికారి యుగేందర్, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణే అడ్డు: మోత్కుపల్లి



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తున్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ముందు తిరకాసులు పెట్టి వర్గీకరణ జరగకుండా ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ అడ్డుపడుతున్నారని మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పీసీసీ ప్రధానకార్యదర్శి కొండేటి మల్లయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మోత్కుపల్లి మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణే లక్ష్యంగా ఆవిర్భవించిన ఎంఆర్‌పీఎస్‌ను మూసివేయాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయినందున పనులన్నీ వదులుకుని దండోరా పేరుతో ఎవరూ పిలిచినా డప్పులు పట్టుకుని గ్రామాల నుంచి తరలిరావద్దని ఆయన సూచించారు. ఎస్సీ వర్గీకరణ మంద కృష్ణ వల్ల రాలేదని, ఈ విజయాన్ని అమరవీరులకు అంకితం చేయాలని అన్నారు. మాదిగ జాతికి ఏది మేలు అయితే దానికి అనుకూలంగా మాట్లాడతానని మంద కృష్ణ తన గురించి మాట్లాడే అర్హతే లేదని పేర్కొన్నారు. దామోదర రాజనర్సింహను మంత్రి వర్గం నుంచి తొలగించాలని, ఎస్సీ వర్గీకరణలో ఈ కులాన్ని ఆ గ్రూపులో కలపాలని, ఆ కులాన్ని ఈ గ్రూపులో కలపాలని తిరకాసులు పెడుతూ వర్గీకరణ జరగకుండా మాదిగ జాతికి మంద కృష్ణ అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఇటుక రాజు మాదిగ, జన్ను కనకరాజు మాదిగ, మేరీ మాదిగ, ముంజుగళ్ళ విజయ్ కుమార్, ఎస్.రాజలింగం, దేవని సతీష్ మాదిగ, పాలడుగు శ్రీనివాస్, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ, డిప్లొమా, బీటెక్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ఐటీఐ ఎలక్ట్రికల్, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 12న మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ఉచితంగా శిక్షణ ఉంటుందని తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. డాటా సెంటర్లలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఐటీఐ, బీటెక్, డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ముందుగా ఫోన్ నంబర్లు 99898 92717.81858 51000 తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

15 నుంచి 'బిల్డ్ నౌ'



సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణ రంగ అనుమతుల కోసం టీజీ బీపాస్ స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టనున్న బిల్డ్‌నౌ సేవలు హెచ్ఎండీఏలో ఈ నెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. బిల్డ్‌నౌపై ఇప్పటికే అధికారులకు, ఉద్యోగులకు శిక్షణనిచ్చారు. శనివారం హెచ్ఎండీఏ, క్రెడాయ్ ఆధ్వర్యంలో బిల్డర్‌ల కోసం ప్రత్యేకంగా వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారులు మల్లికార్జున్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వంపై యువత ఆసక్తి చూపాలి

గ్రీన్ కో గ్రూప్ వ్యవస్థాపకుడు మహేష్ కొల్లి



గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో మహేష్‌కొల్లి, మదన్ పిల్లుట్ల, ప్రొఫెసర్లు

రాయదుర్గం: స్థిరమైన, సంపన్నమైన భవిష్యత్తును రూపొందించడానికిగాను యువత నాయకత్వ బాధ్యతలపై ఆసక్తి చూపాలని గ్రీన్ కో గ్రూప్ వ్యవస్థాపకుడు మహేష్ కొల్లి అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని 505 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు తమ ముందున్న అవకాశాలు, సమస్యలను స్వీకరిస్తూ, ఇతరులలో బలమైన నమ్మకాలను పెంపొందించాలన్నారు. గ్రీన్ కో పర్యావరణ లక్ష్యాలపై రాజీ పడకుండా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, పలువురు ఐఎస్‌బీ ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో మెగా జాబ్‌ఫెయిర్



జాబ్ ఫెయిర్‌లో పాల్గొన్న ఎంపీ ఈటల, వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో నిపుణ, సేవా ఇంటర్నేషనల్ సహకారంతో శనివారం నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్ కుమార్‌రెడ్డితో కలిసి జాబ్‌ఫెయిర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌ఫెయిర్‌ల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు. ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంలో, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడంలో జేఎన్‌టీయూహెచ్ ముందుంటుందని కిషన్‌కుమార్ రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలో కాగ్నిజెంట్ టెక్, మహీంద్ర, ఎల్ అండ్ టి, ఇన్నోమేటిక్స్ సహా పలు రంగాల కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్‌మేళాలో కొంతమంది విద్యార్థులు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు పొందారు. మరికొందరు కంపెనీల అవసరాలకు అనుగుణంగా తదుపరి నియామక ప్రక్రియకు ఎంపికయ్యారు. జాబ్ ఫెయిర్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, నర్సింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రెక్టర్ కె.డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ విభాగం డైరెక్టర్ డా.ఎ.రజని, డిప్యూటీ డైరెక్టర్ డా.జె.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ @175

నేడు జీఎస్ఐ దక్షిణ క్షేత్ర సావనీర్ ఆవిష్కరణ

లక్డీకాపూల్: భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ(జీఎస్ఐ) 175 సంవత్సరంలో అడుగుపెడుతోందని ఆ సంస్థ పీఆర్వో డాక్టర్ గంజి మల్లేష్ తెలిపారు. 1851లో స్థాపించిన ఈ సంస్థ ప్రపంచంలోనే రెండో అతి పురాతన, అతిపెద్ద భూ వైజ్ఞానిక సర్వే సంస్థ అని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా జియోసైంటిఫిక్ సర్వేలను నిర్వాహిస్తూ ఆ సమాచారాన్ని ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలకు అందుబాటులో ఉంచుతోందని తెలిపారు. దేశాభివృద్ధికి 175 సంవత్సరాల నుంచి జీఎస్ఐ చేస్తున్న సేవ గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుగా వాకింగ్ వల్ల కలిగే శారీరక, మానసిక శ్రేయస్సు గురించి తెలియచేసేందుకు నగరంలోని జీఎస్ఐ దక్షిణ క్షేత్రం, శిక్షా సంస్థ ప్రధాన కార్యాలయం సంయుక్తంగా ఆదివారం ట్యాంక్ బండ్ దగ్గర వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వాకింగ్ సంజీవయ్య చిల్డ్రన్స్ పార్క్ నుంచి నెక్లెస్ రోడ్ మీదుగా స్ఫూర్తి స్థల్ వరకు వెళ్లి, తిరిగి పార్కుకు చేరుకుంటుందన్నారు. జీఎస్ఐ దక్షిణ క్షేత్ర కార్యాలయం నిర్వహించిన పనుల మీద రాసిన సావనీర్‌ను ఆ సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్, దక్షిణ క్షేత్ర హెడ్ ఎస్డీ పాట్బాజే ఆవిష్కరిస్తారన్నారు.

బాధ్యతాయుత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలి

సాక్షి సిటీబ్యూరో: ఇంధన వినియోగంలో బాధ్యతగా ఉండేలా సమాజాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ పీఎస్ఎన్వీ ప్రసాద్ అన్నారు. ఇంధన సంరక్షణపై అవగాహన పెంచేందుకు నిర్వహించే వార్షిక సంరక్షణ సామర్థ్య మహోత్సవం శనివారం ముగిసింది. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛమైన, స్థిరమైన ఇంధన వినియోగ సంరక్షణ బాధ్యతను గుర్తు చేశారు. ఈ మేరకు పరిశ్రమలు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతలను గుర్తించాలి



సాక్షి, సిటీబ్యూరో: స్వీయ రక్షణకు అవసరమైన శక్తి యుక్తులతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తయారు కావాలని ఐపీఎస్ అధికారి సుమతి బాలికలు, యువతులకు పిలుపునిచ్చారు. మహిళా శక్తి గొప్పతనాన్ని, సమాజంపై దాని ప్రభావాన్ని విశ్లేషిస్తూ రామకృష్ణ శారద మిషన్ ఆధ్వర్యంలో శనివారం శారద మహిళా కాన్ఫరెన్స్ జరిగింది. నగర శివార్లలోని కన్హ శాంతి వనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆలోచనల్లో స్పష్టత, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమని అన్నారు. ఈ సదస్సుకు జంట నగరాల్లోని దాదాపు 30పైగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన వందలాది బాలికలు, యువతులు హాజరయ్యారు.

వైఎంసీఏ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం తగదు



మాట్లాడుతున్న రాజీవ్ సాగర్

పంజగుట్ట: నిరుపేదలకు సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే యంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) వ్యవహారాల్లో రాజకీయ జోక్యం తగదని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు సాల్మన్ రాజు, వైఎంసీఏ సభ్యులు రాజీవ్‌సాగర్, మోజెస్, రాజేష్ మాట్లాడుతూ 1916లో ఏర్పడ్డ వైఎంసీఏ పేదలకు సేవ చేయడంతో పాటు, యువతకు క్రీడల్లో ప్రావీణ్యం పెంచేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇందులో సుమారు 2 లక్షల మంది వరకు సభ్యత్వం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు వైఎంసీఏను మరింత అభివృద్ధి చేసేందుకు ఎన్నో మంచి పనులు చేస్తున్నారని, ఆయనను అడ్డుకునేందుకు కొంతమంది సభ్యత్వం లేనివారు రాజకీయరంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎంసీఏకి పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్రిస్టఫర్, డేవిడ్ రాజు, రేకల భద్రాద్రి, సౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో మార్పులపై 'హోమ్' అవగాహన



హోమ్-2025 సదస్సులో ప్రసంగిస్తున్న పీఎల్ శ్రీనివాస్

సుల్తాన్‌బజార్: వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హోమ్ సదస్సులు ఉపకరిస్తాయని హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్ (హోమ్)–2025 ఛైర్మన్ డాక్టర్ పీఎల్ శ్రీనివాస్ అన్నారు. ఉస్మానియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో శనివారం కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలో 23వ వార్షిక హోమ్ సదస్సును ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వీఎస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సులభ పద్ధతుల్లో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. యువ వైద్యులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉస్మానియా ఆర్థోపెడిక్ విభాగం ఈ హోమ్ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం బెంగళూర్‌కు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ మల్లికార్జున స్వామి, చెన్నైకి చెందిన డాక్టర్ గోపీనాథ్ మీనన్, మంగళూరుకు చెందిన డాక్టర్ సీతారామారావు, వైజాగ్‌కు చెందిన డాక్టర్ ఉదయ్‌కుమార్‌లు ఆర్థోపెడిక్ రంగంలోని మార్పులకు అనుగుణంగా జరిగే చికిత్సలు, శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదస్సు వైస్ చైర్మన్ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రామ్‌కిషన్‌తోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

108 మంది మహిళా వ్యాపారులకు 'శక్తి' అవార్డులు



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శక్తి అవార్డులు పొందిన మహిళా వ్యాపారవేత్తలు

రాయదుర్గం: పారిశ్రామిక వేత్తలుగా, స్టార్టప్‌ల నిర్వాహకులుగా ఎదిగిన 108 మంది మహిళా వ్యాపారులకు శక్తి అవార్డులను ప్రదానం చేశారు. ఈ మేరకు మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఓడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగిన సదస్సు శనివారం ముగిసింది. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంచు గ్లోరీ స్వరూప, సీఓడబ్ల్యూఈ జాతీయ అధ్యక్షురాలు లలితా ఆలూరి, సీఓడబ్ల్యూఈ వ్యవస్థాపక డైరెక్టర్ సుమన్ కుమార్, ఫౌండేషన్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ వ్యవస్థాపకురాలు కరుణాగోపాల్, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఓ డాక్టర్ రవీంద్రకుమార్‌సింగ్, యూఎన్‌సీసీ(స్పెయిన్) మాజీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ ఓవైస్ సర్మద్, నవరత్నం ఈకో ప్రొడక్ట్స్ సహ వ్యవస్థాపకురాలు గీతా వంగరి పాల్గొన్నారు.

షియా ముస్లింలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఇదాయత్ అలీ మీర్జా

పంజగుట్ట: రాష్ట్రంలో 12 లక్షల జనాభా ఉన్న షియా ముస్లింలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ డిమాండ్ చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఇదాయత్ అలీ మీర్జా, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీ హైదర్, ఉపాధ్యక్షుడు అబిద్ హుస్సేన్ మాట్లాడుతూ షియా సామాజిక వర్గం నుంచి ఇప్పటివరకు ఎలాంటి రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. షియా ముస్లింలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్లతో ఒకవర్గం వారే లబ్ధి పొందుతున్నారని, ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం షియాలకోం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని, విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని, హుస్సేనీ భవన్ నిర్మించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు హజ్జిర్ అలీ, సయ్యద్ అక్బర్ హైదర్, నగర అధ్యక్షుడు మీర్ హసన్, నగర ఉపాధ్యక్షుడు మహ్మద్ అలీ రజ్వీ, సయ్యద్ అహ్మద్ హుస్సేన్, సయ్యద్ హైదర్ నవీన్ పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాడాలి

చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైతన్య మహిళా సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: హక్కులు, సమానత్వం, సాధికారత కోసం మహిళలు పోరాడాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.జ్యోతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 8న ఆనాటి ఉద్యమకారుల స్ఫూర్తితో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా మణిపూర్, ఛత్తీస్‌గఢ్, లడక్‌లో మహిళలు పోరాటం చేస్తున్నారని, కేంద్ర బలగాల లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా లైంగిక నేరాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో తెలంగాణలో 72వ ప్రపంచ సుందరి అందాల పోటీలు ప్రారంభమవుతున్నాయని, వీటిని అడ్డుకుంటామని చెప్పారు. మార్చి 8న అంతర్జాతీయ స్థానిక మహిళా పోరాటం దినం వర్ధిల్లాలంటూ వికారాబాద్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం సిటీ కన్వీనర్ సత్య, నేతలు విజయ, సావిత్రి, అలివేలు, భాగ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, ఆదివారం, 2, మార్చి, 2025





సైకిల్ సవారీ..

విదేశీ వీధుల్లోనూ రైడ్స్

- నగరవాసుల్లో విస్తరిస్తున్న హాబీ
- తాజాగా ముగిసిన థాయ్‌లాండ్ రైడ్
- త్వరలోనే స్పెయిన్‌లోనూ రైడ్‌కు సన్నాహాలు
- వారాంతాల్లో గ్రూపులుగా సైక్లింగ్
- ఆరోగ్యం, పర్యావరణంపై పెరుగుతున్న అవగాహన

వ్యాయామాల అన్నింటిలోనూ అత్యుత్తమమైనది సైకిలింగ్. ఆరోగ్యానికీ ఇది ఎంతో మంచిది. ఓ వైపు ఆరోగ్యం.. మరోవైపు పర్యావరణ కాలుష్యం పట్ల పెరుగుతున్న అవగాహన వెరసి నగర వాసుల్లో సైక్లింగ్ పట్ల ఆసక్తి పెరుగుతోంది. దీనికి తోడు వారాంతాల్లో గ్రూపులుగా మారి సైకిలింగ్ చేయడం ప్రస్తుతం హాబీగా మారింది. ఈ అలవాటు క్రమంగా విస్తరిస్తోంది. దీంతో విభిన్న రకాల సంస్థలు సైక్లిస్టుల కోసం రైడ్స్ నిర్వహిస్తుండడంతో నగరవాసులు భాగ్యనగర వీధుల నుంచి విదేశీ విహారాల వరకూ రైయ్ రైయ్ మంటూ సైకిల్‌పై సవారీ చేస్తున్నారు.. - సాక్షి, సిటీబ్యూరో



ఎడా పెడా దూసుకొచ్చే బైక్స్, కార్స్, ఆటోల మధ్య తాదూరే సందు.. లేదు మెడకో డోలు అన్నట్టు ఉంది..భాగ్యనగరంలో సైకిల్ సవారీ. సరదా ఉంది కదా అని కిలోమీటర్ల కొద్దీ సైకిల్ తొక్కాలంటే ప్రత్యేక ట్రాక్స్ వెతుక్కోవాల్సిందే తప్ప.. నగర రోడ్లపై పరిస్థితులు మాత్రం అనుకూలంగా లేవనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. నగరంలో సైకిల్ ట్రాక్స్ ఉన్నప్పటికీ అవి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావడంతో సైక్లిస్ట్స్ రైడింగ్ కోసం ప్రత్యేక మార్గాలను అన్వేషించక తప్పడం లేదు. ఈ క్రమంలోనే సైకిల్‌పై లాంగ్ జర్నీ చేయాలనుకునే నగరవాసుల కోసం విభిన్న రకాల రైడ్స్ అందుబాటులోకి వచ్చేశాయి.

నైట్.. రైట్..

ట్రాఫిక్ రద్దీ తక్కువ ఉంటుంది కాబట్టి వారాంతపు సెలవు దినాలను ఎంచుకుంటున్నారు ఎక్కువ మంది సైక్లిస్టులు. తమ హాబీని ఎంజాయ్ చేయడం కోసం.. మరింత సౌకర్యంగా వీధుల్లో విహరించాలని రాత్రి సమయాల్లో జాయ్ రైడ్స్‌కి జై కొడుతున్నారు. 'పగలు ట్రాఫిక్ రద్దీతో పాటు పొల్యూషన్ కూడా ఎక్కువ. అందుకే వీలైనంత వరకూ రాత్రిపూట సైక్లింగ్ చేస్తా' అని చెప్పారు ఐటీ ఉద్యోగి సౌరభ్. సాధారణంగా ఈ నైట్ రైడ్స్ రాత్రి 7గంటల ప్రాంతంలో మొదలై పరిస్థితులు, పాల్గొన్నవారి ఆసక్తిని బట్టి.. 10 నుంచి 12గంటల వరకూ కొనసాగుతున్నాయి. శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో రైడ్స్ ఏర్పాటు చేస్తున్నామని ప్రసిద్ధ క్రీడా పరికరాల ఉత్పత్తి కంపెనీ డెకథ్లాన్ ప్రతినిధి చరణ్ తెలిపారు.



సుదూర ప్రాంతాలకూ రెడీ..

సైక్లింగ్‌పై ఉన్న ఇష్టం నగరవాసులను దూరాభారం లెక్కజేయనీయడం లేదు. నగరం నుంచి విభిన్న ప్రాంతాలకు లాంగ్‌రైడ్స్‌కూ వెనుకాడడం లేదు. ఈ విషయంలో బైకర్ క్లబ్స్‌తో వీరు పోటీపడుతున్నారని చెప్పొచ్చు. 'కనీసం 100 నుంచి 250 కి.మీ వరకూ దూరంలో ఉండే గమ్యాలను చేరుకోడానికి నగరంలోని సైక్లిస్టులు ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే తరచూ లాంగ్ రైడ్స్ ఏర్పాటు చేస్తున్నాం' అని బైక్ అఫైర్స్ నిర్వాహకులు వివరించారు.

విదేశాల్లోనూ.. రయ్ రయ్..

నగరం నుంచి విదేశాలకు వెళ్లి అక్కడి రోడ్స్‌పై రైడ్స్ చేయాలనుకునే ఆసక్తి కలిగిన నగరవాసుల కోసం అక్కడ సైక్లింగ్ ఈవెంట్స్ నిర్వహించే సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. 'మల్టీ డే బైస్కిల్ రైడ్స్ పేరిట విదేశాల్లో సైక్లింగ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నాం. నార్తర్న్ థాయ్‌లాండ్‌లో గత ఫిబ్రవరిలో ఒక రైడ్ నిర్వహించాం. పలువురు సిటిజనులు అందులో పాల్గొన్నారు. త్వరలో స్పెయిన్‌లోనూ ఈ తరహా రైడ్ నిర్వహించనున్నాం' అని చెప్పారు బార్నోల్ అడ్వెంచర్స్ సంస్థ నిర్వాహకులు.



బ్రేక్‌ఫాస్ట్ రైడ్స్ షురూ..

నగరంలో ట్రాఫిక్ రద్దీ తక్కువ ఉండే ఉదయపు వేళల్లో బ్రేక్ ఫాస్ట్ రైడ్స్ షురూ అయ్యాయి. తెల్లవారుజామున మొదలై ఉదయం 8–9 గంటల లోపు ముగిసిపోయే ఈ తరహా రైడ్ పూర్తయిన అనంతరం ఏదైనా ప్రత్యేక రెస్టారెంట్ లేదా దాబాల్లో బ్రేక్‌ఫాస్ట్ చేస్తారు. 'ఒకప్పుడు జిమ్‌లో కార్డియో వ్యాయామంలో భాగంగా ఎక్కువ సైకిల్ తొక్కేదానిని. అయితే దాని వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చాయి. వైద్యుల సూచన మేరకు రోడ్స్ మీద సైక్లింగ్‌ను ఎంచుకున్నా' అని సైక్లిస్ట్ నీలిమారాణి చెప్పారు.

పెడలింగ్.. ఈవెంట్స్..

నగరవాసుల్లో నైట్‌రైడ్స్ పట్ల పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా డెకథ్లాన్, బైక్ అఫైర్స్ తదితర సంస్థలు ప్రత్యేక సైక్లింగ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నాయి. వాహనం ఉండి, సైక్లింగ్‌పై ఆసక్తి ప్రధాన అర్హతగా, వ్యక్తిగతంగా లేదా బృందాలుగా కూడా పాల్గొనేందుకు వీటిని నిర్వహిస్తున్నవారు సైక్లిస్టులకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ తరహా రైడ్స్‌లో భాగంగా సైక్లిస్టులకు కొత్త కొత్త సైకిళ్ల గురించిన సమాచారం, వాహన నిర్వహణపై అవగాహన, ఆరోగ్యకరమైన అభిరుచిగా తీర్చిదిద్దుకోవడంపై మెళకువలు అందిస్తున్నారు. చిన్న చిన్న రైడ్స్ కోసం కెబీఆర్ పార్క్, నెక్లెస్ రోడ్ ఎంచుకునే వీరు.. రైడ్ ఈవెంట్స్‌కి శంకర్‌పల్లి నుంచి కోకాపేట్ టూ శంకర్‌పల్లి టౌన్, శంకర్ పల్లి నుంచి కంది రోడ్, మేడ్చల్ రోడ్/నాగ్‌పూర్ హైవే వంటివి ఎంచుకుంటున్నారు.


బిగినర్స్.. సిగ్నేచర్..

ఆలోచనలు, ఆసక్తికి అనుగుణంగా విభిన్న రకాల ఈవెంట్ మేనేజర్స్ రైడ్స్ డిజైన్ చేస్తున్నారు. ప్రారంభకుల కోసం 15 నుంచి 20 కి.మీ వేగం పరిమితితో బిగినర్స్ రైడ్ నిర్వహిస్తున్నారు. ఈ తరహా రైడ్స్ కోసం 25 నుంచి 30 కి.మీ దూరాన్ని ఎంచుకుంటున్నారు. ఇటు ప్రారంభకులు అటు అలవాటైన వారు కాకుండా మధ్యస్థంగా ఉండే వారికి సిగ్నేచర్ రైడ్ నిర్వహిస్తారు. దీని కోసం సుమారు 70 కి.మీ దూరాన్ని నిర్ణయిస్తున్నారు. కనీసం 25 నుంచి 30 కి.మీ వేగంతో 80 నుంచి 100 కి.మీ దూరం ప్రయాణం చేసే రైడ్స్‌ని ఫాస్ట్ రైడ్స్‌గా పేర్కొంటున్నారు. ఇవి నైపుణ్యం కలిగిన వారికి ఏర్పాటు చేస్తున్నారు.

చేనేతను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి



బంజారాహిల్స్: చేనేత కళాకారులను, చేనేత ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటీఫుల్ వ్యవస్థాపకురాలు కిరణ్మయి అలివేలు అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాల్లో శనివారం ఏర్పాటైన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ప్రదర్శనలో కొలువుదీరిన చేనేత వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కళాకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత వంటి అంశాలను తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని ఆమె అన్నారు. ఈ నెల 5వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



నేడు పోటరీ వర్క్‌షాప్స్

సాక్షి, సిటీ బ్యూరో: మట్టిపాత్రల తయారీపై గచ్చిబౌలి హార్ట్ కప్ కాఫీ ఆధ్వర్యంలోనూ, హౌస్ ఆఫ్ గవర్నమెంట్‌లోనూ, ఐరన్ హిల్ మాదాపూర్‌లోనూ నేడు వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నారు. మట్టితో పనిచేయడం, పాత్రలు వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నారు. కుండల తయారీలో చేతి వృత్తుల వారి కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు ఆయా ప్రాంతాల్లో నిర్వహించే వర్క్‌షాపులను సందర్శించవచ్చు.

8న క్యాండిల్ లైట్ కాన్సర్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంగీత ప్రియులకు నూతన అనుభూతినిచ్చే క్యాండిల్ లైట్ కాన్సర్ట్ మరోమారు సిద్ధమవుతోంది. 8న సాయంత్రం బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ వేదికగా ఈ కాన్సర్ట్ నిర్వహిస్తున్నారు. సూర్యాస్తమయం వేళ కొవ్వొత్తుల వెలుతురులో మనసుకు వినసొంపైన సౌండ్ ట్రాక్స్ ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం లభిస్తుంది. ఇటీవల నగరంలో కొవ్వొత్తుల కచేరీలకు ఆదరణ పెరుగుతోంది. గతంలో నిర్వహించిన క్యాండిల్ లైట్ కాన్సర్ట్‌లు విజయవంతమయ్యాయి. దీంతో మహిళా దినోత్సవం రోజున మరోమారు నగరంలో కొవ్వొత్తుల వెలుతురులో సౌండ్ ట్రాక్స్ అలరించనున్నాయి.



ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్ వాకర్ మ్యూజిక్

నగరంలో ప్రదర్శనకు ఎలన్ వాకర్ సిద్ధం

ఏప్రిల్ 18న హైదరాబాద్‌లో అతిపెద్ద డీజే ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో అత్యద్భుతమైన డీజే, రికార్డ్ ప్రొడ్యూసింగ్‌తో ఉర్రూతలూగించే ఎలన్ వాకర్ నగరంలో సందడి చేయనున్నారు. ఎలక్ట్రానిక్ మ్యూజిక్ పవర్‌హౌస్‌గా గుర్తింపు పొందిన వాకర్.. వరల్డ్ ఇండియా టూర్‌లో భాగంగా ఏప్రిల్ 18న హైదరాబాద్‌లో తన ప్రదర్శన ఇవ్వనున్నాడు. గతేడాది ఇండియా టూర్‌లో భాగంగా హైదరాబాద్‌తో పాటు విభిన్న నగరాల్లో దాదాపు లక్షా అరవై వేల మందికి పైగా ఎలక్ట్రిక్ మ్యూజిక్‌తో అలరించి రికార్డు సృష్టించారు. ఈ సారి హైదరాబాద్‌తో పాటు గౌహటి, భువనేశ్వర్, జైపూర్‌లో తన ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు స్పేస్ బౌండ్ నిర్వాహకులు తెలిపారు. వాకర్ కేవలం ఆరు నెలల్లో 12కు పైగా నగరాల్లో ప్రదర్శన ఇవ్వనున్నాడని, ఇప్పటి వరకూ ఏ అంతర్జాతీయ కళాకారుడూ ఈ ఘనత సాధించలేదని స్పేస్ బౌండ్ సీఈఓ కరణ్ సింగ్ పేర్కొన్నారు. దీని టికెట్లు బుక్ మై షోలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





విజ్ఞాన వీక్షణం..

- సైనిక ఆయుధాల వద్ద సందడి
- వేల సంఖ్యలో ఎగ్జిబిషన్ సందర్శన
- మరపురాని జ్ఞాపకం అంటున్న విద్యార్థులు

గచ్చిబౌలి: నగరంలో ఏ విద్యార్థిని కదిలించినా చెప్పేది విజ్ఞాన్ వైభవ్ గురించే. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో రక్షణ రంగంలోని అరుదైన యంత్రాలు, క్షిపణులు, యుద్ధ ట్యాంకర్లు, మిసైల్స్, విడిభాగాల ప్రదర్శన ఇటు ఇంజినీరింగ్, అటు స్కూల్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గచ్చిబౌలి స్టేడియంలో విజ్ఞాన్ వైభవ్–2025కు అపూర్వ స్పందన లభిస్తోంది. నగరం నలుమూలల నుంచి దాదాపు 200 బస్సుల్లో విద్యార్థులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. డీఆర్‌డీఓ ప్రతినిధులు మిసైల్స్, ఇతర ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు.

రీసెర్చ్ పై ఆసక్తి పెరిగింది..



ఎరోనాటికల్ ఇంజినీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లోనూ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. త్రివిధ దళాలకు చెందిన ఆయుధాలు, విడి పరికరాలు చూసిన తరువాత రీసెర్చ్ చేస్తే బాగుండు అనిపించింది.

– అర్షిత, సీఎస్‌ఈ, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్

లైవ్‌లో మిసైల్స్ చూశాను..



ఎగ్జిబిషన్ అంటే ఏదో టైంపాస్‌గా ఉంటుందని వచ్చాను. కానీ ఇక్కడ పుస్తకాల్లో కనిపించని ఎన్నో విషయాలు, మిసైల్స్ గురించి తెలుసుకున్నా. మిసైల్స్ లైవ్‌లో చూడటంతో ఎంతో సంతోషాన్నిచ్చింది.

– సంహిత, 10వ తరగతి, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్

రక్షణ రంగంలో అవకాశాలెన్నో..



రక్షణ రంగం గురించి పెద్దగా అవగాహన లేదు. స్టాల్స్‌లో మిసైల్స్‌పై ఎన్నో వివరాలు అందించారు. చాలా విషయాలపై స్పష్టత వచ్చింది. రక్షణ రంగానికి సంబంధించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. పిల్లలు అడిగితే ఇప్పుడు కొంతైనా చెప్పగలుగుతాననే నమ్మకం ఏర్పడింది. ఇలాంటి ఎగ్జిబిషన్‌లు తరచూ నిర్వహించాలి.

– విజేత, టీచర్, సంతోష్ రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్

అబ్బురపరిచే స్వదేశీ పరిజ్ఞానం..



రక్షణ రంగంలో నూతన టెక్నాలజీ తెలుసుకున్నా. విద్యార్థులకు, ఉద్యోగార్థులకు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ఉపయోగపడే అంశాలు ఎన్నో ఉన్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అరుదైన మిసైల్స్ నేటి తరానికి స్ఫూర్తినిస్తాయి. యువత పుస్తకాలకే పరిమితం కాకుండా పరిశోధనలపై దృష్టి పెట్టాలి.

– వంశి, పీజీ విద్యార్థి, హెచ్‌సీయూ

నెస్ట్..

ఆర్కిటెక్చర్‌లో బెస్ట్..

- అబ్బురపరుస్తున్న పక్షుల అల్లికలు
- హెచ్‌సీయూలో భారీ సంఖ్యలో దర్శనం
- నేటి తరానికి ఆశ్చర్యం కలిగిస్తున్న నిర్మాణాలు









గూడు.. మనుషుల నుంచి జంతువులు, పక్షుల వరకూ ఎంతో అవసరం. అయితే ఒక్కో జీవిది ఒక్కో తరహా నిర్మాణ శైలి. ఆయా జీవుల అవసరాలను తీర్చేదిగా నిర్మాణం ఉంటుంది. వీటిల్లో మరీ ముఖ్యంగా చెప్పుకోదగిన నిర్మాణ శైలి పక్షులదే.. వాటి నిర్మాణాలు పెద్ద పెద్ద ఆర్కిటెక్చర్లను సైతం ఆశ్చర్యపరిచేవిగా ఉంటాయి. అయితే నగరీకరణలో భాగంగా పక్షుల జాడలు, వాటి గూళ్ల సంఖ్య రాను రాను కనుమరుగవుతున్నాయి. నగర శివార్లు, పల్లెటూళ్లు, అడవులకే పరిమితమైన వీటి గూళ్లు నగరంలోని హెచ్‌సీయూలో సందర్శకులను అబ్బురపరుస్తున్నాయి. నగరంలో నివసించే నేటి తరం యువతకు పక్షులను జూ లోనో, పార్కుల్లో సందర్శించి ఆనందించడం అలవాటు. ఇక వాటి గూళ్ల సంగతి, వాటి నిర్మాణ శైలి చాలా మందికి తెలియకపోవచ్చు. అలాంటి పక్షుల గూళ్లు పదుల సంఖ్యలో హెచ్‌సీయూ కేంద్రంగా కనిపిస్తుండడంతో ఆశ్చర్యానికి గురవుతున్నారు. అనేక రకాల పక్షి జాతులకు ఆవాసంగా మారిన గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పక్షి గూళ్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఈ క్యాంపస్‌లో దాదాపు 233 రకాల పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో వాటి గూళ్లను విద్యార్థులు తమ ఫోన్లు, కెమెరాల్లో బంధిస్తున్నారు. క్యాంపస్‌లో వృక్ష సంపద పరిరక్షణే పక్షుల సంఖ్య పెరుగుదలకు కారణమని విద్యార్థులు, పలువురు సందర్శకులు అభిప్రాయపడుతున్నారు.

– రాయదుర్గం





క్లుప్తంగా...

సమాజంలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సమాజంలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ మీడియా అకాడమీలో సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా)పై నిర్వహించిన శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 60 మంది సోషల్ మీడియా జర్నలిస్టులు ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యారు. ప్రముఖ మీడియా నిపుణులు మాడభూషి శ్రీధర్.. సమాచారహక్కు చట్టం ఉపయోగాలను వివరించారు. సీనియర్ జర్నలిస్టు, ఎడిటర్ కె.శ్రీనివాస్.. భాష-దోషాలు అనే అంశంపై ప్రసంగించారు. ఉడుముల సుధాకర్‌రెడ్డి.. డిజిటల్ మీడియాలో వాస్తవాలు-ధ్రువీకరణ అనే అంశంపై ప్రసంగిస్తూ డిజిటల్ టూల్స్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సీనియర్ జర్నలిస్టు గోవిందరెడ్డి.. నేర వార్తలు అనే అంశంపై బోధించారు. ముగింపు కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి సామాజిక పద్ధతులు, వ్యవసాయ, ఆర్థిక, భూములు, నదులు, అటవీ ఉత్పత్తులు మొదలగు అంశాలను విశ్లేషిస్తూ సమగ్రంగా వివరించారు. శ్రీనివాస్ రెడ్డి.. జర్నలిజం-చట్టాలు-వృత్తి ప్రమాణాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం కన్వీనర్ కరుణాకర్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌కు నిరసనగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- సీపీఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పట్ల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. యూపీఎస్‌కు నిరసనగా ఆదివారం ఇందిరాపార్క్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత జనవరి 24న యూనిఫైడ్ పెన్షన్స్ స్కీమ్‌ను ఆమోదిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు. దీనికనుగుణంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు యూపీఎస్ విధానాన్ని అమలు చేసేందుకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలకు తెరలేపిందని పేర్కొన్నారు.

ఈఏపీ సెట్‌కు తొలిరోజు 5,010 దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఈఏపీ సెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ శనివారం మొదలైంది. తొలి రోజు 5,010 దరఖాస్తులు వచ్చినట్టు సెట్ కోకన్వీనర్, జేఎన్టీయూహెచ్ రెక్టార్ కె.విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 3,116, అగ్రికల్చర్, ఫార్మసీ సెట్ విభాగానికి 1,891, రెండు విభాగాలకు రాసేవారి 3 దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించారు.

ఓయూలో ముగిసిన పీహెచ్‌డీ దరఖాస్తుల స్వీకరణ

456 సీట్లకు 9,000 మంది అభ్యర్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్-2025 దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారం ముగిసింది. కేవలం 456 సీట్లకు 9,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.2,000 అపరాధ రుసుముతో ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్ల సంఖ్యను పెంచి.. నెలరోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించాలని తెలంగాణ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.విజయ్ నాయక్ శనివారం పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాగా, ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయోపరిమితి 65 ఏళ్లకు పెరిగినా.. పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచేందుకు ఓయూ అధికారులు సుముఖంగా లేనట్లు కనిపిస్తోంది.



అన్నీ తెలుసుకోవడమే సరైన 'పని'..

ఎవరినైనా పనిలో పెట్టుకునేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవాలి

ఇటీవలి ఘటనల నేపథ్యంలో పోలీసుల సూచనలు

ఆధార్, ఓటర్ కార్డుల జిరాక్స్‌లు, ఫొటో తీసుకోవాలి

వివరాలన్నీ పోలీసులతో వెరిఫికేషన్ చేయించాలి

ప్రజా భద్రత కోసం తాము సిద్ధమంటున్న సీపీ సీవీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: ఉరుకులు పరుగుల జీవితాలు..దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తే కానీ..ఆర్థిక అవసరాలు తీరని కాలమిది. తీరికగా ఇంటిపట్టు ఉండి పనులు చేసుకోలేని ఎన్నో జంటలు పనిమనుషుల మీద ఆధారపడుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పెరిగే కొద్దీ ఇళ్లలో పనిచేసే వారికి డిమాండ్ పెరిగింది. అదేవిధంగా రిటైర్ అయి..పిల్లలు విదేశాల్లో ఉండే వృద్ధ దంపతుల ఇళ్లలోనూ పనిమనుషులే కీలకంగా ఉంటున్నారు. ఇలా ఇళ్లలో పనిచేస్తున్న వారిలో ఎంతోమంది నిజాయితీగానే ఉంటున్నా..కొందరు చోరీలకు, తీవ్ర నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కల్గిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ పోలీసులు నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యాపారి ఇంట్లో పనిమనుషులు కొల్లగొట్టిన రూ.5 కోట్ల విలువైన సొత్తును రికవరీ చేశారు. యజమాని తన కుమార్తె పెళ్లి పనుల్లో ఉండగా చోరీ చేసి పరారయ్యారు. ఇలాంటి కేసులు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. పనిమనుషుల పూర్తి వివరాలు తెలుసుకోకుండా, వారి నేర చరిత్రను గుర్తించకుండా పనిలో పెట్టుకోవడం అనర్థాలకు దారితీస్తోందని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి నేరాలకు ఎప్పటికీ అవకాశం ఉంటుందని, పనిమనిషి, వాచ్‌మన్, తోటమాలి, డ్రైవర్ ఇలా ఎవరిని పనిలో పెట్టుకుంటున్నా..వారి గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు. ఈ మేరకు సేవలందించేందుకు సిద్ధమని స్పష్టం చేస్తున్నారు.

ఏం చేయాలి..

- ఇంట్లో పనికి కుదుర్చుకునే వ్యక్తి ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్‌ల జిరాక్స్‌లు, ఫోన్ నంబర్, వీలుంటే వారి కలర్ ఫొటో తీసుకోవాలి. ఏ రాష్ట్రం, ఏ ప్రాంతం వారనే పూర్తి వివరాలు తెలుసుకోవాలి.
- వారి ప్రస్తుత చిరునామా..శాశ్వత చిరునామా తప్పకుండా తీసుకోవాలి.
- ఈ వివరాలన్నీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇస్తే..వారు ఆ వివరాలను తనిఖీ చేసి సదరు వ్యక్తికి నేర చరిత్ర ఉందా..? లేదా..? అన్నది నిర్ధారిస్తారు.
- నిజాయితీపరులైన పనిమనుషులకు ఇది ఒకింత ఇబ్బందే. ఈ వివరాల సేకరణ సాధారణ ప్రక్రియలో భాగంగానే అన్నట్టుగా వారికి చెప్పాలి.
- సదరు పనిమనిషి గురించి మనకు ఎవరు చెప్పారో.. వాళ్లకు సంబంధించిన యజమానుల నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి.
- ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారి విషయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం.
- వృద్ధులు మాత్రమే ఉండే పక్షంలో స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే..పెట్రోలింగ్ డ్యూటీలో భాగంగా వారు వచ్చి చూసే అవకాశం ఉంటుంది.

ఏం చేయకూడదు..

- ఇంట్లో పనిమనుషులు, ఇతర సహాయకులకు అవసరానికి మించి చనువు ఇవ్వొద్దు. అతి నమ్మకం పెట్టుకోవద్దు.
- ఇంటి పనివాళ్ల ముందు ఆర్థిక విషయాలను ఎప్పుడూ చర్చించవద్దు.
- మీ విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచొద్దు. బ్యాంకులోని లాకర్లలో ఉంచడం ఉత్తమం.
- పని మనుషుల బంధువులు లేదా స్నేహితులను మీ ఇంటిని సందర్శించడానికి అనుమతించొద్దు.
- మీ ఇంట్లో పనివాళ్ల కోసం తెలిసిన వారు..వారి రాష్ట్రం, గ్రామం వారు అంటూ ఇతరులు ఎవరైనా ఎక్కువగా వస్తుంటే పూర్తి వివరాలు తెలుసుకోవాలి.

మాకు శ్రమైనా..మీ భద్రత కోసం సిద్ధం



ఇళ్లలో పని మనుషులను, ఇతర ఉద్యోగస్తులను పెట్టుకునే ముందు వారి వివరాలను స్థానిక పోలీసులకు అందజేస్తే..మేం ఆ వ్యక్తులకు ఏమైనా నేరాలతో సంబంధం ఉందా..? గతంలో నేర చరిత్ర ఉందా..? అన్న విషయాలను దేశ వ్యాప్తంగా ఉండే క్రిమినల్ డేటాబేస్‌లో తనిఖీ చేసి మీకు తెలియజేస్తాం. ఇది ఎంతో శ్రమతో కూడిన పని అయినా..ప్రజాభద్రత కోసం మేం ఇందుకు సిద్ధంగా ఉన్నాం.

– సీవీ ఆనంద్, పోలీస్ కమిషనర్ హైదరాబాద్

అలా చేస్తే భవిష్యత్తులో ఇబ్బంది ఉండదు



ఇళ్లలో పని మనుషులను, డ్రైవర్లు, ఇతర సహాయకులను పనిలో పెట్టుకోవడానికి ముందే వారి వివరాలు తెలుసుకోవాలని, తనిఖీ చేయించాలని పోలీసులు చేస్తున్న సూచన ఎంతో విలువైంది. ఇలా చేయడం వల్ల నేరస్తులను, నేర చరిత్ర ఉన్న వాళ్లను ముందే గుర్తించవచ్చు. భవిష్యత్తులో దొంగతనాలు, ఇతర ప్రమాదాలు తప్పుతాయి. మా గేటెడ్ కమ్యూనిటీలోనూ అందరికీ ఇది సూచిస్తున్నాం.

– శ్రీనివాసరావు వనిగండ్ల, సి-బ్లాక్ ప్రెసిడెంట్, సహ భావన టౌన్‌షిప్, నాగోల్

రాజ్యాంగ హక్కులపై దాడిని ఖండిద్దాం

పాలకులు మతాన్ని ఆయుధంగా మార్చేశారు

- ప్రభుత్వాలను ప్రశ్నిస్తే జైళ్లలో వేస్తున్నారు
- భౌతికంగా కంటే సోషల్ మీడియా ద్వారానే అధిక హింస
- ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవద్దు
- ఎన్‌ఏపీఎం రెండో ప్లీనరీ ప్రారంభ కార్యక్రమంలో వక్తలు
- 4వ తేదీ వరకు కొనసాగనున్న సమావేశాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రశాంత్ భూషణ్. చిత్రంలో అరుణా రాయ్, శాంతా సిన్హా, మేధా పాట్కర్, ఇర్ఫాన్ ఇంజనీర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై జరుగుతున్న దాడిని ప్రజలంతా ఖండించాలని నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ (ఎన్‌ఏపీఎం) రెండో ప్లీనరీలో వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఎన్నో హక్కులపై ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని జైళ్లపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, పౌరహక్కుల నేతలు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవద్దని సూచించారు. ఎన్‌ఏపీఎంను ప్రారంభించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన రెండో ప్లీనరీ సమావేశాలు శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యాయి. 4వ తేదీ వరకు జరగనున్న ఈ సమావేశాల్లో 24 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారు. ప్రజాస్వామ్య ఉద్యమాలపై ప్రభుత్వాల అణచివేత, ఆదివాసీల హక్కులపై దాడి తదితర అంశాలపై ప్లీనరీలో చర్చించనున్నారు. శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారిణి అరుణా రాయ్, న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, ఇర్ఫాన్ ఇంజనీర్, ప్రొఫెసర్ శాంతాసిన్హా, డీయా సరస్వతి, టీఎం కృష్ణ పలు అంశాలపై మాట్లాడారు.

ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవద్దు: అరుణారాయ్

ప్రభుత్వం నుంచి ఎంత ఒత్తిడి ఉన్నా ప్రశ్నించే తత్వాన్ని కోల్పోవద్దని అరుణా రాయ్ అన్నారు. భారతదేశం అంటే భిన్న సంస్కృతులు, భిన్న భాషల కలయిక అని.. ఆ భిన్నత్వాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పాలకులు ప్రజలను విడదీసేందుకు మతాన్ని ఆయుధంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. అది ఎంతో ప్రమాదమని హెచ్చరించారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులపై గ్రామ స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ శాంతా సిన్హా అన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్, వన్ రిలీజియన్ అన్న నినాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించవద్దని ఇర్ఫాన్ ఇంజనీర్ సూచించారు. ప్రస్తుత రాజకీయాలు దేశ ప్రజలపై మతం అనే కారుమబ్బులను కప్పుతున్నాయని, వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని టీఎం కృష్ణ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోపాటు సమాజంలోని మహిళలు, పిల్లలు, ట్రాన్స్‌జెండర్లు.. ఇలా అణచివేతకు గురవుతున్న ఎన్నో వర్గాల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని డీయా సరస్వతి అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆదివాసీల హక్కులను కాలరాస్తోందని, దేశ సహజ సంపదను బడా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తోందని సమావేశంలో పాల్గొన్న పలువురు ఆదివాసీ ఉద్యమ నేతలు ఆరోపించారు. అరుణా రాయ్ రచించిన 'ది పర్సనల్ ఈజ్ పొలిటికల్' పుస్తకాన్ని ప్రశాంత్ భూషణ్ తదితరులు ఆవిష్కరించారు.

సోషల్‌మీడియా ద్వారానే అధిక హింస: ప్రశాంత్ భూషణ్

దేశంలో వాక్ స్వాతంత్య్రంపై ఎక్కువ దాడి జరుగుతోందని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వాలను విమర్శిస్తే జైళ్లలో వేస్తున్నారని అన్నారు. స్వేచ్ఛగా మాట్లాడే వారిని సోషల్ మీడియా వేదికగా హింసించడం పెరిగిందని తెలిపారు. భౌతికంగా కంటే సోషల్ మీడియాలోనే ఇప్పుడు అతిపెద్ద హింస జరుగుతోందని చెప్పారు. సోషల్ మీడియాలో విద్వేష పూరిత పోస్టులు పెట్టేవారిని నియంత్రించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అధికార వికేంద్రీకరణ జరిగితేనే మార్పు సాధ్యమని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితి డబ్బుతో అధికారం సంపాదించటం.. అధికారంలోకి వచ్చాక మళ్లీ డబ్బు సంపాదన అన్నట్టుగా మారిందని అన్నారు. చర్చ జరగకుండానే కొత్త చట్టాలు రూపొందిస్తున్నారని, కొన్నిసార్లు ఒకే రోజులో పదుల సంఖ్యలో నూతన చట్టాలు రూపొందిస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థలకు స్వాతంత్య్రం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు ఐదంచెల 'చెక్‌లిస్ట్'

- 10 శాతం ప్లాట్ల ఈసీలు చెక్ చేయాల్సిందే
- లేఅవుట్ లేదా ప్లాట్ యజమాని డిక్లరేషన్ ఉంటేనే రిజిస్ట్రేషన్
- ఎల్ఆర్ఎస్ నంబర్, డబ్బు చెల్లింపు రసీదును పరిశీలించాకే తుది నిర్ణయం
- సబ్‌రిజిస్ట్రార్లకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: అనధికార లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా రిజిస్ట్రేషన్లు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్లందరికీ ఆ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ సర్క్యులర్ పంపారు. ఈ సర్క్యులర్ ప్రకారం ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఐదంచెల చెక్‌లిస్ట్‌ను పాటించాల్సి ఉంటుంది. ఈ చెక్‌లిస్ట్‌లోని అంశాలను లేఅవుట్ లేదా ప్లాట్ యజమాని ధ్రువీకరించాల్సి ఉంటుంది. ముందుగా ఆ లేఅవుట్‌లో 2020, ఆగస్టు 26 నాటికి 10 శాతం మేర ప్లాట్ల విక్రయాలు జరిగాయని నిర్ధారించుకునేందుకు గాను ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ల(ఈసీ)ను చెక్ చేయాలి. అదే విధంగా ప్రత్యేక ఫార్మాట్‌లో ఆ 10 శాతం ప్లాట్ల వివరాలను ఇవ్వాలి. 10 శాతం ప్లాట్లు అమ్మిన అనంతరం లేఅవుట్ ప్లాన్ చెక్ చేయాలి. వీటితో పాటు ప్లాట్ లేదా లేఅవుట్ యజమానికి డిక్లరేషన్ ఇవ్వాలి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు నంబర్‌తో పాటు ప్లాటు యజమాని ప్రభుత్వానికి చెల్లించిన మొత్తానికి రసీదును పరిశీలించిన అనంతరం రిజిస్ట్రేషన్ చేయాలా వద్దా అన్న దానిపై సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

లేఅవుట్ యజమానులు ఇవ్వాల్సిన ప్రత్యేక ఫార్మాట్‌లో పొందుపర్చాల్సిన వివరాలివే..

జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబర్, లేఅవుట్ విస్తీర్ణం, లేఅవుట్‌లోని మొత్తం ప్లాట్లు, క్రయ, విక్రయ లావాదేవీలు జరిగిన 10 శాతం ప్లాట్లకు సంబంధించి ప్లాట్ల నంబర్లు, రిజిస్టర్ డాక్యుమెంట్ నంబర్లు, సంవత్సరం, ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీ జరిగింది అనే వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది.

ఐఎఫ్‌ఎస్‌లలో చిచ్చురేపిన 'విదేశీ పర్యటన'!

పీసీసీఎఫ్‌తో సంబంధం లేకుండానే 8 మంది కెన్యాకు..

సాక్షి, హైదరాబాద్: ఓ 'విదేశీ పర్యటన' ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్లలో చిచ్చురేపింది. సీఎంవోలోని ఓ ఐఎఫ్‌ఎస్ అధికారితో పాటు అటవీశాఖకు చెందిన ఆరుగురు అధికారులు ఇటీవల కెన్యా, టాంజానియాలలో 8 రోజుల పర్యటనకు వెళ్లి వచ్చారు. ఈ రెండు దేశాల్లో ఎకో టూరిజం, అటవీ సంరక్షణ తదితర అంశాలపై అధ్యయనం చేసి వచ్చారు. ఈ పర్యటనను అటవీశాఖ మంత్రి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్)లతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఖరారు చేయగా, సీఎస్ దీనికి సంబంధించిన ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చును తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ భరించేలా ఉత్తర్వులిచ్చారు. అయితే... పీసీసీఎఫ్ ప్రమేయం లేకుండానే ఆయన కింద పనిచేసే ఆరుగురు ఐఎఫ్‌ఎస్ అధికారులు విదేశీ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశమైంది. అయితే కెన్యా, టాంజానియా ఫీల్డ్ విజిట్ కంటే కూడా ముందే ఆస్ట్రేలియా, సింగపూర్‌లలో పర్యాటకాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించి రావాలని రెండేళ్ల క్రితమే ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే అటవీశాఖపరంగా ఈ పర్యటనకు తగినంత చొరవ తీసుకోలేదని తెలుస్తోంది. దీంతో ఆ పర్యటనకంటే ముందు కెన్యా పర్యటనకు సంబంధించిన ఫైలు చకచకా కదిలిపోయింది. ఇదంతా పీసీసీఎఫ్ అనుమతి లేకుండానే జరగడం, అధికారులు సైతం ఆయనకు సమాచారం ఇవ్వకుండానే పర్యటనకు వెళ్లడం పట్ల ఆయన అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం.

అధికారులకు పీసీసీఎఫ్ మెమోలు..

తన అధికార పరిధిలో పనిచేస్తున్న ఐఎఫ్‌ఎస్ అధికారులకు పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ షోకాజ్ నోటీస్ తరహాలో మెమోలు పంపించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అధికారులు ఎవరికి వారుగా వ్యక్తిగతంగా, తమ వద్ద ఉన్న డాక్యుమెంటరీ ఆధారాలు, ఇతర సమాచారంతో ఈ నెల 10వ తేదీలోగా తనకు వివరాలు పంపించాలని సూచించినట్టు తెలుస్తోంది. తనకు తెలియకుండానే కెన్యా పర్యటనకు అధికారుల జాబితా సిద్ధం చేసి పంపించడంపై కేంద్ర ప్రభుత్వానికి, డీవోపీటీకి కూడా పీసీసీఎఫ్ ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్టుగా ఆయన సన్నిహిత అధికారుల ద్వారా తెలుస్తోంది.

ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షల కోట్లు

- గతేడాదితో పోలిస్తే 9.1% పెరుగుదల
- తెలంగాణలో 1శాతం వృద్ధితో రూ.5,280 కోట్లు
- ఏపీలో రూ.3,817 కోట్ల రాబడి

సాక్షి, న్యూఢిల్లీ: ఫిబ్రవరి నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షల కోట్లకు చేరుకున్నాయి. జీఎస్టీ వసూళ్లు గత నెల 9.1 శాతం పెరిగి రూ.1,83,646 కోట్లకు చేరాయి. గత నెల జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.35,204 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.43,704 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్టీ రూ.90,870 కోట్లు, సెస్ రూ.13,868 కోట్లు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరి నెలలో రూ.1.68 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. ఈ మేరకు శనివారం ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల గణాంకాలను కేంద్ర ఆర్థికశాఖ ఒక ప్రకటనలో విడుదల చేసింది. కాగా గతేడాదితో పోలిస్తే తెలంగాణలో 1 శాతం వృద్ధితో రూ.5,280 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 4 శాతం వృద్ధితో రూ.3,817 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు తెలంగాణకు ప్రీసెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.19,470 కోట్లు, పోస్ట్ సెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.40,340 కోట్లుగా ఉన్నాయి. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌కు ప్రీసెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.13,088 కోట్లు, పోస్ట్ సెటిల్మెంట్ ఎస్‌జీఎస్టీ రూ.30,286 కోట్లుగా ఉన్నాయి.

ఉత్తర 'రింగు'కు ఎన్‌పీజీ గ్రీన్‌సిగ్నల్

- కేంద్రంలోని ప్రధాన శాఖలతో కూడిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూపు భేటీలో పాస్
- హైవే మంత్రిత్వ శాఖ ఆమోదం తదుపరి కేంద్ర ఆర్థిక శాఖకు ఫైలు
- త్వరలోనే 'రీజనల్' ఉత్తర భాగానికి ఎక్స్‌ప్రెస్‌వే నంబర్..
- ఆ తర్వాత పరిహారం పంపిణీ, టెండర్ల ప్రక్రియ ముందుకు..

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగాన్ని పట్టాలెక్కించేందుకు మార్గం సుగమమైంది. దేశవ్యాప్తంగా చేపట్టే కీలక ప్రాజెక్టులపై చర్చించి వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం చూపే పీఎం గతిశక్తిలోని నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ) దీనికి పచ్చజెండా ఊపింది. కేంద్ర ప్రభుత్వంలోని ప్రధాన శాఖలతో కూడిన ఈ గ్రూప్ సమన్వయ బృందంగా పనిచేస్తుంది. సదరు ప్రాజెక్టు వల్ల ఇతర శాఖలు, వాటి పరిధిలోని ప్రాజెక్టులకు ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర కీలక ప్రాజెక్టులకు ఏర్పడే ఇబ్బందులపై ఎన్‌పీజీ చర్చించి.. ఎలాంటి అడ్డంకి లేదనుకుంటే ఆమోద ముద్ర వేస్తుంది. రూ.500 కోట్ల కంటే ఎక్కువ వ్యయమయ్యే ప్రాజెక్టులకు దీని ఆమోదం తప్పనిసరి. శనివారం ఢిల్లీలో జరిగిన ఎన్‌పీజీ భేటీలో 17 ప్రాజెక్టులపై చర్చించారు. అందులో రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగం కూడా ఉంది. ఈ ప్రాజెక్టుతో ఇతర ప్రాజెక్టులకు ఇబ్బంది లేదని తేల్చి, ఓకే చేసినట్టు తెలిసింది.

ఇకపై వేగంగా ప్రక్రియ..

రీజనల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి జనవరిలోనే కేంద్రం టెండర్లు పిలిచింది. ఫిబ్రవరి 14న టెండర్లు ఓపెన్ చేసి నిర్మాణ సంస్థను గుర్తించాల్సి ఉంది. కానీ రెండు సార్లు గడువు పొడిగించారు. రీజనల్ రింగు రోడ్డుకు ఇప్పటివరకు ఎక్స్‌ప్రెస్‌వే నంబర్ (హైవే నంబర్) కేటాయించకపోవటమే దీనికి కారణం. ఏదైనా జాతీయ రహదారి ప్రాజెక్టు చేపడుతున్నప్పుడు.. రోడ్డు నంబర్ కీలకం, దాన్ని ఖరారు చేయకుండా పనులు చేపట్టేందుకు వీలుండదు. రీజనల్ రింగురోడ్డుకు ఇంకా నంబర్ కేటాయించకపోవటంతో.. టెండర్లను తెరిచేందుకు, పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు, నిధులు మంజూరు, భూసేకరణ పరిహారం చెల్లింపు వంటివి చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఎన్‌పీజీ క్లియరెన్స్ రావడంతో, కేంద్ర జాతీయ రహదారుల శాఖ మరోసారి ఆమోద ముద్ర వేసి ఆర్థిక శాఖకు పంపుతుంది. అక్కడ నిధుల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో రోడ్డుకు ఎక్స్‌ప్రెస్ వే నంబర్ కేటాయిస్తారు.

'రీజనల్' దక్షిణ భాగంపై తకరారు!



కేంద్ర ప్రభుత్వం రీజనల్ రింగు రోడ్డు ఉత్తర భాగాన్ని భారత్‌మాల పరియోజనలో చేర్చింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పేచీలు, కొన్ని ప్రక్రియల్లో జాప్యంతో దక్షిణ భాగాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టింది. ఇప్పుడు దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతోపాటే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. మూడు రోజుల క్రితం ఢిల్లీలో ప్రధానితో భేటీ అయిన సీఎం రేవంత్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. కానీ అటు కేంద్రాన్ని చేపట్టాలని కోరుతూనే.. దక్షిణ భాగానికి డీపీఆర్ తయారీ కన్సల్టెన్సీ సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలవడం గమనార్హం. ఇది గందరగోళానికి కారణమైంది. తమ పరిశీలనలో ఉన్న ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఎందుకు పిలిచిందో అంతుచిక్కడం లేదని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) పేర్కొంటుండటం గమనార్హం.

16 ఏళ్లలోపు పిల్లలకు అన్ని షోలకు అనుమతి

మల్టీప్లెక్స్‌లకు హైకోర్టులో ఊరట



సాక్షి, హైదరాబాద్: పదహారేళ్లలోపు పిల్లలను రాత్రి 11 తర్వాత ప్రత్యేక షోలకు అనుమతించే విషయంలో మల్టీప్లెక్స్‌లకు ఊరట లభించింది. పదహారేళ్లలోపు పిల్లలను ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తర్వాత థియేటర్లలో సినిమా ప్రత్యేక ప్రదర్శనకు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని తాము ఇచ్చిన ఆదేశాలపై ప్రభుత్వం పరిశీలన చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. వేకువజామున 4 గంటల నుంచి 6 షోలకు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గొర్ల భరత్‌రాజ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జనవరి 10న విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. వేళాపాళా లేని రాత్రి ప్రదర్శనలు పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని వ్యాఖ్యానిస్తూ.. రాత్రి 11 గంటల తర్వాత చిన్నారులను థియేటర్లకు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. జనవరిలో ఇచ్చిన ఆదేశాలపై ప్రభుత్వం పరిశీలన చేస్తోందని, ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పిల్లలకు అనుమతి నిరాకరణపై అన్ని పక్షాల వారితో చర్చించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించినా, అప్పుడే ఉత్తర్వులు అమలు చేస్తున్నారన్నారు. దీంతో న్యాయమూర్తి.. అందరితో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని చెబుతూ, విచారణ వాయిదా వేశారు.

హెల్త్


ఆమె ఆరోగ్యమే ప్రపంచ భాగ్యం
మహిళల ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవసరాలపై అవగాహన పెరుగుతోంది. మహిళా దినోత్సవాలలో 'మహిళల ఆరోగ్యం' అనేది ప్రధాన అంశంగా మారింది.

ఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)లో గత సంవత్సరం 'ఇన్వెస్టింగ్ ఇన్ విమెన్స్ హెల్త్' ప్రధాన అంశంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళలకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు, సవాళ్ల గురించి వైద్యులు ప్రసంగించారు.

● అ'టెన్'షన్ ప్లీజ్

కేర్ తీసుకోండి

ప్రతి పదేళ్లకోమారు మహిళ తన ఆరోగ్యం కోసం ఆ దశాబ్దపు ప్రణాళిక ప్రకారం వెళ్లాలి. ఇలా చేసుకుంటూ పోవడం వల్ల సుదీర్ఘకాలం పాటు ఆమె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. మీరు ఏ పదుల పడిలో ఉన్నారో చూసుకోండి. ఆ ప్రకారం హెల్త్ కోసం జాగ్రత్తలు తీసుకోండి.



డాక్టర్
కె. ఉషారాణి
సీనియర్ ఫిజీషియన్



ఇరవైలలో...
ముమ్ముందు ఆరోగ్యాల కోసం జాగ్రత్తలు తీసుకోవాల్సిన వయసు ఇది.

● మీ ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఇందుకోసం ఎముకల్లోకి క్యాల్షియమ్ ఇంకేందుకు తగిన వ్యాయామాలు చేయాలి. పాల వంటి క్యాల్షియమ్ సమృద్ధిగా ఉండే పదార్థాలు తీసుకుంటూ ముమ్ముందు ఆస్టియోపోరోసిస్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ● శబ్దకాలుష్యం నుంచి మీ చెవులను కాపాడుకోండి. ఎక్కువ శబ్దంతో వినకుండా మీరు రేడియో, టీవీ, మొబైల్... ఏది వింటున్నా వాల్యూమ్ తగ్గించుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోండి ● రుతుక్రమం సక్రమంగా రాకుండా ఉంటుంటే డాక్టర్లను సంప్రదించి, తగిన చికిత్స తీసుకుని దాన్ని క్రమబద్ధం చేసుకోండి ● ఆటల్లో, వ్యాయామాల్లో గాయాలు కాకుండా చూసుకోండి. ఇవ్వాళ్టి గాయాలు భవిష్యత్తులో గండాలుగా పరిణమించకుండా జాగ్రత్త పడండి ● మనం ఏమి తింటున్నామనే విషయంపై దృష్టి సారించండి. ఇవ్వాళ్టి మీ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లే... భవిష్యత్తులో మీ దీర్ఘకాలిక ఆరోగ్యానికి పునాదులని గుర్తుంచుకోండి ● వయసు పెరిగేకొద్దీ నిద్ర తగ్గే అవకాశముంది కాబట్టి వీలైనంత వరకు కనీసం తొమ్మిది గంటల పాటు కంటినిండా నిద్రపొండి.



ముప్పైలలో...
ఈ వయసులో కనిపించే కొద్దిపాటి మార్పులపై దృష్టిసారించండి.

● మీ బరువును గమనించండి. మీరు బరువు పెరుగుతున్నారంటే జీవక్రియలు మందగించాయని అర్థం. మొదట్లో కొద్దిగానే పెరిగినట్లు కనిపిస్తున్నా జీవక్రియలు చురుగ్గా జరిగేలా చూస్తూ వెంటనే బరువు తగ్గడానికి ప్రయత్నించండి. ● చర్మాన్ని రక్షించుకోడానికి అవసరమైన చర్యలు తీసుకోండి. కనీసం 15 ఎస్‌పీఎఫ్ ఉన్న సన్ స్క్రీన్ రాసుకుంటూ ఉండటం చాలా అవసరం. అది క్యాన్సర్‌తో సహా పలు చర్మ సమస్యలను కాపాడుతుంది ● ఒత్తిడిని తగ్గించుకుంటూ ఉండండి. ఒత్తిడి వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు కలుగుతాయి ● ఈ వయసులోనే క్రమం తప్పకుండా అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలూ, మెడికల్ చెకప్స్ ప్రారంభించాలి. ఇది భవిష్యత్తులో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలను నివారిస్తుంది ● ప్రెగ్నెన్సీతో వచ్చే ముప్పులను గుర్తుంచుకోండి. ఎందుకంటే... 35 ఏళ్లు దాటాక వచ్చే ప్రెగ్నెన్సీలతో బిడ్డకు ఎన్నో రకాలుగా ముప్పు వచ్చే అవకాశాలుంటాయి. ఈ వయసులో గర్భధారణ కోసం ప్రయత్నిస్తుంటే తప్పనిసరిగా ఆబ్‌స్టెట్రీషియన్‌ను సంప్రదించండి.



నలభైలలో...
వయసు తాలూకు సంధి దశ అయిన ఈ ఈడులో కనిపించే మార్పులకు సిద్ధంకండి.

● మెనోపాజ్‌కు ముందుగా కనిపించే 'పెరీ–మెనోపాజ్' మార్పులను గమనిస్తూ ఉండండి. ఈస్ట్రోజెన్ మోతాదులు తగ్గడం వల్ల ఒంట్లోంచి వేడి ఆవిర్ల మాదిరిగా వస్తున్నాయా, నిద్ర పట్టడంలో ఇబ్బందులు కనిపిస్తున్నాయా, త్వరగా చిరాకుపడటం వంటి మార్పులు కనిపిస్తుంటే పాప్ స్మియర్ పరీక్షతోపాటు పెల్విస్ పరీక్షలు చేయించుకోండి ● రొమ్ముక్యాన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్ష మామోగ్రామ్ కూడా చేయించుకోండి ● తీసుకుంటున్న ఆహారంపై దృష్టి నిలపండి. మీ జీవక్రియల వేగానికి తగినట్లుగా ఆహారం అందేలా... కొద్ది కొద్ది మోతాదుల్లో ఎక్కువసార్లు తింటున్నారా అన్న విషయాన్ని గమనించుకోండి ● కంటి పరీక్షలు చేయించుకోండి. ఎందుకంటే చాలారకాల కంటి సమస్యలు ఈ వయసులోనే బయటపడతాయి. దాదాపు ప్రతి ఒక్కరికీ 40లలోనే కళ్లజోడు ధరించాల్సి వస్తుందనే విషయాన్ని గ్రహించండి ● మీ కుటుంబంలో జీర్ణవ్యవస్థకు సంబంధించిన రుగ్మతలు ఉన్నట్లయితే కొలనోస్కోపీకి ప్లాన్ చేసుకోండి. ఎందుకంటే కుటుంబ ఆరోగ్య చరిత్రలో జీర్ణ సంబంధమైన సమస్యలున్నవారి లో ఎంత త్వరగా సమస్యను కనుగొంటే అంత ఎక్కువ ప్రయోజనమని తెలుసుకోండి ● రక్తంలో చక్కెర మోతాదులెలా ఉన్నాయో చూసుకోండి. చాలావరకు 40 ల లోనే టైప్–2 డయాబెటిస్ వస్తుందని గుర్తుంచుకోండి. ఇది చాలామందిలో ఎలాంటి లక్షణాలూ లేకుండానే వచ్చేందుకు అవకాశమున్నందున ఒకసారి మీ డాక్టర్‌తో పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎలాంటి నష్టమూ ఉండదు.



యాభైలలో...
మీ గురించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన వయసు ఇది.

● మెనోపాజ్ కోసం సిద్ధం కండి. 51 అన్నది చాలామందికి మెనోపాజ్ వచ్చే సగటు వయసు ● చురుగ్గా ఉండండి. చురుకుదనం తగ్గిపోయే ఈ వయసులో చురుకుదనాన్ని పెంచుకోవడం వల్ల ముమ్ముందు చాలాకాలం పాటు మరింత ఆరోగ్యంగా ఉండగలరు ● ఒకసారి మొత్తం దేహానికి సంబంధించిన అన్ని పరీక్షలూ చేయించుకోండి. వీలైతే మీ యాభైలనుంచి ప్రతి రెండేళ్లకోమారు అన్ని బేసిక్ హెల్త్ పరీక్షలూ చేయించుకుంటూ ఉండటం మంచిది. ● ఒకసారి ఈసీజీ తీయించుకోండి. సాధారణంగా గుండెజబ్బులు కనిపించేది ఈ వయసులోనే కాబట్టి ఒకసారి ఆ పరీక్ష చేయించుకుని, మీకు ఎలాంటి గుండెజబ్బులూ లేవని నిర్ధారణ చేసుకుని ఆనందంగా ఉండండి.



అరవైలలో...
ఈ వయసు... ఆరోగ్యానికి సంబంధించిన మరో దశకు మొదటి మెట్టు.

● ఈ వయసులో బాధలను దరిజేరనివ్వకండి. సంతోషంగా గడపడానికి ప్రాధాన్యమివ్వండి. మోకాళ్ల అరగడం వంటివి ఈ వయసులో సాధారణంగా కనిపించే సమస్యలు. మోకాళ్ల కీళ్ల మార్పిడి ఆపరేషన్స్ వంటివి ఈ వయసులోనే చేయించుకోండి. మరింత వయసు పెరిగితే అంతగా సాధ్యం కాకపోవచ్చు ● ఈ వయసులో కళ్ల సమస్యలు మామూలే. సాధారణంగా క్యాటరాక్ట్ వంటివి ఈ వయసులో కళ్లకు వచ్చే సమస్యలు. వీలైనంత త్వరగా కాటారాక్ట్ సర్జరీ చేయించుకుని సుదీర్ఘకాలం పాటు మీ కళ్లతో ప్రపంచాన్ని చూడటాన్ని ఎంజాయ్ చేయండి.



డెబ్బైలలో...
వయసు పెరగడాన్ని గమనించుకుంటూ... ఆ ఈడుకు తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకోండి.

● ఆహారంలో మరింత పీచు ఉండేలా జాగ్రత్తలు తీసుకోండి. ఈ వయసులో ఆహారంలో పీచు సమృద్ధిగా ఉండటం వల్ల పెద్దపేగుల్లో కండపెరగడం, ఇతరత్రా పెద్దపేగు సమస్యలను రాకుండా నివారించవచ్చు ● నడక వంటి వ్యాయామాలు చేయండి. ఈ వయసులో చేసే వ్యాయామాలన్నీ దేహానికి మరింత ఎక్కువ శ్రమ కలిగించనివీ, మరీ తీవ్రమైనవి కాకుండా ఉండేవి అవసరం. వారంలో కనీసం 150 నిమిషాల పాటు దేహానికి మంచి కదలికలు ఉండే వ్యాయామం దొరికేలా చూసుకోండి. దీని వల్ల మీలో గుండెజబ్బులు వచ్చే అవకాశాలు కనీసం 15 శాతం తగ్గుతాయి ● ఈ వయసులో అవసరమైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలూ, మామోగ్రామ్ పరీక్షలూ చేయించుకోండి. బరువు పెరగకుండా చూసుకోండి. పెరుగుతున్న బరువు క్యాన్సర్‌తో సహా అనేక అనారోగ్యాలకు హేతువని గుర్తుంచుకోండి ● పెద్ద వయసులో తీసుకోవాల్సిన టీకాలు కొన్ని ఉంటాయి. ఉదాహరణకు ఫ్లూ, నిమోనియా వంటివి. పెద్దవయసులో తీసుకోవల్సిన వ్యాక్సినేషన్ల గురించి తెలుసుకుని, వాటిని తీసుకోవడం వల్ల ఆ వయసులో అవి సోకకుండా జాగ్రత్త తీసుకోవడం సాధ్యమవుతుంది. ఎందుకంటే మంచి వయసులో ఉన్నప్పుడు వాటిని తట్టుకునేంత సామర్థ్యం వయసు పైబడ్డాక ఉండకపోవచ్చు.

ఇలా ప్రతి పదేళ్ల కాలానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకొని, పది పదుల ఏళ్ల పాటు పదిలంగా ఉండండి.

● ప్రొటెక్షన్ ప్లీజ్

...హెల్త్ చూస్తుంది

కుటుంబ ఆరోగ్యాన్నే కాదు సమాజ ఆరోగ్యాన్నీ రెప్పవేయకుండా కనిపెట్టుకోగలదు స్త్రీ! ఆ ఓపిక, శ్రద్ధ మెడిసిన్ డిగ్రీతో వచ్చినవి కావు.. డీఎన్‌ఏలో భాగమై వచ్చినవి!వాటి బలంతోనే డాక్టరమ్మగా అలుపులేని సేవలందిస్తోంది.. దేశ ఆరోగ్య నాడి లయ తప్పకుండా చూసుకుంటోంది! కానీ ఆమె సహనాన్ని బలహీనతగా తీసుకుని.. వైద్యరంగంలో ఆమె భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు! అది ప్రభుత్వ వైద్యరంగంలో స్త్రీల ప్రవేశానికి అడ్డంకిగా మారకముందే మేలుకుని.. నాయకత్వ హోదాల్లో మహిళలకు అవకాశాన్ని ఇచ్చి.. భద్రతను కల్పిస్తే... హెల్త్‌కేర్ సెక్టార్‌లో సాధికారత సాధ్యం కాదు తథ్యం!



● ఆనందిబాయీ జోషీ
● డాక్టర్ కాదంబినీ గంగూలీ
● మేరీ పూనెన్ ల్యూకోస్

ఆమె బాల్యవివాహ బాధితురాలు. వైద్య సదుపాయాల్లేక పురిట్లోనే బిడ్డను పోగొట్టుకుంది. అప్పుడనుకుంది.. మెడిసిన్ చదవాలని! చదివింది.. అదీ అమెరికా, పెన్సిల్వేనియాలోని విమెన్స్ మెడికల్ కాలేజీలో. అలా చేతిలో మెడిసిన్ డిగ్రీ, మెడలో స్టెత్, దేశ తొలి మహిళా వైద్యురాలిగా సొంతగడ్డ మీద అడుగు పెట్టింది. ఆవిడే డాక్టర్ ఆనందీబాయి జోషీ. మన సమాజం ఆమెను ప్రశంసించక పోగా.. తీవ్రంగా విమర్శించింది. వివక్షకు గురైనా వెరవక వైద్యసేవలందించింది. దురదృష్టం.. చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయింది.

మన దేశ తొలి మహిళా వైద్యుల్లో మరో డాక్టర్.. కాదంబినీ గంగూలీ. యూరప్‌లో శిక్షణ పొందిన ఆమె మెడికల్ కెరీర్ అంతా దేశంలోని మహిళల ఆరోగ్యం, మాతా.. శిశు మరణాలను అరికట్టే ప్రయత్నానికే అంకితమైంది. ఇంకా.. మన తొలి మహిళా గైనకాలజిస్ట్ మేరీ పూనెన్ లుకోస్, దేశంలో క్యాన్సర్ రీసెర్చ్ సాగడానికి శ్రమించిన కమల్ రణదివే.. వీళ్లంతా స్వాతంత్ర్యానికి పూర్వమే తమ ప్రతిభతో ప్రపంచాన్ని ఆకట్టుకున్నారు. స్త్రీ సాధికారతకు చిహ్నంగా నిలిచారు.

వీళ్ల స్ఫూర్తితో స్వాతంత్ర్యానంతరం.. దేశంలో క్యాన్సర్ చికిత్సలో సమర్థమైన మార్పులకై కృషి చేసిన డాక్టర్ వి.శాంత, రేడియాలజిస్ట్ డా. కె.ఎ.దిన్షా, కార్డియాలజిస్ట్ డా.పద్మావతి అయ్యర్, డా. నీలమ్ క్లేర్, డా. అజితాచక్రవర్తి, డా. శశి వాధ్వా, డా. కామినీ రావు, డా. ఇందిరా హిందుజా లాంటివాళ్లెందరో వారి వారి విభాగాల్లో రాణించారు. మహిళలకు ఆరోగ్యం పట్ల స్పృహ కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

ఈ పాజిటివ్ నోట్ చూస్తుంటే వైద్యరంగంలో మన మహిళలు ఎంతో ముందుకెళ్లారనే భావన కలుగుతుంది. కానీ అధ్యయనం (2021 ప్రకారం) చేసి లెక్కలు తీస్తే ఆ సంఖ్య 29 శాతమే అని తేలింది. బోర్డ్ మెంబర్స్‌గా ఉన్నది 17 శాతమే. నర్సింగ్‌సేవల్లో మహిళల సంఖ్య 80 శాతం. దేశంలోని మొత్తం హెల్త్‌కేర్ వర్క్‌ఫోర్స్‌లో 54 శాతం ప్రైవేట్ వైద్యరంగానిదే వాటా! అందులో కూడా నాయకత్వ హోదాల్లో ఉన్న మహిళల సంఖ్య 30 శాతానికి మించిలేదు.

అంతర్జాతీయ స్థాయిలో..
హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో ఆంట్రప్రెన్యూర్స్ గా రాణిస్తున్న అను ఆచార్య, కిరణ్ మజుందార్ షా, మీనా గణేశ్, డాక్టర్ నందితా షా, నాన్కీ లఖ్వీందర్ సింగ్, నటాషా పూనావాలా, సునీతా మహేశ్వరి, సమీనా హమీద్, సౌమ్య స్వామినాథన్, డాక్టర్ వి. శాంత సహా తెలుగు వనితలు సంగీతారెడ్డి, శోభనా కామినేని, ప్రీతా రెడ్డి, సునీతా రెడ్డి లాంటి వాళ్లెందరి పేర్లో వినిపిస్తాయి. వీళ్లంతా తమ రంగాలలో తమ ముద్రను చూపించుకుంటున్నారు.



● డాక్టర్ సౌమ్యా స్వామినాథన్



● డాక్టర్ మంజుల అనగాని



● శోభనా కామినేని

ప్రమాదం అంచున... జాతీయ ఆరోగ్య సర్వే ప్రకారం ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు ఏదో ఒకరకమైన శారీరక హింసకు గురవుతున్నారు. ఇది హెల్త్‌కేర్ సెక్టార్‌లోకీ విస్తరించి మహిళావైద్యులు, నర్సుల భద్రతను ప్రమాదంలోకి నెడుతోంది. దీనికి ఉదాహరణ ఇటీవలి కోల్‌కతా కేజీ కర్ ఆసుపత్రి పీజీ స్టూడెంట్ హత్యాచారమే! ఈ దారుణాలకు కారణం ఆయా విభాగాల్లో నాయకత్వ హోదాలో మహిళల సంఖ్య కనీసం 30 శాతం కూడా లేకపోవడమే. పైస్థాయిలో ఎక్కువమంది మహిళలున్న చోట పనిప్రదేశం భద్రంగా ఉంటుంది. భరోసా పెరుగుతుంది. మహిళలకు మౌలిక సదుపాయాల ఏర్పాటు జరుగుతుంది.

ముంబై.. దిక్సూచీ... ఈ విషయంలో 'దిలాసా క్రైసిస్ సెంటర్'ను ఏర్పాటు ద్వారాదేశానికి మార్గదర్శిగా నిలిచింది ముంబై! ఇది మహిళల మీద హింస ఎన్ని రకాలుగా జరుగుతుంది, దాన్నెలా గుర్తించాలి, ఎలా ఎదుర్కోవాలి, ఎలా సహాయం పొందాలి, ఎలా సహాయం అందించాలి వంటి వాటి మీద ఆసుపత్రుల్లోని సిబ్బందికి శిక్షణనిచ్చింది. జనాభాలో సగభాగం ఉన్న మహిళల ఆరోగ్య సంరక్షణ, అవగాహనలో వైద్యరంగంలోని మహిళలదే కీలకపాత్ర. కానీ విధాన నిర్ణయాల్లో మాత్రం వీరి ప్రాతినిధ్యం శూన్యం. అది గ్రహించి ఇటు ప్రభుత్వ రంగం, అటు ప్రైవేట్ రంగం మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచి, వచ్చే మహిళా దినోత్సవానికల్లా వైద్యరంగంలో మహిళల విజయగాథను చెప్పుకునే అవకాశాన్నిస్తాయని ఆశిద్దాం!

మహిళలతోనే భరోసా




నేను మహిళా బాస్‌ల కిందే పనిచేస్తున్నాను. ఏ చిన్న సమస్య అయినా వారితో షేర్ చేసుకుంటాను. వెంటనే స్పందిస్తారు. నేను కూడా నా కింది ఉద్యోగుల విషయంలో అలాగే ఉంటాను. మన బాసులుగా కానీ, కొలీగ్స్‌గా కానీ మహిళలే ఉంటే ఇలాంటి భరోసా వస్తుంది. అయితే అవకాశాలను వెదుక్కుంటేనే మహిళా శక్తి పెరుగుతుంది. ఆ బలం పెరిగితే ఆటోమేటిగ్గా పని ప్రదేశం విమెన్ ఫ్రెండ్లీగా మారుతుంది.

- డాక్టర్ మౌనిక నేలపట్ల
అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ సర్జన్, ప్రభుత్వాసుపత్రి, కామారెడ్డి

* * *

మేము వారధులం



ఒక రకంగా మేము ప్రభుత్వాలకు.. ప్రజలకు మధ్య వారధిలాంటి వాళ్లం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, వారి ఆరోగ్యసంరక్షణలో మా పాత్ర ముఖ్యమైనది. వృత్తిరీత్యా ఎప్పుడూ ప్రజల్లోనే ఉండాలి కాబట్టి.. భద్రత, రక్షణ వంటి వాటిలో ఇబ్బందులుంటాయి. కొన్నిసార్లు అవమానాలూ ఎదురవుతుంటాయి.

- జంగం రమాదేవి, ఆశ వర్కర్, పాల్వంచ, కామారెడ్డిజిల్లా

Inspiration

నా ఇన్‌స్పిరేషన్ మా అమ్మ



- సొనాలీ బెంద్రే, నటి

ఎలాగంటే...
'మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. ఆడపిల్లలకు చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం చాలా ముఖ్యమని నమ్ముతుంది మా అమ్మ (పేరు.. రూపీ బెంద్రే). నేను మోడలింగ్ ట్రయల్స్‌లో ఉన్న రోజుల్లో ఒకసారి.. నన్ను, నా సిస్టర్స్‌ని కూర్చోబెట్టుకుని చెప్పి 'మీరు ఎంత సంపన్నులను తీసుకొచ్చి నా ముందు నిలబెట్టి పెళ్లి చేసుకోబోతున్నామని చెప్పినా నేను పర్మిషన్ ఇవ్వను. మీ కాళ్ల మీద మీరు నిలబడి.. ఫైనాన్షియల్‌గా స్ట్రాంగ్ అయ్యాకే.. పెళ్లి! ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే మీకు వాయిస్ ఉంటుంది.. గుర్తుపెట్టుకోండి' అని చెప్పింది. ఆ మాట మంత్రంలా పనిచేసింది మాకు. కెరీర్‌లో ఎదగడానికి స్ఫూర్తినిచ్చింది. నేనీ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే స్ఫూర్తి అమ్మే! నిజంగానే ఆడపిల్లకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. దాని వల్ల ఒక భరోసా వస్తుంది. ఆ భరోసా మనల్ని స్ట్రాంగ్‌గా నిలబెడుతుంది!'

Impact

నాకు నచ్చిన పాత్ర మనోరమ - మృణాళిని

తెలుగులో సుప్రసిద్ధమైన నవలల్లో ఒకటి రాచకొండ విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి'. ఇది చదివిన వారందరికీ సుబ్బయ్య పాత్ర, చైతన్యస్రవంతి శిల్పం మాత్రమే గుర్తుంటాయి. కానీ అందులో కథకు అతి కీలకమైన స్త్రీ పాత్ర ఉంది. ఆమే మనోరమ. నవలలో వస్తువు సుబ్బయ్యలోని ఆత్మన్యూనత. అదే ఆ పాత్రను అల్పజీవిని చేసిన అంశం. ఆ ఆత్మన్యూనత తగ్గడానికి ప్రేరణ మనోరమ సాన్నిహిత్యం. అందరిచేతా 'నంగిరి పింగిరి గాడు', 'భయస్థుడు', 'అసమర్థుడు' అనిపించుకున్న సుబ్బయ్య, భార్య చేత 'మగడు మగాడు కాకపోతే భార్యల గతి ఇంతే' అని ఈసడించుకోబడ్డ సుబ్బయ్య, నవల చివర్లో 'ఈ ఆడది కష్టంలో ఉందని తెల్సుకుందికి అట్టే కష్టం లేదు... చేతనైతే సాయం చేయవచ్చు' అని మనోరమ గురించి అనుకునే స్థాయికి ఎదగడానికి, తన అల్పత్వాన్ని అధిగమించడంలో తొలి అడుగు వేయడానికి కారణం ఆ మనోరమే.

మనోరమను 'నల్లచీర మనిషి' అని పరిచయం చేస్తాడు రచయిత. స్కూలు టీచరు అని చెప్తాడు. ఆమె గతం మనకుగానీ, సుబ్బయ్యకు గానీ చెప్పడు. మాట తీరును బట్టి కలుపుగోలు మనిషి, ముప్పయ్యో పడిలో ఉన్న అందమైన స్త్రీ అని మాత్రమే ఆ పరిచయంలో అర్థమవుతుంది. మనోరమ తెలుగు నవలాసాహిత్యంలోనే విలక్షణమైన పాత్ర. కొంతవరకూ మార్మికపాత్ర కూడా. నవలలో సుబ్బయ్యను మనిషిలా చూసిన ఏకైక వ్యక్తి. అతన్ని అన్ని బలహీనతలతో సహా అభిమానించిన వ్యక్తి. ఏ ఫలాపేక్ష లేకుండా అతని కష్టాలన్నీ సానుభూతితో వినడమే కాక, అతనికి శారీరకంగానూ దగ్గరైన వ్యక్తి. అతని ప్రాణానికి కంటకుడిగా మారిన గవరయ్యను తన ఊరివాడన్న చిన్న సెంటిమెంటును గుర్తుచేసి, నచ్చజెప్పి, సుబ్బయ్యకు ఆపద తప్పించిన ఉపకారి.

మనశ్శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ సిద్ధాంతం ప్రకారం ఆత్మన్యూనతకు లోనై, సమాజం నుంచి పారిపోవాలనుకునే వ్యక్తికి కుటుంబం నుంచి కానీ సమాజం నుంచి గానీ ఒక ఆధారం, ఊరట లభిస్తే ఆ బలహీనత నుంచి కోలుకుంటారు. ఆ ఊరటకు ప్రతీకే మనోరమ. మగవాడికి, ఒక అపరిచితురాలైన అందమైన స్త్రీ తన సాన్నిహిత్యాన్ని కోరుతున్నది అన్న ఒక్కటి చాలు – అహం తృప్తి పడ్డానికీ; న్యూనత తగ్గడానికీ. పురుషుల సైకాలజీకి సంబంధించిన ఈ అంశానికి ప్రతినిధిగా మనోరమను సృష్టించి, రావిశాస్త్రి తన రచనాప్రతిభను చాటుకున్నారు.



రచయిత మనోరమ అంతరంగాన్ని చిత్రించకపోవడం వల్ల వచ్చిన నష్టమేమీ లేదు. నవల చివర్లో మాత్రం ఆమె ఎందుకో బాధపడుతోందన్న సూచన చేస్తాడు. దాని వివరాలేవీ చెప్పడు. ఎందుకంటే ఇది సుబ్బయ్య కథ. మనోరమ కథ కాదు. కానీ, ఎప్పుడూ తన ఏడుపు మాత్రమే ఏడ్చుకునే సుబ్బయ్య ఒక మనిషిగా మారడానికి మనోరమలో కలిగిన ఈ వ్యాకులమే నాంది పలికింది. ఆ పాత్ర ప్రయోజనం ఈ నవలకు సంబంధించినంతవరకూ అంతే కావచ్చు. ఈ రకంగా రావిశాస్త్రి మనోరమకు అన్యాయం చేసి వుండవచ్చు కూడా... కానీ, రావిశాస్త్రి ఎందుకోసం సృష్టించినా, గుండె నిండా ఔదార్యం, మనసు నిండా ప్రేమ కలిగిన మనోరమ తెలుగు నవలా సాహిత్యంలో గుర్తుంచుకోదగ్గ స్త్రీ పాత్ర.



భారత జట్టులో సహజ, శ్రీవల్లి

న్యూఢిల్లీ: మహిళల టెన్నిస్ టీమ్ ఈవెంట్ బిల్లీ జీన్ కింగ్ కప్‌లో పాల్గొనే భారత జట్టులో తెలుగమ్మాయిలు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఎంపికయ్యారు. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) సెలక్షన్ కమిటీ ఈ టోర్నీ కోసం ఐదుగురు సభ్యుల జట్టును శనివారం ప్రకటించింది. ఇందులో సహజ, శ్రీవల్లిలతో పాటు భారత నంబర్‌వన్ ర్యాంకర్ అంకిత రైనా, వైదేహి చౌదరి, ప్రార్థన తొంబరే ఉన్నారు. ఇటీవల ముంబైలో జరిగిన డబ్ల్యూటీఏ టోర్నీలో సంచలన ప్రదర్శన కనబరిచిన మాయ రాజేశ్వరన్‌ను రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. ఈ టీమ్‌కు విశాల్ ఉప్పల్ నాన్‌ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. పురుషుల విభాగంలో జరిగే ప్రతిష్టాత్మక డేవిస్ కప్ టోర్నమెంట్‌లాగే మహిళల ఈవెంట్‌లో జరిగే టోర్నీయే ఈ 'బిల్లీ జీన్ కింగ్ కప్'. ఈ సారి ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వబోతోంది. పుణేలోని దక్కన్ జింఖానా కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 8 నుంచి బిల్లీ జీన్ కింగ్ కప్ పోటీలు జరుగుతాయి.



సెమీస్ సన్నాహకం

భారత్, న్యూజిలాండ్ వన్డేల్లో చివరిసారిగా గత వరల్డ్ కప్‌లో తలపడ్డాయి. లీగ్ మ్యాచ్‌తో పాటు సెమీస్‌లో కూడా భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి విజయాలు అందుకుంది. అంతకు ముందు కివీస్‌తో వరుసగా మూడు వన్డేల్లో కూడా టీమిండియాదే పైచేయి. అయితే ఫార్మాట్‌లు వేరైనా ఇటీవల మన గడ్డపై టెస్టు సిరీస్‌లో ఆ జట్టు కొట్టిన దెబ్బ ఇంకా తాజాగానే ఉంది. ఇరు జట్లలో ఎక్కువ మంది ఆటగాళ్లు ఆ సిరీస్‌లో ఆడినవారే. ఈ నేపథ్యంలో ఐసీసీ టోర్నీలో తమ సత్తా చాటేందుకు భారత్ సిద్ధంగా ఉంది. చాంపియన్స్ ట్రోఫీ కోణంలో ఇది నామమాత్రపు మ్యాచే అయినా సెమీస్‌కు ముందు సన్నాహకంగా ఇది ఉపయోగపడనుంది. ఇరు జట్ల సెమీస్ ప్రత్యర్థి ఎవరో కూడా ఈ మ్యాచ్‌తోనే తేలనుంది.

నేడు చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ ఢీ

- జోరు మీదున్న ఇరు జట్లు
- మ.గం.2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం


జడేజా, గంభీర్, రోహిత్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశలో గ్రూప్ 'ఎ'నుంచి ఇప్పటికే సెమీ ఫైనల్ చేరిన భారత్, న్యూజిలాండ్ చివరి లీగ్ మ్యాచ్‌కు సన్నద్ధమయ్యాయి. ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ నెగ్గిన టీమ్‌లు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతున్నాయి. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే గ్రూప్ టాపర్‌గా సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడుతుంది. ఓడితే సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఎదుర్కొంటుంది.

పంత్‌కు చాన్స్!

గత రెండు మ్యాచ్‌లలో ప్రత్యర్థులను తక్కువ స్కోర్లకే పరిమితం చేసి భారత జట్టు లక్ష్యాలను సునాయాసంగా ఛేదించింది. మన ప్రదర్శనను బట్టి చూస్తే అంతా ఫామ్‌లో ఉండటంతో మార్పులు చేయాల్సిన అవసరం లేదు. అయితే అందుబాటులో ఉన్న ఇతర ఆటగాళ్లకు మ్యాచ్ అవకాశం ఇచ్చే ఆలోచనతో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. వికెట్ కీపర్‌గా రాహుల్ స్థానంలో రిషబ్ పంత్ ఆడటం దాదాపు ఖాయమైంది. కారు ప్రమాదం నుంచి కోలుకొని పునరాగమనం చేసిన తర్వాత పంత్ ఇప్పటి వరకు ఒకే ఒక్క వన్డే గత ఏడాది ఆడాడు. ఈ మ్యాచ్ తర్వాత ఒకే రోజు విరామంతో సెమీ ఫైనల్ ఆడాల్సి ఉండటంతో ప్రధాన పేసర్ షమీకి విశ్రాంతినిచ్చే అవకాశం కూడా ఉంది. అతని స్థానంలో అర్ష్‌దీప్ ఆడవచ్చు. కివీస్ టాప్-8లో ఐదుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లు కాబట్టి లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ స్థానంలో సుందర్ జట్టులోకి రానున్నాడు. పంత్ బరిలోకి దిగితే అక్షర్ బ్యాటింగ్ అవసరం కూడా టీమ్‌కు అంతగా ఉండకపోవచ్చు. మరో వైపు కుల్దీప్ స్థానంలో వరుణ్ చక్రవర్తిని కూడా ఆడిస్తే అతని వన్డే ప్రదర్శనను అంచనా వేసే అవకాశం ఉంది. బ్యాటింగ్‌పరంగా రోహిత్, గిల్, కోహ్లి, అయ్యర్‌లతో టాప్-4 పటిష్టంగా ఉండగా పాండ్యా, జడేజా అదనపు బలం.



అదే జట్టుతో...

న్యూజిలాండ్ కూడా అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తోంది. జట్టులో అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు కూడా సత్తా చాటుతున్నారు. రచిన్, యంగ్, లాథమ్ ఇప్పటికే సెంచరీలు సాధించగా, కాన్వే కూడా ఫామ్‌లో ఉన్నాడు. సీనియర్ బ్యాటర్ విలియమ్సన్ వైఫల్యమే కొంత ఆందోళన కలిగిస్తోంది. అయితే గతంలో కీలక మ్యాచ్‌లలో భారత్‌పై రాణించిన రికార్డు ఉన్న మాజీ కెప్టెన్ తన స్థాయికి తగినట్లు ఆడితే టీమ్‌కు తిరుగుండదు. ఫిలిప్స్‌లాంటి ఆల్‌రౌండర్ జట్టుకు మరింత కీలకం. జేమీసన్, రూర్కే, హెన్రీలతో పేస్ బౌలింగ్ చాలా పటిష్టంగా ఉంది. కివీస్ స్పిన్ కూడా చాలా బలంగా ఉండటం విశేషం. సాంట్నర్, బ్రేస్‌వెల్ చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. ఓవరాల్‌గా కివీస్ కూడా దుర్భేద్యంగా కనిపిస్తోంది.

కోహ్లి @300



భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఈ మ్యాచ్‌తో 300 వన్డేలు పూర్తి చేసుకోబోతున్నాడు. ఈ ఘనత సాధించిన 7వ భారత ఆటగాడిగా, ఓవరాల్‌గా 22వ ఆటగాడిగా కోహ్లి నిలుస్తాడు. 299 వన్డేల కెరీర్‌లో కోహ్లి 58.20 సగటుతో 14,085 పరుగులు సాధించాడు. ఇందులో 51 సెంచరీలు, 73 అర్ధసెంచరీలు ఉన్నాయి. కోహ్లికి ముందు భారత్ నుంచి సచిన్, ధోని, ద్రవిడ్, అజహరుద్దీన్, గంగూలీ, యువరాజ్ 300 వన్డేలు ఆడారు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, పంత్, పాండ్యా, జడేజా, సుందర్, రాణా, వరుణ్, అర్ష్‌దీప్.

న్యూజిలాండ్: సాంట్నర్ (కెప్టెన్), కాన్వే, రచిన్, విలియమ్సన్, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, జేమీసన్, హెన్రీ, రూర్కే.

పిచ్, వాతావరణం

స్పిన్‌కు అనుకూలం. వర్షసూచన ఏమాత్రం లేదు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

దక్షిణాఫ్రికా అగ్ర స్థానంతో...

- సెమీఫైనల్ చేరిన సఫారీ జట్టు
- ఇంగ్లండ్‌పై 7 వికెట్లతో విజయం
- చాంపియన్స్ ట్రోఫీ



కరాచీ: చాంపియన్స్ ట్రోఫీలో దక్షిణాఫ్రికా సెమీఫైనల్ స్థానం అధికారికంగా ఖాయమైంది. గ్రూప్ 'బి'లో 5 పాయింట్లతో అగ్ర స్థానం సాధిస్తూ ఆ జట్టు ముందంజ వేసింది. సాంకేతికంగా ఈ పోరుకు ముందు అఫ్గానిస్తాన్ కూడా సెమీస్ రేసులో ఉన్నా...ఎలాంటి అనూహ్యం జరగలేదు. ఇంగ్లండ్ కనీసం 207 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడిస్తే మాత్రమే అఫ్గన్‌కు అవకాశం ఉండగా ఇంగ్లండ్ కనీసం ఆ స్కోరు కూడా చేయలేకపోయింది! దాంతో లక్ష్యఛేదనకు ముందే దక్షిణాఫ్రికా సెమీస్ చేరింది. శనివారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 38.2 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. మాజీ కెప్టెన్ జో రూట్ (44 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... ఆర్చర్ (25), డకెట్ (24), కెప్టెన్ బట్లర్ (21) తలా కొన్ని పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్, ముల్డర్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. సఫారీ బౌలర్ల ధాటికి నిలవలేకపోయిన ఇంగ్లండ్ జట్టు... వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో 300 పైచిలుకు పరుగులు చేసిన ఇంగ్లండ్ జట్టు... ఈ పోరులో కనీస ప్రభావం చూపలేకపోయింది. ఫిల్ సాల్ట్ (8), జేమీ స్మిత్ (0), బ్రూక్ (19), లివింగ్‌స్టోన్ (9), ఓవర్టన్ (11) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 29.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. వాన్ డర్ డసెన్ (87 బంతుల్లో 72 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (56 బంతుల్లో 64; 11 ఫోర్లు) ధనాధన్ అర్ధ శతకాలతో మరో 125 బంతులు మిగిలుండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్ 2 వికెట్లు పడగొట్టాడు. యాన్సెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) డసెన్ (బి) యాన్సెన్ 8; డకెట్ (సి అండ్ బి) యాన్సెన్ 24; జేమీ స్మిత్ (సి) మార్క్‌రమ్ (బి) యాన్సెన్ 0; రూట్ (బి) ముల్డర్ 37; బ్రూక్ (సి) యాన్సెన్ (బి) కేశవ్ 19; బట్లర్ (సి) కేశవ్ (బి) ఎంగిడి 21; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) కేశవ్ 9; ఓవర్టన్ (సి) ఎంగిడి (బి) రబాడ 11; ఆర్చర్ (సి) యాన్సెన్ (బి) ముల్డర్ 25; రషీద్ (సి) క్లాసెన్ (బి) ముల్డర్ 2; సాఖిబ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (38.2 ఓవర్లలో ఆలౌట్) 179. వికెట్ల పతనం:** 1-9, 2-20, 3-37, 4-99, 5-103, 6-114, 7-129, 8-171, 9-173, 10-179. **బౌలింగ్:** మార్కో యాన్సెన్ 7-0-39-3; ఎంగిడి 7-0-33-1; రబాడ 7-1-42-1; ముల్డర్ 7.2-0-25-3; కేశవ్ మహరాజ్ 10-1-35-2.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్టన్ (బి) ఆర్చర్ 27; స్టబ్స్ (బి) ఆర్చర్ 0; డసెన్ (నాటౌట్) 72; క్లాసెన్ (సి) సాఖిబ్ (బి) రషీద్ 64; మిల్లర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (29.1 ఓవర్లలో 3 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-11, 2-47, 3-174. **బౌలింగ్:** ఆర్చర్ 9-0-55-2; సాఖిబ్ మహమూద్ 5-0-31-0; ఓవర్టన్ 5-0-34-0; ఆదిల్ రషీద్ 7-0-37-1; లివింగ్‌స్టోన్ 3.1-0-24-0.

దుబాయ్‌కు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా

చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి అసాధారణ పరిణామమిది! చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ 'బి' నుంచి సెమీఫైనల్‌కు అర్హత సాధించిన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు దుబాయ్‌కు పయనమయ్యాయి. రెండింటిలో ఒక జట్టు మైదానంలోకి దిగకుండానే మళ్లీ లాహోర్‌కు రావాల్సి ఉంటుంది. భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్నప్పటికీ... ఇరు జట్ల మధ్య నేటి మ్యాచ్ తర్వాతే వాటి స్థానాలు ఖరారవుతాయి. దీంతో గ్రూప్ 'బి' నుంచి సెమీస్‌కు చేరిన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లను దుబాయ్‌కు తీసుకెళ్లాలని నిర్వాహకులు నిర్ణయించారు. మంగళవారం జరగనున్న తొలి సెమీఫైనల్లో భారత ఆడటం ఇప్పటికే ఖాయం కాగా... ప్రత్యర్థి ఎవరో తేలాల్సి ఉంది. కివీస్‌తో చివరి పోరులో భారత్ విజయం సాధిస్తే ఆస్ట్రేలియాతో రోహిత్ సేన మంగళవారం తొలి సెమీఫైనల్ ఆడుతుంది. ఇదే జరిగితే దక్షిణాఫ్రికా జట్టు తిరిగి పాకిస్తాన్ చేరుకుంటుంది. ఒకవేళ కివీస్ చేతిలో ఓడితే టీమిండియా ప్రత్యర్థి దక్షిణాఫ్రికా కానుంది. కంగారూలు రెండో సెమీఫైనల్ కోసం పాకిస్తాన్‌కు తిరుగు పయనం కానున్నారు. కీలక సెమీఫైనల్‌కు ముందు దుబాయ్ మైదానంలో ప్రాక్టీస్ చేయడంతో పాటు అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లకు ఇది ఉపయోగపడనుంది.

సాక్షి సినిమా

సవాల్ చేయకు...


వరలక్ష్మి

'అందరి జీవితంలో గుడ్ డే, బ్యాడ్ డే అని ఒక రోజు ఉంటుంది. కానీ నా జీవితంలో రెండూ ఒకే రోజు జరిగాయి' అన్న డైలాగ్స్‌తో మొదలవుతుంది 'శివంగి' సినిమా ట్రైలర్. ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇది. దేవరాజ్ భరణీధరన్ దర్శకత్వంలో నరేశ్‌బాబు. పి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నువ్వు ఒకడ్ని ప్రేమించి ఇంకొకడిని పెళ్లి చేసుకున్నావ్.., ప్రేమించినవాడి కోసం లైఫ్ అంతా వెయిట్ చేయడానికి నేను రెడీ, ఇసుమంటి అత్తల-కోడళ్ల ప్రాబ్లమ్ ప్రతి ఇంట్లో ఆల్ ఓవర్ వరల్డ్‌కి ప్రాబ్లమ్.., ఇది నాకు, మా అత్తమ్మకి, మేనేజర్ కిరణ్‌గాడికి జరుగుతున్న వార్... దీంట్లో మేం గెలుస్తాం, సత్యభామ రా... సవాల్ చేయకు... చంపేస్తా' అన్న డైలాగ్స్ 'శివంగి' సినిమా ట్రైలర్‌లో ఉన్నాయి.

ఆపదొచ్చిన ప్రతిసారీ...

శివభక్తుడైన కన్నప్ప పురాణ కథ ఆధారంగా రూపొందుతున్న సినిమా 'కన్నప్ప'. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. ఇందులో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తుండగా మోహన్‌బాబు, శరత్‌కుమార్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఈ సినిమా రెండో టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. 'శంకరుడి సైన్యం ఎక్కడో సన్నద్ధమై ఉంటుంది, వాళ్లు వేలల్లో కాదు... లక్షల్లో రానివ్వండి... తేల్చుకుందాం, నా ఆన తిన్నడి ఆన, ఆపదొచ్చిన ప్రతిసారీ వీరుల తలలు కోరుకునే ఈ రాయి దేవత కాదు, అంతటి నాస్తికుడు మీకు భక్తుడవుతాడా?' అనే డైలాగ్స్ ఈ టీజర్‌లో ఉన్నాయి.


విష్ణు మంచు


ఆది, అవికా గోర్


సస్పెన్స్... థ్రిల్

ఆది సాయికుమార్, అవికా గోర్ హీరో హీరోయిన్లుగా నటించిన డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'షణ్ముఖ'. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు శనివారం చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా షణ్ముగం సాప్పని మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో ఆది కనిపిస్తాడు. ఇప్పటి వరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందించిన డివోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఓ వండర్‌ఫుల్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నాం. ఈ సినిమా ఆది కెరీర్‌లో ఓ మైలు రాయిగా నిలిచిపోతుందున్న నమ్మకం ఉంది'' అని అన్నారు.



కొందరు హీరో-హీరోయిన్ల కాంబినేషన్ రిపీట్ అవుతోంది. ఆ స్టార్స్ చేస్తున్న చిత్రాలపై 'జోడీ రిపీట్' కథనం, అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ', నటి రంభ రీ-ఎంట్రీ వంటి విశేషాల కోసం సాక్షి ఫ్లస్ ఈ పేపర్ చదవండి.

సత్యమేవ జయతే


ప్రియదర్శి

'సార్... నా పేరు షణ్ముఖ్ రెడ్డి. మేం వైజాగ్ నుంచి మాట్లాడుతున్నాం. మా కేసు గురించి మోహన్‌రావుగారితో మాట్లాడాలి, మీరు శుక్రవారం సాయంత్రం వచ్చేయండి... ఎలాగూ శాటర్‌డే, సండే కోర్టు హాలిడేస్ కాబట్టి సార్ మీతో డీటైల్డ్‌గా మాట్లాడతారు. అయితే మేం శుక్రవారం వచ్చి ఫోన్ చేస్తాం సార్' అనే సంభాషణలు 'కోర్టు: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' సినిమా ట్రైలర్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ వీడియోలో ఉన్నాయి. ఈ విజువల్స్‌తో పాటు 'సత్యమేవ జయతే' అని కూడా కనపడుతుంది. ప్రియదర్శి, శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కోర్టు: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. నాని సమర్పణలో రామ్ జగదీశ్ దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మార్చి 14న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 7న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించి, ట్రైలర్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు.

నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో...


హవీష్

'జీనియస్, రామ్ లీల, సెవెన్' వంటి చిత్రాల్లో నటించిన హవీష్ కోనేరు హీరోగా కొత్త చిత్రం ప్రారంభమైంది. 'సినిమా చూపిస్త మావ..., నేను.. లోకల్, ధమాకా', ఇటీవల 'మజాకా' వంటి హిట్ చిత్రాలను డైరెక్ట్ చేసిన నక్కిన త్రినాథరావు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హై ఎనర్జిటిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

పాటలపై హక్కులెవరికి..?


గౌరీకుమారి, అభిరూప్ ముఖర్జీ, ప్రభా శ్రీదేవన్, భరత్

సినిమా పాటల హక్కులు ఎవరివి అనే వివాదం చాలాకాలంగా చిత్ర పరిశ్రమలో నడుస్తోంది. సంగీతదర్శకుడు ఇళయరాజా 'నా పాటపై హక్కు నాదే' అంటుంటారు. కొందరు గాయనీగాయకులు తమకు రాయల్టీ రావాలంటున్నారు. కొందరైతే నిర్మాతలకే హక్కు అంటున్నారు. ఈ విషయంపై చెన్నైకి చెందిన ఇంటర్నేషనల్ ట్రేడ్ మార్క్ అసోసియేషన్ సహకారంతో క్రియాలా, ఐపీ అండ్ మ్యూజిక్ సంస్థలు శనివారం చెన్నైలో సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో నిర్మాత ధనుంజయన్, థింక్ మ్యూజిక్ ఇండియా సంతోష్, గాయకుడు హరిచరణ్ శ్రీనివాస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కాగా సినిమా పాటలు అనేక మాధ్యమాల ద్వారా సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. అసలు వీటి హక్కులు ఎవరికి చెందుతాయి? అనే విషయం గురించి క్రియాలా సంస్థ నిర్వాహకుడు, న్యాయవాది ఎంఎస్. భరత్ మీడియా సమావేశంలో వివరిస్తూ... ఒక పాట రూపొందాలంటే సంగీత దర్శకుడు, గీత రచయిత, గాయకుడు, సౌండ్ ఇంజినీర్.. ఇలా పలువురి కృషి ఉంటుందన్నారు. అయితే వీటన్నింటికీ మూలం నిర్మాత అనీ, ఆయన పెట్టుబడితోనే పాట రూపొందుతోందనీ, పాటలకు మొదటి హక్కుదారుడు నిర్మాతనే అని అన్నారు. ఒకవేళ ఒప్పందం ఉంటే, అందులోని నిబంధనల ప్రకారం హక్కులు వర్తిస్తాయన్నారు. ఎలాంటి ఒప్పందం లేకపోతే పాటల హక్కులు నిర్మాతకే ఉంటాయన్నారు. ఒకవేళ చిత్ర నిర్మాత కన్నుమూస్తే, ఆయన కుటుంబ సభ్యులకే హక్కులు చెందుతాయని భరత్ పేర్కొన్నారు.

– 'సాక్షి' చెన్నై, తమిళ సినిమా

ఓటీటీ ఇది చూడొచ్చు

అమ్మ కోసం చూడాల్సిన సినిమా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం అప్పత్తా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



నవ మాసాలు మోసి, కన్న బిడ్డపై తల్లికి జీవితాంతం మమతానురాగాలుంటాయి. కానీ అదే బిడ్డ తన తల్లిని తల్లిగా చూడక స్వార్థంతో హింసిస్తే ఆ తల్లి తిరిగి ఎలా ప్రవర్తిస్తుంది... ఇదే ఇతివృత్తంతో తీసిన సినిమా 'అప్పత్తా'. నానమ్మ లేదా అమ్మమ్మ అని అర్థం. ఇంకా చెప్పాలంటే ప్రేమతో పెద్దవాళ్లని పిలిచే పదం 'అప్పత్తా'. ఇదో తమిళ సినిమా. ఈ సినిమాకి దర్శకులు ప్రియదర్శన్. ప్రముఖ నటి ఊర్వశి ఈ అప్పత్తా పాత్రలో నటించారు... కాదు కాదు జీవించారు. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అద్దం పట్టే ఓ ఫీల్ గుడ్ మూవీ 'అప్పత్తా'. ఈ చిత్రకథ విషయానికొస్తే... ఓ చిన్న గ్రామంలో అప్పత్తా ఒక్కటే ఉంటుంది. ఎవరికైనా చిన్న ఇబ్బంది ఉన్నా వెంటనే తానున్నానని వాళ్లకి పరిష్కారం చూపుతూ నలుగురికీ సాయపడుతూ ఉంటుంది. అప్పత్తాకు కుక్కలంటే మాత్రం చచ్చేంత భయం. భర్తను పోగొట్టుకున్న ఈవిడ తన కష్టంతో కొడుకును చదివిస్తూ ఉంటుంది. కొడుకు పేరు శ్యామ్. అప్పత్తా ఊరగాయ పచ్చళ్లు బాగా చేస్తుంది. అప్పత్తా ఊరగాయలంటే ఆ చుట్టు పక్కల ఊళ్లల్లో బాగా ఫేమస్. ఆ ఊరగాయలతోనే తన బిడ్డను చదివించుకుంటూ ఉంటుంది. కానీ అదే ఊరగాయ వాసన, అలాగే ఆమె పేదరికం నచ్చని కొడుకు చదువు పేరుతో అప్పత్తాని వదిలి నగరానికి వెళతాడు. కానీ సిటీకి వెళ్లడానికి, అక్కడ ఉండడానికి అప్పత్తా ఇచ్చిన డబ్బులు వాడుకుంటాడు. శ్యామ్ సిటీలోనే సెటిలై ప్రేమ వివాహం చేసుకుంటాడు. కొన్నేళ్ల తరువాత సడెన్‌గా సిటీలో ఉన్న తన కొడుకు దగ్గర నుండి పిలుపు వచ్చి అప్పత్తా గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న కొడుకు ఇంటికి వెళుతుంది. సిటీకి మొట్ట మొదటిసారిగా వచ్చిన తన తల్లిని కనీసం తీసుకురావడానికి కూడా వెళ్లని సదరు కొడుకు అప్పత్తాని ఎందుకు పిలిచాడంటే తన ఫ్యామిలీతో హాలిడే కోసం కొన్ని రోజులు బయటకు వెళుతూ ఇంట్లో ఉన్న కుక్కని చూసుకోవడానికి మనిషి కోసం ఆమెను రప్పించుకుంటాడు. అసలే కుక్కంటే భయపడే అప్పత్తా కొడుకు ఇంట్లో ఉన్న కుక్కని ఎలా ఎదుర్కొంటుంది? అన్నదే ఈ 'అప్పత్తా'. సినిమా మొత్తం కామెడీగా సాగిపోతూ చివర్లో చక్కటి మెసేజ్ ఇచ్చారు దర్శకుడు. మనల్ని కనడానికి మన తల్లి పడ్డ బాధ మనకు తెలియకపోవచ్చు. కానీ మనల్ని పెంచి పోషించిన తల్లిని మాత్రం ఎప్పటికీ బాధపెట్టకూడదు. అందుకే ఇది అమ్మ కోసం చూడాల్సిన సినిమా. మస్ట్ వాచ్... ఫీల్ గుడ్ మూవీ. వాచిట్ ఆన్ జియో హాట్ స్టార్.

– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధువరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కల్వకుంట్ల కవితతో సెల్ఫీ దిగారని..

- బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ వర్గీయుల దాడి
- బాధితులను ఫోన్‌లో పరామర్శించిన కేటీఆర్, హరీశ్‌రావు



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలో మరోసారి రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముందుగా కోడేరు మండలం నార్యానాయక్ తండాలో ఘర్షణ జరిగింది. తండాలో బీఆర్‌ఎస్ నాయకుడు ముడావత్ రవికృష్ణనాయక్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పాండునాయక్ కుటుంబాలకు రాజకీయ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం రెండు కుటుంబాల వారు తండాలో గొడవపడ్డారు. ఆ తర్వాత ఇరువురు కోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అయితే రవికృష్ణ కుటుంబీకులకు గాయాలు కావడంతో కొల్లాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లమని కోడేరు పోలీసులు సూచించారు. దీంతో వారు కొల్లాపూర్‌కు రాగా.. అప్పటికే ఆస్పత్రి గేటు ఎదుట వేచి ఉన్న పాండునాయక్ కుటుంబీకులు రవికృష్ణ కుటుంబీకులపై విచక్షణారహితంగా మళ్లీ దాడి చేశారు. ఈ దాడిలో రవికృష్ణనాయక్, రాజునాయక్ తలకు తీవ్రగాయాలవగా, శ్రీవిద్య అనే మహిళకు చేయి విరిగింది.

ఫొటోలు దిగినందుకే..


శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సింగోటం పర్యటనకు వచ్చిన సందర్భంలో ఆమెతో దిగిన సెల్ఫీ ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసినందుకే తమపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పాండునాయక్, ఆయన వర్గీయులు ఇనుపరాడ్లు, గొడ్డళ్లతో దాడులకు పాల్పడ్డారని రవికృష్ణ విలేకరులకు వెల్లడించారు. ఈ ఘటనపై కోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలపై, కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పాండునాయక్ వర్గీయులపై కేసులు నమోదు చేశారు. కాగా, రవికృష్ణ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ఫోన్‌లో పరామర్శించారు.

దాడులు, కేసులకు భయపడం

సాక్షి, హైదరాబాద్: ఉద్యమ పార్టీ అయిన బీఆర్‌ఎస్ ఎన్నో అణచివేతలను ఎదుర్కొని నిలిచిందని, దాడులు, కేసులకు తమ కార్యకర్తలు భయపడరని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు వరుస దాడులకు పాల్పడుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమై అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రజాపాలన అంటే.. ఇదేనా అని ప్రశ్నించారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తూ బెయిల్ కోరతారా?

- శ్రవణ్‌కుమార్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు
- 'ఫోన్ ట్యాపింగ్'కేసులో పీపీ వాదనలు పరిగణనలోకి
- నిందితుడు ముందస్తు బెయిల్‌కు అర్హుడు కాదన్న న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ (ప్రధాన) కేసులో నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. చట్టాన్ని ఉల్లంఘిస్తూ, విచారణకు సహకరించకుండా బెయిల్ కోరడాన్ని తప్పుబట్టింది. చాలా కాలంగా పిటిషనర్ పరారీలో ఉన్నాడని, దర్యాప్తునకు సహకరించడం లేదని, ప్రాథమిక ఆధారాలున్నందునే ఎఫ్‌ఐఆర్‌లో నిందితుడిగా చేర్చామన్న పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ముందస్తు బెయిల్ అనేది.. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించాల్సిన అసాధారణ పరిష్కారమని, అది నిత్యకృత్యం కాదని స్పష్టం చేసింది. గత ఏడాది పాస్‌పోర్టు అథారిటీ అతని పాస్‌పోర్టును రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే ట్రయల్ కోర్టు కూడా ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ శ్రవణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన.. ఆయన పిటిషన్‌ను కొట్టివేశారు.

పిటిషనర్‌పై తీవ్ర ఆరోపణలు..

'చార్జిషీట్‌లో పేరున్న వ్యక్తి చట్టప్రకారం నడుచుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పుల మేరకు విదేశాలకు పరారైన వారు ముందస్తు బెయిల్ పొందేందుకు అర్హులు కాదు. దర్యాప్తు నివేదిక ఆధారంగా నిందితుడు కొన్ని నెలలుగా పరారీలో ఉన్నాడు. పిటిషనర్‌పై మోపిన ఆరోపణల తీవ్రత, న్యాయ సూత్రాల ఆధారంగా అతను ముందస్తు బెయిల్‌కు అర్హుడు కాదు. ఈ నేరంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అస్పష్టమైన ఆరోపణలతో కేసులో ఇరికించారని చెప్పారు. అయితే, పిటిషనర్ చాలా కాలంగా పరారీలో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే, దర్యాప్తులో కీలక భాగం ఇప్పటికీ అసంపూర్ణంగా ఉంది. కస్టడీ విచారణ అవసరం. నిందితుడు శ్రవణ్‌కుమార్ చట్ట నిబంధనలు పాటిస్తూ ఉపశమనం పొందాలి. ఈ కేసులో పిటిషనర్ ప్రవర్తన, అతనిపై ఆరోపణల తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటే ముందస్తు బెయిల్‌కు అర్హుడు కాదు'అని కోర్టు తీర్పు కాపీలో పేర్కొన్నారు.

19 మంది న్యాయమూర్తుల ఫోన్లు ట్యాపింగ్..

అంతకు ముందు పీపీ వాదనలు వినిపిస్తూ.. 19 మంది తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు ట్యాపింగ్ చేశారన్నారు. ట్యాపింగ్ బాధితుల్లో ఓ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా ఉన్నారని చెప్పారు. ఇలాంటి కేసులో పరారీలో ఉన్న నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు బెయిల్ ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, విదేశాల్లో తలదాచుకున్న శ్రవణ్‌కుమార్‌తో పాటు ప్రభాకర్‌రావును ప్రొక్లైమ్డ్ అఫెండర్‌గా (ప్రకటిత నేరస్తుడు) ప్రకటించాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా, పి.రాధాకిషన్‌రావు, భుజంగరావుకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలంటూ పోలీసులు సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని పరిశీలిస్తున్నారు.




విష్వక్సేన ఆరాధన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. గర్భాలయంలో స్వయంభువుల చెంత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. ఆలయ ముఖ మండపంలో విష్వక్సేన ఆరాధనతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావుతో ఆలయ మాడ వీధిలో నృసింహ వైభవం ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభించారు. వేడుకల్లో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.

దొంగతనాలనీ డ్యూటీలా చేస్తాడు..

- ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి స్కూటీపై బయలుదేరి.. నిజామాబాద్‌లో చోరీ చేసి సాయంత్రం 7 గంటలకు తిరిగి ఇంటికి..
- నిందితుడిపై 80 చోరీ కేసులు
- మీడియా సమావేశంలో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐలు సురేశ్ కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు రాజశేఖర్, ఆరిఫ్


ఖలీల్‌వాడి: ఇంటి తాళాలు పగలగొట్టి రెండు గంటల్లో మూడిళ్లలో చోరీ చేసిన ఘరానా దొంగను పోలీసులు 48 గంటలలో పట్టుకున్నట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన సయ్యద్ హమీద్ హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో స్థిరపడ్డాడు. అక్కడ హమీద్ ఆటో డ్రైవర్‌గా పని చేశాడు. ఆటో నడపడం ద్వారా వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో హమీద్ దొంగతనాలు ప్రారంభించాడు. 2009 నుంచి వరుసగా దొంగతనాలు చేస్తున్నాడు. నిందితుడిపై సైబరాబాద్ కమిషనరేట్, సంగారెడ్డి, నిజామాబాద్‌తోపాటు పలుచోట్ల 80 దొంగతనాల కేసులు ఉన్నాయి. 2018లో హమీద్‌పై పీడీయాక్ట్ అమలైంది. చర్లపల్లి జైలులో ఏడాదిపాటు ఉన్నాడు. 2019 నుంచి 2020 వరకు ఎలాంటి దొంగతనాలు చేయకుండా సాధారణ జీవితం గడిపాడు. మళ్లీ 2021 నుంచి దొంగతనాలు ప్రారంభించాడు.

ఒకేరోజు మూడిళ్లలో చోరీ.. 48 గంటల్లో ఛేదించిన పోలీసులు

మరో దొంగతనం కేసులో 2024 డిసెంబర్ వరకు జైలులో ఉన్న హమీద్ గత ఫిబ్రవరి 26న నిజామాబాద్ జిల్లా మాక్లూర్ పీఎస్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ ఏకశిలానగర్‌లోని దుగ్గి బలరాంరెడ్డి ఇంట్లో 26 తులాల 8 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, రూ.2.68 లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన రవి ఇంట్లో 22 గ్రాముల బంగారం, 12 తులాల వెండి, రూ.35 వేలు, అలాగే గంగస్థాన్ ఫేస్-3లోని సాయితేజ ఇంట్లో రూ.60 వేల నగదు దొంగతనం చేశాడు. ఈ దొంగతనాలు మధ్యాహ్న సమయంలోనే చేయడం గమనార్హం. బలరాంరెడ్డి ఇంట్లో దొంగతనం చేసిన సమయంలో అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఈ ఫుటేజీల్లో హమీద్ గోడ దూకుతున్న ఆనవాళ్లు కనబడటంతో వాటి ఆధారంగా 48 గంటలలో కేసును ఛేదించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. సౌత్ సీఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకుని, మూడిళ్లలో దొంగతనం చేసిన బంగారంతోపాటు వెండి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి స్కూటీపై ఉదయం 6 గంటలకు బయలుదేరి తను టార్గెట్ చేసిన ఇళ్లలో దొంగతనం చేసి సాయంత్రం 7 గంటల వరకు తిరిగి ఇంటికి చేరుకోవడం హమీద్ ప్రత్యేకత. దొంగతనం చేసిన ప్రాంతం నుంచి అరగంటలో వెళ్లిపోతాడు. ఈ కేసును ఛేదించిన నార్త్ సీఐ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్, నిజామాబాద్ రూరల్ ఎస్సై ఆరిఫ్, పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

నీరా కేఫ్‌పై రాజకీయం సరికాదు


- విషయాన్ని రాజకీయం చేయొద్దు
- గౌడ సంఘం ప్రతినిధులతో మంత్రి పొన్నం సమావేశం



సాక్షి, హైదరాబాద్: నీరా కేఫ్ విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. శనివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి గౌడ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు నీరా కేఫ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు, గౌడ సంఘం భవన నిర్మాణంతో పాటు ఇతర రాజకీయ ప్రాధాన్యత అంశాలపై చర్చించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ, నీరా కేఫ్‌పై రాజకీయం చేయొద్దని, కుల ప్రతినిధులుగా కులానికి సంబంధించిన విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తామన్నారు. నీరా కేఫ్ కట్టే సందర్భంలో అప్పట్లో గీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు దాని హక్కులు అప్పగిస్తే ఈరోజు ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం నీరా కేఫ్ హక్కులను గీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగిస్తుందని చెప్పారు. తనతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ సంఘానికి అన్నివేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

మా జనాభాను తక్కువగా చూపించారు

- కులగణనపై మున్నూరుకాపు నేతలు
- కాంగ్రెస్ నేత వీహెచ్ ఇంట్లో భేటీ
- వీహెచ్ చైర్మన్‌గా అఖిలపక్షాలతో కమిటీ ఏర్పాటు



వీహెచ్ ఇంట్లో సమావేశమైన మున్నూరుకాపు నేతలు

సాక్షి, హైదరాబాద్: కులగణనలో తమ కులం జనాభా సంఖ్యను తక్కువగా చూపించారని, ఈ గణనను సరిచేయాలని మున్నూరుకాపు కులానికి చెందిన అఖిలపక్ష పార్టీల నేతలు కోరారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన మున్నూరుకాపు నాయకులు శనివారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ వి.హనుమంతరావు అధ్యక్షతన ఆయన నివాసంలో భేటీ అయ్యారు. కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వ ప్రకటన గురించి చర్చించారు. మున్నూరుకాపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అఖిలపక్ష నేతలు పర్యటించి పైలట్ ప్రాంతాల్లో (హుజూర్‌నగర్, కోదాడతో పాటు ఇతర నియోజకవర్గాల్లో) జనాభా వివరాలు సేకరించాలని, అన్ని వివరాలను సీఎంకు అందజేయాలన్నారు. మున్నూరుకాపుల సత్తాచాటేలా రాష్ట్రస్థాయి బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతూ తీర్మానించారు. ఈ భేటీలో కె.కేశవరావు, ఆది శ్రీనివాస్, వద్దిరాజు రవిచంద్ర, గంగుల కమలాకర్, నేతి విద్యాసాగర్, సి.విఠల్, వి.ప్రకాశ్, రౌతు కనకయ్య, బొంతు రామ్మోహన్, బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, గాలి అనిల్‌కుమార్, ఆకుల లలిత, విజయ, కొనగాల మహేశ్, సత్తుమల్లేశం, సర్దార్ పుటం పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష కమిటీ ఏర్పాటు

మున్నూరుకాపుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించడంతో పాటు హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహణ కోసం అఖిలపక్షాలతో కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా వి.హనుమంతరావు, సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కోవా లక్ష్మణ్, సి.విఠల్, మీసాల చంద్రయ్య, బుక్క వేణుగోపాల్, ఆకుల విజయ (బీజేపీ), వద్దిరాజు రవిచంద్ర, గంగుల కమలాకర్, జోగు రామన్న, బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్‌ఎస్), నేతి విద్యాసాగర్, దానం నాగేందర్, ఆకుల లలిత, గాలి అనిల్, బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, కాసుల బాలరాజు, సత్తు మల్లేశం (కాంగ్రెస్)లతో పాటు సమన్వయకర్తలుగా వి.ప్రకాశ్, బొంతు రామ్మోహన్, సర్దార్ పుటం పురుషోత్తమరావు, రౌతు కనకయ్య, కొండా దేవయ్యలను నియమించారు.



నేటి నుంచి రంజాన్ మాసం షురూ

- ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు పాటించాలి
- రుహియ్యతే హిలాల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సజ్జాద్ పాషా

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంతో పాటు దేశ వ్యాప్తంగా నెలవంక కనిపించిందని, దీంతో ఈ నెల 2వ తేదీ ఆదివారం నుంచి రంజాన్ నెల ప్రారంభమవుతుందని రుహియ్యతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) అధ్యక్షుడు మౌలానా హసన్ ఇబ్రహీం హుస్సేనీ సజ్జాద్ పాషా తెలిపారు. మోజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ, నెలవంక శనివారం నగరంతో పాటు దేశంలోని వివిధ ప్రదేశాల్లో కనిపించినట్లు సమాచారం అందినట్లు వివరించారు. దీంతో ముస్లింలు రంజాన్ నెల ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభించాలని సూచించారు. కమిటీ నిర్ణయం ప్రకారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు ఈనెల 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ నెలవంక నిర్ధారణ కమిటీలతో పాటు ఢిల్లీ కమిటీ కూడా నెలవంక కనిపించినట్లు ప్రకటించిందని తెలిపారు. అన్ని కమిటీలతో సంప్రదింపులు జరిపి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

రంజాన్ మానవ సేవ చేయాలనే సందేశాన్నిస్తుంది

సీఎం రేవంత్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మానవ సేవ చేయాలనే సందేశాన్ని రంజాన్ పండుగ సమస్త మానవాళికి అందిస్తుందన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఉపవాస దీక్షలకు ఉపక్రమించిన ముస్లిం సోదర, సోదరీమణులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ మాసం క్రమశిక్షణను పెంపొందిస్తుంది: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించే కఠోర ఉపవాసం, దైవ ప్రార్థనలు ఆధ్యాత్మికతను, జీవిత పరమార్థాన్ని తెలియజేసి, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ముస్లింలకు వైఎస్ జగన్ రంజాన్ మాస శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపవాస దీక్షలు చేస్తున్న అందరికీ అల్లా దీవెనలు మెండుగా ఉండాలని కోరుకుంటున్నానంటూ శనివారం ఆయన ట్వీట్ చేశారు.

ఉర్దూ స్కూళ్ల పనివేళల్లో మార్పు


సాక్షి, హైదరాబాద్: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈనెల 2వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉర్దూ మీడియం పాఠశాలలు, ఉర్దూ మీడియం సెక్షన్లు, డైట్ కళాశాలల్లో ఉర్దూ మీడియం తరగతుల పనివేళల్లో మార్పులు చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ విద్యాసంస్థలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించాలని సూచించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుల తరఫున పి.మదన్‌మోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అప్డేట్ కాకుంటే.. అంతే..

రోజురోజుకూ కృత్రిమ మేధ వినియోగం, ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో అత్యధిక శాతం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు తమ ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయని భయపడుతున్నారట. సాఫ్ట్‌వేర్‌లాగే నైపుణ్యాల విషయంలో తాము కూడా అప్డేట్ కావడం అత్యవసరమని ఇప్పుడు మరింత ఎక్కువగా భావిస్తున్నారట. ఈ మేరకు ప్రొఫెషనల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం 'గ్రేట్ లెర్నింగ్' చేసిన సర్వేలో తేలింది. ఈ సర్వేలో ఉద్యోగులు ఏం అన్నారంటే..

- సాక్షి సెంట్రల్ డెస్క్





80% కన్నా ఎక్కువ.. ఏఐ ముప్పు నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగ భద్రత ఉండాలంటే నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని భావిస్తున్నవారు.

89% ఈ ఏడాదిలోనే సంబంధిత కోర్సులు చేయాలని భావిస్తున్న ఉద్యోగులు.

84% ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/మెషీన్ లెర్నింగ్‌లో ఈ ఏడాదిలోనే జనరేటివ్ ఏఐ స్కిల్స్ పెంచుకోవాలని భావిస్తున్న ఇంజనీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఉద్యోగులు.



రణరంగ రక్షణ కవచాలు

విజ్ఞాన్ వైభవ్ ఎగ్జిబిషన్-2025లో యుద్ధ పరికరాల ప్రదర్శన

- ఆకట్టుకున్న ఆకాశ్, అండర్‌వాటర్ వెహికల్, యాంటీ -జీ సూట్
- ప్రముఖ సంస్థలతోపాటు విద్యార్థుల ఆవిష్కరణలూ ప్రదర్శన

గచ్చిబౌలి: క్షిపణుల నుంచి డ్రోన్ల వరకు.. అత్యాధునిక పారాచ్యూట్‌ల నుంచి యుద్ధ రంగంలో ఊహించని ప్రమాదం నుంచి ప్రాణాలు కాపాడే పరికరాల వరకు.. 'విజ్ఞాన్ వైభవ్ ఎగ్జిబిషన్-2025'లో రక్షణ రంగానికి చెందిన అనేక అరుదైన ఆయుధాలు, పరికరాలు కొలువుదీరాయి. పేరెన్నికగన్న సంస్థలతోపాటు ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన వస్తువులు కూడా ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. వాటిల్లో కొన్ని ఇవీ..



అటానమస్ అండర్ వాటర్ వెహికల్..: స్వయంచాలిత జలాంతర్గత వాహనం (అటానమస్ అండర్ వాటర్ వెహికల్)ను కూడా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచారు. సముద్ర గర్భంలోని శత్రు సబ్ మెరైన్లతోపాటు బాంబు (మైన్స్)లను ఇది తనంత తానుగా గుర్తిస్తుంది. దీనిని మనుషులు నడపాల్సిన అవసరం లేదు. వైజాగ్‌కు చెందిన ఎన్ఎస్‌టీఎల్ దీనిని తయారు చేసింది.



యాంటీ - జీ సూట్, ఓ బాక్స్

యుద్ధ విమానాలు నడిపే ఫైటర్స్ కోసం యాంటీ -జీ సూట్‌ను తయారుచేశారు. భూమి నుంచి 15 వేల మీటర్ల ఎత్తుకు వెళ్లిన తరువాత రక్త ప్రసరణలో మార్పులు వస్తాయి. ఈ సూట్ వేసుకుంటే బీపీ కంట్రోల్‌లో ఉంటుంది. దీని ఖరీదు రూ.20 లక్షల వరకు ఉంటుంది. ఫైటర్ జెట్‌లో కాక్ పిట్‌కు ఆక్సిజన్ బాక్స్ (ఓ బాక్స్)ను కనెక్ట్ చేసి ఉంచుతారు. ఎత్తుకు వెళ్లిన తరువాత ఫైటర్‌కు దీని ద్వారా ఆక్సిజన్ అందిస్తారు. దీనిని స్వదేశీ పరిజ్ఞానంతో బెంగళూరు డీఆర్‌డీఎల్ తయారు చేసింది. దీని ఖరీదు రూ.3 కోట్లు. తేజస్ ఫైటర్ జెట్‌లో దీన్ని వాడతారు.

ఆకాశ్ వెపన్ సిస్టమ్



శత్రుదేశాల డ్రోన్లు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, క్షిపణులను గాల్లోనే తునాతునకలు చేయగల సర్ఫేస్ టు ఎయిర్ ఆకాశ్ ఆయుధ వ్యవస్థ ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డీఆర్‌డీఎల్ రూపొందించిన ఈ క్షిపణి 25 కిలోమీటర్ల ఎత్తులో వెళ్లే యుద్ధ విమానాలను పేల్చి వేయగలదు.



ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీ: ఫిక్స్‌డ్ వింగ్ అన్‌మ్యాన్డ్ ఆటోమేటిక్ వెహికల్ ద్వారా శత్రు శిబిరాలపై బాంబులు వేయవచ్చు. స్వయంచాలితంగా వెళ్లే ఈ వాహనం.. బాంబు వేసిన వెంటనే కాలిపోతుంది. కేవలం రూ.లక్ష ఖర్చుతో తయారుచేసిన ఈ యూఏవీ బరువు 5 కిలోలు. బ్యాటరీల సహాయంతో గంట సేపు ప్రయాణించగలదు. దీనిని ఇబ్రహీంపట్నం శ్రీ ఇందు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనకు ఉంచారు. ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న అనన్య, శివనాగలక్ష్మి, భాను ప్రకాష్, తేజస్విని దీనిని రూపొందించారు.

మల్టీ కంబాట్ పారాచ్యూట్ సిస్టమ్..: మల్టీ కంబాట్ పారాచ్యూట్ సిస్టమ్ (ఎంసీపీఎస్)ను యుద్ధ విమానాలు నడిపే ఫైటర్లు వాడతారు. దీని ఖరీదు దాదాపు రూ.40 లక్షలు. 30 వేల అడుగుల ఎత్తు నుంచి దీని ద్వారా కిందికి దూకవచ్చు. దాదాపు 40 కిలో మీటర్ల దూరం ఎగురుతూ వెళ్లవచ్చు. దీనిని బెంగళూరు డీఆర్‌డీఏ తయారు చేసింది.



మల్టీపర్పస్ అగ్రికల్చర్ వెహికల్..

ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న మరో వాహనం సోలార్ బేస్డ్ మల్టీపర్పస్ అగ్రికల్చర్ వెహికల్. దీని సాయంతో పంటలకు నీళ్లు, రసాయనాలు పిచికారీ చేయవచ్చు. వాహనంపైనే సోలార్ ప్యానల్స్ ఉండటంతో ఇతర ఇంధనాలు దీనికి అవసరం ఉండదు. కేవలం రూ.6,500 ఖర్చుతో గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ విద్యార్థులు తౌఫీక్, సంపత్, రచన, ఇషి, చంటి, తరుణ్, కీర్తన దీనిని రూపొందించారు.

రక్షణ రంగంలో భారత్ అద్భుత ప్రగతి

ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎం మిస్సైల్ అభివృద్ధి చేసిన ఏకైక దేశం భారత్

- రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడం ఎంతో ముఖ్యం
- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి



రాయదుర్గం: భారతదేశం రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడం ఎంతో ముఖ్యమని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో హైపర్ సోనిక్ శక్తిపై ఆధారపడిన లాంగ్ రేంజ్ యాంటీ షిప్ మిస్సైల్ (ఎల్ఆర్ఏఎస్‌హెచ్ఎం) అభివృద్ధి చేసిన ఏకైక దేశంగా భారత్ అవతరించిందని తెలిపారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో 'భారతదేశం రక్షణ, అంతరిక్ష సాంకేతికతలు: పురోగమనం' అనే అంశంపై అఖిల భారత విద్యార్థి పరిషత్ శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన పలు క్షిపణుల గురించి వివరించారు. ఇందులో సర్ఫేస్, క్రూయిజ్, ఎయిర్ మిస్సైళ్లు ముఖ్యమైనవని గుర్తుచేశారు. రక్షణ రంగంలో భారత్ వేగంగా ముందుకు వెళ్తుందనేందుకు జొరావర్ యుద్ధ ట్యాంక్ అభివృద్ధి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును 18 నెలల్లోనే పూర్తి చేయడం భారతీయ ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనమని అన్నారు. భారతదేశం అభివృద్ధి చేసిన అత్యాధునిక బోయిడ్ ఆర్టిల్లరీ గన్ ప్రపంచంలో ఎవరూ రూపొందించలేని అత్యుత్తమ ఆయుధంగా నిలిచిందని తెలిపారు.

అంతరిక్ష రంగంలోనూ జయకేతనం..: అంతరిక్ష రంగంలో కూడా భారత్ విశేష ప్రగతి సాధించిందని సతీష్‌రెడ్డి అన్నారు. భారత్ అభివృద్ధి చేసిన యాంటీ-శాటిలైట్ టెక్నాలజీ ఎంతో అధునాతనమైందని చెప్పారు. ఈ ప్రయోగాల సమయంలో తక్కువ వ్యర్థాలను ఉత్పత్తి చేయడం మనకు గర్వించదగ్గ విషయని పేర్కొన్నారు. చైనా 13 ఏళ్ల క్రితం నిర్వహించిన యాంటీ శాటిలైట్ (అంతరిక్షంలో నిరుపయోగంగా మారిన ఉపగ్రహాలను క్షిపణి ద్వారా కూల్చివేయటం) ప్రయోగంలో అధిక మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి అయ్యాయని చెప్పారు. ఇస్రో - నాసా సంయుక్తంగా చేపట్టిన అంతరిక్ష అన్వేషణ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను కూడా వివరించారు. భారతీయ యువత ప్రపంచస్థాయి నాయకత్వ సామర్థ్యాలను అందిపుచ్చుకోవటం ద్వారా ఈ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు.



'ఎక్స్'పైనే ఎక్కువ వేటుపడింది

అల్లర్లు, ఆందోళనలు, ఉద్యమాలు, యుద్ధ వాతావరణం వంటి పరిస్థితుల వల్ల ఆయా దేశాలు ఇంటర్‌నెట్‌ను ఆపేస్తున్నాయి. స్థానిక సమాచారం బయటకు చేరకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఇలా అత్యధికంగా నెట్ ఆపేసిన సందర్భాలు 2024లో చోటుచేసుకున్నాయి. 2023లో 283 సార్లు ఇలా జరిగితే.. 2024లో ఏకంగా 296 సార్లు ఇంటర్‌నెట్ షట్‌డౌన్ చేశారు. నెట్‌తోపాటు సోషల్ మీడియాను కూడా వాడకుండా చేస్తున్నారు. ఇలా అత్యధికంగా ఆపేసిన వేదికలు.. ఎక్స్, ఫేస్‌బుక్.

ఏ సోషల్ మీడియా	ఎన్నిసార్లు?	ఎన్ని దేశాల్లో?
ఎక్స్	24	14
ఫేస్‌బుక్	22	12
వాట్సాప్	20	10
యూట్యూబ్	15	10
ఇన్‌స్టాగ్రామ్	13	10
టిక్‌టాక్	10	10

ఆధారం : యాక్సెస్ నౌ, కీపిట్ ఆన్ కొయలిషన్ రిపోర్ట్

జైలులో పోసానికి అస్వస్థత

- గుండెల్లో, కడుపులో నొప్పితో బాధపడిన కృష్ణమురళి
- ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేసిన వైద్యులు
- కిడ్నీలో 4 ఎంఎం రాయి ఉన్నట్లు చెప్పిన ఆర్ఎంవో

రాజంపేట రూరల్/కడప అర్బన్: కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టయి, అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి శనివారం అస్వస్థతకు గురయ్యారు. పోసాని గుండెల్లో, కడుపులో నొప్పితో బాధపడ్డారు. శనివారం పోసానిని ములాఖత్‌లో కలుసుకొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి కూడా తన పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యే బయటకురాగానే జైలు అధికారులకు పోసాని అనారోగ్యం గురించి చెప్పారు. వెంటనే డిప్యూటీ సబ్ జైలర్ మల్‌రెడ్డి పట్టణ ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డికి సమాచారం అందించి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ బత్తల వికాస్ ఆయన్ని పరీక్షించి, ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేయించారు. టుడీ ఏకో, గుండె స్కానింగ్ కోసం కడప రిమ్స్‌కు పంపారు. రైల్వే కోడూరు సీఐ పి.వేంకటేశ్వర్లు భారీ బందోబస్తు మధ్య శనివారం సాయంత్రం 4:16 గంటలకు పోసానిని రిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడ క్యాజువాలిటీలో బీపీ, ఈసీజీ, ఈసీజీ, 2డీ ఎకో, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. రాత్రి 7 గంటల తర్వాత తిరిగి రాజంపేటకు తీసుకెళ్లారు. రాత్రి 8.18కి రాజంపేట సబ్ జైల్లోకి తీసుకెళ్లారు.

అన్ని రకాల పరీక్షలు చేశాం: రిమ్స్ ఆర్ఎంవో డాక్టర్ రాజేశ్వరి

పోసాని కృష్ణమురళికి అన్ని రకాల వైద్య పరీక్షలను చేశామని రిమ్స్ ఆర్ఎంవో డాక్టర్ ఎస్ఆర్ రాజేశ్వరి చెప్పారు. ఆయనకు ఒక కిడ్నీలో 4 ఎంఎం రాయి ఉన్నట్లు అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షల్లో తెలిసిందన్నారు. మిగతా ఎలాంటి అనారోగ్యం లేదన్నారు. అన్ని పరీక్షలు చేసి, డిశ్చార్జ్ చేశామన్నారు. కాగా, పోసాని కృష్ణమురళికి ఎలాంటి అనారోగ్యం లేదని, కేవలం నాటకాలు ఆడుతున్నారని రైల్వే కోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు రిమ్స్ ఆవరణలో మీడియాతో చెప్పారు. పోసానిని అనుసరించిన జనసేన యువకులు పోసాని కృష్ణమురళిని కడప రిమ్స్‌కు తీసుకొచ్చినప్పటి నుంచి జనసేన పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు ఆస్పత్రి ఆవరణలో ఆయన్ని అనుసరించారు. రిమ్స్‌లో వైద్య పరీక్షల కోసం ఆయన్ని తీసుకెళ్లిన ప్రతి చోటుకీ వారు వచ్చారు.



కడప రిమ్స్‌లో పోసానికి వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

హెచ్‌సీయూ ఎస్పైర్ ప్రతినిధులు, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విద్యార్థులతో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



వైద్యులను ఏఐ భర్తీ చేయలేదు

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి నాగేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత వైద్యులను భర్తీ చేయలేదని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కానీ ఏఐని ఎలా ఉపయోగించాలో తెలిసిన వైద్యులు మెరుగైన ఫలితాలను సాధిస్తారని చెప్పారు. గచ్చిబౌలి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో శనివారం జరిగిన 'యాస్పైర్ ఫౌండేషన్ డే' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'మీరా'అనే ఏఐ ఆధారిత మెడికల్ ఇన్ఫర్మేషన్ రోబో, ఏఐ గైడెడ్ ఎండోస్కోపీ, డాక్టర్ - రోగి సంభాషణలలోని క్లిష్టమైన భాగాలను సంగ్రహించే సహజ భాషా ప్రాసెసింగ్ సాధనాల గురించి వివరించారు. ముఖ్యంగా సాధారణ రక్త పరీక్షల ద్వారా శరీరంలోని కొవ్వు, కాలేయ పరిస్థితులను 99 శాతం కచ్చితత్వంతో గుర్తించే సాధనాన్ని తన ఏఐ బృందం ఎలా అభివృద్ధి చేసిందో తెలిపారు. ఏఐ సామర్థ్యాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ డేటా భద్రతా ప్రమాదాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా స్టార్టప్ సంస్థలకు మద్దతు ఇచ్చే అంశంలో ఎస్పైర్ - హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ దాని 8వ ఎడిషన్‌లో సీఎస్ఆర్ కింద ఎస్పైర్ ఎకో ఇన్నోవేట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన స్టార్టప్‌లు మెంటార్‌షిప్, వ్యాపార పద్ధతులపై సహకారానికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఎస్పైర్, ప్లాంట్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, క్లస్టర్ హెడ్ జి పృథ్వీరాజ్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు.



తల్లిదండ్రులతో హేమంత్

ఆదిలాబాద్ కా అమితాబ్

పదో తరగతి విద్యార్థి ఎత్తు 6.8 అడుగులు

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ కా అమితాబ్ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. బడిలో చదివే విద్యార్థుల ఎత్తు సాధారణంగా 5 అడుగుల వరకు ఉంటుంది. కానీ ఒక విద్యార్థి ఏకంగా 6.8 అడుగుల ఎత్తుతో ఆకర్షణగా నిలిచాడు. ఆదిలాబాద్ పట్టణం బొక్కల్‌గూడకు చెందిన వన్నెల సుజాత, వినోద్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు హేమంత్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నంబర్-2లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి తాత నందు 6.5 అడుగుల ఎత్తు, తల్లి సైతం అంతే ఎత్తులో ఉంటారు. హేమంత్ చెల్లి పదో తరగతి చదువుతోంది. హేమంత్ 7వ తరగతిలో 5 అడుగుల ఎత్తులో ఉండగా, 8వ తరగతిలో 6 అడుగులు, 9వ తరగతిలో 6.5, ప్రస్తుతం పదో తరగతిలో 6.8 అడుగుల ఎత్తుకు పెరిగాడు. దీంతో స్నేహితులతోపాటు ఇంటి చుట్టుపక్కల వారు, బంధువులు హేమంత్‌ను జూనియర్ అమితాబ్‌గా పిలుస్తున్నారు.

> **చివరి బెంచీలో కూర్చుంటా..**
> అందరికంటే పొడవుగా ఉండటంతో తరగతి గదిలో చివరి బెంచీలో కూర్చుంటాను. ఆటోలో కూర్చోవాలంటే ఇబ్బందిగా ఉంటోంది. పోలీసు ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను. శుభకార్యాలకు వెళ్లినప్పుడు నాతో బంధువులు, మిత్రులు సెల్ఫీలు దిగుతున్నారు. - హేమంత్

పది పిల్లలకు ఎందుకీ 'పరీక్ష'?

సర్కార్‌కు బండి సంజయ్ ప్రశ్న



సాక్షి,హైదరాబాద్: లంచ్ టైం సవరించి టెన్త్ విద్యార్థులను ఇబ్బందిపెట్టడం సరికాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని ఈనెల 6 నుంచి నిర్వహించనున్న ప్రీ ఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం 12.15 నుంచి 3.15 గంటల మధ్య నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. అది విద్యార్థులు, అధ్యాపకులు లంచ్ చేసే సమయమని, అప్పుడు పరీక్షలతో వారిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం సర్క్యులర్‌ను ఉపసంహరించి, పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షా టైం టేబుల్‌ను మార్చాలని కోరారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు సాయంత్రం 4 గంటల తరువాత విధుల నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని, పాఠశాలల వేళలు సైతం ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయని తెలిపారు. అయినప్పటికీ మళ్లీ రంజాన్ పేరుతో వేళాపాళా లేకుండా పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం? ఒక వర్గం వారిని మెప్పించేందుకు యావత్ విద్యార్థుల కడుపు మాడ్చడం న్యాయమా? అని ప్రశ్నించారు. నిబంధనల పేరుతో అడ్డంకులు సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిలో సమానత్వం ఇదేనా? ప్రభుత్వానికి హిందువులంటే అంత చులకనా?'అని మండిపడ్డారు.

పక్షుల జీవనం అమోఘం

'బర్డ్ ఫెస్టివల్'లో పలువురు వక్తలు



మాట్లాడుతున్న డా.సత్యసెల్వం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పక్షుల జీవనం అమోఘమని పలువురు వక్తలు కొనియాడారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో రెండ్రోజులపాటు నిర్వహించనున్న కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ శనివారం ప్రారంభమైంది. మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయా రంగాల నిపుణులు పక్షుల జీవన విధానం, ఆవశ్యకతపై వివరించారు. పీసీసీఎఫ్ (కంపా) సువర్ణ మాట్లాడుతూ తొలిసారి ఈ వర్క్‌షాప్‌లో పక్షుల జీవనంపై విద్యార్థులు, టీచర్లకు అవగాహన కలిగితే సులువుగా బోధన, వాటి సంరక్షణకు వీలవుతుందని తెలిపారు. రిషీవ్యాలీ (మదనపల్లి)కి చెందిన డాక్టర్ శాంతారాం తమ క్యాంపస్‌లో ఉన్న పక్షుల గురించి వివరించారు. బీఎన్‌హెచ్ఎస్‌కు చెందిన డాక్టర్ సత్య సెల్వం ప్రపంచ దేశాల నుంచి స్థానిక పక్షుల వలసల గురించి తెలిపారు. బిక్షం గుజ్జ పలు రకాల పక్షులు, వాటి జీవన తీరుపై వివరించారు. వర్చువల్‌గా ఐఎఫ్ఎస్ అనురాగ్ మిశ్రా పక్షుల సంరక్షణ, అటవీ శాఖ కోణం అంశంపై ప్రసంగించారు. బాసర సీసీఎఫ్ శరవణన్, కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఎఫ్‌డీవోలు, రేంజర్లు, సెక్షన్ ఆఫీసర్లు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధులు, వైల్డ్‌లైఫ్ ఫొటో గ్రాఫర్లు, బయాలజిస్టులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


దుమ్ముగూడెంలో శిథిలావస్థకు చేరిన 1870 నాటి భవనం


భవనంలో నేటికీ చెక్కు చెదరని దర్వాజా, తలుపులు

‘కోట’ కనుమరుగయ్యేనా!

శిథిలమై.. ప్రమాదకరంగా ఆనాటి అద్భుత కట్టడం • 155 ఏళ్ల చరిత్ర గల నాయుడు గారి మేడ భవనం కూల్చివేతకు స్థానికుల వినతి • పరిశీలిస్తున్న అధికార యంత్రాంగం

ఒకటా.. రెండా 155 ఏళ్ల పురాతన కట్టడం. ఎన్ని తరాలకు ఆశ్రయమిచ్చింది. ఎన్ని సంఘటనలకు సాక్షిగా నిలిచింది. అలాంటి అద్భుత భవనం శిథిలమై ప్రమాదకరంగా మారింది.. యజమానులు తరలిపోగా.. ఒంటరిగా మిగిలి కూలిపోయే స్థితికి చేరింది. స్థానికుల వినతిపై భవనాన్ని కూల్చివేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. నాయుడి గారి మేడగా ప్రసిద్ధి చెందిన ఈ భవనం జ్ఞాపకంగా మారనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండల కేంద్రంలో 155 ఏళ్ల క్రితం కలప వ్యాపారి కోట్ల సన్యాసయ్య నాయుడు నిర్మించిన ఈ కట్టడంపై కథనమిది.

– దుమ్ముగూడెం

•••

విజయనగరానికి చెందిన సన్యాసయ్య నాయుడు తండ్రి పోతన్న కలప వ్యాపారం చేసేవారు. తండ్రి బాటలోనే పయనించిన నాయుడు.. యుక్త వయసులోనే వ్యాపార విస్తరణపై దృష్టి సారించారు. తమ్ముడు కోట్ల లక్ష్మణస్వామితో కలిసి రాజమండ్రి, మద్రాస్, భద్రాచలం ఏజెన్సీలో చేపట్టిన కలప వ్యాపారం అభివృద్ధి చెందింది. కలప వ్యాపారిగా అనతికాలంలోనే సన్యాసయ్య నాయుడు ప్రసిద్ధి చెందారు. వెంకటాపురం నుంచి భద్రాచలం వరకు వేలాది ఎకరాల భూములు కొనుగోలు చేశారు.

దుమ్ముగూడెంలో అద్భుత కట్టడం..

దుమ్ముగూడెంలోని అర ఎకరం స్థలంలో 1870లో భారీ భవన నిర్మాణానికి సన్యాసయ్య నాయుడు అంకురార్పణ చేశారు. బ్రిటిష్ ఇంజనీర్ల నుంచి ప్లాన్ తీసుకోవడమే కాక.. జర్మనీ, తంజావూరు నుంచి నిర్మాణ కార్మికులను రప్పించారు. బర్మా నుంచి కలప, జర్మనీ నుంచి రంగురంగుల అద్దాలు తెప్పించారు. భారీ ఇనుప కడ్డీలను పునాదులకు ఉపయోగించారు. ఇంటి నిర్మాణంలో వాసాలుగా నల్ల జిట్రేగి, దర్వాజలకు బ్లూ బెర్రీ కర్ర, స్తంభాలకు రోజ్ వుడ్ వాడటం విశేషం. పై అంతస్తుల్లోకి వెళ్లేందుకు చెక్క మెట్లు నిర్మించారు. సింహద్వారాన్ని దాదాపు రెండేళ్ల పాటు చెక్కినట్లు తెలుస్తోంది. గానుగ సున్నంలో బెల్లం, కోడిగుడ్లు కలిపి గోడలు, పైకప్పు నిర్మించారట. గచ్చు కోసం పోర్ట్‌ల్యాండ్ నుంచి తెప్పించిన ప్రత్యేకమైన సిమెంట్ మిశ్రమాన్ని వాడారు. ఈ గచ్చు.. గ్రానైట్ కంటే సున్నితంగా, అద్దంలా ఉండడం విశేషం. అయిదేళ్ల పాటు పనులు చేపట్టి రెండంతస్తుల భవనం, ఆపైన పెంట్‌హౌస్‌ను పోలిన రెండు వేర్వేరు గదులు నిర్మించారు. మొదటి సగభాగం భవనమైతే, మిగిలిన సగభాగంలో పెంకులతో మండువా ఇంటిలా నిర్మించిన ఈ భవనంలో హాళ్లు కాకుండా 42 గదులున్నాయి. ధారాళమైన వెలుతురు, గాలి ఈ భవనం సొంతం. అప్పుడు విద్యుత్ లేకపోవడంతో చెక్కలతో చేసిన ఫ్యాన్లను బంట్రోతులు నిరంతరం తాళ్లతో తిప్పేవారని, రాత్రిళ్లు కిరోసిన్ దీపాలను వాడేవారని చెబుతారు. సన్యాసయ్య నాయుడు వ్యాపారిగా రాణించడంతో.. లావాదేవీల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ భవనంలోనే బస కల్పించేవారట.


దుమ్ముగూడెంలోని పురాతన భవనం (ఫైల్)

రెండు తరాలకు ఆశ్రయమిచ్చి..

కోట్ల సన్యాసయ్య నాయుడు అన్ని హంగులతో నిర్మించిన ఈ భవనంలో రెండు తరాల వారు నివసించారు. అనంతరం ఉద్యోగ, వ్యాపార రీత్యా వారు గ్రామాన్ని ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ ఉండకపోవడం, గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా కింది అంతస్తు మునుగుతుండడంతో శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఆందోళన చెందుతున్న స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు ఆయన భవనాన్ని కూల్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆర్అండ్‌బీ శాఖను ఇటీవల కోరారు. ఈనేపథ్యాన భవనం కూల్చివేతకు రంగం సిద్ధమవుతోంది. అత్యాధునిక హంగులు, అత్యంత ఖరీదైన ఈ భవనం త్వరలోనే కాలగర్భంలో కలిసిపోనుంది.

గ్రామానికి వన్నె తెచ్చిన కట్టడం..



దుమ్ముగూడెం గ్రామంలో కోట్ల సన్యాసయ్య నాయుడు నిర్మించిన కట్టడం మా గ్రామానికే వన్నె తెచ్చింది. వ్యాపార రీత్యా నిత్యం వందలాది మంది ఆ భవనంలోకి వచ్చేవారు. గోదావరి మీదుగా వ్యాపార సామ్రాజ్యం నడిచే సమయం కావడంతో.. దుమ్ముగూడెం గ్రామం నిత్యం కళకళలాడేది. కోట్ల వారి వారసులు పట్టణాలకు తరలి వెళ్లడంతో.. ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.

– దల్లి అప్పలరెడ్డి, దుమ్ముగూడెం గ్రామస్తుడు


పొలంలో మేస్తున్న ఎద్దులు

పంట పశువుల పాలు

బోరు నీరు రాక రైతు గోస

భూపాలపల్లి రూరల్: జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామంలో వ్యవసాయ బోరు నీరు అడుగంటడంతో పొలానికి నీరందక.. రైతు పంటను ఎద్దులకు మేతగా వదిలివేశాడు. రైతు దాసరి వెంకన్న తనకున్న రెండెకరాల్లో మిర్చితోట, యాసంగిలో అరెకరం వరి పంట సాగు చేశాడు. నెల రోజులుగా బోరులో నీరు అడుగంటి పొలానికి నీరు లేకుండా పోయింది. పొలం నెర్రెలు బారడంతో.. చేసేదిలేక అందులో ఎద్దులను మేపుతున్నట్లు రైతు వాపోయాడు. ఇరవయ్యేళ్లుగా ఏనాడూ పొలాన్ని బీడుగా ఉంచలేదని, ఈ ఏడాది బోరు నీరు లేక ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశాడు.


విషాహారం తిని మృతి చెందిన నెమలి

విషాహారం తిని రెండు నెమళ్లు మృతి

కమలాపూర్: విషాహారం తిని రెండు నెమళ్లు మృతి చెందాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో శనివారం జరిగిన ఈ సంఘటనపై స్థానిక రైతులు, అటవీ శాఖాధికారులు తెలిపిన వివరాలివి. కమలాపూర్ శివారు సమ్మక్క గుట్ట ప్రాంతంలోని ఒక రైతు మామిడి తోటలో చనిపోయిన నెమలితో పాటు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరో నెమలిని రైతులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారుల సూచనతో రైతులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న నెమలిని పశు వైద్యశాలకు తరలించారు. చికిత్స అందించిన అనంతరం నెమలిని జూపార్కుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. కాగా మామిడి తోటలో చెట్లకు కొట్టిన రసాయనిక మందులతో కూడిన ఆహారం తిని నెమళ్లు మృతి చెందినట్లు పశు వైద్యులు ధ్రువీకరించారని అటవీ శాఖ అధికారి ప్రిసిల్ల తెలిపారు.





ఎండలతో అగచాట్లు

ఎండ తీవ్రత పెరగడంతో పాదచారులు, వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. భానుడి ప్రతాపానికి మధ్యాహ్నం వాహనచోదకులు చేతిరుమాలు, స్కార్ఫ్‌లు చుట్టుకుని బయట పనులు చేసుకుంటున్నారు. పెద్దపల్లిలో వాహనచోదకుల అవస్థలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





కళాఖండాల్లా మోడువారిన వృక్షాలు

ప్రకృతి గీసిన చిత్తరువులు

మోడువారినా వృక్షాలు ఆకర్షిస్తున్నాయి. కళాఖండాల్లా కనువిందు చేస్తున్నాయి. ఈ చెట్లు పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ – బేగంపేట మధ్య పంట పొలాల్లో కనిపించాయి. హరితహారంలో పెద్దపల్లి శివారు శాంతినగర్‌లో నాటిన మొక్కలు కూడా ప్రస్తుతం ఆకులు రాలి.. మొత్తం కాయలతో నిండిపోయాయి. ఈ రెండు దృశ్యాలు ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


ఆకుల్లేక కాయలతో నిండిన చెట్టు

వలస కార్మికుల మృత్యు ఘోష

- గల్ఫ్ దేశాల్లో అనారోగ్యం, మానసిక ఒత్తిడితో చనిపోతున్న కార్మికులు
- ఏడాదిలో 200 మంది వరకు మృతి
- ఆరోగ్య హక్కు ఉన్నా.. అవగాహన లేమి
- రెండు నెలల్లో బ్రెయిన్‌డెడ్‌తో 20 మంది మృతి
- వలస కార్మికుల ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలంటున్న కార్మిక సంఘాల నేతలు


గల్ఫ్ దేశం నుంచి వచ్చిన మృతుని శవపేటిక (ఫైల్)

మోర్తాడ్ (బాల్కొండ): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన కర్న గణేశ్ (55) రెండ్రోజుల కిందట సౌదీ అరేబియాలో గుండెపోటుతో మరణించాడు. వారం రోజుల కిందనే ఒమన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రాజన్న అనే వలస కార్మికుడు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై బ్రెయిన్‌డెడ్‌తో మృత్యువాత పడ్డాడు. ఇలా గల్ఫ్ దేశాల్లో తెలంగాణ జిల్లాలకు చెందిన వలస కార్మికులు అనారోగ్యం, మానసిక ఒత్తిడితో గుండెపోటుకు గురై చనిపోతూనే ఉన్నారు. మరికొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏడాది కాలంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఖతర్, ఒమన్, బ్రహెయిన్, కువైట్, ఇరాక్‌లలో దాదాపు 200 మంది వలస కార్మికులు వివిధ కారణాలతో మరణించారు. గతంలో కంటే మరణాల సంఖ్య రెండేళ్ల నుంచి పెరగడంతో కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలస కార్మికుల ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించకపోవడంతోనే ప్రమాదం పొంచి ఉందనే వాదన వినిపిస్తోంది.

అంపశయ్యపై ప్రవాసీల ఆరోగ్యం

గల్ఫ్ దేశాలకు పొట్ట చేతపట్టుకుని వెళ్లిన వలస కార్మికుల్లో అత్యధికులు తక్కువ నైపుణ్యం గల అల్పాదాయ వర్గాలకు చెందిన వారే ఉన్నారు. తాము పని చేసేచోట అనారోగ్యం పాలైతే ఖరీదైన వైద్యం అందుకోలేని దుస్థితిలో ఉన్నారు. వైద్య ఖర్చులను భరించలేక ఎడారి దేశాల్లో వలస కార్మికులు మృత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎల్లలు దాటి విదేశాలకు వలస వెళ్లిన వారికి అంతర్జాతీయ సూత్రాల ప్రకారం ఆరోగ్య హక్కు ఉన్నా దీనిపై అవగాహన లేకపోవడం, విదేశాంగ శాఖ దృష్టి సారించకపోవడం, కంపెనీ యాజమాన్యాల నిర్లక్ష్యంతో వలస కార్మికుల ఆరోగ్య సంరక్షణ గాలిలో దీపంలా మారింది. అధిక పనిగంటలు, తీవ్ర ఒత్తిడి, విశ్రాంతి లేకుండా జీవనం సాగిస్తుండటంతో వలస కార్మికులు మానసిక వేదనకు గురవుతున్నారు. గడిచిన రెండు నెలల్లో 20 మంది బ్రెయిన్‌డెడ్‌తో మరణించినట్లుగా నమోదవడం గమనార్హం. పని చేసే చోట భద్రత లేకపోవడం, నైపుణ్యం లేక ప్రమాదాలకు గురి కావడం వలస కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రవాసీ బీమాలో ‘ఆరోగ్యం’కరువు

దేశం నుంచి గల్ఫ్‌తో సహా 18 దేశాలకు వలస వెళ్తున్న ఈసీఆర్ కేటగిరీ (10వ తరగతి కంటే తక్కువ విద్యార్హత కలిగిన) వారికి భారత ప్రభుత్వం ప్రవాసీ భారతీయ బీమా యోజన పథకం తప్పనిసరి విధానంలో అమలు చేస్తుంది. ప్రమాదంలో మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యానికి గురైన వారికి రూ.10 లక్షల పరిహారం లభిస్తుంది. వలస కార్మికుల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తున్న ఈ బీమా పథకంలో ఆస్పత్రి ఖర్చులకు సంబంధించిన అంశం లేకపోవడంపై కార్మిక సంఘాల నేతలు పెదవి విరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వలస కార్మికుల అనారోగ్య మరణాలు, ఆత్మహత్యలను నిరోధించడానికి విదేశాంగ శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పలువురు కోరుతున్నారు.



సంతలో సందడి..

తిరుపతి నగరంలోని రాయలచెరువు గేటు వద్ద సంతలో మేకలు, పొట్టేలు అమ్మకాలు జోరుగా జరుగుతాయి ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సంతలో వివిధ రకాల మేకలు, పొట్టేళ్ల తో సందడి వాతావరణం నెలకొంది కొనుగోలుదారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి జీవాలను వాహనాల్లో తరలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



బడిబాటలో బందిఖానా

బడికిపోయి చదవడం సంగతి అటుంచి ముందు బడికి చేరుకోవడమే చిన్నారులకు అతిపెద్ద శిక్షగా మారుతోంది. దూరప్రాంతంలో ఉన్న స్కూళ్లకు తమ చిన్నారులను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆటోలు మాట్లాడుకుంటారు. కొందరు ఆటోవాలాలు ఆటోలో లెక్కకు మించి చిన్నారులు కుక్కేస్తుంటారు. శ్రీకాకుళం పట్టణంలో చిన్నారులను ఆటోలో కుక్కి బడికి తీసుకువెళ్తున్న చిత్రం

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



పరీక్షా కాలం

ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు మొదలయ్యాయి. శనివారం ప్రథమసంవత్సరం విద్యార్థులకు తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్ద బారులు తీరారు. విజయవాడ వన్‌టౌన్‌లోని కేబీయన్ కాలేజీ వద్ద పరీక్ష రాసేందుకు విద్యార్థులు భారీగా తరలి వచ్చిన దృశ్యం – సాక్షి ఫొటోగ్రాఫర్, విజ

భూకంపాలను పసిగట్టేలా..

వారం నుంచి నెల రోజుల ముందే గుర్తించే టెక్నాలజీ.. 19 ఏళ్లుగా సాగిస్తున్న పరిశోధనలు తుది అంకానికి

- ఏలూరుకు చెందిన ఇంజనీర్ శివ సీతారామ్ ఆవిష్కరణ
- ప్రస్తుతం 30, 40 సెకన్లు మాత్రమే ముందుగా చెప్పే వ్యవస్థ
- అది కూడా అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితం
- నూతన సాంకేతికతతో భారీ ప్రమాదాలను తగ్గించవచ్చు

భూకంపం ఎలా వస్తుంది..? ఎప్పుడు వస్తుంది..? ఎందుకు వస్తుంది..? ఎంత తీవ్రతతో వస్తుంది..? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల శాస్త్రవేత్తలు ఏళ్ల తరబడి పరిశోధనలు చేస్తూ ఉన్నారు. అయినా కచ్చితమైన ఫలితం రాలేదు. అతి కొద్ది దేశాల్లో 30 నుంచి 40 సెకన్లు మాత్రమే ముందుగా చెప్పే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. మన దేశంలో అయితే అటువంటిది కూడా లేదు. అయితే, తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను వాతావరణ శాఖ ముందుగా గుర్తించి ఎలా సమాచారం అందిస్తుందో అదే తరహాలో భూకంపాలను అంచనా వేసే టెక్నాలజీపై ఏలూరు నగరానికి చెందిన ఇంజనీర్ సాగించిన పరిశోధన తుది అంకానికి చేరుకుంది.

- సాక్షి ప్రతినిధి, ఏలూరు



శివ ఆవిష్కరణ ఇలా...

భూకంపం సమయం, ప్రదేశం, తీవ్రతను వారం నుంచి నెల రోజుల పాటు ముందస్తుగా అంచనా వేసేందుకు శివ సీతారామ్ 19 ఏళ్ల విస్తృతంగా రీసెర్చ్ చేసి ఫలితాన్ని తుది దశకు తీసుకొచ్చారు. ఇలా ముందస్తు అంచనాలతో సిద్ధం చేసిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. 7 మ్యాగ్నిట్యూడ్ కంటే ఎక్కువ తీవ్రత ఉండే భూకంపాలు రావడానికి ముందు 3 నుంచి 6 నెలల పాటు భూమి లోపల పొరల్లో వివిధ రకాల సంకేతాలు అందుతుంటాయి. దాని ప్రభావం 300 కిలోమీటర్ల వరకు ఉంటుంది. దీనినిబట్టి ప్రదేశం, సమయం, తీవ్రతలో కచ్చితత్వాన్ని అంచనా వేయగలిగితే ఆస్తి, ప్రాణ నష్టం నివారించవచ్చు. దీనిపైనే శివ రీసెర్చ్ చేసి సూక్ష్మ స్థాయి మార్పులు భూకంప కేంద్రం నుంచి కొన్ని కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటాయని గుర్తించారు. వీటిని కొన్ని పద్ధతుల్లో నిర్విరామంగా పర్యవేక్షించి అంచనా వేస్తున్నారు. జనవరిలో టిబెట్‌లో (7.1), 2024 జనవరిలో జపాన్‌లో (7.6), 2023 నవంబరులో నేపాల్‌లో (6.3) సంభవించిన భూకంపాల డేటాతో పాటు సుమారు 20 చోట్ల జరిగిన నష్టం తీవ్రత పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టారు.

భూకంపాలు ఎలా వస్తాయంటే..

భూమి లోపల కోర్, మాంటిల్, క్రస్ట్ అనే మూడు ప్రధాన పొరల్లో గణనీయమైన మార్పులతో భూకంపాలు సంభవిస్తుంటాయి ప్రపంచవ్యాప్తంగా ఏటా సగటున రిక్టర్ స్కేల్‌పై 7 మ్యాగ్నిట్యూడ్ కంటే ఎక్కువగా 6 నుంచి 18 వరకు భూకంపాలు వచ్చే అవకాశం ఉంది. మన దేశంలో భూకంపాలను జోన్లుగా విభజించారు. జోన్‌-2లో హైదరాబాద్, దక్కన్ ప్రాంతం ఉన్నాయి. ఇక్కడ సగటున 5 మ్యాగ్నిట్యూడ్ నమోదుకు అవకాశం ఉంది. జోన్‌-3లో కోస్టల్ ప్రాంతం, గోదావరి, తెలంగాణలో కొంత ప్రాంతం ఉన్నాయి. ఇక్కడ 6 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదుకు అవకాశముంది. జోన్‌-4లో ఢిల్లీ, హరియాణా ఉన్నాయి. ఇక్కడ 7 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదుకు అవకాశముంది. హిమాలయాలు, నార్త్ ఈస్ట్ రాష్ట్రాలు, గుజరాత్, ఉత్తరాఖండ్‌లలో 7 నుంచి 9 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదవుతుంది. జోన్‌-5లో అండమాన్ నికోబార్ దీవులు ఉన్నాయి. ఇక్కడ అత్యధికంగా 9 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదయ్యే అవకాశం ఉంది. 6 నుంచి 9 వరకు మ్యాగ్నిట్యూడ్‌ల వరకు ఉంటే ఆస్తి, ప్రాణనష్టాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. దీనిపై మన దేశంలో నేషనల్ జియో ఫిజిక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ పనిచేస్తోంది.

గతంలో భూకంపాలు ఇలా..

2004 డిసెంబర్ 26న వచ్చిన సునామీతో 2.50 లక్షల మంది, 2005 అక్టోబర్ 8న జమ్మూకశ్మీర్‌లో వచ్చిన భూకంపానికి 80 వేల మంది మృత్యువాతపడ్డారు. సునామీ తీవ్రతతో రాష్ట్రంలో 612 మైళ్ల సముద్ర తీరంలో కొంత నష్టం జరిగింది. ఈ పరిణామాల క్రమంలో దేశంలో 2004లో సునామీ అలర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశారు. సముద్రంలో కొన్ని ప్రాంతాల్లో సెన్సార్ల ద్వారా ముందుగానే తెలుసుకుని శాటిలైట్ ద్వారా కమ్యూనికేషన్ అందిస్తున్నారు. సునామీ అలలు గంటకు 700 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేస్తాయి. అండమాన్, నికోబార్‌లో పెద్ద భూకంపాలు వస్తే గంటన్నరలోపు ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరాన్ని తాకుతాయి.

మరింత అభివృద్ధి చేస్తా: శివ సీతారామ్



నా వద్ద ఉన్న తక్కువ సామర్థ్యం పరికరాలతోనే అంచనాలను రూపొందిస్తున్నా. భవిష్యత్‌లో పరిధి మరింత పెంచుకోవడానికి ప్రయత్నించి, మెరుగ్గా అంచనా విధానాన్ని సిద్ధం చేస్తున్నాం. దీంతో 50 పైగా దేశాల భూకంపాల డేటాను పరిశీలించి సమాచారం పంపే అవకాశం ఉంటుంది. దీనిని కొద్ది సంవత్సరాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆవిష్కరిస్తా. భారత వాతావరణ శాఖ 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ భూకంపాలను ముందుగా అంచనా వేసే వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. ఆ దిశగా నా ప్రాజెక్టు సాగుతోంది.

ప్రయోగాలు.. తుది దశకు..

19 ఏళ్లుగా పరిశోధనలు.. ఈ క్రమంలో అనేక అవాంతరాలు, అవరోధాలు..! వీటిని దాటుకుని భూకంపాలను ముందస్తుగా అంటే కనీసం వారం నుంచి నెల రోజుల ముందు గుర్తించే సరికొత్త టెక్నాలజీని సిద్ధం చేశారు ఏలూరుకు చెందిన మరడాని శివ సీతారామ్. ఆరేళ్లుగా భూకంపాలకు సదదంబంధించిన సమగ్ర సమాచారంతో కూడిన డేటాను సేకరించిన ఆయన.. ప్రస్తుతం తుది దశ పరీక్షల్లో ఉన్నాడు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివి ఏడున్నరేళ్ల జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నెట్‌వర్కింగ్‌పై పనిచేసిన శివ.. హైదరాబాద్ కేంద్రంగా భూకంపాలపై పరిశోధనను కొనసాగిస్తున్నారు. 2004లో భూకంపాలు, సునామీలను గుర్తించడం ఎలా అనేదానిపై పరిశోధన ప్రారంభించి సరికొత్త విధానాన్ని రూపొందించారు. ఆరేళ్ల నుంచి ట్విట్టర్, www.seismo.in వెబ్‌సైట్‌లో ఫిలిప్పీన్స్, తైవాన్, జపాన్ ఇథియోపియా, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, టిబెట్, ఇండియా భూకంపాలకు సంబంధించిన సమగ్ర డేటాను పొందుపరిచారు. 2004 నుంచి 300కు పైగా భూకంపాలకు సంబంధించి సమాచారాన్ని సేకరించారు. 2020 నుంచి పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

20 రకాల పద్ధతులతో ముందస్తు అంచనా

ప్రపంచవ్యాప్తంగా 20 రకాల పద్ధతుల్లో భూకంపాలను అంచనా వేస్తున్నారు. టెక్నాలజీలో అభివృద్ధి చెందిన జపాన్, తైవాన్, మెక్సికో, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ లాంటి దేశాలు భూమిలో అమర్చిన సెన్సార్ ద్వారా 30 నుంచి 40 సెకన్ల ముందు పసిగట్టే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాయి.

క్లుప్తంగా...

హోమాగ్నిలో 'నంది' ఆకారం



హోమంలో కనిపించిన నంది ఆకారంలోని మంటలు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నంద్యాల జిల్లా మహానందిలోని యాగశాలలో శనివారం మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఫొటోగ్రాఫర్ తీసిన ఫొటోలో హోమాగ్ని నంది ఆకారాన్ని తలపించింది. విషయం తెలుసుకున్న భక్తులు ఫొటోను ఆసక్తిగా తిలకించారు.

చంద్రబాబు ప్రభుత్వంపై 420 కేసు పెట్టాలి

మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ: గత ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, మోసం చేసినందుకు చంద్రబాబు ప్రభుత్వంపై 420 కేసులు పెట్టాలని, కూటమి సర్కార్‌ను భర్తరఫ్ చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ మోసపూరితంగా ఉందని, గత ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా లేదని అన్నారు. రైతన్నకు రూ.20 వేలు ఇస్తామన్నారని, అయితే, కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి దీనిని అమలు చేస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పథకం అమలుకు ఎంత ఖర్చవుతుంది, బడ్జెట్‌లో ఎంత పెట్టారనేది స్పష్టత లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500, యాభయ్యేళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు, ఆటో డ్రైవర్లకు, చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని చెప్పారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ హామీల ఊసే లేదన్నారు. గత జగన్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను బాగానే అమలు చేసిందన్నారు.

నేటి నుంచి మంత్రి దుర్గేష్ జర్మనీ పర్యటన

సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రంలోని పర్యాటక వనరులపై అవగాహన కల్పించి, ఈ రంగంలో పెట్టుబడులు రాబట్టేందుకు ఆదివారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకూ జర్మనీలో పర్యటించనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్మనీలోని బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్ సిటీ వేదికగా ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ జరిగే ఐటీబీ బెర్లిన్-2025 పర్యాటక వాణిజ్య ప్రదర్శన(ఈ-ఇంటర్నేషనల్ టూరిజం బోర్స్)లో పాల్గొని, రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు సాధిస్తామని చెప్పారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో టీడీపీ కౌన్సిలర్ భర్త అరెస్టు

ప్రొద్దుటూరు: క్రికెట్ బెట్టింగ్ కేసులో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన 40వ వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ భర్త నాగేంద్రను పోలీసులు అరెస్టు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన కౌన్సిలర్ నంద్యాల వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు ఆయన భార్య టీడీపీలో చేరారు. క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి జమ్మలమడుగు పోలీసులు నమోదు చేసిన కేసులో నాగేంద్ర ప్రథమ నిందితుడిగా ఉన్నాడు. గత ఏడాది ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ నాయకులు సీఎం సురేష్ నాయుడు, వీఎస్ ముక్తియార్‌ల సమక్షంలో కౌన్సిలర్ల దంపతులు పార్టీలో చేరారు. ఇటీవలే 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మునీర్‌ను మట్కా కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

శ్రీసిటీలో షార్ స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



ఎగ్జిబిషన్‌లో పలు ప్రదర్శనలను వీక్షిస్తున్న విద్యార్థులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో శ్రీసిటీలో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ట్రిపుల్ ఐటీ, క్రియా విశ్వవిద్యాలయం, అకార్డ్, చిన్మయ విద్యాలయ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుంచి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలు, లాంచ్ ప్యాడ్‌లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, ఇండియన్ రీజనల్ సెన్సింగ్ అప్లికేషన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీలకు సంబంధించి ఆకర్షణీయ నమూనాలను ప్రదర్శించారు. ఈ నమూనాలను వీక్షించి వాటి వివరాలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు మంచి అనుభూతిని, విజ్ఞానాన్ని పొందారు. సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను వివరించడంతో పాటు సైన్స్ సాంకేతికత పట్ల ఆసక్తిని పెంచే రీతిలో విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మంచం పైనుంచి పడి టెన్త్ విద్యార్థి మృతి

ఆస్పత్రి వద్ద మిన్నంటిన తల్లి రోదనలు




మృతిచెందిన విద్యార్థి రియాజ్

పలమనేరు: ''రే నీ ఫ్రెండ్స్ వచ్చారు లేచి చూడరా నాన్నా'' అంటూ బిడ్డ శవం వద్ద ఆ తల్లి చేసిన ఆర్తనాదాలు అక్కడున్న వారిని కలిచివేశాయి. చిత్తూరు జిల్లా పలమనేరు పాతపేటకు చెందిన టెన్త్ విద్యార్థి శనివారం ఉదయం మంచం పైనుంచి కిందపడి తల వెనుకవైపు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పలమనేరుకి చెందిన గౌషాబాషా కుమారుడు రియాజ్(15) ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం నిద్ర లేచేముందు మంచంపై నుంచి కిందపడి అపస్మారక స్థితిలో ఉండటం తల్లి గమనించింది. వెంటనే బిడ్డను పక్కనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పిల్లవాడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ తల్లి పడిన వేదన చుట్టపక్కలవారిని కంటతడి పెట్టించింది. వారం రోజుల్లో జరగనున్న పబ్లిక్ పరీక్షల కోసం కష్టపడి సిద్ధమవుతున్న బిడ్డ ఇలా విగత జీవిగా మారాడని రోదించింది. కాగా బాలుని తండ్రి దుబాయ్‌లో ఉంటున్నాడు. ఫోన్ ద్వారా విషయాన్ని ఆయనకు తెలిపారు.

ఆదిత్య ఎల్ 1 మిషన్ నుంచి అత్యంత విలువైన సమాచారం

ప్రకటించిన ఇస్రో

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2023 సెప్టెంబర్ 2న పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహం సూర్యునిపై పరిశోధనలు చేస్తూ అత్యంత విలువైన సమాచారాన్ని సేకరిస్తోందని ఇస్రో శుక్రవారం తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. భారతదేశానికి మొట్టమొదటి సౌర ఆధారిత మిషన్ ఆదిత్య ఎల్1 కావడం విశేషం. ఆదిత్య ఎల్1లో అమర్చిన పేలోడ్స్ ఒక సంచలనాత్మక పరిశోధన చేసిందని తెలియజేశారు. నియర్ ఆల్ట్రా వయొలెట్ బ్యాండ్ (ఎన్‌యూవీ) దిగువ సౌరవాతావరణంలో ఫోటోస్ఫియర్ మరియు క్రోమోస్ఫియర్‌లో సౌర మంట ''కెర్నల్'' మొట్టమొదటి చాయాచిత్రాన్ని చిత్రీకరించినట్టుగా ఇస్రో శాస్త్రవేత్తలు తెలియజేశారు. 2023 సెప్టెంబర్ 2న ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని 2024 జనవరి 6న భూమినుంచి 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలో వున్న లాంగ్రేజియన్ పాయింట్-1 వద్ద హాలో కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.



ఆదిత్య ఎల్1 ఉపగ్రహం ద్వారా సూర్యునిపై పరిశోధనలు చేస్తూ సౌరగోళంలో కెర్నల్ అనే మంటను ఛాయా చిత్రాలుగా తీసిన దృశ్యం



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 52,731 మంది స్వామిని దర్శించుకున్నారు. 17,664 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది.

కమనీయం..ఆదిదంపతుల కల్యాణం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిదంపతుల కల్యాణం భక్తుల కోలాహలం మధ్య కమనీయంగా సాగింది. శనివారం తెల్లవారు జామున సుమారు 4.30గంటల సమయంలో జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరునిచే మాంగల్యధారణ జరిగింది. ఇదే శుభఘడియల్లో ఆదిదంపతుల సమక్షంలో నూతన జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. అంతకుముందు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి వేదోక్తంగా పూజలు చేశారు. అనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అదిష్టింపజేసి పెండ్లిమండపం వద్దకు వేంచేశారు..

నేడు స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్ల జారీ

తిరుమల: ప్రతి నెలా మొదటి మంగళవారం (మార్చి 4) స్థానికులకు కల్పించే దర్శనంలో భాగంగా ఆదివారం దర్శన కోటా టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. తిరుపతి స్థానికులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమలలోని స్థానికులకు బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ విషయాన్ని గమనించి తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానిక భక్తులు ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

4న అప్పన్న దోలోత్సవం



సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని ఈ నెల 14న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు శనివారం మీడియాకు తెలిపారు. ఈ మేరకు కొండ దిగువ పుష్కరిణి సత్రం వద్ద ఉన్న మండపంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



27వ రోజుకు చేరిన జూడాల నిరసన

తిరుపతి సిటీ: గౌరవవేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. రూ.7 వేల స్టైఫండ్‌తో నెలవారి ఖర్చులు ఎలా గడపాలో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. గౌరవవేతనం పెంచే వరకు తాము సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు.

సమాజానికి ఉపయోగపడేలా సైన్స్ పరిశోధనలు

తిరుపతి సిటీ: సమాజానికి ఉపయోగపడేలా సైన్స్ పరిశోధనలు ఉండాలని ఎస్వీయూ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మట్లాడుతూ ఇటీవల సైన్స్ రంగంలో జరిగిన పరిశోధనలు ప్రపంచంలోనే మన దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసేలా ఉన్నాయని తెలిపారు. ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు మాట్లాడుతూ సైన్స్‌లో ఫిజిక్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

నేటి సమాజానికి భారతీయ జ్ఞాన పరంపర అందాలి

తిరుపతి సిటీ : నేటి ఆధునిక సమాజానికి భారతీయ జ్ఞాన పరంపర అందించాలని, ఇందులో అధ్యాపకుల పాత్ర కీలకమని మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ, జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఎస్వీయూ మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ)లో యూజీసీ సహకారంతో భారతీయ జ్ఞాన పరంపర సమాజ పురోగతి అనే అంశంపై వారం రోజులుగా చేపట్టిన శిక్షణ శనివారం ముగిసింది.



జోడీ రిపీట్...

చిత్ర పరిశ్రమలో హిట్ జోడీకి ఉన్న క్రేజే వేరు. ఓ హీరో, హీరోయిన్ కాంబినేషన్‌లో సినిమా విజయం సాధిస్తే మళ్లీ ఆ కాంబో ఎప్పుడు రిపీట్ అవుతుందా? అనే ఆసక్తి ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఉంటుంది. హిట్ జోడీ రిపీట్ అవుతోందంటే ట్రేడ్ వర్గాల్లో, బిజినెస్ సర్కిల్స్‌లో ఫుల్ క్రేజ్‌తో పాటు అంచనాలు ఉంటాయి. అందుకే అలాంటి హిట్ జోడీని రిపీట్ చేసేందుకు దర్శక-నిర్మాతలు కూడా తమ వంతు ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఇందుకు ఒక్కోసారి కొన్నేళ్లు కూడా పట్టొచ్చు. ప్రస్తుతం తెలుగులో రిపీట్ అవుతున్న జోడీలపై ఓ లుక్కేద్దాం....

పద్దెనిమిదేళ్ల తర్వాత....



హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిషల జోడీ పద్దెనిమిదేళ్ల తర్వాత రిపీట్ అవుతోంది. 'విశ్వంభర' సినిమాలో వీరు జంటగా నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన 'స్టాలిన్' సినిమాలో వీరిద్దరూ తొలిసారి జోడీగా నటించారు. 2006 సెప్టెంబరు 20న విడుదలైన ఈ మూవీ విజయం సాధించింది. ఈ చిత్రం విడుదలైన పద్దెనిమిదేళ్ల తర్వాత చిరంజీవి, త్రిష రెండోసారి 'విశ్వంభర' కోసం స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. 'బింబిసార' వంటి హిట్ మూవీ తీసిన మల్లిడి వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా 'విశ్వంభర' రూపొందుతోంది. ఈ సినిమాని 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న రిలీజ్ చేయనున్నట్లు తొలుత ప్రకటించింది చిత్రయూనిట్. కానీ చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ హీరోగా రూపొందిన 'గేమ్ చేంజర్' కోసం 'విశ్వంభర' సినిమా విడుదలని వాయిదా వేశారు. అయితే మళ్లీ ఎప్పుడు రిలీజ్ చేస్తారనే విషయంపై చిత్రబృందం ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఈ వేసవిలో సినిమా విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది.

షష్టిపూర్తి కోసం 38 ఏళ్ల తర్వాత...



నటుడు రాజేంద్ర ప్రసాద్, నటి అర్చనల జోడీ 38 ఏళ్ల తర్వాత రిపీట్ అవుతోంది. వీరిద్దరూ 'షష్టిపూర్తి' సినిమా కోసం రెండో సారి కలిసి నటించారు. రాజేంద్ర ప్రసాద్, అర్చన జోడీగా డైరెక్టర్ వంశీ తీసిన చిత్రం 'లేడీస్ టైలర్'. 1986 నవంబరు 26న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ సినిమా తర్వాత రాజేంద్ర ప్రసాద్, అర్చన కలిసి నటించలేదు. తాజాగా పవన్ ప్రభ దర్శకత్వం వహించిన 'షష్టిపూర్తి' కోసం వీరు 38 ఏళ్ల తర్వాత మరోసారి జంటగా నటించారు. ఈ చిత్రంలో రూపేష్, ఆకాంక్షా సింగ్ మరో జంట. అయితే ఈ కథ మొత్తం రాజేంద్ర ప్రసాద్, అర్చన చుట్టూనే తిరుగుతుందట. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో షష్టిపూర్తి కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీకి 'షష్టిపూర్తి' అనే టైటిల్ పెట్టారట. రూపేష్ నిర్మించిన ఈ సినిమా ఎప్పుడు విడుదల కానుంది అనే విషయంపై స్పష్టత లేదు.




మధ్యతరగతి యువకుడి ప్రేమకథ

హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య జంటగా నటించిన తొలి చిత్రం 'బేబి'. సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ 2023 జూలై 14న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీలో ఆనంద్, వైష్ణవి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే పడ్డాయి. ప్రత్యేకించి యువతరం ఈ సినిమాకి ఫుల్ ఫిదా అయ్యారు. 'బేబి' తర్వాత వీరు మరోసారి జోడీగా నటిస్తున్నారు. '90స్' (ఎ మిడిల్ క్లాస్ బయోపిక్) వెబ్ సిరీస్‌తో మంచి విజయం అందుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో 32వ చిత్రంగా రూపొందుతోంది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోలో 'మీరు టీవీలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా చూశారు కదా. ఇప్పుడు థియేటర్లో ఒక మిడిల్ క్లాస్ బాయ్ లవ్ స్టోరీ చూడండి. ఇది నా స్టోరీ, నీ స్టోరీ, కాదు కాదు.. మన స్టోరీ. మోస్ట్ రిలేటబుల్ లవ్ స్టోరీ' అంటూ ఆనంద్ దేవరకొండ చెప్పిన డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



మాస్ జాతర



రవితేజ, శ్రీలీల కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'ధమాకా'. 2022 డిసెంబరు 23న విడుదలైన ఈ మూవీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. అందులోనూ ప్రత్యేకించి రవితేజ-శ్రీలీల డ్యాన్సులు, భీమ్స్ సంగీతం ఈ సినిమాకి ప్లస్‌గా నిలిచాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి హిట్ జోడీ రెండేళ్ల తర్వాత 'మాస్ జాతర' సినిమాతో రిపీట్ అవుతోంది. ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. రవితేజ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతోన్న 'మాస్ జాతర'పై ఇండస్ట్రీలో అంచనాలున్నాయి. అందులోనూ రవితేజ-శ్రీలీల హిట్ జోడీ రిపీట్ అవుతుండటం కూడా ఈ సినిమాకి మరింత క్రేజ్ తీసుకొచ్చింది. జనవరి 26న రవితేజ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న 'మాస్ జాతర' సినిమాకి కూడా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండటం మరో విశేషం. వేసవి కానుకగా మే 9న ఈ మూవీని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్.

నాలుగోసారి...



నటుడు శివాజీ, నటి లయది హిట్ జోడీ. 'మిస్సమ్మ' (2003), 'అదిరిందయ్యా చంద్రం' (2004), 'టాటా బిర్లా మధ్యలో లైలా' (2006) వంటి సినిమాల్లో జంటగా నటించి, హిట్స్ అందుకున్నారు. తాజాగా వీరి జోడీ నాలుగోసారి రిపీట్ అవుతోంది. వివాహం తర్వాత సినిమాలకు కొన్నేళ్లు విరామం ఇచ్చిన లయ ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించారు. ప్రస్తుతం లయ, శివాజీ జోడీగా కొత్త సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంతో సుధీర్ శ్రీరామ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై శివాజీ నిర్మిస్తున్నారు. క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది. హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న ఈ జంట నటిస్తున్న నాలుగో చిత్రంపై ప్రేక్షకుల్లో క్రేజ్ నెలకొంది.

బ్యాక్ టు బ్యాక్



హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల కాంబినేషన్ బ్యాక్ టు బ్యాక్ రిపీట్ అవుతోంది. వక్కంతం వంశీ దర్శకత్వం వహించిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మాన్' సినిమాలో నితిన్, శ్రీలీల తొలిసారి జంటగా నటించారు. 2023 డిసెంబరు 8న విడుదలైన ఈ చిత్రం ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. కానీ, నితిన్-శ్రీలీల జోడీ బాగుందనే టాక్ వచ్చింది. ఇప్పుడు ఈ ఇద్దరూ 'రాబిన్‌హుడ్' సినిమాలో జంటగా నటించారు. 'భీష్మ' వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మంచి వినోదాత్మక కుటుంబ కథా చిత్రం ఇదని, నితిన్ కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో రూపొందినట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'రాబిన్‌హుడ్'లో తన పాత్ర, నటన గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారంటూ శ్రీలీల కూడా స్పష్టం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ మూవీ క్రిస్మస్ కానుకగా 2024 డిసెంబరు 25న విడుదల కావాల్సి ఉంది. అయితే ముందుగా ప్రకటించిన తేదీకి విడుదలకాలేదు. మార్చి 28న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్రయూనిట్.

అప్పుడు వినోదం.. ఇప్పుడు థ్రిల్లర్



వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన కెరీర్‌లో విజయవంతమైన చిత్రాల్లో 'సామజవరగమన' ఒకటి. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రెబా మోనికా జాన్ నటించారు. 2023 జూన్ 29న రిలీజైన ఈ సినిమా ప్రేక్షకులను నవ్వించడంతో పాటు హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం తర్వాత 'మృత్యుంజయ్' మూవీ కోసం మరోసారి జోడీ కట్టారు శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్. ఈ చిత్రానికి హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించారు. రమ్య గుణ్ణం సమర్పణలో లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందింది. 'సామజవరగమన'తో వినోదం పంచిన శ్రీవిష్ణు, రెబా జాన్ 'మృత్యుంజయ్'తో ప్రేక్షకులను ఏ మేర భయపెడతారో చూడాలి.

'సీతా రామం' సినిమాతో సూపర్ హిట్ జోడీ అనిపించుకున్న దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ రెండోసారి నటించనున్నారట. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమాలో సాయిపల్లవి లేదా మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే బాలకృష్ణ- ప్రగ్యాజైస్వాల్ జోడీ కూడా రిపీట్ కానుందని సమాచారం. 'అఖండ, డాకు మహారాజ్' వంటి సినిమాల తర్వాత 'అఖండ 2'లో వీరిద్దరూ కలిసి నటించనున్నారట. అయితే 'అఖండ 2'లో హీరోయిన్‌గా సంయుక్తని ప్రకటించారు మేకర్స్. మరి ప్రగ్యా జైస్వాల్ సెకండ్ హీరోయిన్‌గా కనిపిస్తారా? లేదంటే ముఖ్యమైన పాత్ర చేయనున్నారా? అనేది వేచి చూడాలి.

ఇదిలా ఉంటే..
మరికొన్ని జోడీలు కూడా రిపీట్ కానున్నాయని సమాచారం.

- దేరంగుల జగన్ మోహన్



అజిత్

మొత్తం తగలబెడతాడు!

"ఏకే ఒక రెడ్ డ్రాగన్. వాడి రూల్స్‌ని వాడే బ్రేక్ చేసి, వచ్చాడంటే.. వాడి నిప్పుల శ్వాసతో మొత్తం తగలబెడతాడు" అంటూ మొదలవుతుంది 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తెలుగు టీజర్. అజిత్ కుమార్ హీరోగా నటించిన లేటెస్ట్ మల్టీ లాంగ్వేజ్ ఫిల్మ్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. త్రిషా కృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ప్రభు, ప్రసన్న, అర్జున్ దాస్, సునీల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ-సిరీస్‌ల సమర్పణలో మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. తాజాగా శనివారం ఈ సినిమా తెలుగు, హిందీ టీజర్‌ను రిలీజ్ చేశారు మేక ర్స్. "మనం ఎంత గుడ్‌గా ఉన్నా కూడా, ఈ లోకం మనల్ని బ్యాడ్‌గా చేస్తుంది., చూపిస్తా..!, జీవితంలో ఏం ఏం చేయకూడదో కొన్ని సార్లు అవన్నీ చేయాలి బేబీ..' అన్న డైలాగ్స్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

రీ ఎంట్రీకి రెడీ



రంభ

రంభ.. ప్రత్యేకించి పరిచయం అక్కర్లేని పేరు. 90వ దశకంలో హీరోయిన్‌గా రంభ పేరు ఎక్కువగా మార్మోగిపోయింది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ... ఇలా అన్ని భాషల్లో తనదైన ముద్ర వేశారామె. అందం, అభినయం, గ్రేస్‌ఫుల్ స్టెప్పులకు ప్రేక్షకులు ఫిదా అయ్యేవారు. ప్రత్యేకించి ఆమె డ్యాన్స్‌కి అభిమానులున్నారంటే అతిశయోక్తి కాదు. వివాహం తర్వాత కొన్నేళ్లుగా రంభ సినీ పరిశ్రమకు, నటనకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె రీ ఎంట్రీకి సన్నద్ధం అవుతున్నారు. ఈ సందర్భంగా రంభ మాట్లాడుతూ– "నా మొదటి చాయిస్ ఎప్పుడూ సినిమానే. నా రీ ఎంట్రీకి ఇదే సరైన సమయం అని భావిస్తున్నాను. ఇప్పుడు ఎలాంటి సవాల్‌తో కూడుకున్న పాత్రలు చేసేందుకు అయినా నేను సిద్ధంగా ఉన్నాను. కొత్త పాత్రలను ఎంచుకుని, మళ్లీ ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలతో రీ ఎంట్రీ ఇవ్వాలని ఎదురు చూస్తున్నాను" అని తెలిపారు.

వింటేజ్ లవ్

బాలీవుడ్‌లో 'జబ్ వియ్ మెట్, రాక్‌స్టార్, హైవే, లవ్ ఆజ్ కల్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారు ఇంతియాజ్ అలీ. తాజాగా ఈ దర్శకుడు 'ఓ సాథీ రే' అనే వెబ్ సిరీస్‌తో అసోసియేట్ అయ్యారు. కానీ దర్శకుడిగా కాదు. రైటర్, షో రన్నర్‌గా చేస్తున్నారు. ఈ సిరీస్‌కు అరిఫ్ అలీ దర్శకత్వం వహిస్తున్నారు. లవ్, హ్యూమన్ ఎమోషన్స్ ప్రధానాంశాలుగా ఉన్న ఈ సిరీస్‌లో అదితీ రావ్ హైదరీ, అర్జున్ రాంపాల్, అవినాష్ తివారీ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. "ఈ రోజుల్లో అప్పటి వింటేజ్ లవ్ ఫీల్‌ని ఈ సిరీస్‌తో వీక్షకులు అనుభూతి చెందుతారు" అని మేకర్స్ పేర్కొన్నారు. త్వరలోనే ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.



అదితీ రావ్

బిజినెస్ రీల్

ఎన్‌ఎండీసీ డైరెక్టర్‌గా ప్రియదర్శిని



సాక్షి, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ డైరెక్టర్‌గా (పర్సనల్) చీఫ్ జనరల్ మేనేజర్ ప్రియదర్శిని గడ్డం నియమితులయ్యారు. తదుపరి ఉత్తర్వులు లేదా పదవీ విరమణ తేదీ 2026 జనవరి 31 వరకు ఆమె ఈ బాధ్యతల్లో ఉంటారు. ఎన్‌ఎండీసీలో ఈ పదవిని అలంకరించిన తొలి మహిళగా రికార్డు స్థాపించారు. పబ్లిక్ ఎంటర్‌ప్రైస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) 2024 అక్టోబర్‌లో ఎన్‌ఎండీసీ డైరెక్టర్ (పర్సనల్) పదవికి ఆమె పేరును సిఫార్సు చేసింది. మొత్తం ఎనమిది మంది పోటీపడ్డారు. స్టీల్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ తాజాగా ఆమోదం తెలిపింది. కాగా, సంస్థలో అన్ని మైనింగ్ ప్రాజెక్టులలో, ప్రధాన కార్యాలయంలో కూడా ప్రియదర్శిని పనిచేశారు.

దేశీయ విమాన ప్రయాణికుల్లో 11 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఈ ఏడాది జనవరిలో 1.46 కోట్లు నమోదైంది. 2024 జనవరితో పోలిస్తే ఈ సంఖ్య 11.28 శాతం పెరిగింది. ఇండిగో మార్కెట్ వాటా 65.2 శాతానికి పెరిగింది. ఎయిర్ ఇండియా గ్రూప్ వాటా 25.7 శాతానికి తగ్గింది. అకాశా ఎయిర్ 4.7 శాతం, స్పైస్‌జెట్ మార్కెట్ వాటా 3.2 శాతానికి ఎగిసింది. 1.62 శాతం సర్వీసులు రద్దు అయ్యాయి. ఇందులో ఫ్లై బిగ్ 17.74 శాతం, ఫ్లై91 5.09, అలయన్స్ ఎయిర్ 4.35 శాతం సర్వీసులు రద్దయ్యాయి. సరైన సమయానికి సర్వీసులు అందించిన కంపెనీగా 75.5 శాతంతో ఇండిగో ముందు వరుసలో ఉంది. విమానాల రద్దు ప్రభావం జనవరిలో 41,119 మంది ప్రయాణికులపై పడింది. విమానాల ఆలస్యం ప్రభావం 1,78,934 మందిపై చూపింది.

జూన్‌కల్లా న్యూమరస్ మరో మోడల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీలో ఉన్న న్యూమరస్ జూన్ కల్లా మరో మోడల్‌ను ప్రవేశపెడుతోంది. కొత్త మోడల్ ఒకసారి చార్జింగ్‌తో 100 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ ఇంజనీరింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ సౌందరరాజన్ ఎస్ తెలిపారు. మల్టీపర్పస్ ఈ–స్కూటర్ డిప్లోస్ మ్యాక్స్‌ను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. డిప్లోస్ మ్యాక్స్ ఒకసారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్లు పరుగెడుతుందని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో సంస్థకు 30 విక్రయ కేంద్రాలున్నాయి. 2026 మార్చినాటికి ఈ సంఖ్యను 170కి చేరుస్తామని వెల్లడించారు.

ప్రైవేట్ టెల్కో నెట్‌వర్క్‌ల అవసరం లేదు

సీవోఏఐ వ్యాఖ్య



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా టెలికం నెట్‌వర్క్ కవరేజీ ఉన్న నేపథ్యంలో కంపెనీలు సొంతంగా ప్రైవేట్ నెట్‌వర్క్‌లను (సీఎన్‌పీఎన్) ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం దాదాపుగా లేదని టెల్కోల సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ వ్యాఖ్యానించారు. ప్రజలకు టెలికం కనెక్టివిటీ చాలా పరిమితంగా ఉన్న చోట్ల లేదా అస్సలు లేని కనెక్టివిటీనే లేని భౌగోళిక ప్రాంతాల్లో, చాలా తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఇలాంటివి కావాలి తప్ప భారత్‌లో అనవసరమని తెలిపారు. కంపెనీలు తమ ఫ్యాక్టరీ కార్యకలాపాలు మొదలైన అవసరాల కోసం, నేరుగా టెలికం శాఖ నుంచి స్పెక్ట్రంను తీసుకుని, సొంతంగా ప్రైవేట్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కొచ్చర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రైవేట్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడానికి బదులుగా పారిశ్రామిక వృద్ధికి దోహదపడే టెలికం మౌలిక సదుపాయాలను పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. డిజిటల్ భారత్ నిధికి మరింతగా నిధులను సమకూర్చగలిగితే ఇంకా కనెక్టివిటీ అంతగా లేని ప్రాంతాల్లోనూ సేవలను విస్తరించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని కొచ్చర్ పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-3-2025

విశాఖ	482-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	445-00
వరంగల్	447-00
రిటైల్ ధర	5.05

స్మార్ట్‌వాచ్.. ఇష్టం తగ్గింది!



2024 విక్రయాలు 30 శాతం డౌన్

కొత్తదనం లేకపోవడంతో క్షీణత ● ప్రీమియం విభాగంలోనే వృద్ధి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌వాచెస్ పట్ల జనంలో ఆసక్తి తగ్గిందా? 2024 అమ్మకాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. 2023తో పోలిస్తే గత ఏడాది స్మార్ట్‌వాచ్‌ల విక్రయాలు ఏకంగా 30 శాతం క్షీణించాయి. అసంతృప్తికర అనుభవం, ఆవిష్కరణలు లేకపోవడం దీనికి ప్రధాన కారణం అని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. తక్కువ ధర కలిగిన స్మార్ట్‌వాచెస్ విభాగంలో ప్రముఖ బ్రాండ్స్ భారీగా దెబ్బ తిన్నాయి. బలహీన అప్‌గ్రేడ్ సైకిల్స్, మొదటిసారి కొనుగోలుదార్లలో అసంతృప్తికర వినియోగ అనుభవాల కారణంగా అనేక సంవత్సరాల స్థిర వృద్ధి తర్వాత మొదటిసారిగా భారీ తగ్గుదల అని కౌంటర్‌పాయింట్ తెలిపింది.

బ్రాండ్స్‌వారీగా ఇలా..

ప్రతికూల కస్టమర్ సెంటిమెంట్ ప్రభావం ప్రధానంగా టాప్–3 బ్రాండ్స్ ఫైర్ బోల్ట్, బోట్, నాయిస్‌పై చూపింది. ఫైర్ బోల్ట్ సేల్స్ 54 శాతం తగ్గాయి. బోట్ 47 శాతం, నాయిస్ 26 శాతం క్షీణతను నమోదు చేశాయి. సరఫరాలు తగ్గినప్పటికీ ఈ మూడు బ్రాండ్స్ మార్కెట్‌ను నడిపించాయని నివేదిక వివరించింది. తొలి స్థానంలో ఉన్న నాయిస్ 27 శాతం మార్కెట్ వాటాతో మార్కెట్‌ను ముందుకు తీసుకువెళ్లింది. ఆ తర్వాత ఫైర్–బోల్ట్ 19 శాతం వాటాతో రెండవ స్థానంలో ఉంది. 2023లో ఈ కంపెనీ మార్కెట్ వాటా 30 శాతం. 2023లో 17 శాతంగా ఉన్న బోట్ వాటా గత ఏడాది 13 శాతానికి వచ్చి చేరింది. గత సంవత్సరంలో బౌల్ట్ సేల్స్ దాదాపు స్థిరంగా ఉన్నాయి. ఫాస్ట్రాక్ మాతృ బ్రాండ్ అయిన టైటాన్ 35 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిన ఏకైక కంపెనీగా నిలిచింది.

> ఐడీసీ ప్రకారం భారత్‌లో వేరబుల్స్ మార్కెట్ మొదటిసారిగా 2024లో వార్షిక క్షీణతను చవి చూసింది. మొత్తం విక్రయాలు 11.3% తిరోగమనం చెంది 11.9 కోట్ల యూనిట్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌వాచ్ అమ్మకాలు 34.4% తగ్గి 3.5 కోట్ల యూనిట్లకు పడిపోవడం ఈ క్షీణతకు ప్రధాన కారణం. 2023లో వేరబుల్స్ పరిశ్రమలో స్మార్ట్‌వాచ్‌ల వాటా 39.8% నమోదైంది. గత ఏడాది వీటి వాటా 29.4%కి వచ్చి చేరింది.

పరిస్థితుల్లో మార్పు..

హెల్త్ ట్రాకింగ్, అవసరమైన సెన్సార్లపై వినియోగదారుల అవగాహన పెరిగేకొద్దీ.. కస్టమర్ల అనుభవాన్ని మార్చగల అధిక–నాణ్యత మోడళ్లలో పెట్టుబడి పెట్టడానికి కంపెనీలు ఎక్కువ మొగ్గు చూపుతాయని నివేదిక వివరించింది. 'డిమాండ్‌ను ప్రోత్సహించడానికి తయారీ సంస్థలు ఈ విభాగంలో కస్టమర్ నమ్మకాన్ని పునర్నిర్మించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కంపెనీలు కొత్త ఫీచర్లను తీసుకురావడం, వినియోగదారులు వారి పాత స్మార్ట్‌వాచ్‌లను భర్తీ చేయడం వల్ల పరిస్థితుల్లో మార్పు వస్తుంది. ఇదే జరిగితే 2025 విక్రయాల్లో సింగిల్ డిజిట్ స్థాయిలో తగ్గుదల అంచనా వేస్తున్నాం' అని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ విశ్లేషకులు బల్బీర్ సింగ్ అన్నారు.

ప్రీమియం.. మహా జోరు..

ఆసక్తికర అంశం ఏమంటే రూ.20,000 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం స్మార్ట్‌వాచ్‌ల విభాగం మాత్రం దూసుకుపోతోంది. ఈ విభాగంలో అమ్మకాలు 147 శాతం పెరిగాయి. అనుభవజ్ఞులైన వినియోగదారులు అధునాతన, తదుపరితరం స్మార్ట్‌వాచెస్ వైపు మళ్లడం ఈ వృద్ధికి కారణం. దిగ్గజ బ్రాండ్లలో యాపిల్, సీఎంఎఫ్ బై నథింగ్ అత్యధిక వార్షిక వృద్ధిని సాధించాయి. ప్రీమియం విభాగంలో యాపిల్, సామ్‌సంగ్, వన్‌ప్లస్ టాప్–3 స్థానాల్లో కొనసాగుతున్నాయి. తయారీ కంపెనీలు ఇప్పుడు వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడానికి, ఎన్‌ఎఫ్‌సీ, జీపీఎస్, సెల్యులర్ కనెక్టివిటీ వంటి కొత్త ఫీచర్లను చేర్చడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని కౌంటర్‌పాయింట్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ అన్షిక జైన్ వివరించారు. అదే సమయంలో అధిక ధరల్లో మోడళ్లను క్రమంగా పెంచడంతోపాటు పిల్లల విభాగాలను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నాయని అన్నారు.

నెమ్మదైన రీప్లేస్‌మెంట్..

తక్కువ ధర విభాగాలలో మోడళ్ల మధ్య పెద్దగా తేడా లేకపోవడం, తక్కువ సెన్సార్ ఖచ్చితత్వం, సరైన మోడల్‌ను ఎంచుకోవడం కష్టతరం చేసిన అస్పష్ట ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో, అసంతృప్తికరమైన అనుభవం.. వెరశి రీప్లేస్‌మెంట్ చక్రం నెమ్మదిగా సాగిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక వివరించింది. మొదటిసారి వినియోగదారుల సంఖ్య తిరోగమనం, బ్రాండ్స్ మధ్య ధరల యుద్ధాలు.. విలువ, పరిమాణంలో మరింత తగ్గుదలకు దారితీశాయి. అయితే వృద్ధిలో తగ్గుదల తాత్కాలిక విరామం మాత్రమే అని నివేదిక వివరించింది. స్మార్ట్‌వాచ్‌ల వినియోగ స్థాయి ఇప్పటికీ తక్కువగా ఉన్నందున భవిష్యత్తులో కొనుగోళ్ల శాతం పెరగవచ్చని పేర్కొంది.

స్పెక్ట్రం అవసరం మరింత పెరుగుతుంది

టెలికం కార్యదర్శి నీరజ్ మిట్టల్



న్యూఢిల్లీ: దేశీయంగా డేటా వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో టెలికం సదుపాయాలను మరింత మెరుగుపర్చుకోవాల్సి ఉంటుందని కేంద్ర టెలికం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తెలిపారు. మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ వినియోగానికి మరింత స్పెక్ట్రం అవసరమవుతుందని తెలిపారు. అటు 5జీ సేవల కోసం చేసిన ఇన్వెస్ట్‌మెంట్లపై టెల్కోలకు రాబడులు లభించడం కష్టతరంగా ఉంటున్న నేపథ్యంలో ఈ రెండు అంశాల మీద ప్రభుత్వం దృష్టి పెడుతున్నట్లు వివరించారు. దేశీయంగా డేటా స్పీడ్ సగటున 99–100 ఎంబీపీఎస్ నుంచి 151 ఎంబీపీఎస్‌కి పెరిగినట్లు చెప్పారు. సగటున ప్రతి నెలా ఒక్కో యూజరు దాదాపు 29 గిగాబైట్ల డేటాను వినియోగిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో 5జీ నుంచి 6జీకి మారాలంటే మౌలిక సదుపాయాలపై భారీగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుందని, మరింత స్పెక్ట్రం అవసరమవుతుందని చెప్పారు. ప్రైవేట్ టెల్కోలు 5జీ సేవల కోసం 2024లో టెలికం మౌలిక సదుపాయాలు, స్పెక్ట్రంపై రూ. 70,000 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. ప్రస్తుతం జియో, భారతి ఎయిర్‌టెల్ 5జీ సర్వీసులను అందిస్తుండగా.. వొడాఫోన్ ఐడియా, బీఎస్‌ఎన్‌ఎల్ ఇంకా సేవలను ప్రారంభించాల్సి ఉంది. భారీగా డేటాను వినియోగించే యూజర్లున్నందున నెట్‌ఫ్లిక్స్, మెటా, అమెజాన్, గూగుల్‌లాంటి టెక్ దిగ్గజాలు కూడా తమ ఆదాయాల్లో కొంత భాగాన్ని భారత్‌లో నెట్‌వర్క్ మౌలిక సదుపాయాల కల్పన కోసం అందించాలంటూ టెల్కోలు కోరుతున్నాయి.

వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్

అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ వెల్లడి



న్యూయార్క్: బలమైన ప్రైవేట్ పెట్టుబడులు, స్థూల ఆర్థిక స్థిరత్వం నేపథ్యంలో 2025–26లో 6.5 శాతం జీడీపీ వృద్ధిని సాధించడం ద్వారా.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని నిలుపుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ తెలిపింది. భారత బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలనే ఆశయాన్ని సాకారం చేసుకోవడానికి కీలక, సవాలుతో కూడిన నిర్మాణాత్మక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి దేశానికి అవకాశాన్ని అందిస్తుందని వివరించింది. నిరంతర స్థూల ఆర్థిక, ఆర్థిక స్థిరత్వం నేపథ్యంలో ప్రైవేట్ వినియోగంలో బలమైన వృద్ధితో 2024–25, 2025–26లో వాస్తవ జీడీపీ 6.5% పెరుగుతుందని అంచనా. ఇటీవలి కాలంలో ఆర్థిక వ్యవస్థలో నియంత్రణ ఉన్నప్పటికీ భారత ఆర్థిక వృద్ధి బలంగానే ఉంది. 2024–25 మొదటి అర్ధభాగంలో జీడీపీ వృద్ధి 6%గా ఉంది' అని వివరించింది.

నిరర్థక రుణాలు తగ్గాయి..

అధిక–నాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, పెట్టుబడులను ఉత్తేజపరిచేందుకు, అధిక వృద్ధి అవకాశాలను అందుకోవడానికి సమగ్ర నిర్మాణాత్మక సంస్కరణలు చాలా ముఖ్యమైనవని ఐఎంఎఫ్ తెలిపింది. 'కార్మిక మార్కెట్ సంస్కరణలను అమలు చేయడం, మానవ వనరుల బలోపేతం, శ్రామిక శక్తిలో మహిళల అధిక భాగస్వామ్యానికి మద్దతు ఇవ్వడంపై దృష్టి పెట్టాలి. ఆహార ధరల హెచ్చుతగ్గులు కొంత అస్థిరతను సృష్టించినప్పటికీ రిజర్వ్ బ్యాంక్ టాలరెన్స్ బ్యాండ్ (2 నుండి 6 శాతం) పరిధిలో ద్రవ్యోల్బణం విస్తృతంగా తగ్గింది. ఆర్థిక రంగం స్థితిస్థాపకంగానే ఉంది. నిరర్థక రుణాలు బహుళ సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక ఏకీకరణ కొనసాగింది. సర్వీసెస్ ఎగుమతుల్లో బలమైన వృద్ధి మద్దతుతో కరెంట్ ఖాతా లోటు చాలా అదుపులో ఉంది' అని వివరించింది.

దేశం ఖర్చు చేస్తోంది

గత ఏడాది రూ.1,83,01,500 కోట్ల వ్యయం

● యూఎస్, చైనా, జర్మనీని మించిన వృద్ధి

వచ్చే ఏడాది మూడవ స్థానానికి భారత్ ● డెలాయిట్–ఆర్‌ఏఐ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: వస్తు సేవల కోసం 2013లో భారతీయులు వెచ్చించిన మొత్తం రూ.87,15,000 కోట్లు. 2024లో ఇది రెట్టింపై రూ.1,83,01,500 కోట్లకు చేరుకుందని డెలాయిట్ తాజా నివేదిక వెల్లడించింది. ప్రైవేటు వినియోగం 7.2 శాతం వార్షిక వృద్ధితో దూసుకెళ్లిందని, అమెరికా, చైనా, జర్మనీ కంటే భారత్ వేగంగా ఉందని తెలిపింది. భారత్‌లో కస్టమర్ల విచక్షణా వ్యయంపై రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ నివేదికను రూపొందించింది. 2026 నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద వినియోగదారుల మార్కెట్‌గా అవతరించే దిశగా జనాభాపర లాభాలను పొందేందుకు భారత్ మంచి స్థితిలో ఉందని వివరించింది. వ్యవస్థీకృత రిటైల్, అనుభవ ఆధారిత వినియోగం పెరుగుదల.. వెరశి వినియోగాన్ని పెంచడంలో సహాయపడిందని తెలిపింది. వ్యవస్థీకృత రిటైల్ వేగంగా విస్తరిస్తోంది. ఏటా 10 శాతం వార్షిక వృద్ధి నమోదు చేస్తోంది. ఇది 2030 నాటికి రూ.20,04,450 కోట్లకు చేరుకుంటుందని అంచనా అని పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..

పెరగనున్న సంపాదనపరులు..

2030 నాటికి సంవత్సరానికి రూ.8,71,500 కంటే ఎక్కువ సంపాదించే భారతీయుల సంఖ్య దాదాపు మూడు రెట్లు దూసుకెళ్లి 16.5 కోట్లకు చేరుతుందని అంచనా. 2024లో ఈ సంఖ్య 6 కోట్లు. ఇది దేశంలోని మధ్యతరగతి వర్గాల వృద్ధిని, విచక్షణా వ్యయం వైపు ప్రాథమిక మార్పును ప్రతిబింబిస్తుంది. పెరుగుతున్న సంపదతో వినియోగదారులు ధర కంటే నాణ్యత, సౌలభ్యం, అనుభవాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రీమియమైజేషన్, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలతోసహా అనేక కీలక శక్తులు వినియోగంలో దూకుడును నడిపిస్తున్నాయి. ఫిన్‌టెక్ సొల్యూషన్స్, యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు వినియోగదారులు బ్రాండ్లతో ఎలా నిమగ్నమవ్వాలో పునర్నిర్మిస్తున్నాయి. ఈ–కామర్స్ స్వీకరణను పెంచుతున్నాయి. డిజిటల్ వినియోగానికి ఆజ్యం పోస్తున్నాయి.

జెన్ జడ్, మిలీనియల్స్..

జనాభాలో 52 శాతం ఉన్న జనరేషన్ జెడ్, మిలీనియల్స్ ఈ మార్పును నడిపిస్తున్నారు. ప్రీమియం బ్రాండ్లు, స్థిర ఉత్పత్తులు, వ్యక్తిగతీకరించిన అనుభవాల కోసం డిమాండ్‌ను పెంచుతున్నాయి. 'భారత వినియోగదారుల వ్యవస్థ ప్రాథమిక పరివర్తనకు లోనవుతోంది. విచక్షణతో కూడిన వ్యయాల పెరుగుదల, డిజిటల్ వాణిజ్యాన్ని విస్తరించడం, అందుబాటులో రుణాలు.. వెరశి బ్రాండ్లు తమ నియమాలను పునర్నిర్వచించుకుంటున్నాయి' అని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్, కంజ్యూమర్ ఇండస్ట్రీ లీడర్ ఆనంద్ రామనాథన్ అన్నారు. '2030 నాటికి భారతదేశ తలసరి ఆదాయం రూ.3,48,600 దాటుతుందని అంచనా. ఇది వివిధ రంగాలలో కొత్త అవకాశాలను తెరుస్తుంది. వ్యాపారాలు వినియోగదారుల అంచనాలను అందిపుచ్చుకోవడానికి అద్భుత అవకాశాన్ని కలిగి ఉన్నాయి. అందుబాటు ధర, సౌలభ్యం, స్థిరత్వాన్ని సమతుల్యం చేయడం ద్వారా సమాచారం, సాంకేతికతను ఉపయోగించుకుని అత్యంత వ్యక్తిగతీకరించిన అనుభవాలను సృష్టిస్తాయి' అని వివరించారు.

వృద్ధి దశలోకి ప్రవేశం..

పెరుగుతున్న ఆదాయాలు, డిజిటల్ స్వీకరణ, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ప్రాధాన్యతల ద్వారా భారత్‌లో విచక్షణా వ్యయం కొత్త వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్‌ఏఐ) సీఈవో కుమార్ రాజగోపాలన్ అన్నారు. 'వ్యవస్థీకృత రిటైల్, నూతన వాణిజ్య నమూనాలు విస్తరిస్తున్న కొద్దీ ఈ ధోరణులకు అనుగుణంగా ఉండే వ్యాపారాలు వృద్ధి, ఆవిష్కరణలకు అపార అవకాశాలను తెరుస్తాయి. డిజిటల్, ఆర్థిక సమ్మిళిత వృద్ధి దేశంలో ఖర్చులను పెంచుతోంది. రుణ లభ్యత అపూర్వ వేగంతో విస్తరిస్తోంది. క్రెడిట్ కార్డుల సంఖ్య గత ఏడాది దేశవ్యాప్తంగా 10.2 కోట్లు ఉంది. 2030 నాటికి ఈ సంఖ్య 29.6 కోట్లకు దూసుకెళుతుందని అంచనా. దీనివల్ల వినియోగదారులు చేస్తున్న ఖర్చులు పెరుగుతాయి' అని ఆయన పేర్కొన్నారు.



వికసిత భారత్ సాధ్యమే

ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన దేశంగా 2047 నాటికి అవతరించాలనే భారత లక్ష్యం సాకారమయ్యే ఆశయమని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా శనివారం అన్నారు. ఇందుకోసం దేశ తలసరి ఆదాయం ఏటా 7.3 శాతం పెరిగి రాబోయే 24 ఏళ్లలో 14,000 డాలర్లకు చేరుకోవాలని అన్నారు. 'తలసరి ఆదాయంలో ఈ స్థాయి వృద్ధిని సాధించాలంటే భారత జీడీపీ రాబోయే 24 సంవత్సరాలలో 7.9 శాతం దూసుకెళ్లాలి. దేశ తలసరి ఆదాయం 2023–24లో దాదాపు 2,570 డాలర్లు. ఇది దక్షిణ కొరియా, తైవాన్, యూఎస్, ఇతర యూరోపియన్ దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం, సహేతుక మూలధన సేకరణ, నైపుణ్య సముపార్జనతో తలసరి ఆదాయం విషయంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుకోవడానికి భారత్‌కు అపార అవకాశం ఉంది. 21 సంవత్సరాలుగా మన వృద్ధి రేటు (వాస్తవ డాలర్ పరంగా) 7.8 శాతంగా ఉంది. జీడీపీ వృద్ధి రేటుం 7.9 శాతానికి చేరుకోవడం పూర్తిగా సాధ్యమే. వికసిత భారత్ సాకారమయ్యే ఆశయం. ఈ వృద్ధి రేటును రాబోయే 10 సంవత్సరాలు కొనసాగిస్తే 9.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుంది' అని వివరించారు.

ఇరు దేశాలు తగ్గిస్తే..

యూఎస్ ప్రతీకార పన్నులపై పనగరియా మాట్లాడుతూ.. ఇరు దేశాలు సుంకాలను తగ్గిస్తే పరిస్థితులు సానుకూలంగా మారతాయని అన్నారు. ఒకవేళ సుంకాల యుద్ధానికి దారితీస్తే.. అమెరికా భారతదేశంపై సుంకాలు విధించి, న్యూఢిల్లీ తన సొంత సుంకాలతో ప్రతీకారం తీర్చుకుంటే దురదృష్టకర ఫలితం ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ఆశాజనకంగా ఆటో అమ్మకాలు

- స్వల్పంగా పెరిగిన మారుతీ సుజుకీ సేల్స్
- ఎంఅండ్‌ఎం, టయోటా రెండంకెల వృద్ధి
- నెమ్మదించిన హ్యుండై, టాటా మోటార్స్



ఫిబ్రవరిలో ఎగుమతులతో కలుపుకుని కంపెనీల వాహన విక్రయాలు

కంపెనీ	2025	2024	వృద్ధి/క్షీణత (శాతాల్లో)
మారుతీ	1,99,400	1,97,471	1
హ్యుండై	58,727	60,501	(-3)
టాటా మోటార్స్	77,232	84,834	(-8)
ఎంఅండ్‌ఎం	83,072	79,923	15
టయోటా కిర్లోస్కర్	28,414	25,220	13
కియా ఇండియా	25,026	20,200	24
ఎంజీ మోటార్	4,956	4,002	16
హోండా కార్స్	13,078	10,323	(-21)
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటార్స్	4,03,976	368,424	10
రాయల్ ఎన్‌ఫీల్డ్	90,670	75,935	19
సుజుకీ మోటార్‌సైకిల్	90,206	97,435	(-7)
వాణిజ్య వాహనాలు			
మహీంద్రా ట్రాక్టర్స్	25,527	21,672	18

ముంబై: వాహన కంపెనీల విక్రయాలు ఎగుమతులతో కలుపుకుని ఫిబ్రవరిలో ఆశాజనకంగా నమోదయ్యాయి. ప్యాసింజర్స్ వెహికిల్స్ తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ స్వల్ప వృద్ధితో సరిపెట్టుకుంది. డిమాండ్ స్తబ్దుగా ఉండడంతో హ్యుండై, టాటా మోటార్స్ వాహన అమ్మకాలు నెమ్మదించాయి. ఎస్‌యూవీలు, ఎంపీవీ మోడళ్లకు గిరాకీ లభించడంతో మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్ మోటార్ వాహన విక్రయాలు గత నెలలో రెండంకెల వృద్ధి సాధించాయి.

- మారుతీ సుజుకీ దేశీయంగా గత నెలలో 1,60,791 యూనిట్ల వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సంఖ్య 1,60,271 యూనిట్లు. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్–ప్రెస్సో విక్రయాలు 14,782 నుంచి 10,226 యూనిట్లకు తగ్గాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వేగన్–ఆర్ అమ్మకాలు 71,627 నుంచి 72,942 యూనిట్లకు పెరిగాయి. యుటిలిటీ వాహన విభాగంలోని బ్రెజ్జా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎక్స్‌ఎల్6 విక్రయాలు 61,234 నుంచి 65,033 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు కలుపుకొని ఈ ఫిబ్రవరిలో కంపెనీ 1,99,400 యూనిట్ల వాహనాలు విక్రయించింది.
- హ్యుండై మోటార్ ఇండియా మొత్తం వాహన విక్రయాలు 3% క్షీణించి 58,727 యూనిట్లకు వచ్చి చేరాయి. దేశీయంగా భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ.. కేంద్ర బడ్జెట్ 2025లో ప్రతిపాదిత పన్ను సంస్కరణలు, మెరుగైన ద్రవ్య లభ్యత మార్కెట్‌కు అవసరమైన డిమాండ్‌ను అందిస్తాయని ఆశావాదంగా ఉన్నాం' అని కంపెనీ సీఈవో తరుణ్ గర్గ్ అన్నారు.
- టాటా మోటార్స్ మొత్తం వాహన విక్రయాలు 8% తగ్గి 77,232 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- ఎస్‌యూవీలకు డిమాండ్ లభించడంతో ఎంఅండ్‌ఎం మొత్తం అమ్మకాల్లో 15% వృద్ధి నమోదై 83,072 యూనిట్లకు చేరుకున్నాయి.

జనంలో రూ.2000 నోట్లు!



ముంబై: ఉపసంహరించిన రూ.2000 నోట్లలో ఇప్పటి వరకు 98.18 శాతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయి. ప్రజల వద్ద ఇంకా రూ.6,471 కోట్ల విలువైన నోట్లు ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శనివారం తెలిపింది. 2023 మే 19న ఆర్‌బీఐ రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. ఆనాడు చలామణిలో ఉన్న రూ.2000 నోట్ల మొత్తం విలువ రూ.3.56 లక్షల కోట్లు. 2025 ఫిబ్రవరి 28 నాటికి ఈ విలువ రూ.6,471 కోట్లకు వచ్చి చేరిందని ఆర్‌బీఐ పేర్కొంది. ఆర్‌బీఐ కరెన్సీ కార్యకలాపాలను నిర్వహిస్తున్న 19 ఇష్యూ కార్యాలయాల్లో రూ.2000 నోట్లను డిపాజిట్ లేదా మార్చుకునే సదుపాయం ఉంది.

కరుణ్ నాయర్ అజేయ సెంచరీ

- విజయానికి చేరువైన విదర్భ
- రెండో ఇన్నింగ్స్‌లో 249/4
- రాణించిన దానిశ్ మాలేవర్
- కేరళతో రంజీ ట్రోఫీ ఫైనల్


దానిశ్

నాగ్‌పూర్: సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (280 బంతుల్లో 132 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదం తొక్కడంతో రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ జట్టు పటిష్ట స్థితికి చేరింది. కేరళతో జరుగుతున్న తుది పోరులో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న విదర్భ జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో నింపాదిగా బ్యాటింగ్ చేసింది. శనివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ సెంచరీ సాధించగా... దానిశ్ మాలేవర్ (162 బంతుల్లో 73; 5 ఫోర్లు) అర్ధ సెంచరీతో రాణించాడు. మూడో ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన కరుణ్ నాయర్ చివరి వరకు అజేయంగా నిలిచి తాజా రంజీ ట్రోఫీలో నాలుగో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇటీవల విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో 5 సెంచరీలు చేసిన కరుణ్ నాయర్‌కు ఓవరాల్‌గా ఈ సీజన్‌లో ఇది 9వ శతకం కావడం విశేషం. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 37 పరుగులతో కలుపుకొని విదర్భ ఓవరాల్‌గా 286 పరుగుల ముందంజలో ఉంది. నేడు ఆటకు చివరి రోజు కాగా... కరుణ్ నాయర్‌తో పాటు కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. రంజీ ట్రోఫీ నిబంధనల ప్రకారం మ్యాచ్‌లో ఇరు జట్ల రెండు ఇన్నింగ్స్‌లు పూర్తికాక పోతే... తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఆ లెక్కన అనూహ్య జరిగితే తప్ప విదర్భ జట్టు మూడోసారి రంజీ ట్రోఫీ చేజిక్కించుకోవడం లాంఛనమే.

ఆ క్యాచ్ పట్టుంటే...

సీజన్ ఆసాంతం నిలకడగా రాణించిన విదర్భ జట్టు... ఫైనల్లోనూ అదే జోరు కొనసాగిస్తోంది. కేరళ బౌలర్ల ధాటికి మూడు ఓవర్లు ముగియక ముందే ఓపెనర్లు పార్థ్ రేఖడే (1), ధ్రువ్ షోరె (5) అవుట్ కావడంతో ఒక దశలో విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 7 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కేరళ జట్టు అదే ఒత్తిడిని కొనసాగిస్తే మ్యాచ్ మలుపు తిరగడం ఖాయమనిపించింది. అయితే ఇలాంటి స్థితిలో సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ తన విలువ చాటుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీతో విజృంభించిన దానిశ్ మాలేవర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించడంతో ఏమాత్రం తొందరపాటుకు పోకుండా జాగ్రత్తగా ఆడుతూ పరుగులు సాధించారు. 31 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అధన్ టామ్ బౌలింగ్‌లో నాయర్ ఇచ్చిన క్యాచ్‌ను మొదటి స్లిప్‌లో అక్షయ్ చంద్రన్ వదిలేయడంతో కేరళ జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. తక్కువ ఎత్తులో వచ్చిన క్యాచ్‌ను అందుకోవడంలో అక్షయ్ విఫలమయ్యాడు. ఇక ఆ తర్వాత ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వని నాయర్ సంయమనంతో ముందుకు సాగాడు. ఈ క్రమంలో కరుణ్ నాయర్ 104 బంతుల్లో... దానిశ్ 123 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. కేరళ సారథి సచిన్ బేబీ ఎంతమంది బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. ఈ ఏడాది ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్... కేరళ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో నాయర్ 184 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సెంచరీ అనంతరం తొమ్మిది అంకెను సూచిస్తూ నాయర్ సంబరాలు చేసుకున్నాడు. మూడో వికెట్‌కు 346 బంతుల్లో 182 పరుగులు జోడించిన అనంతరం దానిశ్ అవుటయ్యాడు. ఆ తర్వాత యశ్ రాథోడ్ (56 బంతుల్లో 24) కొద్ది సేపు నాయర్‌కు సహకారం అందించాడు. నాలుగో వికెట్‌కు 123 బంతుల్లో 49 పరుగులు జోడించిన అనంతరం రాథోడ్ అవుట్ కాగా... సారథి అక్షయ్ వాడ్కర్ (33 బంతుల్లో 4 బ్యాటింగ్)తో కలిసి నాయర్ నాలుగో రోజు ఆట ముగించాడు. చేతిలో 6 వికెట్లు ఉన్న కేరళ... ఆదివారం ఆఖరి రోజు వీలైనంత ఎక్కువసేపు బ్యాటింగ్ చేయాలని భావిస్తోంది. కేరళ బౌలర్లలో నిధీశ్, జలజ్ సక్సేనా, ఆదిత్య సర్వతే, అక్షయ్ చందన్ తలా ఒక వికెట్ పడగొట్టారు.


కరుణ్ నాయర్



“మైదానంలో అడుగుపెడితే పరుగులు సాధించడమే నా పని. ప్రస్తుతం అదే చేస్తున్నా. భారత జట్టుకు తిరిగి ఎంపికవడం నా చేతిలో లేదు. దానిపై ఏం వ్యాఖ్యానించలేను. ఈ మ్యాచ్‌కు ముందు 8 శతకాలు చేశాను. జట్టు సహాయ సిబ్బందితో దీని గురించి మాట్లాడా. ఈ రోజు సెంచరీ చేస్తే తొమ్మిదో అంకె చూపుతానని చెప్పా. అది సాధ్యమైంది కాబట్టే అలా సంజ్ఞ చేశా. నేను క్రీజులో అడుగుపెట్టినప్పుడు జట్టు 7/2తో ఉంది. దీంతో సుదీర్ఘంగా బ్యాటింగ్ చేయాలని ముందే అనుకున్నా. కొన్ని కఠిన సవాళ్లు ఎదురైన సెంచరీ పూర్తిచేసుకొని అజేయంగా నిలవడం ఆనందంగా ఉంది. ఆదివారం కూడా ఇదే ఏకాగ్రతతో బ్యాటింగ్ చేస్తాం. తొలి ఇన్నింగ్స్‌లో రనౌట్ కావడం ఎంతో బాధించింది. లేకపోతే అప్పుడు కూడా శతకం సాధిస్తానని అనుకున్నా. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. కానీ ఓపిగ్గా ప్రయత్నించి పరుగులు రాబట్టా. నాకు ఇది నాలుగో రంజీ ట్రోఫీ ఫైనల్. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.

-కరుణ్ నాయర్, విదర్భ బ్యాటర్

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 379; కేరళ తొలి ఇన్నింగ్స్: 342; విదర్భ రెండో ఇన్నింగ్స్: పార్థ్ రేఖడే (బి) జలజ్ సక్సేనా 1; ధ్రువ్ షోరే (సి) అజహరుద్దీన్ (బి) నిధీశ్ 5; దానిశ్ మాలేవర్ (సి) సచిన్ బేబీ (బి) అక్షయ్ చంద్రన్ 73; కరుణ్ నాయర్ (నాటౌట్) 132; యశ్ రాథోడ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆదిత్య సర్వతే 24; అక్షయ్ వాడ్కర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (90 ఓవర్లలో 4 వికెట్లకు) 249. వికెట్ల పతనం:** 1-5, 2-7, 3-189, 4-238, **బౌలింగ్:** నిధీశ్ 10-2-37-1; జలజ్ సక్సేనా 32-7-76-1; అధన్ టామ్ 10-0-38-0; ఆదిత్య సర్వతే 25-8-55-1; బాసిల్ 4-1-6-0; అక్షయ్ చంద్రన్ 9-1-29-1.

అనిరుధ్ జోడీకి టైటిల్



బెంగళూరు: హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్... బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో డబుల్స్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అనిరుధ్ (భారత్)-రే హో (చైనీస్ తైపీ) జంట 6-2, 6-4తో బ్లేక్ బేల్డన్-మాథ్యూ రోమియోస్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు బెంగళూరు ఓపెన్ టెన్నిస్ టోర్నీ నిర్వహించగా... అందులో ఏడుసార్లు భారతీయ ప్లేయర్లు డబుల్స్ చాంపియన్స్‌గా నిలిచారు. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో అనిరుధ్-రే హో జంట నెట్ గేమ్‌తో చెలరేగింది. తొలి సెట్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్న అనిరుధ్ జంట... రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా వెనక్కి తగ్గకుండా విజయం ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో రూ.8.65 లక్షల నగదు బహుమతితో పాటు... 125 ర్యాంకింగ్ పాయింట్లు అనిరుధ్ జోడీ ఖాతాలో చేరాయి.

తనీషా-ధ్రువ్ ఓటమి

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్లు తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జర్మన్ ఓపెన్ సెమీఫైనల్లో పరాజయం పాలయ్యారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో శనివారం ఎనిమిదో సీడ్ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట 23-25, 21-10, 15-21తో గ్లోరియా-రేహాన్ (ఇండోనేసియా) ద్వయం చేతిలో ఓడింది. దీంతో ఈ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో చివర్లో ఒత్తిడికి గురైన భారత జంట వెనుకంజలో పడింది. రెండో గేమ్ ఆరంభం నుంచే చెలరేగి ఆడిన తనీషా-ధ్రువ్... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను సమం చేశారు. అయితే మూడో గేమ్‌లో కీలక సమయాల్లో జోరు కొనసాగించలేక పరాయం పాలయ్యారు. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో తనీషా-ధ్రువ్ జంట 21-14, 21-17తో చైనా జోడీ జియా జియాన్ -మెంగ్ యింగ్ పై గెలిచింది.

ఆంధ్రప్రదేశ్ శుభారంభం



పంచ్‌కులా: సీనియర్ మహిళల జాతీయ హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు శుభారంభం చేసింది. హరియాణాలోని పంచ్‌కులాలో జరుగుతున్న ఈ టోర్నీలో 'సి' డివిజన్ పూల్ 'బి' నుంచి బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ జట్టు శనివారం ఆడిన తొలి మ్యాచ్‌లో 9-0 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌పై ఘనవిజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయింది. ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున మేరీ (15వ, 23వ, 28వ, 31వ, 50వ నిమిషాల్లో) ఐదు గోల్స్‌తో అదరగొట్టింది. టోర్నీ తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో ఢిల్లీ 4-1 గోల్స్ తేడాతో చండీగఢ్‌పై, ఛత్తీస్‌గఢ్ 5-1 గోల్స్ తేడాతో హిమాచల్‌పై, కేరళ 10-0 గోల్స్ తేడాతో గుజరాత్‌పై విజయాలు సాధించాయి.

చాంపియన్ యూకీ జోడీ



దుబాయ్: భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ ఈ ఏడాది తొలి టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. దుబాయ్ చాంపియన్‌షిప్ ఏటీపీ-500 టోర్నీలో అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)తో కలిసి యూకీ బాంబ్రీ పురుషుల డబుల్స్ ఫైనల్లో విజయం సాధించాడు. శనివారం జరిగిన తుదిపోరులో యూకీ-పాపిరిన్ జంట 3-6, 7-6 (14/12), 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో రెండో సీడ్ హెలియోవారా (ఫిన్‌లాండ్)-హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) జోడీపై విజయం సాధించింది. ఆద్యాంతం హోరాహోరీగా సాగిన పోరులో ఇండో-ఆసీస్ జోడీ 8 ఏస్‌లు సంధించి రెండు డబుల్ ఫాల్ట్స్ చేసింది. అదే సమయంలో హెలియోవారా-ప్యాటెన్ ద్వయం 4 ఏస్‌లు సాధించి 2 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన బాంబ్రీ జంట... తర్వాత కోలుకొని వరుస సెట్లలో విజృంభించింది. 32 ఏళ్ల యూకీ బాంబ్రీ కెరీర్‌లో ఇదే తొలి ఏటీపీ-500 టైటిల్ కావడం విశేషం. దీంతో అసోసియేషన్ ఆఫ్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్‌లో యూకీ నాలుగో డబుల్స్ టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. మరో మూడు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ముంబై, మోహన్ బగాన్ మ్యాచ్ 'డ్రా'



ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో భాగంగా శనివారం ముంబై సిటీ, మోహన్ బగాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2-2 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. మ్యాచ్ ఆరంభం నుంచి జోరు కనబర్చిన మోహన్ బగాన్ జట్టు... చివర్లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చి 'డ్రా'తో సరిపెట్టుకుంది. మోహన్ బగాన్ తరఫున జేమీ మెక్ లారెన్ (32వ నిమిషంలో), దిమిత్రి పెట్రాటోస్ (41వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. ముంబై సిటీ తరఫున జాన్ టొరల్ (57వ నిమిషంలో), నాథన్ రోడ్రిగ్స్ (89వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. తొలి అర్ధభాగం ముగిసే సరికి 2-0తో స్పష్టమైన ఆధిక్యంలో ఉన్న మోహన్ బగాన్.. ద్వితీయార్ధంలో పట్టుకోల్పోయింది. తాజా సీజన్‌లో 23 మ్యాచ్‌లాడిన మోహన్ బగాన్.. 16 విజయాలు, 2 పరాజయాలు, 5 'డ్రా'లతో 53 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ముంబై సిటీ జట్టు 22 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, 5 పరాజయాలు, 9 'డ్రా'లతో 33 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో ఉంది.

కేరళ బ్లాస్టర్స్, జంషెడ్‌పూర్ మధ్య శనివారమే జరిగిన మరో మ్యాచ్ కూడా 1-1 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. కేరళ బ్లాస్టర్స్ తరఫున కోరూ సింగ్ (35వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించగా... జంషెడ్‌పూర్ తరఫున మిలోస్ డ్రినికిక్ (86వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు.



మూడో ర్యాంక్‌కు గుకేశ్

న్యూఢిల్లీ: ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్తున్నాడు. ఈ భారత గ్రాండ్‌మాస్టర్ టాప్-3 ర్యాంకుల్లో నిలిచాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శనివారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 18 ఏళ్ల టీనేజ్ సంచలనం కెరీర్‌లో అత్యుత్తమంగా మూడో ర్యాంకుకు ఎగబాకాడు. డిసెంబర్‌లో సింగపూర్‌లో జరిగిన చాంపియన్‌షిప్‌లో ప్రపంచ కిరీటం గెలిచిన గుకేశ్ ఫిబ్రవరిలో 10 పాయింట్లను మెరుగుపర్చుకోవడంతో 2787 రేటింగ్స్‌తో మూడో స్థానానికి చేరుకున్నాడు. తొలి రెండు స్థానాల్లో నార్వే సూపర్ గ్రాండ్‌మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్ (2833), హికరు నకమురు (2802; అమెరికా) ఉన్నారు. గత నెల నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద చేతిలో టైబ్రేక్‌లో ఓడిన గుకేశ్ చివరకు రన్నరప్‌గా సరిపెట్టుకున్నాడు. టాటా చెస్ టైటిల్ నెగ్గిన ప్రజ్ఞానంద మళ్లీ టాప్-10లోకి వచ్చాడు. 17 పాయింట్లు మెరుగుపర్చుకున్న అతను 2758 రేటింగ్స్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ప్రజ్ఞానంద గత ఏడాది జూలైలో తొలిసారి టాప్-10 ర్యాంకింగ్స్‌లోకి ఎగబాకాడు.

ప్రజ్ఞానంద బోణీ...

ప్రేగ్ (చెక్‌రిపబ్లిక్): భారత ఆటగాళ్లు ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటుకున్నారు. గ్రాండ్ మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద ఈ టోర్నీలో బోణీ కొట్టగా, ఇదివరకే ఖాతా తెరిచిన అరవింద్ చిదంబరం ఒక్కడే స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. టోర్నీ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగిన ప్రజ్ఞానందకు తొలి రెండు గేముల్లోనూ డ్రా ఫలితాలే ఎదురయ్యాయి. శనివారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో తమిళనాడు ఆటగాడు... స్థానిక చెస్ రిపబ్లిక్ ప్లేయర్ ఎన్‌గుయెన్ థాయ్‌డే వాన్‌పై గెలుపొందాడు. మరో పోరులో అరవింద్... చైనా ప్రత్యర్థి వీ యిని ఓడించాడు.


షఫాలీ

'ప్లే ఆఫ్స్'కు ఢిల్లీ క్యాపిటల్స్

బెంగళూరుపై 9 వికెట్లతో ఘన విజయం	ఆర్‌సీబీకి వరుసగా నాలుగో ఓటమి	చెలరేగిన షఫాలీ, జొనాసెన్


జొనాసెన్

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సొంత ప్రేక్షకుల్ని మళ్లీ నిరాశపర్చింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో బెంగళూరు గడ్డపై వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఓడింది. తద్వారా ఈ వేదికపై ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పరాజయం చవిచూసిన స్మృతి మంధాన సేన ప్లేఆఫ్స్ రేసుకు దాదాపు దూరమైంది. మరో వైపు లీగ్‌లో ఐదో విజయాన్ని నమోదు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. శనివారం జరిగిన పోరులో మెగ్‌లానింగ్ నేతృత్వంలోని ఢిల్లీ 9 వికెట్ల తేడాతో బెంగళూరుపై ఘన విజయం సాధించింది. టాస్ నెగ్గిన క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. కెప్టెన్ స్మృతి (8) పేలవంగా ఆడి నిష్క్రమించగా, ఎలైస్ పెరీ (47 బంతుల్లో 60 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడింది. రాఘ్వీ బిస్త్ (32 బంతుల్లో 33; 2 సిక్స్‌లు)తో కలిసి మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించింది. ప్రత్యర్థి బౌలర్లలో శిఖా పాండే, శ్రీచరణి చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 15.3 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 151 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (2) సింగిల్ డిజిట్‌కే అవుటవగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షఫాలీ వర్మ (43 బంతుల్లో 80 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా బెంగళూరు బౌలింగ్‌ను దంచేసింది. వన్‌డౌన్ బ్యాటర్ జెస్ జొనాసెన్ (38 బంతుల్లో 61 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి వీరవిహారం చేసిన షఫాలీ అభేద్యమైన రెండో వికెట్‌కు 146 పరుగులు జోడించింది. జెస్, షఫాలీ ఇద్దరు కూడా 30 బంతుల్లోనే ఫిఫ్టీలను పూర్తి చేసుకున్నారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (సి)లానింగ్ (బి) శిఖా 8; డానీవ్యాట్ (సి) బ్రైస్ (బి) మరిజాన్ 21; పెర్రీ నాటౌట్ 60; రాఘ్వీ బిస్త్ (స్టంప్డ్) బ్రైస్ (బి) శ్రీచరణి 33; రిచాఘోష్ (సి) లానింగ్ (బి) శ్రీచరణి 5; కనిక (సి) షఫాలీ (బి) శిఖా 2; జార్జియా నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 147. వికెట్ల పతనం:** 1-9, 2-53, 3-119, 4-125, 5-128. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4-0-18-1, శిఖా పాండే 4-0-24-2, జెస్ జొనాసెన్ 3-0-33-0, అనాబెల్ 4-0-27-0, శ్రీచరణి 4-0-28-2, మిన్ను మణి 1-0-14-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి) పెర్రీ (బి) రేణుక 2; షఫాలీ నాటౌట్ 80; జెస్ జొనాసెన్ నాటౌట్ 61; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (15.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1-5. **బౌలింగ్:** రేణుక 4-1-28-1, కిమ్‌గార్త్ 3-0-25-0, ఎలిస్ పెర్రీ 2-0-24-0, జార్జియా 3-0-21-0, స్నేహ్ రాణా 1.3-0-22-0, ఏక్తా బిస్త్ 1-0-15-0, రాఘ్వీ బిస్త్ 1-0-11-0.

రచ్చకెక్కిన చర్చ

ట్రంప్ వర్సెస్ జెలెన్‌స్కీ | సర్వత్రా దానిపైనే చర్చ | అధ్యక్షుల వాగ్వాదం జరిగిందిలా...

వాషింగ్టన్

చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా అధ్యక్షుల వాగ్వాదానికి, పరస్పర ఆక్షేపణలకు, వాగ్బాణాలకు వైట్‌హౌస్ శుక్రవారం వేదికగా నిలిచింది. మీడియా సాక్షిగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్షంగా ప్రసారమైన భేటీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధినేత వొలొదిమిర్ జెలెన్‌స్కీ మధ్య సాగిన విమర్శలపర్వం సర్వత్రా చర్చనీయంగా మారింది. నిజానికి ఈ రగడకు అగ్గి రాజేసింది వారితో పాటు చర్చల్లో పాల్గొన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్. అలా ఒక్కసారిగా వేడెక్కిన పరిస్థితి కాస్తా చూస్తుండగానే అదుపు తప్పిపోయింది. చివరికి జెలెన్‌స్కీని ట్రంప్ వైట్‌హౌస్ వదిలి పొమ్మనడం, చర్చలకు అర్ధాంతరంగా ఫుల్‌స్టాప్ పెట్టి ఆయన వెనుదిరగడం దాకా వెళ్లింది! జెలెన్‌స్కీ వైట్‌హౌస్ సందర్శన రద్దవడమే గాక రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా దన్ను కొనసాగడం కూడా అనుమానంలో పడింది. వారి మధ్య వాగ్యుద్ధం ఎలా జరిగిందంటే...

వాన్స్: (బైడెన్‌ను ఉద్దేశించి) నాలుగేళ్లుగా అమెరికా (తాజా మాజీ) అధ్యక్షుడు (బైడెన్) రష్యా అధినేత పుతిన్‌ను ఉద్దేశించి గట్టి మాటలు మాట్లాడుతూ వచ్చారు. అయినా పట్టించుకోకుండా ఉక్రెయిన్‌పై దండెత్తిన పుతిన్ ఆ దేశాన్ని చాలావరకు నేలమట్టం చేశారు. ఇప్పుడిక దౌత్యమే శాంతికి మార్గం. నామమాత్రపు బెదిరింపులకు దిగుతూ, ఛాతీ చరుచుకుంటూ బైడెన్ చూపిన దారి పనికొచ్చేది కాదని తేలిపోయింది. దౌత్యానికి బాటలు వేసినప్పుడే అమెరికా మంచి దేశమని అనిపించుకోగలదు. ట్రంప్ సరిగ్గా అదే చేస్తున్నారు.

జెలెన్‌స్కీ: నేనొకటి అడగొచ్చా?

వాన్స్: తప్పకుండా.

జెలెన్‌స్కీ: పుతిన్ మా దేశాన్ని ఆక్రమించాడు. నిజమే. 2014లోనూ అతనదే చేశాడు. క్రిమియాను ఆక్రమించాడు. మా ప్రజలను భారీగా పొట్టన పెట్టుకున్నాడు. అప్పుడెవరూ అతన్ని ఆపలేదు. ఇన్నేళ్లుగా కూడా ఆపడం లేదు. 2014లో ఒబామా, తర్వాత ట్రంప్, ఆ తర్వాత బైడెన్... ఏ అధ్యక్షుడూ పట్టించుకోలేదు. దేవుని దయవల్ల పుతిన్‌ను ఇప్పుడు బహుశా ట్రంప్ ఆపుతారేమో.

ట్రంప్: 2015లోనా?

జెలెన్‌స్కీ: 2014లో

ట్రంప్: అవునా? అప్పుడు అధ్యక్షున్ని నేను కాదుగా.

వాన్స్: అదే కదా!

> **జెలెన్‌స్కీ:** కావచ్చు. కానీ 2014 నుంచి 2022 దాకా కూడా మా దుస్థితి అలాగే కొనసాగుతూ వచ్చింది. సరిహద్దుల వెంబడి మా ప్రజలు నిస్సహాయంగా చనిపోతూనే వచ్చారు. ఈ దారుణాన్ని ఆపేవారే లేకపోయారు. పుతిన్‌తో చర్చలు జరిపాం. ఒక్కసారి కాదు. ఎన్నోసార్లు. అతనితో ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాం. (ట్రంప్‌నుద్దేశించి) మీరు కూడా 2019లో పుతిన్‌తో ఒప్పందం చేసుకున్నారు. (ఫ్రాన్స్ అధ్యక్షుడు) మాక్రాన్, (నాటి జర్మనీ చాన్సలర్) మెర్కెల్ కూడా. కాల్పుల విరమణ ఒప్పందాలూ కుదిరాయి. పుతిన్ వాటిని ఉల్లంఘించబోడనే మీరంతా మాకు హామీ ఇచ్చారు. కానీ ఏం జరిగింది? దానికతను తూట్లు పొడిచాడు. మావాళ్లను మరింతగా పొట్టన పెట్టుకున్నాడు. ఖైదీల మార్పిడి ఒప్పందాన్నీ తుంగలో తొక్కాడు. ఇదెక్కడి దౌత్యం? జేడీ! మీరేం మాట్లాడుతున్నారో, వాటికి అర్థమేమిటో మీకైనా తెలుస్తోందా?

వాన్స్: మీ దేశంలో సాగుతున్న వినాశనానికి తెర దించగలిగే దౌత్యం గురించి మాత్రమే నేను మాట్లాడుతున్నా. కానీ ఒక్కటి మాత్రం మీకు స్పష్టంగా చెప్పదలచుకున్నా. ఇలా ఓవల్ ఆఫీసులో కూర్చుని అమెరికా మీడియా సమక్షంలో మీరిలా వాదనకు దిగడం చాలా అమర్యాదకరం. మీకిప్పుడు రష్యాతో పోరాడేందుకు సరిపడా సైన్యమే లేదు. మరో దారిలేక పౌరులకు ఆయుధాలిచ్చి బలవంతంగా యుద్ధక్షేత్రంలోకి నెడుతున్నారు. అలాంటి ఘర్షణకు తెర దించేందుకు కృషి చేస్తున్నందుకు అధ్యక్షుడు ట్రంప్‌కు మీరు నిజానికి కృతజ్ఞతలు తెలపాలి.

జెలెన్‌స్కీ: మాకెలాంటి సమస్యలున్నాయో కళ్లతో చూసినట్టే చెబుతున్నారు! మీరెప్పుడైనా ఉక్రెయిన్‌లో పర్యటించారా?

వాన్స్: అవును.

జెలెన్‌స్కీ: ఓసారి ఇప్పుడొచ్చి చూడండి.

వాన్స్: ఉక్రెయిన్‌లో ఏం జరుగుతోందో చూశాను. కథలు కథలుగా విన్నాను. నిజానికి మీరు తరచూ దేశాధినేతలు తదితరులను మీ దేశానికి రప్పించుకుంటూ ఉంటారు. అవన్నీ ఫక్తు ప్రచార టూర్లు. మీకు సమస్యలున్నది నిజం కాదంటారా? సైన్యంలో చేరేందుకు జనమే లేకపోవడం నిజం కదా?

జెలెన్‌స్కీ: అవును. మాకు సమస్యలున్నాయి.

వాన్స్: అలాంటప్పుడు అమెరికాలో పర్యటిస్తూ, వైట్‌హౌస్‌లో ఓవల్ ఆఫీసులో కూర్చుని మరీ, అదీ అధ్యక్షుని సమక్షంలోనే మా యంత్రాంగంపై దాడికి దిగడం మర్యాదా? మీ దేశ వినాశనానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న మా ప్రభుత్వంపై నోరు పారేసుకోవడం సబబా?

జెలెన్‌స్కీ: వరుసబెట్టి చాలా ప్రశ్నలే అడిగేశారు. అన్నింటినీ ఒక్కొక్కటిగా చర్చిద్దాం.

వాన్స్: అలాగే కానిద్దాం.

జెలెన్‌స్కీ: ముందుగా మీరొకటి అర్థం చేసుకోవాలి. యుద్ధ సమయంలో ఎవరికైనా సమస్యలే ఉంటాయి. రేపు మీకైనా అంతే. కాకపోతే ఇప్పుడు మీకది తెలియకపోవచ్చు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి వస్తే మీకూ తెలిసొస్తుంది.

ట్రంప్: మున్ముందు మాకెలా అనిపిస్తుందో మీరేమీ మాకు చెప్పాల్సిన అవసరం. మేం కేవలం మీ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం. మీ పరిస్థితే మాకొస్తే ఎలా ఉంటుందో మాకు చెప్పే సాహసం చేయకండి.

జెలెన్‌స్కీ: నేను మీకేమీ చెప్పడం లేదు. నాకు సంధించిన ప్రశ్నలకు బదులిస్తున్నానంతే.

ట్రంప్: అలా కాదు. ఏం జరగాలో, ఎలా జరగాలో నిర్దేశించే పరిస్థితిలో మీరు ఎంతమాత్రమూ లేరు.

వాన్స్: కానీ మీరు ఎంతసేపూ కేవలం మీకేం కావాలో మాకు నిర్దేశించే ప్రయత్నమే చేస్తూ వస్తున్నారు.

ట్రంప్: మాకూ మీలాంటి పరిస్థితే వస్తే మాకెలా ఉంటుందో చెప్పే పరిస్థితిలో మీరు లేరు. ముందు అది తెలుసుకోండి. మేం బాగుంటాం.

జెలెన్‌స్కీ: (మాలాంటి పరిస్థితే గనక వస్తే) ఎంతోమంది ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం మీకూ అనుభవంలోకి వస్తుంది.

ట్రంప్: మేమెప్పుడూ శక్తిమంతంగా ఉంటాం.

జెలెన్‌స్కీ: మళ్లీ చెబుతున్నా. అలాంటి పరిస్థితే వస్తే ఎలా ఉంటుందో అప్పుడు మీకూ అనుభవంలోకి వస్తుంది.

ట్రంప్: ప్రస్తుతం మీ పరిస్థితి అస్సలు బాగా లేదు. ఇదంతా స్వయంకృతం. మీరు స్వయంగా కొనితెచ్చుకున్నదే.

జెలెన్‌స్కీ: యుద్ధం మొదలైనప్పటి నుంచీ...

ట్రంప్: (మధ్యలోనే అడ్డుకుంటూ) చెప్తున్నాగా. మీరు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు. మీ దగ్గర ప్రస్తుతం వాడేందుకు ఎలాంటి కార్డులూ లేవు. మేం దన్నుగా ఉన్నప్పుడే మీరు ఏమైనా చేయగలిగేది!

జెలెన్‌స్కీ: నేనేమీ కార్డులు ప్లే చేయడం లేదు. సమస్య పరిష్కారానికి చాలా చిత్తశుద్ధితో ఉన్నా. మిస్టర్ ప్రెసిడెంట్! మీరది అర్థం చేసుకోవాలి.

ట్రంప్: లేదు లేదు. ఎంతసేపూ మీరు కార్డులే ప్లే చేస్తున్నారు. లక్షలాది జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అందరినీ మూడో ప్రపంచ యుద్ధ భయంలోకి నెడుతున్నారు.

జెలెన్‌స్కీ: మీరేం మాట్లాడుతున్నారు!

ట్రంప్: అవును. మీరు అందరినీ మూడో ప్రపంచ యుద్ధం దిశగా నెట్టే జూదానికి దిగారు. అంతేకాదు! మీ ప్రవర్తన అమెరికా పట్ల అత్యంత అమర్యాదకరంగా ఉంది. కేవలం మాటలు చెప్పే ఎన్నో దేశాల కంటే మీకు అన్నివిధాలా దన్నుగా నిలిచింది మేమే.

వాన్స్: అందుకు మీరు కనీసం ఒక్కసారన్నా కృతజ్ఞతలు తెలిపారా?

జెలెన్‌స్కీ: ఒక్కసారి కాదు. ఎన్నోసార్లు చెప్పా! ఇప్పుడూ చెబుతున్నా.

వాన్స్: నేననేది ఈ భేటీలో. ఇప్పటిదాకా మాపై, మా దేశంపై విమర్శలే తప్ప కృతజ్ఞతాపూర్వకమైన మాటలు ఒక్కటైనా మాట్లాడారా? గత అక్టోబర్లో పెన్సిల్వేనియాలో మా ప్రత్యర్థి పార్టీకి అనుకూలంగా ప్రచారం చేసిన చరిత్ర మీది!

జెలెన్‌స్కీ: నేనలా చేయలేదు.

> **వాన్స్:** ఇప్పటికైనా అమెరికాకు, మీ దేశాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్న మా అధ్యక్షునికి కృతజ్ఞతగా కనీసం మంచి మాటలైనా చెప్పండి.
>
> **జెలెన్‌స్కీ:** మీరేమనుకుంటున్నారు? గొంతు చించుకు అరిస్తే సరిపోతుందా...
>
> **ట్రంప్:** (ఆగ్రహంగా మధ్యలోనే కలగజేసుకుంటూ) ఆయన (వాన్స్) గొంతు చించుకోవడం లేదు. అంత గట్టిగా మాట్లాడటం లేదు. వాస్తవమేమిటంటే, మీ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.

జెలెన్‌స్కీ: ఆయన అన్నదానికి నన్ను కనీసం సమాధానమైనా చెప్పనిస్తారా?

ట్రంప్: చెప్పనిచ్చే సమస్యే లేదు. ఇప్పటికే చాలా ఎక్కువ మాట్లాడేశారు. ఓవైపు మీ దేశమే చాలా సమస్యల్లో ఉంది.

జెలెన్‌స్కీ: అవును. నాకు తెలుసు.

ట్రంప్: మీరు (యుద్ధం) గెలవబోవడం లేదు. ఈ ఆపద నుంచి బయట పడేందుకు మీకున్న ఏకైక అవకాశం మా దన్ను మాత్రమే.

జెలెన్‌స్కీ: మిస్టర్ ప్రెసిడెంట్! మేమెవరినీ ఆక్రమించలేదు. మా దేశంలో మేం బతుకుతున్నాం. ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచీ మేం ఒంటరిగానే పోరాడుతున్నాం. అయినా సరే, మీ దేశం పట్ల మొదటినుంచీ కృతజ్ఞతగానే ఉన్నాం. ఇప్పుడు కూడా చెబుతున్నా. కృతజ్ఞతలు.

ట్రంప్: కాల్పుల విమరణకు మీరు అంగీకరించి తీరాల్సిందే. మా సాయుధ సాయం లేకపోతే ఈ యుద్ధం రెండే రెండు వారాల్లో ముగిసిపోయేది.

జెలెన్‌స్కీ: కాదు. మూడే రోజుల్లో. అలాగని పుతిన్ కూడా అన్నారు.

ట్రంప్: ఏమో! అంతకంటే కూడా ముందే ముగిసేదేమో! ఇలాగైతే మీతో ఒప్పందం కుదుర్చుకోవడం చాలా చాలా కష్టం.

వాన్స్: ఇప్పటికైనా కనీసం కృతజ్ఞతలు తెలపండి.

జెలెన్‌స్కీ: ఒక్కసారి కాదు. ఎన్నోసార్లు చెప్పా. అమెరికా పౌరులకు కృతజ్ఞతలు.

వాన్స్: మన మధ్య అభిప్రాయ భేదాలున్నాయని అంగీకరించండి. మీరు చేస్తున్నదే తప్పు. అలాంటప్పుడు వాటిని చర్చించుకుని పరిష్కరించుకోవాలి. అంతే తప్ప ఇలా అమెరికా మీడియా సాక్షిగా మాతో గొడవకు దిగడం చాలా తప్పు.

ట్రంప్: కానీ నా ఉద్దేశంలో ఇదీ మంచిదే. ఏం జరుగుతోందో ఇప్పుడు అమెరికా ప్రజలంతా చూస్తున్నారు. వారికీ తెలియనీయండి. ఇది చాలా ముఖ్యం. అందుకే ఈ సంవాదాన్ని ఇంతసేపు కొనసాగించా. జెలెన్‌స్కీ అమెరికాకు కృతజ్ఞుడై ఉండాల్సిందే.

జెలెన్‌స్కీ: అవును. నేను కృతజ్ఞున్ని.

ట్రంప్: మీ దగ్గర వాడటానికి ఇంకే కార్డులూ లేవు. మీరు నిండా మునిగారు. మీ జనం చనిపోతున్నారు. పోరాడేందుకు మీకు సైనికుల్లేరు. ఎలా చూసుకున్నా యుద్ధానికి తెర దించడమే మీకు మంచిది. కానీ మీరు చూస్తే కాల్పు విరమణే వద్దంటున్నారు! అది కావాలి, ఇది కావాలని పేచీకి దిగుతున్నారు! మీకొక్కటే చెప్పదలచుకున్నా. కాల్పుల విరమణకు ఇప్పుడే, ఇక్కడే ఒప్పుకుంటారా సరేసరి. మీ దేశంపై తూటాల వర్షం ఆగుతుంది. జన నష్టానికి తెర పడుతుంది.

జెలెన్‌స్కీ: యుద్ధం ఆగాలనే మేమూ కోరుతున్నాం. కానీ అందుకోసం మేం కోరుతున్న హామీలు కావాలి. ఆ విషయం మీకిప్పటికే స్పష్టంగా చెప్పా.

ట్రంప్: అంటే ఏమిటి మీరనేది? కాల్పుల విరమణ వద్దా? నాకైతే అదే కావాలి. ఎందుకంటే ఈ పరిస్థితుల్లో మీరు కోరుతున్న ఒప్పందాల కంటే మీకు త్వరగా దక్కేది కాల్పుల విరమణే!

జెలెన్‌స్కీ: కాల్పుల విరమణపై మీవాళ్లనే అడిగి చూడండి. మీకే తెలుస్తుంది!

ట్రంప్: దానితో నాకు సంబంధం లేదు. అదంతా బైడెన్ అనే వ్యక్తి ఉండగా జరిగిన వ్యవహారం. కానీ అతనంత సమర్థుడు కాదు.

జెలెన్‌స్కీ: అప్పుడాయన మీ దేశాధ్యక్షుడు.

ట్రంప్: ఏం మాట్లాడుతున్నారు? బైడెన్ అనే కాదు. అంతకుముందు ఒబామా మాత్రం మీకేం సాయం చేశాడు? కేవలం కాగితాలిచ్చి సరిపెట్టాడు. నేనేమో మీకు శత్రువులపైకి ప్రయోగించేందుకు ఆయుధాలు సమకూర్చా. అందుకే చెప్తున్నా. మీరు నిజానికి మరింతగా కృతజ్ఞులై ఉండాలి. మీరిప్పుడు నిస్సహాయులు. మా దన్నే మీకు బలం. మేమే లేకపోతే మీకేమీ లేదు. పుతిన్ నన్ను గౌరవిస్తున్నాడంటే కారణం అధ్యక్షునిగా తొలి టర్ములో నా శైలిని దగ్గర్నుంచి గమనించాడు గనుకే.

(రష్యా గనుక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఏమిటన్న ఒక రిపోర్టర్ ప్రశ్నను ట్రంప్‌కు వాన్స్ వినిపించారు)

> **ట్రంప్:** ఎందుకీ ఊహాజనిత ప్రశ్నలు? ఇప్పటికిప్పుడు మీ నెత్తిపై బాంబు పడితే? రష్యా ఒకవేళ ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందో నాకైతే తెలియదు. బైడెన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రష్యా నిజంగానే ఉల్లంఘించింది. ఎందుకంటే అతనంటే వారికి గౌరవం లేదు. ఒబామా అన్నా అంతే. కానీ నా విషయం అలా కాదు. నేనంటే రష్యాకు, పుతిన్‌కు ఎంతో గౌరవం. ఒక్కటి చెప్తా వినండి. పుతిన్‌కు నేను చుక్కలు చూపించా! నేను చెప్పేదల్లా ఒక్కటే. ఒబామాతోనో, బుష్‌తోనో, చివరికి బైడెన్‌తో కూడా ఒప్పందాలను పుతిన్ ఉల్లంఘించి ఉండొచ్చు. నాకు తెలియదు. కానీ నాతో మాత్రం ఆయన అలా చేయలేదు. ఇప్పుడు కూడా ఒప్పందం చేసుకోవాలనే పుతిన్ అనుకుంటున్నాడు. (జెలెన్‌స్కీని ఉద్దేశించి) కానీ కాల్పుల విమరణకు ఒప్పుకునే ఉద్దేశం మీకేమాత్రం ఉందో లేదో నాకైతే తెలియదు. మిమ్మల్ని నేను బలశాలిగా, శక్తిమంతునిగా తీర్చిదిద్దా. అమెరికా దన్నే లేకపోతే మీకెన్నటికీ అంతటి శక్తి ఉండేదే కాదు. మీ ప్రజలు చాలా ధైర్యశాలులు. చివరిగా ఒక్కటే మాట. మాతో (ఖనిజ వనరుల) ఒప్పందం చేసుకుంటారా, సరేసరి! లేదంటే రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి యత్నాల నుంచి అమెరికా వైదొలగుతుంది. అప్పుడిక మీ పోరాటం మీదే. అదంత సులువని నేనైతే అనుకోను. ఎందుకంటే పోరాడేందుకు మీ దగ్గర ఏమీ లేదు. మాతో ఒప్పందం కుదుర్చుకుంటే మీరు చాలా మెరుగైన స్థితిలో ఉంటారు. కానీ ఏ దశలోనూ మీరు కాస్త కూడా కృతజ్ఞతపూర్వకంగా వ్యవహరించడం లేదు. ఇది ఎంతమాత్రమూ సరైన పద్ధతి కాదు. నిజంగా చెప్తున్నా. మీ తీరు అస్సలు సరి కాదు. చూడాల్సిందంతా చూసేశాం. కదా! టీవీలకైతే ఇదంతా నిజంగా పండుగే!



శుక్రవారం వైట్‌హౌస్ భేటీలో జెలెన్‌స్కీ, ట్రంప్, వాన్స్ వాగ్యుద్ధం

వెల్లువెత్తిన జోక్స్, మీమ్స్

ఓవైపు ఇల్లు కాలి ఒకడు ఏడుస్తుంటే ఇంకొకరు వచ్చి చుట్ట కాల్చుకోవడానికి నిప్పు కావాలని అడగాడట. ఉక్రెయిన్, రష్యా యుద్ధం.. మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదముందని ప్రపంచ దేశాలు ఓవైపు భయపడుతుంటే ఆ భయాలను తొలగించి యుద్ధాన్ని ఆపేందుకు, బదులుగా అత్యంత విలువైన ఖనిజాలపై అజమాయిషీ కోసం అమెరికా చేసిన ప్రయత్నం విఫలం కాగా ఆ ఘటనను మీమర్స్ తమ జోకులకు పెద్ద ముడి సరుకుగా వాడుకుంటున్నారు. శుక్రవారం శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మధ్య భేటీ తొలుత మర్యాదపూర్వకంగా, తుదకు అమర్యాదపూర్వకంగా, పరస్పర హెచ్చరికలకు వేదికగా మారి అర్ధంతరంగా ముగిసిన విషయం తెల్సిందే. అమెరికాసహా అంతర్జాతీయ మీడియా సాక్షిగా జరిగిన ఈ రసాభాసా వాగ్వాద భేటీపై ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మీమ్స్ తెగ వెల్లువెత్తుతున్నాయి.

తారాస్థాయిలో వాగ్వాదం

ఓవల్ ఆఫీస్‌లో అంతర్జాతీయ మీడియా ప్రతినిధుల సమక్షంలో ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. చివర్లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కలగజేసుకుని జెలెన్‌స్కీపై తీవ్ర అసహనం వ్యక్తంచేయడం, అందుకు ట్రంప్ వంతపాడటం, దీనికి దీటైన బదులిస్తూ జెలెన్‌స్కీ మాట్లాడం చూసిన వారెవరికైనా ట్రంప్, జెలెన్‌స్కీ కొట్టుకుంటారా అన్న అనుమానం వచ్చింది. వాస్తవంలో సాధ్యంకాని వాళ్ల పిడిగుద్దులు, డిష్యుండిష్యుం ఫైట్ సీన్‌ను కృత్రిమ మేథ సాధ్యం చేసింది. ఒరిజినల్ వీడియోతో ట్రంప్, జెలెన్‌స్కీ ఫైట్‌సీన్‌ను ఏఐలో సృష్టించి ఆన్‌లైన్‌లో షేర్‌చేశారు. ఆ వీడియో ఎడిటింగ్ మొదటి మూడు, నాలుగు సెకన్లు నిజంగానే కొట్టుకున్నారా అన్నంతగా కుదిరింది. ఇప్పుడీ వీడియో అన్ని సోషల్‌మీడియా యాప్స్‌లో వైరల్‌గా మారింది. ఇంకొక వీడియోను పూర్తి భిన్నంగా సృష్టించారు. వాస్తవంలో ట్రంప్, జేడీ వాన్స్‌తో జెలెన్‌స్కీ వాగ్వాదానికి దిగితే ఏఐ వీడియోలో మాత్రం వీళ్లిద్దరినీ జెలెన్‌స్కీ చేతులు పట్టుకుని మరీ బతిమాలుతూ 'మా దేశాన్ని కాపాడండి''అని వేడుకుంటున్నట్లు రూపొందించారు. ఇందులో 'ఇప్పటికి చేసిన సాయం చాలు, ఇక సాయం సంగతి మర్చిపో'అని ట్రంప్, వాన్స్‌లు జెలెన్‌స్కీ చేతులను దులిపేసుకుంటున్నట్లు ఏఐ వీడియో క్రియేట్‌చేశారు. ఇది కూడా తెగ నవ్వులు తెప్పిస్తోంది. అత్యంత విలువైన ఖనిజాలపై ఆధిపత్యం సంపాదించి అమెరికన్ పెత్తందార్లు వాటితో వేల కోట్లు గడించాలని భావించి, ఇప్పుడు భంగపడ్డారని తెలిపేలా ఒక వెయిటర్ 'ఖనిజాల డీల్ రద్దయింది. సారీ. మీకు భోజనాలు లేవు'అంటూ బడా పారిశ్రామికవేత్తలకు చూపిస్తున్నట్లు పాతకాలంనాటి 'ఫాల్టీ టవర్స్'సీరియల్ ఎపిసోడ్‌ను మీమ్స్‌లో వాడారు.

భారతీయ 'ట్రీట్‌మెంట్'

భారత్‌లో సాధారణ నిరుపేద కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలను తమకు నచ్చినట్లు పెంచేందుకు ప్రయత్నిస్తుంటారు. వైట్‌హౌజ్‌లో ట్రంప్, జేడీ వాన్స్ సైతం జెలెన్‌స్కీని దాదాపు అలాగే మీడియాకు చూపేందుకు ప్రయత్నించారని నెటిజన్లు మరో మీమ్ సిద్ధంచేసి సామాజిక మాధ్యమాల్లోకి వదిలారు. రష్యాతో యుద్ధంలో ఇంత సాయపడిన మాకు శ్వేతసౌధంలో మీడియా సమక్షంలో అగ్రరాజ్య అధ్యక్షునికి కనీసం గౌరవం ఇవ్వరా?. ఒక్కసారైనా మా ప్రెసిడెంట్‌కు థాంక్యూ అని చెప్పారా? అని జెలెన్‌స్కీని వాన్స్ నిలదీస్తూ హెచ్చరించడం తెల్సిందే. ఈ సందర్భంలో వాన్స్, ట్రంప్ సగటు భారతీయ తల్లిదండ్రుల్లా అద్భుతమైన పాత్ర పోషించారని నెటిజన్లు వ్యాఖ్యలు చేస్తూ పోస్ట్‌లు పెట్టారు.

పొగుడుతూ పోస్టులు

మరోవైపు జెలెన్‌స్కీని మీడియా ఎదుటే చక్రబంధంలో ఇరికించే ప్రయత్నంలో వాన్స్, ట్రంప్ దాదాపు సఫలమయ్యారని వీళ్లను పొగిడే వారి సంఖ్యా పెరిగింది. యుద్ధంలో వందల కోట్ల డాలర్లు ఇచ్చిన మాపై మీరు చూపించే మర్యాద ఇదేనా?. మీరు ఇదే ధోరణి కనబరిస్తే దౌత్యబంధం తెగిపోతుందని వాన్స్ హెచ్చరించి జెలెన్‌స్కీని ఒకింత సందిగ్ధంలో పడేశారని అమెరికన్ మీడియా ఆయనను పొగడ్తల్లో ముంచెత్తింది. అయితే జెలెన్‌స్కీని పొడిగే వారి సంఖ్యా అమాంతం పెరిగింది. ఇందులో సాధారణ ప్రజలతో పాటు దేశాధినేతలు ఉన్నారు. యూరప్‌దేశాల అధినేతలు ఆయనకు ఫోన్‌చేసిమరీ తమ మద్దతు పలికినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. మిత్రదేశానికి ప్రతిఫలం ఆశించి సాయం చేస్తే ఆ సాయానికి అర్థమే ఉండదని, సహజ సంపదను కాజేసేందుకు కుట్ర పన్నిన అమెరికాను జెలెన్‌స్కీ సాక్షాత్తూ శ్వేతసౌధంలోనే కడిగిపారేశారని ఆయనను పొగుడుతూ పోస్ట్‌లు వెల్లువెత్తాయి. భవిష్యత్తులో రష్యా మళ్లీ దురాక్రమణకు దిగితే మాకు ఉండే రక్షణ ఏర్పాట్లు ఏమిటి?. ఆ విషయంలో మీరెలా మాకు సాయపడగలరు? అని జెలెన్‌స్కీ అడిగిన సూటి ప్రశ్నకు ట్రంప్, జేడీ వాన్స్ సరైన సమాధానం చెప్పలేకపోవడం తెల్సిందే. ఇద్దరు అగ్రనేతలు రెచ్చగొట్టినా జెలెన్‌స్కీ సంయమనం కోల్పోలేదంటూ మరో మీమ్ సందడిచేస్తోంది. ప్రముఖ హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ నటించిన ఎయిర్‌ఫోర్స్ సినిమా సీన్‌లో పైఅధికారి ఇష్టమొచ్చినట్లు తిడుతున్నా టామ్ క్రూజ్ పట్టరాని ఆవేశంతో ఉన్నాసరే సంయమనం పాటించినట్లు జెలెన్‌స్కీ కూడా నిగ్రహంతో ఉన్నారని మీమ్ క్రియేట్ చేశారు. వైట్‌హౌజ్‌లో ముగ్గురు నేతల వాగ్వాదాన్ని ప్రత్యక్షంగా చూసి హుతాశురాలైన ఉక్రెయిన్ మహిళా రాయబారి ఒక్సానా మార్కరోవా తలపట్టుకోవడంపైనా ఒక మీమ్ బయటికొచ్చింది. మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్(అమెరికాను మళ్లీ గొప్పగా చేద్దాం) నినాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కీలక నేతగా జెలెన్‌స్కీ ఎదిగారంటూ, భేటీలో ఎడముఖం పెడముఖంగా కూర్చున్న ట్రంప్, జెలెన్‌స్కీ ఫొటోను మరొకరు పోస్ట్‌చేశారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

తుర్కియేలో ఎట్టకేలకు శాంతి వీచికలు

40 ఏళ్ల తర్వాత కాల్పుల విరమణ ప్రకటించిన కుర్దిష్ మిలిటెంట్లు

ఇస్తాంబుల్: తుర్కియే దేశంలో గత 40 ఏళ్లుగా ప్రభుత్వంతో పోరాడుతున్న కుర్దిష్ మిలిటెంట్లు ఎట్టకేలకు కాల్పుల విరమణ ప్రకటించారు. దీంతో తుర్కియేలో దశాబ్దాల తర్వాత శాంతి స్థాపనకు మార్గం సుగమం అయింది. ''కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మా అగ్రనేత అబ్దుల్లాహ్ ఒకలాన్ పిలుపుమేరకు శాంతి, ప్రజాస్వామ్యయుత సమాజ స్థాపనే లక్ష్యంగా ఈరోజు నుంచి ఆయుధాలకు పనిజెప్పబోము. ఒకవేళ మాపై ప్రభుత్వ దాడులు జరిగితే మా ఆయుధాలు గర్జిస్తాయి''అని కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ(పీకేకే) ప్రకటించింది. ఆయుధాలను వీడాలని అబ్దుల్లాహ్ గురువారం పిలుపునిచ్చిన నేపథ్యంలో పీకేకే అనుకూల ఫిరాత్ న్యూస్ ఏజెన్సీ ఏఎన్‌ఎఫ్‌లో శనివారం పీకేకే కార్యనిర్వాహక కమిటీ ఈ విషయాన్ని వెల్లడించింది. దీంతో దేశాధ్యక్షుడు తయ్యీప్ ఎర్డోగన్ సారథ్యంలోని తుర్కియే ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. పశ్చిమాసియాలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా తుర్కియేలో ఈ హఠాత్పరిణామం సంభవించిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. పశ్చిమాసియా పరిధిలో సిరియాలో బషర్ అస్సాద్ ప్రభుత్వం కూలిపోయి తిరుగుబాటుదారులు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం, లెబనాన్‌లో హెజ్‌బొల్లా మిలిటెంట్ల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడం, గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడం తెల్సిందే. కుర్దిష్ మిలిటెంట్ ప్రకటనపై ఎర్డోగన్ ప్రభుత్వం అధికారికంగా స్పందించకపోయినా దేశ ఉపాధ్యక్షుడు సెవ్‌డెట్ యిల్మాజ్ శనివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. ''ఉగ్రవాదరహిత తుర్కియే దిశలో కొత్త అధ్యాయం మొదలైంది. ఈ సువర్ణావకాశాన్ని మేం సద్వినియోగం చేసుకుంటాం. ఈ కాల్పుల విరమణ అంశంలో విజయం సాధిస్తాం''అని యిల్మాజ్ వ్యాఖ్యానించారు. ఇటీవల మార్మరా సముద్రంలోని ఇమ్రాలీ ద్వీపకారాగారంలో ఒకలాన్‌తో పీకేకేలోని కుర్దిష్ రాజకీయ నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 1999 నుంచి ఒకలాన్ జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2015 వేసవిలో ప్రభుత్వం, పీకేకే మధ్య చర్చలు జరిగినా ఎలాంటి ఫలితం రాలేదు.

1984 నుంచి ఉద్రిక్తతలు

ఇరాన్ మూలాలున్న కుర్దులు తాము నివసించే ఉత్తర, ఈశాన్య తుర్కియే ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇచ్చి కుర్దిస్తాన్‌గా ప్రకటించాలని చాన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. కుర్దిస్తాన్ కుదరని పక్షంలో తాము నివసించే ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఈ ఉద్యమాలే తదనంతరకాలంలో గెరిల్లా పోరాటంగా చివరకు పీకేకే మిలిటెంట్ సంస్థ ఆవిర్భావానికి కారణమయ్యాయి. పాతికేళ్లుగా కారాగారానికి పరిమితమైనా 75 ఏళ్ల ఒకలాన్ ఇప్పటికీ పీకేకేను క్రియాశీలకంగా ఉంచడంలో సఫలమయ్యారు. ''మా పార్టీ మహాసభ నిర్వహించి ఆ కార్యక్రమంలో సభ్యులమంతా ఆయుధాలను వీడతాం. ఒకలాన్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగేందుకు వీలుగా ఆయనను విడిచిపెట్టండి''అని ఎర్డోగన్ ప్రభుత్వానికి పీకేకే విజ్ఞప్తిచేసింది.



గుజరాత్‌లో సింధులోయ నాగరికత కాలం నాటి చరిత్రాత్మక నగరం ధోలవీరాను శనివారం సందర్శించిన సందర్భంగా మెట్ల బావిని పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

14వ సారి తండ్రి అయిన మస్క్

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తన సంపదతో పాటు తన సంతానాన్నీ పెంచుకుంటూ పోతున్నారు. ఇప్పటికే అధికారికంగా 12 మందికి, అనధికారికంగా మరొకరికి తండ్రి అయిన మస్క్ తాజాగా మరోసారి తండ్రి అయ్యారు. మస్క్ సహజీవన భాగస్వామి షివోన్ జిలిస్ తాజాగా పండంటి బాబుకు జన్మనివ్వడంతో మస్క్ పిల్లల సంఖ్య 14కు పెరిగింది. జిలిస్, మస్క్‌కు ఇప్పటికే ముగ్గురు పిల్లలున్నారు. తాజాగా పుట్టిన బాబుకు సెల్డాన్ లైకుర్గస్ అని నామకరణం చేశామని జిలిస్ ప్రకటించారు. అర్కాడియా 2024 తొలినాళ్లలో జన్మించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాల్లో వెల్లడైంది. మస్క్ కారణంగా తాను ఒక బిడ్డకు జన్మనిచ్చానని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ యాష్లే సెయింట్ క్లేర్ ఆరోపించిన్న వేళ జిలిస్ బిడ్డను జన్మించిన వార్త బయటకు రావడం గమనార్హం. మస్క్ తొలిసారిగా జస్టిన్ విల్సన్‌ను పెళ్లాడారు. వీరికి 2002లో నెవడా అలెగ్జాండర్ జన్మించారు. ఈ పిల్లాడు కొద్ది వారాలకే చనిపోయాడు. తర్వాత ఐవీఎఫ్ పద్ధతిలో ఈ జంటకు మొత్తంగా ఐదుగురు సంతానం కలిగారు. తర్వాత మస్క్.. గ్రైమ్స్‌తో సహజీవనం చేశారు. ఈ కారణంగా ముగ్గురు పిల్లలు పుట్టారు. విడిపోయాక జిలిస్‌తో మస్క్ కలిసి ఉంటున్నారు.

చర్చలు ఆపేసి కార్యాచరణ ప్రారంభించండి

- బడ్జెట్ ప్రతిపాదనలను అమల్లోకి తీసుకురావాలి
- భాగస్వామ్యపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: దేశంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలను యుద్ధప్రాతిపదికన అమల్లోకి తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. బడ్జెట్‌పై చర్చలతో కాలం గడపకుండా వెంటనే కార్యాచరణపై దృష్టి పెట్టాలని భాగస్వామ్యపక్షాలకు సూచించారు. వ్యవసాయం, గ్రామీణ ప్రగతిపై శనివారం జరిగిన వెబినార్‌లో మోదీ మాట్లాడారు. 'వికసిత్ భారత్' పట్ల ప్రభుత్వ దార్శనికత, ఆశయాన్ని బడ్జెట్ ప్రతిబింబిస్తోందని చెప్పారు. బడ్జెట్ ప్రతిపాదనలను వేగంగా అమలు చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇక కార్యరంగంలోకి అడుగుపెడితే రైతన్నలకు, గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఉద్బోధించారు. మనం దృష్టి మొత్తం ఇప్పుడు కార్యాచరణపై ఉండాలన్నారు. బడ్జెట్‌లో అమల్లో ఏవైనా అవరోధాలు, సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరించాలని కోరారు. అనుకున్న ఫలితాలు రావాలంటే భాగస్వామ్య పక్షాలు చురుకైన పాత్ర పోషించాలని చెప్పారు. బడ్జెట్‌ను ఎంత ప్రభావవంతంగా అమలు చేయగలం అనేదానిపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. వ్యవసాయాన్ని మొదటి గ్రోత్ ఇంజన్‌గా పరిగణిస్తున్నామని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, గ్రామీణ ప్రగతి అనే రెండు లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఏ ఒక్క రైతు కూడా నిర్లక్ష్యానికి గురికావొద్దని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంలో మన పూర్తి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాల్సిన సమయం వచ్చిందని, మరిన్ని లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ రంగంలో మనం ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించామన్నారు. పదేళ్ల క్రితం 265 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగేదని, అది ఇప్పుడు 330 మిలియన్ టన్నులకు చేరుకుందని ప్రధానమంత్రి వివరించారు. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' తన దృష్టిలో చాలా ముఖ్యమైన పథకమని ప్రస్తావించారు. ఈ పథకం కింద 100 జిల్లాల్లో పంటల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే గ్రామీణాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చామని గుర్తుచేశారు.

విపక్ష హోదా ఇవ్వాల్సిందే

శివసేన నేత సంజయ్ రౌత్ డిమాండ్

ముంబై: మహారాష్ట్ర శాసనసభలో నిబంధనావళి ప్రకారం తమ పార్టీకి విపక్ష హోదా దక్కాలని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ముంబైలో మాట్లాడారు. ''గతంలో ఆనాడు సభలో ఉన్న మొత్తం స్థానాల్లో 10 శాతం కూడా గెలవని పార్టీలకు విపక్ష హోదా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలా చూసినా ఇప్పుడు 288 సీట్లున్న మహారాష్ట్ర అసెంబ్లీలో విపక్ష పార్టీలన్నీ కలిపి దాదాపు 50 చోట్ల గెలిచాయి. ఆ లెక్కన మాకు విపక్ష హోదా దక్కాల్సిందే''అని రౌత్ వివరించారు. రేపటి నుంచి 26వ తేదీదాకా మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో రౌత్ స్పందించారు. ''విధాన్ సభలో శివసేన(యూబీటీ)కి విపక్ష హోదా ఇవ్వాల్సిందే. విపక్ష హోదా ఏ పార్టీకి ఇవ్వని సందర్భాల్లో సభను నిర్వహించవచ్చు అని రాజ్యాంగంలోని ఏ అధికరణంలోనూ ప్రస్తావించలేదు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సభ నిర్వహణ ఉండొద్దు. మా ఒక్క శివసేనకే 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక విపక్ష కాంగ్రెస్‌కు 16, ఎన్సీపీ(ఎస్పీ) పార్టీకి 10 మంది ఎమ్మెల్యేల బలముంది. ఉమ్మడిగా మా విపక్షాల డిమాండ్‌ను అసెంబ్లీ స్పీకర్ ఆమోదిస్తారని ఆశిస్తున్నాం''అని రౌత్ ఆశాభావం వ్యక్తంచేశారు. శాసనసభలో శివసేన(యూబీటీ)కి విపక్ష హోదా ఇస్తే తమ పార్టీకి శాసనమండలిలో విపక్ష హోదా ఇవ్వాలని కాంగ్రెస్ ఇటీవల డిమాండ్ చేయడం తెల్సిందే. ప్రస్తుతం శాసనమండలిలో విపక్ష నేత హోదా ఉన్న శివసేన(యూబీటీ) నేత అంబదాస్ దన్వే పదవీకాలం ఈ ఏడాది ఆగస్ట్‌తో ముగిసిపోనుంది. దీంతో ఆ హోదాను తమ పార్టీ నేతకే కట్టబెట్టాలని కాంగ్రెస్ కోరుతోంది.

సాక్షి ప్లస్
ఆదివారం। 2-3-2025

భాషా పరంగా ప్రొహిబిషన్ అంటే ఏమిటి?

వివిధ రిట్లు-అర్థం-పరిధి - ప్రాముఖ్యత

ప్రొహిబిషన్ (నిషేధం)

భాషా పరంగా ప్రొహిబిషన్ అంటే నిషేధించడం అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు లేదా ట్రిబ్యునల్ తన పరిధిని అతిక్రమించి కేసులు విచారిస్తున్నప్పుడు ఆ విచారణను తదుపరి ఆదేశాల వరకు నిలిపివేయాలని కోర్టు ఆదేశిస్తుంది. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే ఈ రిట్ ముఖ్య ఉద్దేశం. ప్రొహిబిషన్ న్యాయ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. పాలనా సంస్థలు, చట్టపర సంస్థలకు వర్తించదు.

సెర్షియోరరి (ఉన్నత న్యాయస్థాన పరిశీలన అధికారం)

భాషాపరంగా సెర్షియోరరి అంటే 'సుపీరియర్ లేదా 'టు బి సర్టిఫైడ్' లేదా 'బ్రింగ్ ద రికార్డ్స్' అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు తన పరిధిని అతిక్రమించి కేసును విచారించి తీర్పు వెలువరించినప్పుడు దాన్ని రద్దు చేసి, కేసును పై స్థాయి కోర్టుకు బదిలీ చేయాలని ఇచ్చే ఆదేశం. ఈ రిట్ ఉద్దేశం కూడా దిగువ న్యాయస్థానాలు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే.

సెర్షియోరరిని ప్రైవేటు సంస్థలు, శాసన సంస్థలకు వ్యతిరేకంగా జారీ చేయరు. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే పరిపాలనా సంస్థలకు వ్యతిరేకంగా జారీచేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఎన్విరాన్-లీగల్ యాక్షన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

ప్రొహిబిషన్, సెర్షియోరరి మధ్య తేడాలు

ప్రొహిబిషన్, సెర్షియోరరిల రిట్ల ఉద్దేశం ఒక్కటే. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నియంత్రించడం. అయితే వీటి ప్రక్రియలో తేడా ఉంది. కేసు ప్రారంభదశలో ఉంటే ప్రొహిబిషన్ రిట్, తీర్పు వెలువడిన తర్వాత సెర్షియోరరి రిట్‌ను జారీ చేస్తారు.

సెర్షియోరరి రిట్ దిగువ కోర్టులను నియంత్రించడంతోపాటు, అవి చేసిన తప్పులను కూడా సవరిస్తుంది. ప్రొహిబిషన్ రిట్ కేవలం నిలుపుదల చేస్తుంది. (Prohibition is preventive where as certiorari is curative)

కోవారంటో (అధికార పృచ్ఛ)

భాషాపరంగా దీన్ని 'బై వాట్ వారంట్' (By What Warrant) అంటారు. అంటే 'ఏ అధికారంతో' అని ప్రశ్నించడం. ప్రజా పదవుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ప్రజా సంబంధమైన పదవుల్లోకి అక్రమంగా ప్రవేశించిన లేదా ప్రజా పదవులను దుర్వినియోగం చేసిన వ్యక్తి ఆ పదవిలో కొనసాగడానికి చట్టబద్ధంగా ఉన్న అధికారాన్ని న్యాయస్థానాలు ప్రశ్నిస్తాయి. చట్టబద్ధత లేకపోతే ఆ పదవి నుంచి వెంటనే తొలగిపోవాలని ఆదేశిస్తాయి. ప్రజా పదవి అంటే చట్టంతో ఏర్పాటైన స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ. ఉదాహరణకు ప్రభుత్వ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, మంత్రులు, ముఖ్య మంత్రులు మొదలైనవి.

ఈ రిట్ కోసం బాధితుడు మాత్రమే న్యాయస్థానాల్లో కేసు వేయాలనే నియమం లేదు. ప్రజా పదవులను దుర్వినియోగం నుంచి కాపాడాలనే సామాజిక స్పృహ ఉన్న ఏ పౌరుడైనా కోర్టును ఆశ్రయించవచ్చు. మూడో వ్యక్తికి (Third Person) ఇందులో జోక్యం చేసుకునే హక్కు (Locus Standi- లోకస్ స్టాండై) ఉంటుంది.

ఇన్‌జంక్షన్ (నిలుపుదల ఆదేశం)

ఈ రిట్ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించలేదు. కేవలం సివిల్ వివాదాల్లో యథాతథస్థితిని (Status-Quo-Ante) కొనసాగించడానికి దీన్ని జారీ చేస్తారు. భర్తీ చేయడానికి వీలుపడని నష్టాన్ని అరికట్టేందుకు ఇన్‌జంక్షన్‌ను జారీ చేస్తారు. కాబట్టి ప్రాథమిక హక్కుల రక్షణకు, ఈ రిట్‌కు సంబంధం లేదు.

ప్రాథమిక హక్కులు - ఇతర నిబంధనలు

ప్రకరణ 33ను అనుసరించి, ప్రాథమిక హక్కులు కింది వర్గాలకు వర్తించే విషయంలో పార్లమెంటు చట్టం ద్వారా కొన్ని పరిమితులు విధించవచ్చు.

ఎ) సైనిక, పారా మిలటరీ దళాలు.
బి) పోలీసులు, ఇతర రక్షణపరమైన విధులు నిర్వర్తిస్తున్న సంస్థలు, అధికారుల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు.
సి) గూఢచార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు.
డి) అత్యవసర సర్వీసులైన టెలి కమ్యూనికేషన్లు, ఇతర శాఖల్లో పనిచేసే ఉద్యోగులు.

ప్రకరణ 34-సైనికచట్టం (Marshal Law) - ప్రాథమిక హక్కులపై పరిమితులు

దేశంలోని ఏదైనా ప్రాంతంలో సైనిక చట్టం ప్రకటించినప్పుడు ఆ సమయంలో సైనిక బలగాలు చేపట్టిన చర్యలు, తద్వారా జరిగిన నష్టాలకు, పరిణామాలకు వారిని బాధ్యులను చేయడానికి వీలులేదు. పార్లమెంటు ఒక చట్టం ద్వారా వారి చర్యలకు రక్షణ కల్పిస్తుంది. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీలులేదు.

ప్రకరణ 34, 35ల మధ్య తేడా

ప్రకరణ 34లో ప్రస్తావించిన అంశాలు కేవలం కొన్ని వర్గాల ఉద్యోగులు, వారి హక్కులపై విధించిన పరిమితులు. ప్రకరణ 35లో ప్రస్తావించిన అంశాలు కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో ప్రాథమిక



హక్కులను పరిమితం చేయడానికి రూపొందించినవి. కాబట్టి ఒకటి వర్గానికి సంబంధించింది, మరొకటి ప్రాంతానికి సంబంధించినది.

ఉదా: 1958లో రూపొందించిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (Armed Forces (Special Power) Act- AFSPA). దీన్ని పలు పర్యాయాలు సవరించి అసోం, మణిపూర్ రాష్ట్రాల్లోని కల్లోలిత ప్రాంతాల్లో విధించారు. అలాగే 1983లో పంజాబ్, చండీగఢ్‌లో కూడా ప్రయోగించారు. అక్కడి పరిస్థితుల కారణంగా శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు విఫలమైనప్పుడు ఈ చట్టం ద్వారా సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ- 35 చట్టబద్ధత, శిక్షలు

మూడో భాగంలో పేర్కొన్న నిబంధన అమలుకు చట్టబద్ధత కల్పించడం, శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. శాసనసభలకు ఉండదు. ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒకే పద్ధతి లేదా ప్రక్రియ ఉండాలనే ఉద్దేశంతో ఈ అధికారాన్ని పార్లమెంటుకు మాత్రమే ఇచ్చారు.

ఉదా: ప్రకరణ 16(3) ప్రకారం రిజర్వేషన్ల అమలు, ప్రకరణ 32(3) ప్రకారం రిట్లు జారీ చేసే అధికారాన్ని న్యాయస్థానాలకు సంక్రమింపజేయడం, ప్రకరణ 33 ప్రకారం సాయుధ బలగాల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించడం, ప్రకరణ 34 ప్రకారం సైనిక పాలన, మొదలైన అంశాలపై పార్లమెంటుకు మాత్రమే చట్టాలు చేసే అధికారం ఉంటుంది. అదే విధంగా ఈ భాగంలో పేర్కొన్న నేరాలకు, (ఉదాహరణకు ప్రకరణ 17లో పేర్కొన్న అస్పృశ్యత, 23లో పేర్కొన్న దోపిడీ, 24లోని బాలకార్మిక వ్యవస్థ మొదలైన వాటికి) శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకే ఉంటుంది.

ప్రకరణ 35(బి) ప్రకారం, పై విషయాలకు సంబంధించి రాజ్యాంగం అమల్లోకి రాక పూర్వం ఉన్న చట్టాలు అలాగే కొనసాగుతాయి. అయితే ప్రకరణ 372 ప్రకారం పూర్వ శాసనాలకు మార్పులు, చేర్పులు, సవరణలు చేసి పార్లమెంటు కొత్త చట్టాలు రూపొందించుకోవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రాథమిక హక్కులు - ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (Public Interest Litigation-PIL)

ప్రాథమిక హక్కుల రక్షణ, అమలుకు సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేక ఏర్పాట్లను ప్రకరణ 32, ప్రకరణ 226లో పేర్కొన్నారు. హక్కులకు భంగం వాటిల్లినప్పుడు లేదా అమలు కానప్పుడు బాధితుడే కోర్టును ఆశ్రయిస్తాడు. అయితే బాధితుడికి సరైన అవగాహన లేకపోవడం లేదా ఆర్థిక, సామాజిక స్థితి పరంగా కోర్టును ఆశ్రయించే పరిస్థితి ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో బాధితులకు సంబంధించి ప్రజాప్రయోజనం అందులో ఇమిడి ఉంటే వారి తరఫున మూడో వ్యక్తి కూడా కోర్టులో వ్యాజ్యం వేయవచ్చు. దీన్నే ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అంటారు.

సాధారణంగా కోర్టు జోక్యాన్ని కోరే హక్కు (Locus Standi) బాధితులకే ఉంటుంది. కానీ సుప్రీంకోర్టు ఆ హక్కును ఇతరులకు కూడా సంక్రమింపజేసింది. ఈ వెసులుబాటును పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ (పీఐఎల్) లేదా సోషల్లీ ఇంట్రస్ట్ లిటిగేషన్ అని అంటారు.

గమనిక: పీఐఎల్ భావన మొదట అమెరికా న్యాయ వ్యవస్థలో ప్రారంభమైంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో బాగా ప్రచారంలోకి వచ్చింది. ఇండియాలోని పీఐఎల్ భావన అమెరికా నమూనా లాంటిదే. కానీ కొన్ని మార్పులతో పాటిస్తుంది.

రాజ్యాంగంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం గురించి ప్రస్తావన లేదు. అయితే సుప్రీంకోర్టులో మొదటిసారి ఈ భావనను ప్రవేశపెట్టింది జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్. ఆ తర్వాత జస్టిస్ పి.ఎన్. భగవతి నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్‌కి మొదటిసారిగా 1979లో బిహార్ జైల్లో ఖైదీల తరఫున పీఐఎల్ దాఖలు చేశారు. దీన్నే హుస్సేనార ఖతూన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసు అంటారు.

1981లో ఎస్.పి.గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును పీఐఎల్‌కు సంబంధించిన అతి ముఖ్యమైన కేసుగా పేర్కొంటారు. జస్టిస్ పి.ఎన్.భగవతి పీఐఎల్‌ను చక్కగా నిర్వచించి, తగిన వివరణ ఇచ్చారు.

ప్రకరణ 32 ప్రకారం, సుప్రీంకోర్టులో, ప్రకరణ 226 ప్రకారం హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేయవచ్చు. ఇతర న్యాయస్థానాలకు ఈ అధికారం లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి కుంభకోణాలు పీఐఎల్ ద్వారానే దేశంలో వెలుగులోకి వచ్చాయి.

పీఐఎల్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించరాదు. ప్రచారం కోసం ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేయాలనే దురుద్దేశంతో ప్రజాప్రయోజనాల నెపంతో పీఐఎల్ ను దాఖలు చేస్తే అలాంటి వ్యక్తులపై న్యాయస్థానాలు భారీ జరిమానాలు విధిస్తాయి.

ఉదా: సంజీవ్ భట్నాగర్ జాతీయగీతం నుంచి సింధ్ అనే పదాన్ని తొలగించాలని సుప్రీంకోర్టులో పీఐఎల్ దాఖలు చేశారు. అది అనవసరమైన, ఆర్భాటమైన కేసుగా భావించి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు భారీ జరిమానా విధించింది.

ప్రాథమిక హక్కులపై పరిమితులు- జాతీయ అత్యవసర పరిస్థితి ప్రభావం

నిబంధన 352 ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. దీనికి సంబంధించి రాజ్యాంగంలో ప్రకరణలు 358, 359లలో వివరణలు ఉన్నాయి.

ప్రకరణ 358 ప్రకారం బాహ్య అత్యవసర పరిస్థితి

యుద్ధం, దురాక్రమణ కారణంగా అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలను మాత్రమే రద్దు చేస్తారు. ఇతర ప్రాథమిక హక్కులు రద్దు కావు.

ప్రకరణ 358 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిలో ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలు వాటంతట అవే రద్దవుతాయి.

కానీ ప్రకరణ 359 ప్రకారం ప్రాథమిక హక్కులు రద్దు చేయడానికి రాష్ట్రపతి ప్రత్యేక ఆదేశాన్ని జారీ చేయాలి. ఎమర్జెన్సీ విధించినంత మాత్రాన వాటంతట అవే రద్దు కావు.

నిబంధన 358 పరిధి దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. కానీ ప్రకరణ 359 పరిధి దేశంలో కొన్ని ప్రాంతాలకు లేదా మొత్తం భాగానికి వర్తింపజేయవచ్చు.

జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ కారణంగా విధించినప్పటికీ (బాహ్య, అంతరంగిక కారణాలు) ప్రకరణ 20, 21 రద్దుకావు. ఈ అంశాన్ని 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా పొందుపరిచారు. ప్రకరణలు 358, 359 మధ్య కొంత సామీప్యం ఉంది. ఇవి అత్యవసర పరిస్థితి విధించడం ద్వారా జరిగే పరిణామాలకు రక్షణ కల్పిస్తాయి కానీ ఎమర్జెన్సీతో సంబంధం లేని చట్టాలకు వర్తించవు.

ప్రాథమిక హక్కులు- మినహాయింపులు

ప్రకరణ 31-ఏ లో పేర్కొన్న ఐదు రకాల చట్టాలు తమ ప్రాథమిక హక్కులకు విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలులేదు. ఈ అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

నిబంధన 31-బిలో కూడా ఇలాంటి పరిమితులనే పేర్కొన్నారు. 31-సి ప్రకారం నిర్దేశిక నియమాల్లో పొందుపరిచిన 39-బి, 39-సి అమలు కోసం ప్రాథమిక హక్కులపై పరిమితులు విధిస్తే, అది రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానంలో ప్రశ్నించరాదు.

ప్రాథమిక హక్కులు - ముఖ్య వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.కె. గోపాలన్ వర్సెస్ తమిళనాడు -1950:
1950లో చేసిన నివారక నిర్బంధ చట్టంలోని సెక్షన్ 4 న్యాయ సమీక్షాధికారానికి విరుద్ధంగా ఉన్నందున అది చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఈ చట్టం కింద ముందస్తు అరెస్టు సమంజసమేనని పేర్కొంది.

శంకర్ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా-1951:
మొదటి రాజ్యాంగ సవరణకు సంబంధించిన అంశాన్ని ఈ వివాదంలో సుప్రీం కోర్టు పరిశీలించింది. ఈ సవరణ రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెప్పింది. ఈ కేసులోనే సుప్రీం కోర్టు మొదటిసారి న్యాయ సమీక్షాధికారాన్ని వినియోగించింది.

బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం-1954:
ఈ వివాదం కూడా ఆస్తి హక్కుకు సంబంధించిందే. ప్రభుత్వం ప్రజల ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు అందుకు మార్కెట్ విలువతో కూడిన నష్టపరిహారాన్ని చెల్లించాలని తీర్పు చెప్పింది.

తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు ఏ శక్తి ఉంటుంది?

యాంత్రిక శాస్త్రం

ప్రచోదనం

ఏదైనా ఒక వస్తువుపై అతి స్వల్పకాలంలో అత్యధిక బలాన్ని ప్రయోగిస్తే దాన్ని ప్రచోదనం అంటారు.

ప్రచోదనం (I) = బలం × కాలం

$I = F \times \Delta t$

$\frac{I}{\Delta t} = F$ ప్రకారం ఒక వస్తువుపై అత్యధిక బలాన్ని అతిస్వల్పకాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ప్రమాణాలు: డైన్ సెకన్, న్యూటన్ సెకన్

అనువర్తనాలు:

- జంపింగ్ పోటీలో దూకే స్థలం వద్ద గోతిని తవ్వి దానిలో వరిపొట్టు, రంపం పొట్టు, ఇసుక, స్పాంజ్‌ను ఉంచుతారు. వీటివల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. ఫలితంగా దూకుతున్న వ్యక్తికి గాయాలు కావు.
- క్రికెట్‌లో బంతిని క్యాచ్ పట్టుకునే సమయంలో ఫీల్డర్ చేతులను ముందుకు చాపి, తర్వాత క్రమంగా వెనక్కి తీసుకుంటాడు. ఇలా చేయడం వల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. అందువల్ల ఫీల్డర్ చేతులకు గాయాలు కావు.
- వాహనాల్లో షాక్ అబ్జార్బ్స్ (స్ప్రింగ్‌లు) అమరుస్తారు. దీనివల్ల వాహనాలు గుంతలున్న రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- సున్నితమైన గాజు వస్తువులు, పింగాణీ, మట్టి వస్తువులను రవాణా చేసేటప్పుడు వాటి చుట్టూ దూది, గడ్డి, స్పాంజి, థర్మాకోల్ మొదలైన వాటిని అమరుస్తారు. ఫలితంగా ఆ వస్తువుల రవాణా సమయంలో ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- గమనంలో వున్న ఒక వాహనం అంతే ద్రవ్యరాశి ఉన్న విరామస్థితిలోని మరో వాహనాన్ని ఢీకొడితే.. కదులుతున్న వాహనం ఆగి ఉన్న వాహనంపై తక్కువ సమయంలో ఎక్కువ బలాన్ని ప్రయోగిస్తుంది. కాబట్టి ఆగి ఉన్న వాహనానికి ఎక్కువ నష్టం జరుగుతుంది.
- కొంత ఎత్తు నుంచి స్వేచ్ఛగా దృఢమైన తలం పైకి దూకిన వ్యక్తి తన శరీర బరువు మొత్తాన్నీ స్వల్పకాలంలో ఆ తలంపై ప్రయోగిస్తాడు. దీంతో ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా అతడికి గాయాలవుతాయి. కానీ అదే వ్యక్తి సరిపడా నీరున్న బావిలో దూకితే కాలపరిమితి పెరిగి, ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఆ వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు.
- ఒక ఇనుప మేకుపై అత్యధిక బలాన్ని అతి స్వల్ప కాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉండి, ఆ మేకు గోడలోకి లేదా చెక్కదిమ్మలోకి చొచ్చుకొని వెళ్లగలుగుతుంది.

ప్రక్షేపకం (Projectile)

ఏదైనా ఒక వస్తువును భూమి క్షితిజ సమాంతర దిశకు కొంత కోణంలో (90° తప్ప) పైకి విసిరినప్పుడు అది పరావలయ మార్గంలో ప్రయాణించి భూమిని మరో బిందువు వద్ద తాకుతుంది. ఈ విధంగా విసిరిన వస్తువును ప్రక్షేపకం అంటారు.

ప్రక్షేపకం ఎల్లప్పుడూ పరావలయ లేదా అర్ధ పరావలయ మార్గంలో ప్రయాణిస్తుంది.

ఉదాహరణలు:

1. తుపాకి నుంచి వెలువడిన బుల్లెట్, యుద్ధ ట్యాంకుల నుంచి వెలువడిన విస్ఫోటక పదార్థాలు పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
2. ప్రయోగించిన క్షిపణి, రాకెట్‌లు కూడా పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
3. కదులుతున్న వాహనంలో నుంచి ఒక వస్తువును బయటకు జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి కింద పడుతుంది.
4. గగనతలంలో ఎగురుతున్న ఒక జెట్ విమానం నుంచి బాంబును జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని తాకుతుంది.

వ్యాప్తి (Range)

ఒక ప్రక్షేపకం భూమి క్షితిజ సమాంతర దిశలో ప్రయాణించిన గరిష్ఠ దూరాన్ని వ్యాప్తి అంటారు. గరిష్ఠ వ్యాప్తి పొందాలంటే ప్రక్షేపకాన్ని 45° కోణంతో ప్రయోగించాలి.

యాంత్రికశక్తి

ఒక వస్తువు క్షితిజ శక్తి, గతిజ శక్తుల మొత్తాన్ని యాంత్రిక శక్తి (Mechanical Energy) అంటారు.

యాంత్రిక శక్తి = P.E. + K.E.

స్థితిజ శక్తి:

ఒక వస్తువుకు తన స్థితి లేదా స్థానం లేదా నిర్మాణం వల్ల కలిగే శక్తిని క్షితిజ శక్తి అంటారు.

క్షితిజ శక్తి (P.E.) = mgh

m = వస్తువు ద్రవ్యరాశి
(ఎల్లప్పుడు స్థిరం)
g = గురుత్వ త్వరణం
(ఒక ప్రదేశంలో g విలువ స్థిరం)
h = భూమి ఉపరితలం నుంచి వస్తువు పొందిన ఎత్తు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

వస్తువు పొందిన ఎత్తు విలువ పెరిగితే వస్తువు పొందిన క్షితిజ శక్తి కూడా పెరుగుతుంది.

ఉదాహరణలు:

- రిజర్వాయర్లలో, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో ఉండే నీటికి స్థితిజశక్తి ఉంటుంది.
- ఒక తీగను స్ప్రింగ్‌లా చుట్టినపుడు దానిలో PE నిల్వ ఉంటుంది.
- ఒక రబ్బరు పట్టీని సాగదీసినప్పుడు కూడా దానిలో స్థితిజశక్తి ఉంటుంది.
- విల్లులో బాణం అమర్చి వెనక్కి లాగినప్పుడు దానిలోనూ PE నిల్వ ఉంటుంది.

గతిజశక్తి:

ఒక వస్తువు తన గమనం వల్ల పొందిన శక్తిని గతిజశక్తి అంటారు.

గతిజ శక్తి = $KE = \frac{1}{2}mv^2$

m = వస్తువు ద్రవ్యరాశి; v = వేగం

- గమనంలో వున్న రాయి, బంతికి ఈ శక్తి ఉంటుంది.
- పేల్చిన తుపాకీ గుండు, తుఫాన్ గాలులకు, రంపం మిల్లులో వేగంగా తిరిగే రంపానికి గతిజ శక్తి ఉంటుంది.
- వేగం పెరిగితే వస్తువు గతిజశక్తి కూడా పెరుగుతుంది.
- గతిజశక్తి సమీకరణం, రేఖీయ ద్రవ్యవేగాల మధ్య సంబంధం

$KE = \frac{p^2}{2m} \Rightarrow K.E. \propto p^2$

- గమనంలో వున్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని x% పెంచినప్పుడు దాని K.E.లో

పెరుగుదల శాతం $= \left(\frac{200+x}{100}\right)x$

ప్రశ్న: గమనంలో ఉన్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని 100 శాతం పెంచితే, దాని K.E. లో మార్పు (పెరుగుదల)శాతం ఎంత?

$= \left(\frac{200+x}{100}\right)x \quad (\because x = 100\%)$

$= \left(\frac{200+100}{100}\right)\times 100 \quad = \frac{300}{100}\times 100$

K.E.లో పెరుగుదల = 300%

- గమనంలో ఉన్న వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని K.E. నాలుగు రెట్లు పెరుగుతుంది.

యాంత్రిక శక్తికి ఉదాహరణలు:

ఒక వస్తువు ఏక కాలంలో క్షితిజ, గతిజ శక్తులను కలిగి ఉంటే వాటికి ఉదాహరణలు.

- గగన తలంలో ఎగురుతున్న విమానం, రాకెట్లు, క్షిపణులు, గాలిపటం, మేఘాలు, పక్షి, బెలూన్ మొదలైన వాటికి యాంత్రిక శక్తి ఉంటుంది.
- గమనంలో ఉన్న వాహనంలోని ప్రయాణికుడు యాంత్రిక శక్తిని కలిగి ఉంటాడు.
- సౌర కుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు లేదా గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు యాంత్రిక శక్తి ఉంటుంది.
- పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్‌కు యాంత్రిక శక్తి ఉంటుంది.

నోట్: బావిలోని నీరు, లోయలో వున్న వస్తువు, గనిలోని కార్మికుడికి క్షితిజ శక్తి ఉంటుంది.

- తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు క్షితిజ శక్తి, భ్రమణ గతిజ శక్తులుంటాయి.

శక్తి రూపాంతరాలు

- రిజర్వాయర్‌లో నిలకడగా ఉన్న నీరు క్షితిజ శక్తిని కలిగి ఉంటుంది. ఈ నీరు జలపాతంలా కిందకి పడుతున్నప్పుడు దాని స్థితిజశక్తి గతిజశక్తిగా మారుతుంది. నీటి ప్రవాహానికి ఎదురుగా విద్యుత్ టర్బైన్‌ను అమరిస్తే జనరేటర్‌లో విద్యుత్‌గా రూపాంతరం చెందుతుంది.
- గడియారంలో చుట్టగా చుట్టిన స్ప్రింగ్‌లో స్థితిజ శక్తి ఉంటుంది. ఈ స్థితిజ శక్తి గడియారంలోని ముల్లు తిరగడానికి కావాల్సిన K.E.గా మారుతుంది.
- పక్షులను వేటాడటానికి ఉపయోగించే గులేరులోని రబ్బరు పట్టీ మధ్యభాగంలో ఒక చిన్న రాయిని అమర్చి వెనక్కి లాగితే, ఆ రబ్బరు పట్టీలోని స్థితిజశక్తి రాయికి గతిజశక్తిని అందిస్తుంది. ఫలితంగా రాయి ముందుకు దూసుకెళ్తుంది. ఇలాంటి శక్తి రూపాంతరం ధనస్సు, బాణాల్లో కూడా జరుగుతుంది.
- వాహనాల్లో ఇంధనాలను మండించినప్పుడు వెలువడే ఉష్ణశక్తి వాటిని కదిలించడానికి కావల్సిన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- సైకిల్ డైనమోలో యాంత్రికశక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.
- పరుగు తీస్తున్న వ్యక్తిలో కండర శక్తి గతిజశక్తిగా మారుతుంది.
- ఒక వ్యక్తి.. భవనం, పర్వతం, స్తంభం మొదలైన వాటిపై ఎక్కినప్పుడు కండర శక్తి స్థితిజ శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- చెట్టు కొమ్మపై వాలిన పక్షి ఎగరడం ఆరంభించినప్పుడు దాని కండర శక్తి(PE) యాంత్రిక శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినప్పుడు ఉవ్వెత్తున లేచిన సముద్ర కెరటాల స్థితిజశక్తి ఒడకు గతిజశక్తిగా అందుతుంది.
- చిన్న పిల్లలు ఆడుకునే ఆట బొమ్మల్లో అమర్చిన ఘటాల్లోని రసాయనశక్తి విద్యుచ్ఛక్తిగా, తర్వాత బొమ్మలను కదిలించడానికి అవసరమైన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- విద్యుత్ మోటార్‌లో విద్యుత్ శక్తి యాంత్రిక శక్తిగా మారుతుంది.

భ్రమణ చలనం లేదా కోణీయ చలనం

ఒక వస్తువు ఏదైనా స్థిర బిందువు చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తే ఆ చలనాన్ని భ్రమణ చలనం లేదా కోణీయ చలనమంటారు.

ఉదా: తిరుగుతున్న ఫ్యాన్ రెక్కలు, వాహనం చక్రాలు, సౌరకుటుంబంలోని గ్రహాలు, ఉపగ్రహాలు భ్రమణ చలనాన్ని కలిగి ఉంటాయి.

- భ్రమణ చలనంలో ఉన్న ప్రతి వస్తువుకు ఏక కాలంలో రేఖీయ, కోణీయ భౌతిక రాశులుంటాయి.

రేఖీయ స్థానభ్రంశం (Linear displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు వృత్త పరిధిపై పొందిన స్థానభ్రంశాన్ని రేఖీయ స్థాన భ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెం.మీ. లేదా మీటర్

కోణీయ స్థానభ్రంశం (Angular displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు ఆ వృత్త కేంద్రం వద్ద పొందిన స్థానభ్రంశాన్ని కోణీయ స్థానభ్రంశం అంటారు.

$\theta = \angle BOA$

ప్రమాణాలు: డిగ్రీ, రేడియన్
(రేడియన్ - అంతర్జాతీయ ప్రమాణం)

- రేఖీయ, కోణీయ స్థానభ్రంశాల మధ్య సంబంధం:

వృత్త చాపం (AB) =
వృత్త వ్యాసార్ధం × కేంద్రం వద్ద కోణం

$\bar{S} = r \times \theta$

రేఖీయ వేగం (V)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త పరిధిపై పొందిన రేఖీయ స్థానభ్రంశాన్ని రేఖీయ వేగం అంటారు.

$\bar{V} = \frac{\bar{S}}{t}$

ప్రమాణాలు: సెం.మీ./సెకన్, మీ./సెకన్

కోణీయ వేగం (ω)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త కేంద్రం వద్ద పొందిన కోణీయ స్థానభ్రంశాన్ని కోణీయ వేగం అంటారు.

$\therefore \omega = \frac{\theta}{t}$; ప్రమాణాలు: డిగ్రీ/ సెకన్ లేదా రేడియన్ / సెకన్.

- రేఖీయ, కోణీయ వేగాల మధ్య సంబంధం $v = r\omega$
- భ్రమణ చలనంలో రేఖీయవేగం ఒక కణం నుంచి మరో కణానికి మారుతుంది. కానీ కోణీయ వేగం అన్ని కణాలకు సమానం.

కోణీయ ద్రవ్యవేగం

భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే ద్రవ్యవేగాన్ని కోణీయ ద్రవ్యవేగం అంటారు.

$L = mvr$ లేదా $L = mr^2\omega$ $[\because v = r\omega]$

ప్రమాణాలు: గ్రామ్.సెం.మీ.^{2}/సెకన్, కేజీ. సెం.మీ.^{2}/సెకన్

$L = mvr \Rightarrow \frac{L}{r} = mv$

$v \propto \frac{1}{r}$ (ద్రవ్యరాశి స్థిరంగా ఉన్నప్పుడు)

- భ్రమణ చలనంలో ఉన్న వస్తువు రేఖీయ వేగం దాని వృత్త వ్యాసార్ధానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి కక్ష్యావ్యాసార్ధం పెరిగితే రేఖీయ వేగం తగ్గుతుంది.

ఉదా: భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఒక కృత్రిమ ఉపగ్రహాన్ని అల్పకక్ష్య నుంచి అధిక కక్ష్యలోకి బదిలీ చేస్తే ఆ ఉపగ్రహం రేఖీయ వేగం తగ్గుతుంది. కక్ష్య వ్యాసార్ధం పెరగడమే దీనికి కారణం.

- భ్రమణ చలనం చేస్తున్న వస్తువుకు ఏకకాలంలో అభికేంద్ర, అపకేంద్ర బలాలు ఉంటాయి.

తెలంగాణలో 700 ఏళ్ల వలస పాలన

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తెలంగాణ పోరాటానికి శతాబ్దాల చారిత్రక నేపథ్యం ఉంది. తెలంగాణ పోరాటానికి గల కారణాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే.. 1323లో కాకతీయ రాజుల పాలన అనంతరం జరిగిన వలస రాజ్య స్థాపనల గురించి తెలుసుకోవాలి. 1324 నుంచి 1948 వరకు తెలంగాణ ప్రాంతాన్ని అయిదు ముస్లిం రాజ్య వంశాలు పాలించాయి. వీరి 624 ఏళ్ల పాలనలో తెలంగాణ ప్రజలు దుర్భర పరిస్థితుల్లో జీవించారు. మరో రకంగా చెప్పాలంటే.. మన పూర్వీకులు తమ సొంత ప్రాంతంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా బతుకులు వెళ్లదీశారు.



కాకతీయుల స్వర్ణయుగం

క్రీ.శ. 1324లో కాకతీయ రాజు రెండో ప్రతాపరుద్రుడిని ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్ తుగ్లక్ ఓడించడంతో తెలంగాణా ప్రాంతంలో వలస పాలన మొదలైంది. ప్రతాపరుద్రుడి ఓటమితో 300 ఏళ్లకు పైగా సాగిన కాకతీయుల సువర్ణ పాలన అంతమైంది. కాకతీయులు ఉత్తర తెలంగాణ ప్రాంతంలో పుట్టి, పెరిగి.. సాధారణ తెలంగాణ ప్రజల స్థాయి నుంచి రాజులుగా ఎదిగారు. కాకతీయ రాజులు సాగు కోసం చెరువులు, కాలువలు, బావులను తవ్వించారు. తెలంగాణ ప్రాంతంలో అనేక దేవాలయాలు నిర్మించారు. వీరి పాలనలో తెలంగాణ శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లింది.

వలస పాలనలో రికార్డు

తెలంగాణలో కాకతీయుల పాలన అనంతరం క్రీ.శ. 1324 నుంచి క్రీ.శ. 1347 వరకు మహ్మద్ బిన్ తుగ్లక్ పాలన కొనసాగింది. క్రీ.శ. 1347లో అతని సుబేదారు అల్లావుద్దీన్ హసన్ గంగూ బహమనీ తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. బహమనీ సామ్రాజ్యం పేరుతో దక్కన్‌లో తన స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. దక్షిణ భారత దేశంలో ఇది తొలి ముస్లిం రాజ్యం. ఈ పరిణామం తదనంతర కాలంలో దక్షిణ భారతదేశంపై ముస్లిం రాజుల దాడులకు మార్గం వేసింది. బహమనీ రాజ్యంలోని 5 ప్రావిన్సుల్లో గోల్కొండ ఒకటి. తెలంగాణ ఇందులో భాగంగా ఉండేది. బహమనీ సుల్తానులు క్రీ.శ. 1347 నుంచి క్రీ.శ. 1512 వరకూ.. 165ఏళ్ల పరిపాలన సాగించారు. 165 ఏళ్ల బహమనీయుల పాలన చివర్లో ఆయా ప్రావిన్సుల పాలకులు తిరుగుబాటు చేయడంతో క్రీ.శ. 1512లో బహమనీ సామ్రాజ్యం 5 రాజ్యాలుగా విడిపోయింది. వీటిల్లో గోల్కొండ రాజ్యాన్ని సుల్తాన్ కులీ కుతుబ్ షా 1512లో ఏర్పాటు చేశాడు. ఈ గోల్కొండ రాజ్యంలో తెలంగాణ అంతర్భాగం. కుతుబ్‌షాహీ పాలకులు గోల్కొండ రాజ్యాన్ని 1687 వరకూ పాలించారు. కుతుబ్‌షాహీ అయిదో రాజు మహ్మద్ కులీ కుతుబ్ షా క్రీ.శ. 1592లో హైదరాబాద్‌ను, చార్మినార్‌ను నిర్మించాడు. ఆయనను హైదరాబాద్ నగర నిర్మాతగా పేర్కొంటారు. క్రీ.శ. 1687లో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండను జయించి తన సామ్రాజ్యంలో కలిపేసుకున్నాడు. మొఘలుల పాలన క్రీ.శ 1723 వరకూ కొనసాగింది. 1724లో మొదటి నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జా తెలంగాణను జయించి హైదరాబాద్ రాజ్యంలో విలీనం చేశాడు. అసఫ్ జాహీలు క్రీ.శ.1724 నుంచి క్రీ.శ 1948 వరకూ సుదీర్ఘంగా 224 ఏళ్లపాటు పాలించారు. ఇలా తెలంగాణలో పరాయి పాలన 624 ఏళ్ల పాటు నిరాటంకంగా కొనసాగింది. ఇదో రకంగా ప్రపంచ రికార్డు. ఎందుకంటే.. ప్రపంచ చరిత్రలో మరెక్కడా కూడా ఒక ప్రాంతంలో ఇంత సుదీర్ఘ కాలం వలస పాలన సాగిన దాఖలాలు లేవు.

పరాయి పాలనలో వివక్షలెన్నో

ముస్లిం పాలకులు తెలుగు భాష స్థానంలో పర్షియన్ భాషను ప్రజలపై బలవంతంగా రుద్దారు. కాకతీయ పాలకులు ప్రోత్సహించిన స్థానిక సంస్కృతి స్థానంలో పర్షియన్ సాహిత్యం, కళలు, సంస్కృతిని ప్రవేశపెట్టారు. సమాజంలోని ఉన్నత వర్గాల వస్త్రాలంకరణ, ఆహారపు అలవాట్లలోనూ మార్పులు వచ్చాయి. వలస పాలకులు స్కూళ్లలో స్థానిక భాష కాకుండా.. పర్షియన్ మాధ్యమంలోనే బోధన విధానాన్ని ప్రవేశ పెట్టారు. అది కూడా ముస్లిం జనాభా అధికంగా ఉండే పట్టణాల్లోనే జరిగేది. పరాయి పాలకులు హిందువులు ఎక్కువగా నివసించే తెలంగాణ గ్రామాలను పూర్తిగా విస్మరించారు. ఈ నిర్లక్ష్యం, పక్షపాత ధోరణి వల్ల ప్రజలు నిరక్షరాస్యులుగా మిగిలిపోయి జీవనోపాధి కోసం వ్యవసాయ పనులకు మాత్రమే పరిమితం అయ్యారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో, సైన్యంలో స్థానిక ప్రజలకు స్థానం లేకుండా పోయింది. అసఫ్ జాహీల కాలంలో 1885 వరకు పర్షియనే అధికార భాషగా కొనసాగింది. 1885లో అప్పటి ప్రధాని రెండో సాలార్‌జంగ్ పర్షియన్ స్థానంలో ఉర్దూను అధికార భాషగా మార్చాడు. స్థానిక భాష తెలుగుకు బదులు బోధన మాధ్యమంగా ఉర్దూను తప్పనిసరి చేశారు. అప్పటి నుంచి 1948లో అసఫ్ జాహీల పాలన ముగిసే వరకూ.. ఉర్దూ మాధ్యమంలోనే బోధన కొనసాగింది. అంతేకాకుండా ధరించే దుస్తుల విషయంలోనూ పట్టణాల్లోని ముస్లిమేతర ఉన్నత వర్గాలకు షేర్వాణి, పైజామా అనేది హోదాకు గుర్తుగా మారింది. ఇవన్నీ ఇలా ఉంటే.. 1918 లో ఉస్మానియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ.. పీజీ వరకూ అన్ని స్థాయిల్లో ఉర్దూ మాధ్యమం తప్పనిసరి చేశారు. ఉర్దూ మీడియంలో చదవడం వల్ల తదనంతర కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే విషయంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు వెనుకబడిపోయారు. మరోవైపు 1887లో హైదరాబాద్‌లోని జాగీర్దార్లు ఇంగ్లిష్ మీడియం బోధనతో నిజాం కాలేజీని ఏర్పాటుచేసుకున్నారు. తద్వారా తమ పిల్లలకు ఇంగ్లిష్ మాధ్యమంలో విద్యను అందించాలనేది వీరి ఆలోచన. సమాజంలోని ఉన్నత వర్గాలకే ఇంగ్లిష్ మీడియం చదువు అందిందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. నిజాం కాలేజీ 1948వరకూ మద్రాస్ యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగింది. ఆరో నిజాం రాజు కాలంలో హైదరాబాద్ స్టేట్‌లోని పట్టణాల, జిల్లాల పేర్లను సైతం మార్చారు. ఎలగందల్‌ను కరీంనగర్‌గా.. ఇందురును నిజామాబాద్‌గా, పాలమూరును మహబూబ్‌నగర్‌గా.. మెతుకును మెదక్‌గా.. మానుకోట పేరు మహబూబాబాద్‌గా.. భువనగిరి పేరును భోంగిర్‌గా; ఎద్దులాపురం పేరును ఆదిలాబాద్‌గా.. పాంచెర్లను హుజూర్‌నగర్‌గా మార్చేశారు. ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో వలసపాలకులు మార్చిన పేర్ల స్థానంలో అసలు పేర్లను తిరిగి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఏడో నిజాం వలస వాద, మతతత్వ విధానాలు

ఏడో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసహన, పక్షపాత మతతత్వ ధోరణులకు మరికొన్ని ఉదాహరణలు చూద్దాం. 1939లో వందేమాతరం గీతంపై నిషేధం విధించడం అనేది నిజాం అసహనం, అణిచివేత విధానాలకు నిదర్శనం. హిందూ విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో వందేమాతరం గీతం పాడకుండా నిషేధించారు. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా వందేమాతరం పాడితే వారిని యూనివర్సిటీ నుంచి బహిష్కరించారు. ఇలా బహిష్కరణకు గురైన విద్యార్థులు తమ చదువులు కొనసాగించేందుకు నాగ్‌పూర్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇలా నాడు బహిష్కరణకు గురైన వారిలో పీవీ నరసింహారావు ఒకరు. అంతేకాకుండా రోజూ ఉదయం తరగతుల ప్రారంభానికి ముందు ఏడో నిజాం రాజును స్తుతిస్తూ ఉర్దూలో ప్రార్థన చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఏడో నిజాం రాజు ముస్లిం జనాభా పెంచుతూ, హిందూ జనాభాను తగ్గించే యోచనతో మతతత్వ జనాభా విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విషయం 1931 జనాభా లెక్కలను చూస్తే అర్థమవుతుంది. 1931లో హిందూ జనాభా 84 శాతం ఉండగా, ముస్లిం జనాభా 10 శాతం ఉండేది. కానీ 1941లో ముస్లిం జనాభా గణనీయంగా 12.8 శాతానికి చేరగా, హిందూ జనాభా 81.4 శాతానికి తగ్గింది. అదే విధంగా 1941లోనే హిందూ జనాభాను తగ్గించే యోచనతో దళితులను విడిగా నమోదు చేశారు. ఫలితంగా హిందూ జనాభాను 63.5 శాతంగా చూపించారు. అంతేకాకుండా ఉత్తర భారతదేశానికి చెందిన ముస్లింలు హైదరాబాద్ రాజ్యానికి వచ్చేలా ఉద్దేశపూర్వకంగా, పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారు. ఉత్తరాది నుంచి వచ్చే ముస్లింలకు ఇక్కడ ప్రత్యేక వేతనాలు, సదుపాయాలు, రాయితీలు అందించి ఉద్యోగాల్లో చేరేలా ప్రోత్సహించారు. దాంతో వర్తక వాణిజ్యాల్లో, విద్యాసంస్థల్లో, రక్షణ, పోలీసు బలగాల్లో వారికి ప్రాధాన్యత లభించింది. ఇలా 60వేల మంది ఉత్తరాది ముస్లింలు హైదరాబాద్ రాష్ట్రానికి వచ్చారు. వీరిలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వచ్చిన వారున్నారు. ఈ విధానం ద్వారా రాజ్యంలో ముస్లింలను ఉన్నత వర్గంగా ఏర్పరచాలని ఏడో నిజాం భావించాడు. అయితే ఇలాంటి చర్యల ద్వారా 1919 లో నిజాం చేసిన ముల్కీ నిబంధనల చట్టాన్ని స్వయంగా తనే ఉల్లంఘించినట్లయింది. 1947 దేశ విభజన సమయంలో ఉత్తర భారతదేశం నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు రాష్ట్రానికి వలస వచ్చారు. వారు ఇక్కడ పునరావాసం ఏర్పరచుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు కల్పించింది. హైదరాబాద్ రాజ్యంలో ముస్లిం జనాభా పెంచడానికి తీసుకున్న మరో చర్య ఇది. ఇలాంటి మతతత్వ విధానాల వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థలు, వర్తక వాణిజ్యాల్లో హిందువులు అవకాశాలు అందుకోలేకపోయారు. 1931 జనాభా లెక్కల ప్రకారం రక్షణ, పోలీసు, ఇతర సర్వీసుల్లో హిందూ, ముస్లింల గణాంకాలను పరిశీలిస్తే... ముస్లింలు 1,07,737 మంది ఉంటే.. హిందువుల సంఖ్య కేవలం 23,368 మంది. పైన పేర్కొన్న సర్వీసుల్లో ముస్లింల సంఖ్య 1931 నుంచి 1947 మధ్య కాలంలో మరింతగా పెరిగింది. దీన్నిబట్టి ప్రభుత్వ సర్వీసుల్లో ముస్లింలకు అధిక ఆదరణ లభించిందని స్పష్టమవుతోంది. ఇలాంటి వివక్ష ఇతర రంగాల్లోనూ కొనసాగింది. అక్షరాస్యత పరంగానూ హిందూ, ముస్లింల మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు, అసమానతలు ఉండేవి. 1921లో ప్రతి వెయ్యిమంది హిందువుల్లో 23 మంది అక్షరాస్యులు ఉంటే.. ప్రతి వెయ్యి మంది ముస్లింలలో 59మంది అక్షరాస్యులు ఉండేవారు. ఇది 1931లో ప్రతి వెయ్యి మంది హిందువుల్లో 33.3గా.. ప్రతి వెయ్యి మంది ముస్లింలలో 103.5గా ఉంది.

కాంగ్రెస్ పార్టీపై నిషేధం

రాజకీయ పార్టీల విషయంలోనూ నిజాం పక్షపాత వైఖరి స్పష్టంగా ఉండేది. 1927లో బహదూర్ యార్‌జంగ్ స్థాపించిన 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్' అనే ముస్లిం సంస్థకు ప్రభుత్వం అనుమతించింది. ఇది ముస్లింల రాజకీయ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పడింది. అయినప్పటికీ ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు అందించింది. 1937లో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీని మతతత్వ సంస్థ అనే కారణంతో నిజాం ప్రభుత్వం నిషేధించింది. బ్రిటిష్ ఇండియాలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన రాజకీయ పార్టీ. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం స్వాతంత్ర్య పోరాటం చేసింది. అలాంటి పార్టీని నాటి నిజాం ప్రభుత్వం మతతత్వ పార్టీగా ముద్ర వేసింది. అదే సమయంలో మతతత్వ పార్టీ అయిన 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్'ను మాత్రం సమ్మతించింది. ప్రభుత్వ మతతత్వ విధానాలు ముస్లింలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాయనడానికి ఇది మరో ఉదాహరణ.

రాజకీయ నాయకుల నిర్బంధం

హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర ఆందోళనలను నియంత్రించేందుకు 1947 ఆగస్టు 25 తర్వాత ఎంతో మంది రాజకీయ నాయకులను, దాశరథి, కాళోజీ నారాయణరావు తదితర కవులను, ప్రముఖులను నిజాం ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించింది. 1947 ఆగస్టులో భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత కూడా 13 నెలలపాటు వీరు జైలు జీవితం గడిపారు. 1948 సెప్టెంబర్‌లో పోలీసు చర్య తర్వాతే వీరు విడుదలయ్యారు. ఏడో నిజాం పాలనలో హైదరాబాద్‌లో పౌరహక్కుల ఉల్లంఘన, అణచివేత చర్యలు ఏ విధంగా ఉండేవో చెప్పడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం.

హైదరాబాద్‌లో దుష్పరిపాలన

ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు చెందిన సాయుధ విభాగం 'రజాకార్లు' హిందువులపై తీవ్ర అకృత్యాలకు పాల్పడ్డారు. దీంతో వేల మంది ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ దుష్పరిపాలన తమ దృష్టికి వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం 1948 జూలైలో హైదరాబాద్‌పై ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. ఈ క్రమంలో దుష్పరిపాలనకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేసింది. అవి.. 'హైదరాబాద్‌లో దుష్పరిపాలన, అకృత్యాలకు నిస్సహాయ వీక్షకులుగా చూస్తూ ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావించట్లేదు. ఇప్పటికే క్షీణించే పరిస్థితుల్లో ఉన్న శాంతి భద్రతలు మరింత క్షీణించి శాంతి, సహనాలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే భారత ప్రభుత్వం తప్పనిసరిగా సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకుంటుంది' అని పేర్కొంది. మరోవైపు రజాకార్ల దుష్పరిపాలన, అకృత్యాలకు నిరసనగా అప్పటి హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జి. రామాచారి 1948 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామాలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని ఈ విధంగా వర్ణించారు. ''రాజ్యంలో విధ్వంసక శక్తులు, గూండాయిజం విశృంఖలమయ్యాయి.

A result of a computer virus can not lead to

BANK EXAMS

COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
1) Folder 2) Pod 3) Version
4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
1) System menu
2) Address bar 3) Menu bar
4) Tool bar
5) None of the above
3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
1) Program 2) Database
3) Memory file 4) Folder
5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
1) Home Edition
2) Media Center Edition
3) Tablet PC Edition
4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
1) user-happy 2) user-simple
3) user-friendly 4) Interface
5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
1) Right-clicking
2) Left-clicking
3) Either 1 or 2
4) All of the above
5) Neither 1 nor 2
7. Another term for hyperlink is______
1) Link 2) Source
3) Bar 4) All of the above
5) None of the above
8. A graphical user interface displays_________
1) Graphics 2) Text
3) Both 1 and 2
4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
1) Win Zip 2) Win Shrink
3) Win Style 4) Win small
5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is _________.
1) Queue 2) Linked list
3) Doubly linked list
4) Binary tree
5) None of the above
11. Caps lock, Num-lock are known as _______.
1) Modifier key 2) Toggle key
3) Function key 4) Numeric key
5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
1) Static RAM
2) Dynamic RAM 3) EPROM
4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in _____
1) China 2) USA 3) India
4) England 5) None of these
14. A result of a computer virus can not lead to_______.
1) Disk Crash
2) Mother Board Crash
3) Corruption of program
4) Deletion of files
5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
1) Begin the line with a # sign
2) Begin the line with double slashes (/ /)
3) Begin and end the line with double hyphens (-_-)
4) Indent the line
5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
1) 4GLs 2) Macro languages
3) Procedure-oriented languages
4) Visual programming languages
5) None of these
17. Firewalls are used to protect against _______.
1) Unauthorized Attacks
2) Virus Attacks
3) Data Driven Attacks
4) Fire Attacks
5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
1) Management 2) Processing
3) Utility 4) Application
5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
1) Factory 2) Operating room
3) Waiting room
4) Planning room
5) None of these
20. The CPU and memory are located on the ________.
1) Expansion board
2) Motherboard
3) Storage device
4) Output device
5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
1) Application software
2) System software
3) Operating system software
4) Platform software
5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
1) <ahref> 2) <a> 3) <link>
4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
1) Insert 2) Format 3) Edit
4) Tools 5) None of these
24. A half byte is known as_______.
1) Data 2) Bit 3) Half byte
4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
1) Modern 2) Interface
3) Clue 4) Data bus
5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
1) POS 2) RFID 3) PPS
4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
1) HTML 2) MP3 3) MPEG
4) MIDI 5) None of these

KEY

1) 1 2) 2 3) 1 4) 1 5) 3
6) 1 7) 1 8) 3 9) 1 10) 3
11) 2 12) 2 13) 3 14) 2 15) 2
16) 4 17) 1 18) 4 19) 3 20) 2
21) 1 22) 1 23) 1 24) 4 25) 2
26) 2 27) 4